ఈనాడు

విజయవాడ 28-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 108

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్స్

సీజన్ సీజన్‌కూ స్థాయి పెంచుకుంటున్న మహిళల ప్రీమియర్ లీగ్‌లో.. క్రికెటర్ల వేలం ధర కూడా పైపైకి వెళ్తోంది. ఈ నెలలోనే వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యురాలైన ఆల్‌రౌండర్ దీప్తి శర్మ.. లీగ్ వేలం చరిత్రలోనే అత్యధిక ధర పలికింది. తన పాత జట్టు యూపీ వారియర్స్ ఆమెను రూ.3.2 కోట్లకు సొంతం చేసుకోవడం విశేషం. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్ సైతం రూ.3 కోట్ల క్లబ్బులో చేరింది. తెలుగమ్మాయి శ్రీ చరణి లీగ్‌లో కోటీశ్వరురాలైంది. ఆమె రూ.1.3 కోట్లు పలికింది.

దీప్తికి జాక్‌పాట్

● డబ్ల్యూపీఎల్ వేలంలో రూ.3.2 కోట్లు ● తిరిగి వారియర్స్ జట్టుకు ఆల్‌రౌండర్ ● శిఖ పాండేకు రూ.2.4 కోట్లు ● శ్రీచరణికి రూ.1.3 కోట్లు













దిల్లీ

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్ వేలంలో స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రికార్డు ధర పలికింది. రూ.3.2 కోట్లకు యూపీ వారియర్స్ ఆమెను కొనుక్కుంది. దీప్తి ఈ వేలంలో అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా నిలిచింది. వారియర్స్ రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా ఆమెను సొంతం చేసుకుంది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ప్లేయర్ల జాబితాలో స్మృతి మంధాన (రూ.3.4 కోట్లు) తర్వాత దీప్తి రెండో స్థానంలో ఉంది. గత ఐపీఎల్‌లో ఆమె రూ.2.60 కోట్లకు వారియర్స్‌కే ఆడింది. ఆ ఫ్రాంఛైజీ వదిలేయడంతో వేలానికి రావాల్సి వచ్చింది. అత్యధిక సొమ్ము (రూ.14.5 కోట్లు)తో వేలానికి వచ్చిన వారియర్స్.. ఇంగ్లాండ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ (రూ.85 లక్షలు), క్రాంతి గౌడ్ (రూ.50 లక్షలు)ను కూడా ఆర్‌టీఎం ద్వారా దక్కించుకుంది. దిల్లీతో హోరాహోరీగా పోటీపడి మెగ్ లానింగ్ (రూ.1.9 కోట్లు)ను కూడా కొనుక్కుంది. లానింగ్ కెప్టెన్‌గా దిల్లీని మూడుసార్లు డబ్ల్యూపీఎల్ ఫైనల్‌కు చేర్చింది. "దీప్తి కోసం ఈ స్థాయిలో ఖర్చుపెట్టాల్సి ఉంటుందని మేము ముందే అనుకున్నాం. అలాంటి నాణ్యమైన స్పిన్ ఆల్‌రౌండర్‌కు ఇంత మొత్తంలో పెట్టక తప్పదు" అని యూపీ వారియర్స్ డైరెక్టర్ క్షేమల్ వైంగాంకర్ అన్నాడు.

న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్ ఈ వేలంలో దీప్తి తర్వాత అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా నిలిచింది. ముంబయి ఆమెను రూ.3 కోట్లకు కొనుక్కుంది. 2023 నుంచి భారత జట్టుకు ఆడని ఆల్‌రౌండర్ శిఖ పాండే ఆశ్చర్యకర ధరకు అమ్ముడుపోయింది. వారియర్స్ ఆమె కోసం రూ.2.4 కోట్లు వెచ్చించింది. ఆశ శోభన (రూ.1.1 కోట్లు), హర్లీన్ డియోల్ (రూ.50 లక్షలు)లను దక్కించుకున్న వారియర్స్.. తన జట్టును మరింత బలోపేతం చేసుకుంది. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి (రూ.75 లక్షలు), రాధ యాదవ్ (రూ.65 లక్షలు), దక్షిణాఫ్రికా హార్డ్ హిట్టర్ నడైన్ డిక్లెర్క్ (రూ.65 లక్షలు)లను ఆర్సీబీ సొంతం చేసుకుంది.

ఖరీదైన ప్లేయర్లు వీళ్లే

దీప్తి శర్మ:	రూ.3.2 కోట్లు (యూపీ వారియర్స్)
అమేలియా కెర్:	రూ. 3 కోట్లు (ముంబయి ఇండియన్స్)
శిఖ పాండే:	రూ.2.4 కోట్లు (యూపీ వారియర్స్)
సోఫీ డివైన్:	రూ. 2 కోట్లు (గుజరాత్ జెయింట్స్)
మెగ్ లానింగ్:	రూ.1.9 కోట్లు (యూపీ వారియర్స్)
చినెల్ హెన్రీ:	రూ.1.3 కోట్లు (దిల్లీ క్యాపిటల్స్)
శ్రీచరణి:	రూ.1.3 కోట్లు (దిల్లీ క్యాపిటల్స్)

వేలంలో అమ్ముడైన ప్రధాన క్రికెటర్లు

గుజరాత్ జెయింట్స్: సోఫీ డివైన్ (రూ.2 కోట్లు), జార్జియా వేర్‌హామ్ (రూ.1 కోటి), భారతి ఫుల్మాలి (రూ.70 లక్షలు), కశ్వీ (రూ. 65 లక్షలు), రేణుక సింగ్ (రూ.60 లక్షలు), కిమ్ గార్త్ (రూ.50 లక్షలు), యాస్తిక (రూ.50 లక్షలు).

యూపీ వారియర్స్: దీప్తి శర్మ (రూ.3.2 కోట్లు), శిఖ పాండే (రూ.2.40 కోట్లు), మెగ్ లానింగ్ (రూ.1.9 కోట్లు), లిచ్‌ఫీల్డ్ (రూ.1.2 కోట్లు), సోఫీ ఎకిల్‌స్టోన్ (రూ.85 లక్షలు), డాటిన్ (రూ.80 లక్షలు), హర్లీన్ డియోల్ (రూ.50 లక్షలు), క్రాంతి గౌడ్ (రూ.50 లక్షలు), ప్రతీక రావల్ (రూ.50 లక్షలు), త్రిష (రూ.10 లక్షలు).

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: లారెన్ బెల్ (రూ.90 లక్షలు), పూజ వస్త్రాకర్ (రూ.85 లక్షలు), గ్రేస్ హారిస్ (రూ.75 లక్షలు), అరుంధతి రెడ్డి (రూ.75 లక్షలు), నడైన్ డిక్లెర్క్ (రూ.65 లక్షలు), రాధ యాదవ్ (రూ.65 లక్షలు).


ముంబయి ఇండియన్స్: అమేలియా కెర్ (రూ.3 కోట్లు), సజీవన్ సజన (రూ.75 లక్షలు), షబ్నమ్ ఇస్మాయిల్ (రూ.60 లక్షలు).

దిల్లీ క్యాపిటల్స్: శ్రీచరణి (రూ.1.3 కోట్లు), చినెల్ హెన్రీ (రూ.1.3 కోట్లు), లారా వోల్వార్ట్ (రూ.రూ.1.1 కోట్లు), స్నేహ్ రాణా (రూ.50 లక్షలు).

దీప్తితో పాటు వన్డే ప్రపంచకప్‌లో విశేషంగా రాణించిన తెలుగమ్మాయి శ్రీచరణికి కూడా మంచి డిమాండ్ వచ్చింది. ఈ ఎడమచేతి వాటం స్పిన్నర్‌ను దిల్లీ క్యాపిటల్స్ రూ.1.3 కోట్లకు చేజిక్కించుకుంది. శ్రీచరణి కనీస ధర.రూ.30 లక్షలే. నిరుడు ఆమె రూ.55 లక్షలకే దిల్లీకి ఆడింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (రూ.1.1 కోట్లు), వెస్టిండీస్ బ్యాటర్ చినెలీ హెన్రీ (రూ.1.3 కోట్లు), స్నేహ్ రాణా (రూ.50 లక్షలు)ను కూడా దిల్లీ సొంతం చేసుకుంది. మరోవైపు న్యూజిలాండ్ స్టార్ సోఫీ డివైన్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.2 కోట్లకు తీసుకుంది. భారత పేసర్ రేణుక సింగ్ (రూ.60 లక్షలు) కూడా ఆ జట్టుకే వెళ్లింది.

అలీసాకు నిరాశ

ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీకి షాక్ తగిలింది. వేలంలో ఆమె అమ్ముడుపోలేదు. రూ.50 లక్షల కనీస ధర ఉన్న ఆమెపై ఫ్రాంఛైజీలు ఆసక్తి ప్రదర్శించలేదు. అలానా కింగ్, అలీస్ క్యాప్సీ, అమీ జోన్స్ కూడా అమ్ముడుపోలేదు. 73 ఖాళీల కోసం 277 మంది ప్లేయర్లను వేలంలో ఉంచగా.. 67 మంది క్రికెటర్లను ఫ్రాంఛైజీలు కొనుగోలు చేశాయి. ఈ మెగా వేలానికి ముందు ఫ్రాంఛైజీలకు గరిష్ఠంగా అయిదుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకోవడానికి అవకాశమిచ్చారు.



ప్రధానితో ప్రపంచ ఛాంపియన్లు

దిల్లీ: మహిళల అంధుల టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టు గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకుంది. భారత్ గర్వించేలా చేసిన జట్టును ప్రధాని అభినందించారు. ఆటోగ్రాఫ్‌లు చేసిన బ్యాట్‌ను ఈ సందర్భంగా భారత్ బృందం ప్రధానికి బహుమతిగా ఇచ్చింది. జట్టు సభ్యులకు ప్రధాని స్వీట్లు తినిపించడంతో పాటు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. ఆరు దేశాలు పోటీపడిన ప్రపంచకప్‌లో ఫైనల్లో నేపాల్‌ను ఓడించి భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. తెలుగమ్మాయిలు దీపిక (కెప్టెన్), కరుణ కుమారి ఈ జట్టులో ఉన్నారు.

కప్పుపై భారత్ కన్ను

రా.8.30 నుంచి

● తొలి మ్యాచ్‌లో చిలీతో పోరు ● నేటి నుంచే జూనియర్ హాకీ ప్రపంచకప్


భారత జూనియర్ హాకీ జట్టు

చెన్నై: జూనియర్ హాకీ ప్రపంచకప్‌నకు వేళైంది. 24 జట్లు పోటీపడుతున్న ఈ మెగా టోర్నీకి చెన్నై, మధురై ఆతిథ్యం ఇస్తున్నాయి. రెండుసార్లు ఛాంపియన్ భారత్.. సుదీర్ఘ విరామం తర్వాత కప్ గెలవాలనే పట్టుదలతో ఉంది. 2001లో తొలిసారి, 2016లో చివరిగా విజేతగా నిలిచిన భారత్.. సొంతగడ్డపై సత్తా చాటి కప్ అందుకోవాలని భావిస్తోంది. రోహిత్ సారథ్యంలోని భారత జట్టు పూల్-బిలో చిలీ, స్విట్జర్లాండ్, ఒమన్‌తో తలపడనుంది. శుక్రవారం చిలీతో మ్యాచ్‌లో భారత్ టోర్నీని ఆరంభిస్తుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న భారత్.. దిగ్గజ ఆటగాడు పీఆర్ శ్రీజేశ్ మార్గనిర్దేశంలో జోరు మీద ఉంది. గత ప్రపంచకప్‌లో ఆడిన రోహిత్, అమీర్ అలీ అనుభవం జట్టుకు ఉపకరించేదే. దిల్‌రాజ్ సింగ్, గుర్‌జ్యోత్, మన్‌ప్రీత్ సింగ్, అంకిత్‌పాల్ రాణించడం జట్టుకు కీలకం. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 18వ స్థానంలో ఉన్న చిలీ నుంచి భారత్‌కు పెద్ద ప్రతిఘటన ఎదురు కాకపోవచ్చు. ఏడుసార్లు విజేత, డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ, రెండుసార్లు ఛాంపియన్ అర్జెంటీనా నుంచి టోర్నీలో భారత్‌కు గట్టి పోటీ తప్పదు. ఈ కప్‌లో పూల్-ఎలో కెనడా, జర్మనీ, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా, పూల్-సిలో అర్జెంటీనా, చైనా, జపాన్, న్యూజిలాండ్, పూల్-డిలో బెల్జియం, ఈజిప్ట్, నమీబియా, స్పెయిన్, పూల్-ఇలో ఆస్ట్రియా, ఇంగ్లాండ్, మలేసియా, నెదర్లాండ్స్, పూల్-ఎఫ్‌లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, కొరియా పోటీకి సై అంటున్నాయి. శుక్రవారం ఇతర మ్యాచ్‌ల్లో జర్మనీ-దక్షిణాఫ్రికా, కెనడా-ఐర్లాండ్, అర్జెంటీనా-జపాన్, స్పెయిన్-ఈజిప్ట్, న్యూజిలాండ్-చైనా, బెల్జియం-నమీబియా, ఒమన్-స్విట్జర్లాండ్ ఆడనున్నాయి.

బంగ్లాపై ఐర్లాండ్ ఘనవిజయం

చటోగ్రామ్: బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన ఐర్లాండ్.. మూడు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసింది. గురువారం తొలి టీ20లో ఆ జట్టు 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట హ్యారీ టెక్టార్ (69; 45 బంతుల్లో 1×4, 5×6), టిమ్ టెక్టార్ (32; 19 బంతుల్లో 6×4) మెరుపులతో ఐర్లాండ్ 4 వికెట్లకు 181 పరుగులు చేసింది. బంగ్లా బౌలర్లలో తంజిమ్ షకిబ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మాథ్యూ హంఫ్రీస్ (4/13), బారీ మెకార్తీ (3/23)ల ధాటికి బంగ్లా నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 142 పరుగులే చేయగలిగింది. తౌహిద్ హృదోయ్ (83; 50 బంతుల్లో 7×4, 3×6) ఒంటరి పోరాటం చేశాడు.

ఒకుహారకు తన్వి షాక్


తన్వి


శ్రీకాంత్

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ తన్వి శర్మ సంచలనం సృష్టించింది. ప్రపంచ మాజీ ఛాంపియన్ నొజొమి ఒకుహారకు షాకిచ్చిన తన్వి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 16 ఏళ్ల తన్వి 13-21, 21-16, 21-19తో రెండో సీడ్ ఒకుహారపై విజయం సాధించింది. 59 నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఉన్నతి హుడా 21-15, 21-10తో తస్నిమ్ మీర్‌పై, రక్షితశ్రీ 16-21, 21-19, 21-17తో దేవిక సిహాగ్‌పై గెలిచి క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. పురుషుల సింగిల్స్‌లో 19 ఏళ్ల మన్‌రాజ్ సింగ్ అదరగొట్టాడు. 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్.ప్రణయ్‌కు షాకిచ్చాడు. ప్రిక్వార్టర్స్‌లో మన్‌రాజ్ 21-15, 21-18తో ప్రణయ్‌పై గెలుపొందాడు. మిథున్ మంజునాథ్ 21-16, 17-21, 21-17తో తరుణ్ మన్నెపల్లిపై, కిదాంబి శ్రీకాంత్ 21-6, 21-16తో సనీత్ దయానంద్‌పై, ప్రియాన్షు రజావత్ 21-16, 10-21, 21-12తో రాహుల్ భరద్వాజ్‌పై నెగ్గి క్వార్టర్స్ చేరుకున్నారు. మహిళల డబుల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ 21-17, 21-12తో జెనిత్ అబిగేల్- లిఖిత శ్రీవాస్తవ జంటపై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.


జెమీమా, స్మృతి మంధాన

మంధాన కోసం..


బ్రిస్బేన్: మహిళల ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన జెమీమా రోడ్రిగ్స్.. తన స్నేహితురాలు స్మృతి మంధాన కోసం బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)కు దూరమైంది. స్మృతి మంధాన వివాహం అనూహ్యంగా ఆగిపోయిన నేపథ్యంలో ఆమెకు మద్దతుగా భారత్‌లోనే ఉండాలని జెమీమా నిర్ణయించుకుంది. ఫలితంగా ఆస్ట్రేలియాలో డబ్ల్యూబీబీఎల్ మిగతా సీజన్‌కు జెమీమా దూరం కానుంది. బ్రిస్బేన్ హీట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న జెమీమా.. మంధాన వివాహానికి హాజరయ్యేందుకు కొన్ని రోజుల కిందట భారత్‌కు తిరిగొచ్చింది. అయితే మంధాన తండ్రి అనారోగ్యం కారణంగా పెళ్లి వాయిదా పడింది. అసలు పలాష్ ముచ్చల్‌తో స్మృతి వివాహం జరుగుతుందా లేదా అనే సందేహాలు కూడా నెలకొన్నాయి. ఈ కఠిన సమయంలో స్మృతితో పాటు ఉండాలని జెమీమా నిర్ణయించుకుంది. "డబ్ల్యూబీబీఎల్ మిగతా సీజన్ నుంచి విడుదల చేయాలన్న జెమీమా విజ్ఞప్తికి బ్రిస్బేన్ హీట్ అంగీకారం తెలిపింది. 10 రోజుల క్రితం హోబర్ట్ హరికేన్స్‌తో మ్యాచ్ అనంతరం మంధాన పెళ్లిలో పాల్గొనేందుకు జెమీమా భారత్‌కు వెళ్లింది. తన సహచరిణి మంధానకు మద్దతుగా జెమీమా అక్కడే ఉండనుంది. చివరి నాలుగు మ్యాచ్‌లకు ఆమె అందుబాటులో ఉండదు" అని బ్రిస్బేన్ హీట్ పేర్కొంది.

బాగా ఆడలేదు.. మన్నించండి


పంత్

దిల్లీ: దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో జట్టు పేలవ ప్రదర్శనకు టీమ్‌ఇండియా వైస్‌కెప్టెన్ రిషభ్ పంత్ క్షమాపణలు చెప్పాడు. తాము తిరిగి పుంజుకుంటామని అన్నాడు. భారత జట్టు 0-2తో సిరీస్‌ను కోల్పోయిన సంగతి తెలిసిందే. గిల్ గైర్హాజరీలో పంత్ భారత్‌కు నాయకత్వం వహించాడు. ''గత రెండు వారాల్లో మేం బాగా ఆడలేదన్నది వాస్తం. మేమెప్పుడూ అత్యుత్తమ క్రికెట్ ఆడి, కోట్లాది భారతీయులను సంతోషపెట్టాలనే కోరుకుంటాం'' అని 'ఎక్స్' పోస్ట్‌లో పంత్ పేర్కొన్నాడు. ''ఈసారి అంచనాలను అందుకోలేకపోయినందుకు మమ్మల్ని క్షమించాలి. కానీ వ్యక్తిగా, జట్టుగా ఎలా ఎదగాలో ఆట నేర్పుతుంది. మా జట్టు సామర్థ్యం గురించి మాకు తెలుసు. మేం కష్టపడతాం, శక్తిని కూడదీసుకుంటాం. లోపాలను సరిదిద్దుకుని పుంజుకుంటాం'' అని చెప్పాడు. దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఆటగాళ్లకు గొప్ప గౌరవమని పంత్ అన్నాడు. గాయంతో అర్ధంతరంగా సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా ఈ ఓటమిపై పోస్టు పెట్టాడు. ''ప్రశాంతంగా ఉండే సముద్రాలు మనకు ప్రయాణాన్ని నేర్పించవు. తుపానులే మన చేతులను దృఢంగా మారుస్తాయి. మేం ఒకరినొకరు నమ్ముతాం. ఒకరి కోసం ఒకరు పోరాడుతూ ముందడుగు వేస్తాం. మరింత దృఢంగా పైకి ఎదుగుతాం'' అని అతను పేర్కొన్నాడు.

గంభీర్ విషయంలో తొందరపడట్లేదు


గంభీర్

ముంబయి: భారత క్రికెట్ జట్టు సొంతగడ్డపై ఒకే ఏడాది రెండు టెస్టు సిరీస్‌లలో వైట్‌వాష్‌కు గురైనా.. చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ భవిష్యత్‌పై బీసీసీఐ ఇప్పుడిప్పుడే ఎలాంటి నిర్ణయం తీసుకునేలా కనిపించట్లేదు. ప్రస్తుతం భారత జట్టు సంధి దశలో ఉందని.. వచ్చే రెండేళ్లలో ప్రపంచకప్‌లు జరగబోతున్నాయని, అందుకే కోచ్‌కు మరింత సమయం ఇవ్వాలని బోర్డు భావిస్తున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తాజాగా దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను భారత్ 0-2తో చేజార్చుకున్న తర్వాత తన భవిష్యత్‌పై బీసీసీఐదే తుది నిర్ణయమని కోచ్ గంభీర్ వ్యాఖ్యానించాడు. "గంభీర్ భవిష్యత్‌పై బీసీసీఐ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవాలని అనుకోవట్లేదు. ప్రస్తుతం భారత జట్టు సంధి దశలో ఉంది. 2026 టీ20 ప్రపంచకప్, 2027 వన్డే ప్రపంచకప్‌లు రాబోతున్నాయి. దక్షిణాఫ్రికాతో సిరీస్ చేజారడంపై టీమ్ మేనేజ్‌మెంట్, సెలక్టర్లతో బీసీసీఐ మాట్లాడనుంది'' అని ఓ బీసీసీఐ అధికారి తెలిపాడు. ఈ ఏడాదిలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌ను 0-3తో ఓడిన టీమ్‌ఇండియా.. తాజాగా దక్షిణాఫ్రికా చేతిలో కంగుతింది.

న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు


● అజ్లాన్‌షా హాకీ కప్

ఇపో (మలేసియా): అజ్లాన్ షా హాకీ కప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. గురువారం సంజయ్ సారథ్యంలోని జట్టు 3-2తో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే భారత్ దూకుడుగా ఆడింది. నాలుగో నిమిషంలో అమిత్ రోహిత్‌దాస్ చేసిన గోల్‌తో ఖాతా తెరిచింది. రెండో క్వార్టర్‌లోనూ భారత్ జోరు కొనసాగినా.. ఫినిషింగ్ చేయలేకపోయింది. మూడో క్వార్టర్ ఆరంభంలో సంజయ్ (32వ) పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేయడంతో ఆధిక్యం రెట్టింపైంది. ఈ స్థితిలో భారత్ జోరు చూస్తే తేలిగ్గా గెలిచేలా కనిపించింది. కానీ జార్జి బాకర్ (42వ, 48 ని) స్వల్ప వ్యవధిలో రెండు గోల్స్ కొట్టి న్యూజిలాండ్‌ను పోటీలోకి తెచ్చాడు. అక్కడ నుంచి రెండు జట్లు హోరాహోరీగా తలపడడంతో విజయం ఎటువైపు మొగ్గుతుందో అనే ఉత్కంఠ రేగింది. కొన్ని నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా సెల్వం కార్తి (54వ) బంతిని నెట్‌లోకి పంపి భారత్‌ను గెలిపించాడు. అభిషేక్ నుంచి పాస్ అందుకున్న సెల్వం.. ప్రత్యర్థి గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించాడు. శనివారం కెనడాతో భారత్ తలపడనుంది.

ఇండియా-ఎ అండర్-19 జట్టు ఓటమి

బెంగళూరు: అండర్-19 ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఇండియా-ఎ జట్టుపై అఫ్గానిస్థాన్ పైచేయి సాధించింది. గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గాన్ 65 పరుగుల తేడాతో నెగ్గింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మహబూబ్ ఖాన్ (50; 82 బంతుల్లో 4×4, 1×6), అజీజుల్లా మియాఖిల్ (60; 65 బంతుల్లో 5×4, 2×6) రాణించడంతో మొదట అఫ్గాన్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 233 పరుగులు సాధించింది. ఇండియా-ఎ బౌలర్లలో కనిష్క్ చౌహాన్ (3/42), హెనిల్ పటేల్ (2/41) మెరిశారు. అనంతరం ఇండియా-ఎ 30.2 ఓవర్లలో 168 పరుగులకే కుప్పకూలింది. జట్టు ఖాతా తెరవకముందే ఓపెనర్లు వాఫీ కచ్చి, లక్ష్య రాయ్‌చందాని డకౌట్లుగా వెనుదిరగడం ఇండియా-ఎ లక్ష్య ఛేదనపై తీవ్ర ప్రభావం చూపింది. వినీత్ (63; 62 బంతుల్లో 11×4, 1×6) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. అబ్దుల్ అజీజ్ (3/48), సలాం ఖాన్ (3/35), రూహుల్లా అరబ్ (3/34) మూడేసి వికెట్లు పడగొట్టి అఫ్గాన్‌కు విజయాన్ని అందించారు. ఇండియా-బి జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించిన నేపథ్యంలో ఈ నెల 30న జరిగే ఫైనల్లో అఫ్గాన్‌తో ఇండియా-ఎ తలపడనుంది.

కోచ్ ఏం చేయగలడు?


అశ్విన్

దిల్లీ: సొంతగడ్డపై భారత్ 0-2తో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయానికి బాధ్యుడిని చేస్తూ చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను విమర్శించడాన్ని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తప్పుబట్టాడు. ఆటగాళ్లు పూర్తిగా బాధ్యతలు నిర్వర్తించనపుడు గంభీర్‌ను తొలగించాలని అనడం సరికాదని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. "మనం ఇలా ఎందుకు చేస్తున్నాం? ఇది ఒక క్రీడ. జట్టును నిర్వహించడం అంత సులువు కాదు. నిజానికి గంభీర్ కూడా బాధపడుతున్నాడు. దాన్ని అర్థం చేసుకోవాలి. ఎవరినైనా తొలగించడం బాగా అనిపించొచ్చు. కానీ అలా చేయకూడదు. నా ఆలోచన అలా ఉండదు. గంభీర్ నా బంధువు కాదు. ఎవరికీ మద్దతు ఇవ్వడం గురించి మాట్లాడట్లేదు. నేను 10 తప్పులను కూడా ఎత్తి చూపగలను. అవును.. పొరపాట్లు జరుగుతాయి. తప్పులు ఎవరైనా చేయొచ్చు. అవి ఖరీదైనవి అయినప్పుడు నష్టం కలిగిస్తాయి. నాదొక సాధారణ ప్రశ్న. అసలు కోచ్ ఏం చేయగలడు? నైపుణ్యంతో ఆడటం.. ప్రదర్శన ఇవ్వడం ఆటగాడి బాధ్యత. వ్యక్తిగత దాడిని నేనెప్పుడూ ఇష్టపడను. ఎందుకంటే అందరూ ఎవరో ఒకరిని నిందించడానికే చూస్తారు'' అని అశ్విన్ తెలిపాడు.

ఈనాడు

విజయవాడ 28-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 108

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈ చెట్టుకు కుండీ పొగగొట్టమేనండీ



కుండీల్లో మొక్కలు పెరగడం సహజం. కానీ.. పొగగొట్టాన్నే కుండీగా మలుచుకుని పెరిగిన చెట్టును గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రులో చూడొచ్చు. నాలుగు దశాబ్దాల కిందట ఇక్కడ ఓ సున్నపు బట్టీ ఉండేది. క్రమేపీ ఆ పరిశ్రమ మూతపడినా.. పొగగొట్టం మాత్రం మిగిలింది. అందులో ఓ మర్రి చెట్టు పెరిగి.. భారీ కుండీని తలపిస్తోంది.

– న్యూస్‌టుడే, మంగళగిరి, తాడేపల్లి

టైరుపై అక్షరం... జీవితాలకు శాసనం!

- వేగంగా వెళుతున్న వాహనం ఒక్కసారిగా టైరు పగిలి అదుపుతప్పి బోల్తా కొట్టింది.
- హైవేపై వెళుతున్న కారు అనూహ్యంగా పక్కరోడ్డులోకి దూసుకెళ్లి వేరే వాహనాలను ఢీకొట్టింది.
- నడుస్తున్న బస్సు టైర్ల నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఇలాంటి సంఘటనలకు మూల కారణం వాహనాన్ని టైరు సామర్థ్యం (గరిష్ఠ వేగ పరిమితి) దాటి నడపడమే. వాహన వేగం... దాన్ని టైర్లు భరించే సామర్థ్యం వేర్వేరుగా ఉంటే ప్రమాదాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆ అక్షరమే... భద్రతకు కీలకం

- ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, లారీల టైర్లు ఎంత నాణ్యంగా ఉన్నా...వాటి స్పీడ్ రేటింగ్ సరైనదిగా లేకపోతే ప్రమాదాలు తప్పవు.
- చాలామందికి టైర్లపై ఉండే అక్షరాలు, నంబర్లకు అర్థం తెలియదు. మరికొందరు తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు.
- టైర్ స్పీడ్ రేటింగ్ ఒక అక్షరమే అయినా, అది వాహనంలో ప్రయాణించే వారి జీవితాన్ని ప్రభావితం చేస్తుందని గుర్తు పెట్టుకోవాలి.



- ప్రతి టైర్‌పై దాని సామర్థ్యం తెలియజేసే ఒక ప్రత్యేకమైన కోడ్ ఉంటుంది. అందులో చివరి ఆల్ఫాబెటికల్ అక్షరం చాలా కీలకమైంది. దాన్ని 'టైర్ స్పీడ్ రేటింగ్' అంటారు.
- ఈ అక్షరం ఆ టైర్ భద్రతను తట్టుకోగలిగే గరిష్ఠ వేగాన్ని సూచిస్తుంది.

ఏమవుతుందంటే?



- వాహనాన్ని డిజైన్ చేసిన సామర్థ్యంకన్నా ఎక్కువ వేగంతో నడిపితే టైర్లు దెబ్బతింటాయి.
- టైర్లు ఒక్కసారిగా వేడెక్కడం, రబ్బర్ పొరలు విడిపోవడం, బెల్టింగ్ దెబ్బతిని అకస్మాత్తుగా పగిలిపోయేందుకు (టైర్ బర్స్ట్) అవకాశం ఉంటుంది.
- ఒక్కోసారి ఆ రాపిడికి మంటలు వ్యాపిస్తాయి.

మరేం చేయాలి?



- వాహన కంపెనీ, ఆ మోడల్‌కు తగిన స్పీడ్ రేటింగ్ నిర్ణయిస్తుంది. డ్రైవర్ డోర్ వద్ద ఉండే స్టిక్కర్ లేక వాహన మాన్యువల్‌లో స్పష్టంగా ఇస్తారు.
- వాహనానికి దీన్ని సూచించిన స్పీడ్ రేటింగ్ ఉన్న టైర్లు మాత్రమే వాడాలి.
- ఎక్కువగా హైవేలపై డ్రైవ్ చేసేవారు 'హెచ్', 'వి' రేటింగ్ టైర్లు తీసుకోవడం మంచిది
- సూచించిన రేటింగ్ కంటే తక్కువ రేటింగ్ ఉన్న టైర్లు వాడితే బ్రేక్ ప్రభావం తగ్గుతుంది. ఓవర్‌లోడ్ ఉన్నప్పుడు ప్రమాదస్థాయి రెట్టింపు అవుతుంది.

బీమా క్లెయిమ్స్‌పైనా ప్రభావం...



తయారీదారు సిఫారసు చేసిన వేగ పరిమితికి భిన్నంగా ఉండే టైర్లను మీ కారుకు అమర్చినప్పుడు ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ కంపెనీలు మీ క్లెయిమ్‌ను అంగీకరించవు. అందుకే ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- ఈనాడు, విశాఖపట్నం

ఏ అక్షరం... ఎంత వేగం?

అక్షరం	జె	కె	ఎల్	ఎం	ఎన్	ఆర్	ఎస్	టీ	హెచ్	వి	డబ్ల్యు
గరిష్ఠ వేగం (కిమీ/గంట)	100	110	120	130	140	170	180	190	210	240	270

కోనసీమకొచ్చింది నారింజ పక్షి!



అటవీ ప్రాంతాల్లో జీవించే నారింజ రంగు తల పక్షి (ఆరెంజ్ హెడెడ్ థ్రష్) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరులో కనువిందు చేసింది. దీనికి తల నుంచి ఉదర భాగం అంతా నారింజ, రెక్కలు నీలిరంగుల్లో ఉన్నాయి. ఈ పక్షులు పురుగులు కీటకాలు, పండ్లను ఆహారంగా తీసుకుని, విత్తన వ్యాప్తిలో ప్రధాన పాత్ర పోషిస్తాయని కోరంగి అభయారణ్యం ఫారెస్ట్ బీట్ అధికారి కోన మహేశ్ తెలిపారు. వీటికి మృదువైన స్వరం ఉన్నా.. నిశ్శబ్దంగా ఉంటాయని చెప్పారు.


– న్యూస్‌టుడే, కోనసీమ

నగరం మధ్యలో గిరిజన గ్రామం!



రాష్ట్రంలోనే అతి పెద్ద నగరం విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా.. ఐటీ హబ్‌గా ఎదుగుతోంది. ఈ మహా నగరం మధ్యలో ఉన్న కంబాలకొండ అభయారణ్యంలో శంభువానిపాలెం పేరిట గిరిజన గ్రామం ఉండడం విశేషం. ఇది నగరంలోని ఆరో వార్డు పరిధిలోకి వస్తుంది. ఈ గ్రామంలో 70 గృహాలుండగా, 300 మంది నివసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో 20 మంది పిల్లలు చదువుతున్నారు. ఇక్కడి జనం అడవిలో గొర్రెలు, మేకలు, పశువులు పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు. వీరు నగరానికి రాకపోకలు సాగించేలా అధికారులు ఉదయం, సాయంత్రం ఓ బస్సు నడుపుతున్నారు.

– ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, పీఎం పాలెం



చేపల వేట జాగాకు పడవ పోటీలు



- **పోటీదారులు:** బలుసుతిప్ప మత్స్యకారులు
- **పోటీపడిన పడవలు:** సుమారు 100
- **ఒక్కో పడవలో మత్స్యకారులు:** ఐదుగురు వరకు..
- **మొత్తం దూరం:** 30 కి.మీ.
- **వేట కాలం:** నవంబరు నుంచి వర్షాకాలం వరకు

చేపల వేటకు గోదావరిలో జాగా కోసం ఏటా పోటీ జరుగుతుంటుంది. ఈ ఏడాది సైతం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్ప మత్స్యకారులు గురువారం పడవ పోటీల్లో తలపడ్డారు. బలుసుతిప్ప వంతెన నుంచి కోటిపల్లి వరకు పరిసర గోదావరి పాయలలో చేపల వేటకు కొన్ని స్థావరాలు (అంతరాలు) ఉన్నాయి. మత్స్యకారులు వాటిని దక్కించుకునేందుకు పడవ పోటీల్లో పాల్గొనాల్సిందే. ఎక్కువ చేపలు దొరికే స్థావరాలను పొందేందుకు వీరంతా ఇలా హోరాహోరీగా పోటీపడతారు. ముందుగా వెళ్లి స్థావరం దక్కించుకున్న వారు అక్కడ పడవ లంగరు వేసి ఆ పరిధి తమదని తెలియజేస్తారు. అక్కడ వారు మాత్రమే నవంబరు నుంచి వచ్చే ఏడాది వరదలు వచ్చే వరకు చేపల వేట సాగిస్తారు. దాని కోసం ఒడ్డున తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుంటారు. ఒక్కోచోట ఒకటి, అంతకంటే ఎక్కువ కుటుంబాలు ఉంటాయి.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఈ కండల వెనుక 100 కిలోల కష్టం





తన 25వ ఏటా 100 కిలోల బరువు ఉన్నాడు. పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా తీవ్రంగా కష్టపడ్డాడు. నాలుగుసార్లు ప్రయత్నించినా ముందంజ వేయలేకపోయాడు. అయినా నిరాశ చెందలేదు. తొలుత బరువు తగ్గాలనుకొని జిమ్‌కు వెళ్లడం ప్రారంభించాడు. కొన్నిరోజులకే అది అభిరుచిగా మారి.. బాడీబిల్డింగ్ వైపు ఆసక్తి కలిగింది. పట్టుదల, నిరంతర సాధన, క్రమశిక్షణతో ఐదేళ్లలోనే 65 కిలోల విభాగంలో మిస్టర్ ఆంధ్రా టైటిల్ సాధించాడు మచిలీపట్నానికి చెందిన బీరం ప్రశాంత్. అగ్నిమాపక శాఖ విశ్రాంత ఉద్యోగి నాగేశ్వరరావు, పుణ్యవతి దంపతుల మూడో కుమారుడైన ఆయన పీజీ వరకు చదివాడు. కొన్నేళ్లు ఎస్సై పోస్టులకు సన్నద్ధమయ్యాడు. బరువు తగ్గాలని నిర్ణయించుకున్నాక కఠిన నిబంధనలు విధించుకున్నాడు. ఐదేళ్లపాటు జిమ్‌లో రోజుకు ఐదు గంటలు కసరత్తులు చేశాడు. జంక్‌ఫుడ్, బిర్యానీలు, స్వీట్లు పూర్తిగా మానేశాడు. ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే డైట్ తీసుకునేవాడు. ఎట్టకేలకు 75 కిలోలకు తగ్గాడు. దీంతో ఈ ఏడాది సెప్టెంబరు 28న విజయనగరంలో నిర్వహించిన బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచాడు. అక్కడితో ఆగిపోకుండా నవంబరు 2న న్యూ నవ్యాంధ్ర ఫిట్‌నెస్ అండ్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన ఓపెన్ బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో 65 కిలోల విభాగంలో తలపడ్డాడు. 80 మంది పోటీదారులను దాటుకొని 'మిస్టర్ ఆంధ్రా' టైటిల్ ఎగరేసుకుపోయాడు. ఈ క్రమంలో 35 రోజుల్లో 10 కిలోల బరువు తగ్గడం విశేషం.

– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

గణితం.. సంగీతం



పిల్లలకు పాఠం ఆసక్తికరంగా చెబితే సులభంగా అర్థం అవుతుంది. 'Maths Made Easy With Music' పేరుతో గణిత పాఠాలను సినీపాటల పేరడీలా ఆలపిస్తూ విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్నారు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక సావరంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ పాలెపు నాగేశ్వరరావు. లెక్కలకు సంగీతాన్ని జోడించి చెబుతున్న ఈ మాస్టారి పాఠాలు ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఆయనను అభినందించారు. పాఠ్యాంశాల్ని సినిమా పాటల ట్యూన్లకు సరిపడేలా మార్చి భాగహారాలు, ఆల్జీబ్రా, శాతాలు.. వంటివి సులువుగా అర్థమయ్యేలా విద్యార్థులతో పాడిస్తూ బోధిస్తున్నారు. వీటిని వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. క్లిష్టమైన సూత్రాలు, స్టెప్‌లను చిన్నచిన్న లైన్ల రూపంలో, రిథమ్‌తో చెప్పడంతో విద్యార్థులు సులువుగా గుర్తుపెట్టుకుంటున్నారు. 1998లో ఉపాధ్యాయుడిగా చేరిన నాగేశ్వరరావు తొలుత మామూలుగానే బోధించేవారు. 2024 అక్టోబరులో ప్రయోగాత్మకంగా బోధించగా విద్యార్థులు ఆసక్తి కనబరచడంతో వీడియోలు తీసి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ పోస్ట్ చేశారు. తొలిగా పాడిన మైనస్ ఇంటు మైనస్ చేస్తే ప్లస్ వస్తుందంటూ పేరడీ పాటను ఇప్పటివరకు 76 లక్షల మందికిపైగా చూశారు. ఈ ప్రోత్సాహంతో 50కి పైగా గణిత పాటలను రీల్స్‌గా విడుదల చేశారు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్‌లో 'palepunageswararao'లో పాఠాలు వీక్షించవచ్చని ఆయన తెలిపారు. వీక్షకుల సంఖ్య 5 కోట్లకు చేరుకోగా, ఇన్‌స్టాలో 70 వేల మంది అనుసరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, రాయవరం

ఛార్జర్... ఏదో ఒకటి వాడేయొద్దు!



హడావుడిగా బయటికి వెళ్లినపుడు, కార్యాలయాల్లో... ఇలా వివిధ సందర్భాల్లో చాలామంది మొబైల్‌కు ఏదో ఒక ఛార్జర్‌ను వినియోగిస్తారు. ఒక్కసారికే కదా ఏంకాదులే.. అనుకొని వాడితే కొన్నిసార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కొన్ని సంస్థలు కొత్త ఫోన్‌తో పాటు కేవలం కేబుల్ ఇచ్చి, ఎడాప్టర్ ఇవ్వట్లేదు. బయటనో, ఆన్‌లైన్‌లోనో తక్కువకు దొరికిందని చాలా మంది కొనేస్తుంటారు. ఇవి నాణ్యమైనవా లేదా నకిలీవా అని చూడకుండా వినియోగిస్తుంటారు. దీంతో ఫోన్ హీటెక్కడం, మరీ వేగంగా లేదా ఆలస్యంగా ఛార్జింగ్ అవ్వడం, వెంటనే తగ్గిపోవడం, బ్యాటరీ ఉబ్బిపోవడం, మదర్‌బోర్డు, సూక్ష్మ చిప్‌లు దెబ్బతినడం వంటివి జరుగుతుంటాయి.

- కంపెనీ ఛార్జర్లలో విద్యుత్తు వోల్టేజ్‌ని నియంత్రించే ట్రాన్స్‌ఫార్మర్లు, కెపాసిటర్లు, ఇండక్టర్లు, ఐసీలు, రాగి తదితర అన్ని భాగాలు నాణ్యమైనవి ఉంటాయి. ఇవి నకిలీ వాటికంటే కాస్త బరువుగానూ.. వేడెక్కకుండా ఉంటాయి. విద్యుత్తులో వచ్చే హెచ్చు తగ్గులను తట్టుకుంటాయి. నాణ్యత లేని వాటిని వినియోగిస్తే మొబైల్ మదర్ బోర్డులోని సున్నితమైన చిప్‌లు దెబ్బతింటాయి.
- మొబైల్ ఛార్జింగ్ స్పీడ్‌కు మించి ఉన్న వేరే కంపెనీ ఛార్జర్‌లు వాడితే బ్యాటరీ దెబ్బతింటుంది. ఫోన్ ఛార్జింగ్ కెపాసిటీ కన్నా ఎక్కువ వోల్టేజ్ ఉన్న ఛార్జర్‌ను వినియోగిస్తే ఫోన్ పాడవుతుంది. అదే తక్కువగా ఉంటే ఫోన్ నెమ్మదిగా ఛార్జ్ అవుతుంది.
- కంపెనీలు ఛార్జర్ల వోల్టేజిని ఫోన్‌కు తగ్గట్టుగా తయారుచేస్తాయి. ఒకదానికి బదులు మరొకటి ఎక్కువగా వినియోగిస్తే మొబైల్ పాడవుతుంది. నాణ్యమైన ఛార్జర్ అయితే ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సమయంలో ఫోన్ ఛార్జింగ్‌లో ఉన్నా ఛార్జర్ వరకే దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు.
- మనం కొంటున్న ఛార్జర్లపై దాదాపు అన్నింటిపైనా ఐఎస్ఐ మార్కు ఉంటోంది. నకిలీవైతే ఈ మార్కు మసకగా కనిపిస్తోంది.

బీఐఎస్ కేర్‌తో మోసాలకు చెక్ ..

- ఛార్జర్ నాణ్యతను తెలుసుకునేందుకు.. మన సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ లేదా యాప్ స్టోర్‌లో బీఐఎస్ కేర్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యాప్ ఓపెన్ చేయగానే వెరిఫై ఆర్(రిజిస్ట్రేషన్) నంబర్ అనే ఆప్షన్ క్లిక్ చేయాలి. మనం కొన్న ఛార్జర్‌పై ఆర్ నంబరు అని ఉంటుంది. దాన్ని యాప్‌లో నమోదుచేయగానే కంపెనీ పేరు, వస్తువు ఏంటి, ఎక్కడ, ఎవరు తయారు చేశారు. మోడల్ నంబర్, చెల్లుబాటు గడువు, తదితర వివరాలన్నీ ఇందులో కనిపిస్తాయి.
- ఇలాంటి వివరాలేవి రాకపోతే అది పక్కా నకిలీ అని నిర్ధారించుకోవచ్చు. ఈ యాప్‌లో కేవలం ఛార్జర్‌లే కాదు అన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలు, ఆహార పదార్థాలు ఇలా ఎన్నో వస్తువుల రిజిస్ట్రేషన్ నంబర్లతో నాణ్యమైనవో.. నకిలీవో నిర్ధారించుకోవచ్చు. నకిలీవని తేలాక ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వెనక్కి తీసుకోకుంటే ఈ యాప్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు.

నాణ్యతలేని ఛార్జర్లు కొన్నిసార్లు ప్రాణాంతకమవుతుంటాయి

- ఇటీవల నల్గొండ జిల్లాలో ఛార్జర్ పేలి ఓ ఇల్లు ధ్వంసమైంది. దాదాపు రూ.6లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.
- నెల్లూరుకు చెందిన చలంచర్ల మణి తన మొబైల్‌కు ఛార్జింగ్ పెట్టడానికి ఎడాప్టర్ ప్లగ్‌లో పెట్టి.. పిన్ ఫోన్‌కు కనెక్ట్ చేశారు.. ఒక్కసారిగా షాక్ కొట్టి ప్రాణాలు కోల్పోయారు.
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఛార్జింగ్ పెట్టిన మొబైల్ పేలి మంటలు ఇల్లంతా వ్యాపించి నలుగురు చిన్నారులు మృతి చెందారు.

-ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

సమాధులు చెప్పే ప్రేమకథ



ఎంత కష్టమైనా, ఎన్ని అడ్డంకులు వచ్చినా చనిపోయే వరకు కలిసున్నా ప్రేమికుల కథ 'రాజు వెడ్స్ రాంబాయి' అయితే.. కనీసం మృతి చెందిన తర్వాతైనా ప్రియురాలితో ఉండాలనే భావనతో ఆమె సమాధి పక్కనే శాశ్వత నిద్రకు ఉపక్రమించిన ఓ డచ్ ప్రేమికుడి కథ ఇది. శతాబ్దాలుగా మచిలీపట్నం కేంద్రంగా చరిత్రలో మరుగునపడింది. 17వ శతాబ్దంలో డచ్‌వారు మచిలీపట్నంలో వ్యాపారం చేయడానికి వచ్చారు. కాలక్రమంలో ఇక్కడే పరిశ్రమలు నెలకొల్పడటంతో మరింత మంది ఇక్కడికి వలసొచ్చారు. అలా వచ్చినవారిలో జొహన్నెస్ క్రుజిఫ్ ఒకరు. అతను ఓ ఫ్యాక్టరీలో క్లర్క్‌గా పనిచేసేవారు. డచ్ వ్యాపారి కుమార్తె కేథరినా వాన్‌డెన్‌బ్రియాన్‌ను జొహన్నెస్ అమితంగా ఇష్టపడ్డారు. ఆమె కూడా అతని ప్రేమను అంగీకరించింది. వివాహం చేసుకోవడానికి సిద్ధపడి కేథరినా తల్లిదండ్రులను ఒప్పించారు. అంతలోనే కొందరు కేథరినా వ్యక్తిత్వం గురించి జొహన్నెస్‌కు చెడుగా చెప్పారు. వాస్తవాలేంటో తెలుసుకుందామని కొన్నిరోజులు అతను ఆమెను దూరం పెట్టాడు. ఎడబాటును తట్టుకోలేని కేథరినా అనారోగ్యానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరుకొంది. జొహన్నెస్‌కు ఈ విషయం తెలిసేసరికి 1678 అక్టోబరులో కేథరినా మృతి చెందింది. చెప్పుడు మాటలు విని చాలా పెద్ద తప్పు చేశానంటూ జొహన్నెస్ తీవ్రంగా కుమిలిపోయి మంచం పట్టాడు. చివరికి తాను చనిపోతానని తెలుసుకున్న అతను కేథరినా పక్కనే పూడ్చిపెట్టాలని ఆమె తల్లిదండ్రులను కోరాడు. అలా కేథరినా చనిపోయిన మూడు నెలలకు జొహన్నెస్ కూడా తనువు చాలించాడు. అతని కోరిక మేరకు కేథరినా సమాధి పక్కనే పూడ్చిపెట్టి ఒకే సమాధి ఏర్పాటు చేశారు. మచిలీపట్నంలోని మాచవరం ప్రాంతంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో పరిరక్షిస్తున్న డచ్ సమాధుల్లో వీరి సమాధిని ఇప్పటికీ చూడవచ్చు. అన్నింటిపై చనిపోయిన వారి వివరాలతో పాటు ఒక చిత్రం ఉండగా.. వీరి సమాధిపై మాత్రం రెండు చిత్రాలు ఉంటాయి.

– ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

బాబోయ్.. సముద్ర సీల్!



చిత్రంలో కనిపిస్తున్నది సముద్ర సీల్ అనుకుంటే పొరబడినట్లే. ఇది శ్రీకాకుళం జిల్లా మందస మండలం బేతాళపురం తీరానికి మొంథా తుపాను సమయంలో కొట్టుకొచ్చిన ఓ చెట్టు మొద్దు. దీని కొంత భాగం ఇసుకలో కూరుకుపోగా మిగిలిన భాగం సీల్ క్షీరదంలా కనిపిస్తోంది.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

ఆ అద్భుత శక్తి మీకుంటే తిరుగుండదు



మీ పనులు ప్రణాళిక ప్రకారం జరుగుతున్నా, జరగకపోయినా; అవమానాలు ఎదురైనా, అభినందనలు దక్కినా; భరించలేని ఒత్తిడి ఉన్నా, పట్టలేని ఆనందం కలిగినా; పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రశాంత చిత్తంతో ఉండటం ఓ అద్భుత శక్తి. దాన్ని మీరు సాధిస్తే ఇక మీకు తిరుగుండదు. ఇతరులు ఒత్తిడితో చిత్తవుతున్నప్పుడు, గందరగోళ పరిస్థితుల్లో అయోమయానికి గురవుతున్నప్పుడు మీరు సడలని ఏకాగ్రతతో పనిచేస్తారు. అదే మిమ్మల్ని ప్రత్యేక వ్యక్తిగా నిలుపుతుంది.


– మైఖేల్ డొరెక్, కంటెంట్ క్రియేటర్

రైతు నేస్తాలు.. ఈ మయూరాలు



పల్నాడు జిల్లా వినుకొండ మండలం కొత్తపాలెంలోని సుబ్బారావు పొలంలో రెండు మయూరాలు కనువిందు చేస్తున్నాయి. సుబ్బారావు గ్రామ సమీపంలోని తన పొలంలో బొప్పాయి, జామ, బత్తాయి.. సీజన్ల వారీగా అరటి, పుచ్చ తదితర పండ్ల తోటలు సాగు చేస్తుంటారు. కొంతకాలం కిందట రెండు నెమళ్లు ఆ తోట వద్దకు వచ్చి జామకాయలు తిని సాయంత్రం వరకు గడిపి వెళ్లిపోయాయని, అప్పటినుంచి రోజూ పొలం వద్దకు వస్తున్నాయని రైతు సుబ్బారావు చెప్పారు. ఈ రెండు మయూరాలు రైతు పెంచుకుంటున్న కోళ్లు, దూడలతో పాటు తోటలో కలియదిరుగుతున్నాయి. సాయంత్రం కాగానే వాటి దారిన అవి వెళ్లిపోతున్నాయి.

– న్యూస్‌టుడే, వినుకొండ రూరల్





ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 28-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 108

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



రెండోదశ భూ సమీకరణ తప్పనిసరి

- రాజధాని నగరం అంతర్జాతీయ స్థాయిలో ఉండాలా? మున్సిపాలిటీగా మిగిలిపోవాలా?
- అమరావతి నష్టపోతే మీరూ నష్టపోతారు
- ఇన్ని జేఏసీలెందుకు.. అమరావతి అభివృద్ధి కమిటీగా ఏర్పడండి
- మీ సమస్యలన్నీ సంక్రాంతిలోగా పరిష్కరిస్తాం
- రాజధాని రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ



రాజధాని రైతుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మంత్రి నారాయణ తదితరులు

ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతి కోసం రెండోదశ భూసమీకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న సంస్థలకు భూములు లేవని, అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్‌సిటీ, విమానాశ్రయం, రైల్వేస్టేషన్ నిర్మించేందుకూ భూములు అవసరమని ఆయన తెలిపారు. అవన్నీ వస్తేనే అమరావతి ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రెండోదశ భూసమీకరణకు రైతులు సహకరించకపోతే అమరావతి ఒక మున్సిపాలిటీగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. రాజధాని రైతులతో గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో రైతుల సమస్యలు, వారి డిమాండ్లను సావధానంగా విన్నారు. సానుకూలంగా స్పందిస్తూనే, రైతులు ప్రతి చిన్నదానికీ సోషల్ మీడియాకు ఎక్కడం, అంతర్గత విభేదాలతో సమస్యలను జటిలం చేయడం సరికాదని సుతిమెత్తగా హెచ్చరించారు. అమరావతి రైతుల్లో అన్ని జేఏసీలు ఉండడమే.. ఐకమత్యం కొరవడిందనడానికి నిదర్శనమన్నారు. అందరూ ఒకేతాటిపై ఉండాలని స్పష్టంచేశారు. రైతులందరూ ఒకే గొడుగు కిందకు వచ్చి, అమరావతి అభివృద్ధి కమిటీగా ఏర్పడాలని సీఎం సూచించారు.

రైతుల సానుకూల స్పందన

“రాజధానికి భూములిచ్చిన రైతులతో మనసు విప్పి మాట్లాడాలి కాబట్టి అన్నీ చెబుతున్నాను. అమరావతే రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్‌గా ఉండాలి. ఇక్కడ అభివృద్ధి ఫలాల్ని (మిగతా 11లో)

> అమరావతి రైతులు ఐక్యంగా ఉన్నప్పుడే విచ్ఛిన్నకర శక్తులు రాజధానికి నష్టం కలిగించాలని చూశాయి. 2019-24 మధ్య అమరావతిని నామరూపాల్లేకుండా చేయాలని ప్రయత్నించాయి. మీరంతా ఐక్యంగా పోరాడి కాపాడుకున్నారు. ఇప్పుడు మీరు వర్గాలుగా విడిపోయి... చిన్నచిన్న అంశాల్ని భూతద్దంలో చూపిస్తే తప్పుడు సంకేతాలు వెళతాయి. అమరావతికి నష్టం జరిగితే మీరూ నష్టపోతారు.
> – రైతులతో చంద్రబాబు



సమావేశానికి హాజరైన రాజధాని రైతులు



పోలవరం.. మార్కాపురం.. మదనపల్లె

3 కొత్త జిల్లాలకు నోటిఫికేషన్ విడుదల

- రెవెన్యూ డివిజన్లుగా నక్కపల్లి, అద్దంకి, మడకశిర, పీలేరు, బనగానపల్లి
- మరికొన్ని మండలాలూ ఒక డివిజన్ నుంచి మరో డివిజన్‌లోకి
- కొత్తగా పెద్దహరివాణం మండలం
- పెనుగొండ.. ఇక వాసవీ పెనుగొండ
- మార్పుచేర్పులపై ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ

3 లో

టెక్ భారత్ సాకారం!

- జెన్-జడ్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు
- అంతరిక్ష రంగ విస్తరణకు అంకుర సంస్థల అండ
- ప్రపంచంలో మనది మూడో అతిపెద్ద స్టార్టప్‌ల వ్యవస్థ
- హైదరాబాద్‌లో ‘స్కైరూట్’ ఇన్ఫినిటీ క్యాంపస్ వర్చువల్‌గా ప్రారంభం





హైదరాబాద్‌లోని ‘స్కైరూట్’ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ★ స్కైరూట్ సంస్థ రూపొందించిన విక్రమ్–1 రాకెట్


ఈనాడు – హైదరాబాద్

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ భారతదేశాన్ని అగ్రపథంలో నిలుపుతున్నారని, ‘టెక్ భారత్’ను సాకారం చేస్తున్నారని యువతరంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా జెన్-జడ్ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు సరికొత్త అవకాశాలను సృష్టిస్తూ అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని విస్తరిస్తున్నారని అభినందించారు. అంతరిక్ష సేవల ప్రైవేటు సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను గురువారం ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఉపగ్రహ ప్రయోగాల కోసం విక్రమ్-1 అనే ఆర్బిటల్ రాకెట్‌ను ఈ సంస్థ రూపొందించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... “చిన్నపాటి అద్దె గదుల్లో, పరిమితమైన వనరులతో ప్రారంభమైన అంతరిక్ష సేవల రంగానికి చెందిన 300 అంకుర సంస్థలు ఇప్పుడు అత్యంత క్రియాశీలకంగా మారాయి. జెన్-జడ్‌లో సృజనాత్మకత, ఆశావాదం, దృఢచిత్తం ఎక్కువగా కనిపిస్తున్నాయి. దాదాపు 1.50 లక్షల స్టార్టప్‌లతో ప్రపంచవ్యాప్తంగా మూడో అతిపెద్ద అంకుర సంస్థల వ్యవస్థ మనదే. మనదేశం ఇప్పుడు యాప్స్, సేవలకు మాత్రమే పరిమితం కాలేదు. డీప్-టెక్, హార్డ్‌వేర్, ఉత్పత్తి రంగాల్లో వేగంగా వృద్ధి చెందుతోంది. (మిగతా 10లో)

రాష్ట్రానికి ‘దిత్వా’ ముప్పు!

బంగాళాఖాతంలో తుపానుగా బలపడిన తీవ్ర వాయుగుండం

- నాలుగు రోజులు కొనసాగనున్న తీవ్రత
- కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలకు అవకాశం



తుపాను గమనంపై ఐఎండీ విడుదల చేసిన చిత్రం

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రానికి మరో తుపాను ముప్పు పొంచి ఉంది. నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక సమీపంలోని తీవ్ర వాయుగుండం గురువారం ఉదయం తుపానుగా బలపడినట్లు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) పేర్కొంది. ఇది గురువారం సాయంత్రానికి బట్టికాలోవా (శ్రీలంక)కు 20 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 520, చెన్నైకి 620 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. క్రమంగా ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం ఉదయానికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా (ఏపీ) తీరాలను సమీపించే అవకాశముందని చెప్పింది. ఈ నేపథ్యంలో అండమాన్, నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌తో పాటు ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలను ఐఎండీ అప్రమత్తం చేసింది.

సరస్సు పేరు: తుపానుకు ఐఎండీ.. ‘దిత్వా’గా నామకరణం చేసింది. దీన్ని యెమెన్ సూచించింది. అక్కడి సోకోత్రా ద్వీపంలోని ఒక ప్రసిద్ధ సరస్సు పేరు ఇది. దాదాపు నాలుగు రోజులపాటు తుపాను తీవ్రత కొనసాగనుంది. ఇది చెన్నై, పుదుచ్చేరి మధ్యలో తీరం దాటుతుందని తొలుత అంచనా వేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితి ప్రకారం తుపాను (మిగతా 10లో)

శ్రీవారికి అప్రతిష్ఠ కలిగే ఏ పనీ చేయను.. చేయనివ్వను

- తప్పులు చేస్తే ఈ జన్మలోనే శిక్ష
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- అమరావతిలో రూ.260 కోట్లతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: శ్రీవేంకటేశ్వరస్వామికి అప్రతిష్ఠ కలిగే ఏ పనీ చేయను... ఎవరినీ చేయనివ్వనని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కలియుగ దేవుడి సన్నిధిలో ఉన్నప్పుడు పవిత్రత, పరిశుభ్రత, స్వచ్ఛమైన ఆలోచన ఉండాలన్నారు. రూ.260 కోట్లతో అమరావతిలో చేపట్టిన శ్రీవారి ఆలయ అభివృద్ధి పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని, తిరుమల తరహాలో ఆలయాన్ని తీర్చిదిద్దుతామని వెల్లడించారు. రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల భూమిపూజ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. ‘చిన్నప్పటి నుంచి స్వామిని చూస్తూనే బతికా. శ్రీవారి పాదపద్మాల చెంత తరించా. స్వామి దగ్గరకు సీఎంగా కాకుండా.. ఓ భక్తుడిగా క్యూ లైన్‌లోనే (మిగతా 10లో)



అమరావతిలోని వెంకటపాలెంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతిలో శ్రీవారి వైద్య సేవకులు

పుట్టపర్తిలో మాదిరిగా వారిని ఆహ్వానించాలన్న సీఎం 10 లో

పంచాయతీల విభజనకు పచ్చజెండా

నిషేధం తాత్కాలికంగా ఎత్తివేస్తూ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీల విభజన, పునర్నిర్మాణంపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఇవి అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌ను ఆదేశించింది. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సంబంధిత ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ప్రస్తుత పదవీ కాలం 2026 మార్చి నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ లేఖ కూడా రాశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్... పంచాయతీల విభజన, పునర్నిర్మాణంపై ఉన్న నిషేధాన్ని (మిగతా 10లో)

కల్తీ నెయ్యి కేసులో కొనుగోళ్ల విభాగం జీఎం అరెస్టు

- లడ్డూ వ్యవహారంలో అరెస్టయిన తొలి తితిదే అధికారి సుబ్రహ్మణ్యం
- రూ.లక్షల్లో లంచం ముట్టినట్లు ఆరోపణలు

2 లో


అమరావతిలో బ్యాంకుల కార్యాలయాల నిర్మాణాలకు నేడు శంకుస్థాపన

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో 25 బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, నారాయణ హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి పక్కన సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొదటి బ్లాక్‌లో కార్యక్రమం నిర్వహించనున్నారు. అమరావతిలో ఇప్పటికే వివిధ బ్యాంకుల యాజమాన్యాలు కార్యాలయాలు నిర్మించే ప్రాంతాల్లో శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశాయి. రాజధాని రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, స్థానికులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు సీఆర్డీఏ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

‘స్క్రబ్ టైఫస్’తో జాగ్రత్త

- రాష్ట్రవ్యాప్తంగా వెలుగులోకి పాజిటివ్ కేసులు
- చిత్తూరు, కాకినాడ, విశాఖ జిల్లాల్లో అత్యధికం

రాష్ట్రంలో ‘స్క్రబ్ టైఫస్’ తీవ్రత ఇలా.. (జనవరి 1 నుంచి నవంబర్ 26 వరకు)	అనుమానిత కేసులకు పరీక్షలు	గుర్తించిన పాజిటివ్ కేసులు
	6,678	1,317



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ‘స్క్రబ్ టైఫస్’ జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. 26 జిల్లాల్లోనూ పాజిటివ్ కేసులు ఉన్నాయి. స్క్రబ్ టైఫస్ అనేది నల్లిని పోలిన చిన్న కీటకం. రికెట్సియా కుటుంబానికి చెందిన ఓరియంటియా సుట్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల స్క్రబ్ టైఫస్ వస్తుంది. ఈ కీటకం కుడితే శరీరంపై నల్లని మచ్చ, దద్దుర్లు ఏర్పడతాయి. వారం, పది రోజుల తర్వాత జ్వరం, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణసమస్యల రూపంలో ఇన్‌ఫెక్షన్ బయటపడుతుంది. సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోతే తీవ్ర శ్వాస సంబంధిత సమస్యలు (ఏఆర్‌డీఎస్), మెదడు, వెన్నెముక ఇన్‌ఫెక్షన్లు (మెనింజైటిస్), మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది.

ఎక్కడ ఎలా..

ఈ బ్యాక్టీరియా బారిన పడినవారిలో ఎక్కువగా చిత్తూరు (379), కాకినాడ (141), విశాఖపట్నం (123) జిల్లాల వారు ఉన్నారు. ఇంకా.. వైఎస్సార్ కడప (94), శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు (86), అనంతపురం (68), తిరుపతి (64), విజయనగరం (59), కర్నూలు (42), అనకాపల్లి (41), శ్రీకాకుళం (34), అన్నమయ్య (32), గుంటూరు (31), నంద్యాల (30) జిల్లాల్లోనూ కేసులు వెలుగుచూశాయి. (మిగతా 10లో)

ఐపీఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్ మరో 6 నెలల పొడిగింపు

ఈనాడు, అమరావతి: అగ్నిమాపక, సీఐడీ విభాగాల్లో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగాలున్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. 2026 మే 26 వరకూ ఆయనపై సస్పెన్షన్ విధిస్తూ సీఎస్ కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైకాపా హయాంలో అగ్నిమాపక శాఖ డీజీ, సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన సంజయ్.. అగ్ని సాఫ్ట్‌వేర్, ఎన్‌వోసీ వెబ్ పోర్టల్ నిర్వహణ, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంలోని అంశాలపై అవగాహన కార్యక్రమాల పేరిట నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని గతేడాది చివర్లో సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. వెంటనే డిసెంబరు 3న రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి ఆయన్ను సస్పెండ్ చేసింది. తర్వాత రెండుసార్లు పొడిగించింది. గురువారంతో ఆ గడువు ముగియనుండటంతో సస్పెన్షన్ సమీక్షా కమిటీ మరో 6 నెలల పాటు సస్పెన్షన్ పొడిగించాలని నిర్ణయించింది.

కల్తీ నెయ్యి కేసులో కొనుగోళ్ల విభాగం జీఎం అరెస్టు

- రూ.లక్షల్లో లంచం ముట్టినట్లు ఆరోపణలు
- వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నకూ సహకారం
- డిసెంబరు 10 వరకు రిమాండ్ విధించిన నెల్లూరు ఏసీబీ కోర్టు



సుబ్రహ్మణ్యానికి వైద్యపరీక్షలు చేస్తున్న రుయా సిబ్బంది

ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో తొలిసారి తితిదే అధికారిని అరెస్టు చేశారు. నకిలీ నెయ్యి తిరుమలకు వచ్చినప్పుడు కొనుగోళ్ల విభాగం జనరల్ మేనేజర్‌గా ఉన్న ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యాన్ని సిట్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. రుయా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేశాక నెల్లూరులోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి డిసెంబరు 10 వరకు రిమాండ్ విధించారు. కేసులో ఈయన 29వ నిందితుడు. తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్న (ఏ24)కు సుబ్రహ్మణ్యం సహకరించారని సిట్ ఇప్పటికే తేల్చింది. నెయ్యి సరఫరా చేసే డెయిరీలు, ప్రతినిధుల వివరాలు ఈయనే అందజేశారు. వీటి ఆధారంగా అప్పన్న.. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ సంస్థకు టెండర్ దక్కేలా చక్రం తిప్పారు. ప్రతిఫలంగా హవాలా మార్గంలో రూ.50 లక్షల లంచం తీసుకున్నారు. తిరుమలకు కల్తీ నెయ్యి వస్తోందని తెలిసినా చర్యలు తీసుకోకుండా సుబ్రహ్మణ్యం ఊరుకోవడం వల్లే వైకాపా పాలనలో తిరుమలకు 68 లక్షల కిలోల కల్తీనెయ్యి సరఫరా అయ్యింది. కల్తీనెయ్యి అనుమతించినందుకు సుబ్రహ్మణ్యానికి పెద్ద మొత్తంలోనే నగదు ముట్టిందని తెలుస్తోంది. ఈ అభియోగాల నేపథ్యంలోనే ఆయనను అరెస్టు చేసినట్లు సమాచారం.

మైసూరు ల్యాబ్ నివేదిక ఇచ్చినా

2022 మే 16న భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ కల్తీ నెయ్యి సరఫరా చేస్తోందని వైవీ సుబ్బారెడ్డికి ఫిర్యాదు రాగా విచారించి నివేదిక ఇవ్వాలని ఆయన నాటి జీఎం సుబ్రహ్మణ్యాన్ని ఆదేశించారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన పిటిషన్‌పై విచారించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ఈ ఫిర్యాదు వైవీ చేతికి ఇచ్చింది ఆయన మాజీ పీఏ చిన్నఅప్పన్నే. మే 20న తిరుమలలోని క్యాంప్ ఆఫీసులో సుబ్బారెడ్డిని సుబ్రహ్మణ్యం కలవగా ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ ట్యాంకర్లు, టిన్నుల ద్వారా పంపే నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో పరీక్షించాలని ఆదేశించారు. జూన్‌లో పంపగా నాలుగింటిలోనూ కల్తీ జరిగిందని ఆగస్టులో నివేదిక వచ్చింది. అయినా సుబ్బారెడ్డి చర్యలు తీసుకోలేదు. బాధ్యులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాల్సి ఉన్నా సుబ్రహ్మణ్యం యథావిధిగా నెయ్యి సరఫరాకు అనుమతించారు. భోలేబాబా డెయిరీ 2022 అక్టోబరు వరకు, మిగతా సంస్థలు 2024 వరకు నకిలీ నెయ్యిని తితిదేకు పంపినట్లు సిట్ తేల్చింది.

అధికారులకే తెలుసన్న వైవీ


కల్తీ నెయ్యి కేసులో ఈ నెల 20న సుబ్బారెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ప్రశ్నించారు. ఈ సందర్భంగా నెయ్యి కొనుగోలు, టెండర్ల ఖరారు బాధ్యతను అధికారులే చూసుకుంటారని ఆయన సమాధానమిచ్చారు. వారికే ఈ వ్యవహారాలు తెలుసని బదులిచ్చారు. కేసు కీలక దశకు చేరుకోవడం, విచారణకు సహకరించకపోవడం కూడా సుబ్రహ్మణ్యం అరెస్టుకు కారణమని తెలుస్తోంది. కల్తీనెయ్యి కేసులో ఇప్పటివరకు నిందితుల సంఖ్య 24గా ఉంది. సుబ్రహ్మణ్యం అరెస్టుతో 29కి పెరిగింది. ఏ25 నుంచి ఏ28 వరకు ఎవరున్నారో తెలియాలి. వచ్చే నెలలో దాఖలు చేసే మలి ఛార్జ్‌షీట్‌లో మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశముంది. తొలి ఛార్జ్‌షీట్‌లో తితిదే కొనుగోళ్ల విభాగంలో విధులు నిర్వర్తించిన యడం నాగేంద్రప్రసాద్ (ఏ9), కరమల శేఖర్ (ఏ10) నిందితులుగా ఉన్నారు. వీరిని గతంలోనే సిట్ అధికారులు ప్రశ్నించారు.

రవికుమార్ బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తు

పరకామణిలో చోరీ కేసు నిందితుడు రవికుమార్, ఇతర కుటుంబసభ్యుల బ్యాంకు లావాదేవీలపై సీఐడీ ప్రత్యేక బృందం గురువారం దర్యాప్తు చేపట్టింది. రెండురోజుల కిందట బ్యాంకు లావాదేవీల గురించి వెల్లడించాలని సీఐడీ కొన్ని బ్యాంకులకు నోటీసులిచ్చింది. వారిచ్చిన వివరాల మేరకు దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతి, బెంగళూరు, తమిళనాడులోని బ్యాంకుల లావాదేవీలను వారు పరిశీలించినట్లు సమాచారం.

పరకామణిలో చోరీపై నాకు తెలియదు

- నేడు సిట్ విచారణకు హాజరవుతా
- వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి వెల్లడి



ఈనాడు, దిల్లీ: పరకామణిలో చోరీ వ్యవహారంపై దర్యాప్తు జరుపుతున్న అధికారులు తనను విచారణకు పిలిచినందున శుక్రవారం విజయవాడలో హాజరు కాబోతున్నట్లు రాజ్యసభ సభ్యుడు, తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. పరకామణిలో దొంగతనం గురించి తనకు తెలియదని చెప్పారు. ఆయన గురువారం దిల్లీలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. 'పరకామణిలో కానుకల చోరీ కేసులో ఉన్న రవికుమార్ స్వామివారికి విరాళంగా ఇచ్చిన ఆస్తులు దొంగతనం ద్వారా వచ్చాయని మాకు తెలియదు. దాతలు ఇచ్చే విరాళాలు బోర్డు ముందు పెట్టినప్పుడు అవి స్పష్టంగా ఉన్నాయా? లేదా? వాటిని స్వీకరించవచ్చా అని చూసి మాత్రమే ఆమోదిస్తాం. ఇందులోనూ అదే జరిగింది. నెయ్యి, పరకామణి విషయంలో నేనే తప్పూ చేయలేదు. అధికారులు తయారు చేసిన అంశాలు బోర్డు ముందుకొస్తే సభ్యుల అభిప్రాయం ప్రకారమే మేం నిర్ణయం తీసుకున్నాం' అని వివరించారు.

★ కల్తీ నెయ్యి కేసులో మాజీ పీఏ చిన్న అప్పన్న వ్యవహారం గురించి అడిగిన ప్రశ్నకు సుబ్బారెడ్డి స్పందిస్తూ 'అప్పన్న 2014 నుంచి 2018 వరకే నాకు పీఏగా ఉన్నారు. తర్వాత అతనికి, నాకు అధికారికంగా ఎలాంటి సంబంధాలు లేవు' అన్నారు. అప్పన్న ఖాతాలో కోట్ల రూపాయలు జమ కావడంతో తనకు సంబంధం లేదన్నారు. తితిదే వ్యవహారానికి, చిన్న అప్పన్నకు సంబంధమే లేదన్నారు.

★ కల్తీనెయ్యి వ్యవహారంపై 2019 నుంచి కాకుండా అంతకుముందు పదేళ్ల నుంచి దర్యాప్తు జరపాలని వైవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. 'కల్తీ నెయ్యి ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్యాంకర్లు 2024 జూన్- జులై నెలల్లో వచ్చాయి. ఆ నెయ్యి లడ్డూ ప్రసాదంలో కలిసిందని తెదేపా ఆరోపిస్తోంది. సిట్ ఛార్జ్‌షీట్ ప్రకారం జూన్, జులై నెలల్లో తిప్పిపంపిన నెయ్యి తిరిగి ఆగస్టులో వేర్వేరు సరఫరాదారుల ద్వారా రావడంతో లడ్డూ తయారీలో ఉపయోగించినట్లు ఉంది. ఈ రెండు సందర్భాల్లో చంద్రబాబు ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా? చంద్రబాబు హయాంలోనూ కిలో నెయ్యి రూ.276, 279, 295లకు కూడా కొన్నారు. అంటే ఆ నెయ్యి కూడా కల్తీదేనా? ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపణలు చేశాక కూడా 2024 సెప్టెంబర్‌లో కిలో నెయ్యి రూ.475కే కొన్నారు. అది కల్తీది కాదా?' అని సుబ్బారెడ్డి ప్రశ్నించారు.

వైకుంఠ ద్వార దర్శనాల ఈ-డిప్‌కు తొలి రోజే 4.60 లక్షల మంది నమోదు



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు మొదటి మూడు రోజుల ఆన్‌లైన్ ఈ-డిప్‌కు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం ఉదయం 10 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా గంటలోనే రికార్డు స్థాయిలో 2.16 లక్షల మంది భక్తులు నమోదు చేసుకున్నారు. సాయంత్రానికి మొత్తం 4.60 లక్షల మంది నమోదు చేసుకోగా డిసెంబరు ఒకటో తేదీ వరకు అవకాశం ఉండటంతో ఈ సంఖ్య భారీగా ఉండనుంది. డిసెంబరు 2న ఈ-డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులకు ఫోన్ ద్వారా సందేశం పంపి డిసెంబరు 30 నుంచి మూడు రోజులు వైకుంఠ ద్వార దర్శనాలకు అనుమతిస్తారు. మిగిలిన ఏడు రోజులు ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనం కల్పించడంతో పాటు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, శ్రీవాణి దర్శన టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఇందుకు డిసెంబరు 5న ఆన్‌లైన్‌లో కోటా విడుదల చేస్తారు. తితిదే వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in, ttdevasthanams app, ఏపీ వాట్సప్ నంబరు 95523 00009లో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

అసభ్య సంజ్ఞలు.. ఆపై దాడి

- ఆర్టీసీ బస్సులో విద్యార్థినిపై విద్యార్థి అమానుషం
- ఫిర్యాదుపై తొలుత స్పందించని పోలీసులు
- మనస్తాపంతో బాధితురాలి ఆత్మహత్యాయత్నం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: బస్సులో ఓ విద్యార్థి.. విద్యార్థినిని ఉద్దేశించి అసభ్యకర సంజ్ఞలు చేశాడు. ప్రశ్నిస్తే విచక్షణారహితంగా దాడి చేశారు. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయిస్తే వారి నుంచి సరైన స్పందన రావడం లేదని భావించి.. మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలో బుధవారం జరిగిన ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఓ విద్యార్థిని, ఇదే మండలంలోని మరో గ్రామానికి చెందిన విద్యార్థి ధర్మవరంలో వేర్వేరు కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నారు. రెండ్రోజుల క్రితం బస్సులో వెళ్తుండగా బాలికను ఉద్దేశించి విద్యార్థి అసభ్యకర సంజ్ఞలు చేశాడు. మరునాడూ అలాగే ప్రవర్తించడంతో ఆమె సెల్‌ఫోన్‌లో రికార్డు చేసింది. ఎందుకు అలా చేస్తున్నావని చెంపదెబ్బ కొట్టి, ప్రశ్నించింది. దీంతో ఆ విద్యార్థి దుర్భాషలాడుతూ బాలికపై దాడికి దిగాడు. ధర్మవరంలో బస్సు దిగి వెళుతున్నప్పుడూ మరోసారి దాడి చేశాడు. బాధితురాలు ఫిర్యాదు చేసేందుకు ధర్మవరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఘటన చెన్నేకొత్తపల్లి పరిధిలో జరగడంతో అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు చెప్పడంతో తండ్రితో కలిసి అక్కడికీ వెళ్లారు. కానీ, పోలీసుల నుంచి సరైన స్పందన రాలేదని భావించిన విద్యార్థిని ఇంటికి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలిని కుటుంబసభ్యులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం రాత్రి తెలిపారు. పోలీసులు తక్షణమే స్పందించి ఉంటే తమ బిడ్డ ఆత్మహత్యకు యత్నించేది కాదని బాధితురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

106 రోడ్ల పునరుద్ధరణకు రూ.276 కోట్లు

ఈనాడు, అమరావతి: న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్(ఎన్‌డీబీ), కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి(సీఆర్ఐఎఫ్), రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి కింద గతంలో మంజూరు చేసి, పనులు ప్రారంభించక రద్దయిన 106 రహదారుల పనులు చేపట్టేందుకు రూ. 276.58 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులకు రూ.500 కోట్లతో ప్రభుత్వం సెప్టెంబరులో పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఇందులో వివిధ ప్రాజెక్టుల కింద గతంలో మంజూరై, పనులు జరగక రద్దయిన 59 జిల్లా రోడ్లు, 47 రాష్ట్ర రహదారుల పనులు చేపట్టేందుకు తాజాగా నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

28–11–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
అష్టమి: సా. 6-33 తదుపరి నవమి; **శతభిష:** రా. 10-19 తదుపరి పూర్వాభాద్ర; **వర్జ్యం:** ఉ.7-08 వరకు తిరిగి తె.4-35 నుంచి 6-10 వరకు
అమృత ఘడియలు: మ.3-08 నుంచి 4-44 వరకు;
దుర్ముహూర్తం: ఉ. 8-28 నుంచి 9-13 వరకు తిరిగి మ. 12-10 నుంచి 12-54 వరకు; **రాహుకాలం:** ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 6.16; **సూర్యాస్తమయం:** సా. 5.20

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	18.0	28.0
శ్రీకాకుళం	18.0	30.0
అనంతపురం	18.8	31.2
కడప	19.0	28.0
కర్నూలు	19.7	31.3
విశాఖపట్నం	20.0	28.8
రాజమహేంద్రవరం	20.0	33.0
విజయవాడ	21.0	29.0
నరసాపురం	21.0	29.6
ఒంగోలు	21.8	29.5
నెల్లూరు	23.6	31.3
గుంటూరు	24.0	30.0
తాడేపల్లిగూడెం	25.0	30.0

మద్యం ముడుపుల సొమ్ము — మళ్లింపు కోసమే ఆ కంపెనీలు పెట్టారా?

- మీ సంస్థల బ్యాంకు ఖాతాల్లోకి ఎక్కడి నుంచి డబ్బులొచ్చాయి?
- జగన్ సన్నిహితుడు నర్రెడ్డి సునీల్‌రెడ్డిపై సిట్ ప్రశ్నల వర్షం
- పొంతనలేని సమాధానాలతో సరి..



వైకాపా అధినేత జగన్‌తో గతంలో సునీల్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: 'వైకాపా అధికారంలోకి వచ్చాక 2020, 2021, 2022 సంవత్సరాల్లో మీరు మొత్తం 6 కంపెనీలు ఏర్పాటు చేశారు. రెండు, మూడేళ్ల డైరెక్టర్‌గా కొనసాగి.. ఆ తర్వాత వాటి నుంచి వైదొలగడానికి కారణమేంటి? మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన ముడుపుల సొమ్ము మళ్లింపు కోసమే ఈ సంస్థలు నెలకొల్పారా? మీతో వీటిని ఎవరు పెట్టించారు' అంటూ వైకాపా అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడు, అతని తరఫున ఆర్థిక వ్యవహారాలన్నీ చక్కబెడతారనే పేరున్న నర్రెడ్డి సునీల్‌రెడ్డిపై సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకూ దాదాపు 9 గంటల పాటు సిట్ అధికారులు సునీల్‌రెడ్డిని విచారించారు. ఆయా కంపెనీల ద్వారా ఏయే కార్యకలాపాలు నిర్వహించారు? వైకాపా హయాంలో వాటి ద్వారా ఎంత మేరకు లావాదేవీలు జరిపారు? ఆయా సంస్థల బ్యాంకు ఖాతాల్లోకి ఎక్కడి నుంచి సొమ్ములు వచ్చాయి అనే అంశాలపై సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు సమాచారం. సునీల్‌రెడ్డి ఏ ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానాలివ్వలేదని తెలిసింది. మరి కొన్ని ప్రశ్నలకు నోరువిప్పకుండా మౌనం వహించినట్లు సమాచారం.

దుబాయ్‌లో ఆస్తులకు డబ్బు ఎక్కడిది?

★ సునీల్‌రెడ్డి 2019-24 మధ్య దుబాయ్‌లో భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు, పెట్టుబడులు పెట్టినట్లు అనుమానిస్తున్న సిట్.. అతను ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నారు? అందుకు డబ్బు ఎక్కడి నుంచి సమకూరింది? హవాలా ద్వారా తరలించారా? మూలం ఎక్కడ? మద్యం ముడుపుల సొమ్ముతోనే ఇవన్నీ కొన్నారా అనే కోణంలో సునీల్‌రెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది.

★ సునీల్‌రెడ్డి డైరెక్టర్‌గా కొనసాగిన గ్రీన్ ఫ్యూయల్స్ గ్లోబల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన సిట్ వాటిపై ఆరా తీసినట్లు సమాచారం.

★ మద్యం ముడుపుల సొమ్ము రూటింగ్, ఈ కేసులోని నిందితులతో సంబంధాలు, వారితో జరిపిన భేటీలు తదితర అంశాలపై కూడా సునీల్‌రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది.

ఎమ్మార్ కుంభకోణం తరహాలోనే...

★ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో నర్రెడ్డి సునీల్‌రెడ్డి నిందితుడు. ఈ కుంభకోణం వెలుగుచూశాక సీబీఐ అతన్ని అరెస్టు చేసింది. వై.ఎస్.రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆయన అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్‌ప్రోకో ద్వారా పెద్ద ఎత్తున దోచుకున్నారనే అభియోగాలపై అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇలా కొల్లగొట్టిన నిధుల్ని పెట్టుబడుల రూపంలో మళ్లించుకునేందుకు సునీల్‌రెడ్డిని ముందు పెట్టి అనేక డొల్ల కంపెనీలు ఏర్పాటు చేయించారనే ఆరోపణలున్నాయి. జగన్‌కు సునీల్‌రెడ్డి నమ్మినబంటని, అతను చెప్పిన పనిని ఎడమ చేతికి తెలియకుండా నమ్మకంగా పూర్తి చేసే కుడి భుజమని చెబుతారు.

★ ఎమ్మార్ ప్రాపర్టీస్ కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తు మళ్లింపు కోసం పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసిన చరిత్ర సునీల్‌రెడ్డికి ఉంది. మద్యం కుంభకోణం ముడుపుల రూటింగ్ కోసం వైకాపా ముఠా అదే తరహా నేర విధానాన్ని అనుసరించినట్లు ఇప్పటికే సిట్ దర్యాప్తులో తేలింది. ఆ డొల్ల కంపెనీల తీగ లాగుతున్న క్రమంలో.. సునీల్‌రెడ్డి డైరెక్టర్‌గా కొనసాగిన కంపెనీల నుంచి పలు అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు సిట్ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే ఆయన్ను గురువారం విచారణకు పిలిపించి ప్రశ్నించింది.

హార్డ్‌డిస్కులు, పత్రాల విశ్లేషణలో వెల్లడైన అంశాల ఆధారంగా..

సునీల్‌రెడ్డి డైరెక్టర్‌గా గతంలో కొనసాగిన, ప్రస్తుతం కొనసాగుతున్న 1. ఆర్.ఆర్.గ్లోబల్ ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్, 2. గ్రీన్ స్మార్ట్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్, 3. గ్రీన్‌టెక్ ఇంజినీరింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, 4. శేఖర్ ఫౌండేషన్, 5. గ్రీన్‌టెల్ ఎంటర్‌ప్రైజస్ ఎల్ఎల్‌పీ, 6. గ్రీన్‌కార్ట్ మీడియా ఎల్ఎల్‌పీ, 7. వయొలేట ఫర్నిచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 8. గ్రీన్‌స్మార్ట్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ, 9. జెన్సిస్ పెట్రోకెమికల్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, 10. గ్రీన్ ఫ్యూయల్స్ గ్లోబల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో సెప్టెంబరు 11న సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నాల్లో 5 చోట్ల.. ఈ పది కంపెనీల్లో తనిఖీలు చేసి కీలక డాక్యుమెంట్లు, హార్డ్‌డిస్కులు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ నిపుణులతో విశ్లేషించారు. ఫోరెన్సిక్ విశ్లేషణలో వెల్లడైన అంశాల ఆధారంగా సునీల్‌రెడ్డిని ప్రశ్నించగా ఆయన పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆర్థిక లావాదేవీలపై అడగ్గా.. అవన్నీ ఆడిటర్‌కు తెలుస్తాయంటూ సమాధానాన్ని దాటవేసినట్లు సమాచారం. వ్యాపారమంటే చాలా వ్యవహారాలు ఉంటాయని వాటిపై ఇప్పటికప్పుడు అడిగితే తనకు ఎలా గుర్తుంటాయని సునీల్‌రెడ్డి ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది.

పోలవరం.. మార్కాపురం.. మదనపల్లె

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. పలు చోట్ల ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాన్ని మరో డివిజన్‌లోకి చేర్చింది. పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ గ్రామం పేరును వాసవీ పెనుగొండగా మార్చింది. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి పెద్దహరివాణం కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేసింది. వీటన్నింటిపై జిల్లాల వారీగా ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయాలని జిల్లాల కలెక్టర్లకు సూచిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనల్ని 30 రోజుల్లోగా జిల్లా కలెక్టర్లకు అందజేయాలని పేర్కొన్నారు. డిసెంబరు నెలాఖరులోగా జిల్లాల విభజన ప్రక్రియ పూర్తి చేసి, తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు.

ప్రకాశం జిల్లాలోకి కందుకూరు, అద్దంకి

◆ కందుకూరు, అద్దంకి నియోజకవర్గాల్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపారు. కందుకూరు డివిజన్‌లో కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెం, మర్రిపూడి, పొన్నలూరు మండలాలు ఉంటాయి. కొత్తగా ఏర్పాటయ్యే అద్దంకి రెవెన్యూ డివిజన్‌లో అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలు వస్తాయి. ◆ మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రాపురం డివిజన్ నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లో చేర్చారు. ◆ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కొండాపురం, వరికుంటపాడు మండలాల్ని కావలి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేశారు. ఆత్మకూరు డివిజన్‌లోని కలువాయి మండలం, నెల్లూరు డివిజన్‌లోని సైదాపురం, రాపూరు మండలాల్ని తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో కలిపారు. ◆ వైఎస్సార్ కడప జిల్లా కడప రెవెన్యూ డివిజన్‌లోని ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల్ని అన్నమయ్య జిల్లా రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేశారు. ◆ కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి పెద్ద హరివాణం కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేశారు. దీంతో ఆదోని మండలంలో 29 గ్రామాలు, కొత్తగా ఏర్పడే పెద్ద హరివాణం మండలంలో 17 గ్రామాలు ఉంటాయి. ◆ పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోకి.. కదిరి డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి డివిజన్‌లోకి చేర్చారు. ◆ చిత్తూరు జిల్లా పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లోకి మార్చారు. ◆ శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లోని నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లోకి మార్చారు. ◆ సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌లో చేర్చారు.

జిల్లా	కొత్త డివిజన్	మండలాలు
◆ అనకాపల్లి	నక్కపల్లి	యలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావు పేట, కోటవురట్ల, ఎస్.రాయవరం
◆ శ్రీసత్య సాయి	మడకశిర	మడకశిర, గుడిబండ, రోళ్ల, అమరాపురం, అగలి
◆ నంద్యాల	బనగానపల్లి	బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల

రామచంద్రపురం డివిజన్‌లో ఇక రెండు మండలాలే

ఈనాడు, రాజమహేంద్రవరం: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయబోతున్నారు. తద్వారా దాని పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లోకి రాబోతున్నాయి. వీటిని వేరుచేయడంతో రామచంద్రాపురం డివిజన్‌లో కేవలం రామచంద్రపురం, కె.గంగవరం మండలాలే మిగిలాయి. ఈ డివిజన్‌ను ఇలాగే కొనసాగిస్తారా? ఆ రెండు మండలాలను మరో డివిజన్‌లో విలీనం చేస్తారా అనే చర్చ నడుస్తోంది.

కొత్త జిల్లాలు, వాటి పరిధిలోని రెవెన్యూ డివిజన్లు, మండలాలు

మార్కాపురం జిల్లా – **మార్కాపురం రెవెన్యూ డివిజన్:** గిద్దలూరు, బేస్తవారపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు, మార్కాపురం, తర్లుపాడు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, పొదిలి, కొనకనమిట్ల.

కనిగిరి రెవెన్యూ డివిజన్: హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి (పీసీపల్లి), చంద్రశేఖరపురం (సీఎస్‌పురం), పామూరు

పోలవరం జిల్లా – **జిల్లా కేంద్రం:** రంపచోడవరం

రంపచోడవరం రెవెన్యూ డివిజన్: రంపచోడవరం, దేవీపట్నం, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి

చింతూరు రెవెన్యూ డివిజన్: ఎటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం

మదనపల్లె జిల్లా – **మదనపల్లె రెవెన్యూ డివిజన్:** మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, పెద్ద తిప్పసముద్రం, బి.కొత్తకోట, చౌడేపల్లి, పుంగనూరు

కొత్తగా ఏర్పాటయ్యే పీలేరు రెవెన్యూ డివిజన్: సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభం వారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం

ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా ఫరూక్ షిబ్లీ బాధ్యతల స్వీకరణ

ఈనాడు, అమరావతి: ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా ఫరూక్ షిబ్లీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉర్దూ అకాడమీ ద్వారా ఉర్దూ భాషాభివృద్ధికి, శిక్షణ కేంద్రాల సమర్థ నిర్వహణకు ఫరూక్ షిబ్లీ చర్యలు చేపట్టాలని సూచించారు. షిబ్లీ మాట్లాడుతూ.. ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

శాసనమండలి ఛైర్మన్ చర్య చట్టవిరుద్ధం

- ఎమ్మెల్సీ జయమంగళ రాజీనామాను ఏడాదిగా పెండింగ్‌లో పెట్టడమేంటి?
- విచక్షణాధికారం పేరుతో విచారణ ప్రక్రియ దుర్వినియోగం
- హైకోర్టు ఆక్షేపణ
- 4 వారాల్లో నిర్ణయం వెల్లడించాలని మోషేనురాజుకు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ జయమంగళ వెంకటరమణ ఇచ్చిన లేఖపై శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు నిర్ణయం తీసుకోకుండా ఏడాదిపాటు పెండింగ్‌లో ఉంచడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఆయన చర్యలు చట్టవిరుద్ధమని తేల్చింది. విచక్షణాధికారం పేరుతో సహేతుక సమయంలో నిర్ణయం వెల్లడించకపోవడం విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే కాదు, 'వెడ్నెస్‌బరీ సూత్రా'నికి, అధికరణ 14కు విరుద్ధమని తేల్చిచెప్పింది. జయమంగళ వెంకటరమణ 2024 నవంబర్ 23న ఛైర్మన్‌కు రాజీనామా సమర్పించారని గుర్తుచేసింది. విచారణ నిమిత్తం 2025 నవంబర్ 28న తన ముందు హాజరుకావాలని ఛైర్మన్ ఆయనకు సెప్టెంబర్ 8న నోటీసు జారీచేయడాన్ని ఆక్షేపించింది. జయమంగళ రాజీనామాపై నాలుగు వారాల్లో విచారణ ముగించి, నిర్ణయం ప్రకటించాలని ఛైర్మన్‌ను ఆదేశించింది. వైకాపా తరఫున ఎమ్మెల్సీగా గెలుపొందిన వెంకటరమణ. . 2024 నవంబర్‌లో తాను ఇచ్చిన రాజీనామా లేఖపై శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు నిర్ణయం తీసుకోలేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై వాదనలు ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ తీర్పును రిజర్వు చేశారు. గురువారం నిర్ణయాన్ని వెల్లడించారు.

గరిష్ఠంగా నెలలో నిర్ణయం తీసుకోవాలి


'సభ్యులు సమర్పించిన రాజీనామాలపై స్పీకర్ లేదా ఛైర్మన్.. సభ్యుడి నుంచి వివరణ తీసుకున్న తర్వాత 15 రోజుల్లో, గరిష్ఠంగా నెలలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. మండలి ఛైర్మన్ చర్య పార్లమెంట్‌లో జరిగిన చర్చల ఆధారంగా తీసుకొచ్చిన 33వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధం. చట్టాలు చేసేవాళ్లు చట్టం కంటే ఎక్కువ కాదు. చట్టసభల్లో స్పీకర్, ఛైర్మన్ నిష్పాక్షికంగా వ్యవహరిస్తారని రాజ్యాంగం వారిపై అపారమైన నమ్మకాన్ని ఉంచింది. ఈ నేపథ్యంలో వారి విచక్షణాధికారం ఏకపక్ష మార్గంగా ఉండకూడదు. రాజీనామాపై ఏపీ మండలి ఛైర్మన్ సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడం సహేతుకం, సమర్థనీయం కాదు' అని తేల్చిచెప్పింది. రాజీనామా స్వచ్ఛందంగా చేశారా లేదా అని విచారణ చేసే అధికార పరిధి ఛైర్మన్‌కు ఉందని, దాన్ని కోర్టు నిరోధించలేదని న్యాయమూర్తి స్పష్టత ఇచ్చారు.

రూ.10 వేలు ఖర్చులు చెల్లించిన మండలి ఛైర్మన్

జయమంగళ వ్యాజ్యంలో కౌంటర్ వేయడంలో మోషేనురాజు జాప్యం చేయడంపై హైకోర్టు గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రూ.10 వేలు ఖర్చులు చెల్లించాలనే షరతుతో కౌంటర్ దాఖలుకు అనుమతిచ్చింది. ఏపీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడి పేరున ఆ సొమ్ము జమ చేయాలని అప్పట్లో స్పష్టం చేసింది. ఆ సొమ్ముతో న్యాయ గ్రంథాలు కొని, సంఘం గ్రంథాలయంలో ఉంచాలని అధ్యక్షుడిని ఆదేశిస్తూ సెప్టెంబర్ 16న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఛైర్మన్ రూ.10 వేలు న్యాయవాదుల సంఘానికి చెల్లించారు.

చిరంజీవి ట్రస్టుకు ఎఫ్‌సీఆర్ఏ అనుమతి

దిల్లీ: విదేశీ విరాళాలు సేకరించేందుకు వీలుగా. . చిరంజీవి ఛారిటబుల్ ట్రస్టుకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్-ఎఫ్‌సీఆర్ఏ) కింద రిజిస్ట్రేషన్‌కు కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపింది. విదేశాల నుంచి విరాళాలు పొందాలని కోరుకునే స్వచ్ఛంద సంస్థలన్నీ తప్పనిసరిగా 2010నాటి ఎఫ్‌సీఆర్ఏ కింద నమోదు కావాలి. ఈ ట్రస్టును సినీ నటుడు చిరంజీవి 1998లో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జవహర్ కాలనీలో స్థాపించారు. ట్రస్టు పేద ప్రజల కోసం బ్లడ్ బ్యాంకు, ఐ బ్యాంకు నిర్వహిస్తోంది.



పిల్లలను కష్టపడనివ్వండి

పిల్లలకు చిన్నతనంలోనే సవాళ్లను ఎదుర్కోవడం అలవాటు చేయాలి. అందుకోసం కష్టమైన పనులను చేసేలా వారిని ప్రోత్సహించాలి. అవసరమైనప్పుడు మీరు సలహాలు మాత్రం ఇవ్వండి. దీనివల్ల వారి సామర్థ్యంపై వారికి విశ్వాసం ఏర్పడుతుంది. పిల్లలను కష్టపడనివ్వండి. వారు వైఫల్యాలను రుచిచూడనివ్వండి. వాటి నుంచి నేర్చుకుంటూ ఎదగనివ్వండి.

– అమీ, పేరెంటింగ్ కోచ్

10 రాష్ట్రాల్లోని వైద్య కళాశాలల్లో ఈడీ సోదాలు

- విశాఖ గాయత్రి విద్యాపరిషత్ కళాశాలలోనూ..



విశాఖలోని గాయత్రీ విద్యాపరిషత్ వైద్యకళాశాల

దిల్లీ, ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-కొమ్మాది: మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా గురువారం 10 రాష్ట్రాల్లోని వైద్య కళాశాలల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, రాజస్థాన్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీల్లోని 15 చోట్ల ఈ సోదాలు జరిగాయి. ఇందులో 7 వైద్య కళాశాలలు, కొంతమంది వ్యక్తుల ఇళ్లలో అధికారులు సోదాలు జరిపారు. వైద్య కళాశాలల నియంత్రణ చట్రాన్ని (ఫ్రేమ్‌వర్క్) తారుమారు చేయడం, లంచాలను ఎరవేయడానికి సంబంధించి పలు వైద్య కళాశాలల యాజమాన్యాలు, వ్యక్తులపై ఈ ఏడాది జూన్ 30న సీబీఐ కేసులు నమోదుచేసింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులతో పాటు ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇచ్చారనే అభియోగాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఎఫ్ఐఆర్‌లో 34 మంది పేర్లను అధికారులు చేర్చారు. కేంద్ర ఆరోగ్య శాఖలోని 8 మంది, ఎన్ఎంసీలోని ఐదుగురు వైద్యులు, జాతీయ వైద్య అథారిటీలోని ఒకరు, మధ్యవర్తులు, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రతినిధులు ఇందులో ఉన్నారు.

◆ ఛత్తీస్‌గఢ్‌లోని వైద్య కళాశాల నుంచి రూ.55 లక్షల లంచం తీసుకున్న కేసులో 8 మందిని గతంలోనే సీబీఐ అరెస్టు చేసింది. ఇందులో ఎన్ఎంసీకి చెందిన ముగ్గురు అధికారులు ఉన్నారు.

విశాఖలో ఇలా: 'నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) స్కాం' కేసులో దేశవ్యాప్త సోదాల్లో భాగంగా విశాఖ మారికవలసలో ఉన్న గాయత్రీ విద్యాపరిషత్ వైద్య కళాశాలలోనూ ఈడీ సోదాలు చేపట్టింది. ఉదయం 10 గంటల సమయంలో రెండు వాహనాల్లో 14మంది అధికారులు కళాశాలకు చేరుకున్నారు. కీలక రికార్డులతోపాటు కంప్యూటర్ డేటాను తనిఖీ చేశారు. విద్యార్థులు మినహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు.

◆ వైద్య కళాశాలల తనిఖీలప్పుడు అధికారులకు లంచాలు ఎరవేసి అనుకూలంగా నివేదికలు తెచ్చుకున్నారన్న కోణంలో దేశవ్యాప్తంగా సీబీఐ జులై 3న 36 మందిపై కేసు నమోదు చేసింది. ఎన్ఎంసీ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయిస్తామని డబ్బులు తీసుకుని హవాలా రూపంలో దిల్లీలోని దళారికి విశాఖకు చెందిన వ్యక్తులు పంపినట్లు గుర్తించారు. ఇదే విషయంలో గాయత్రీ వైద్యకళాశాల డైరెక్టర్ వెంకట్ నుంచి అక్కయ్యపాలేనికి చెందిన డాక్టర్ కృష్ణకిశోర్ రూ.50 లక్షలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి పేర్లు అప్పట్లో సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

ఈనాడు

సామాజిక శాస్త్రాలపై శీతకన్ను!

స్వేచ్ఛ, సమానత్వం, సౌహార్దం, న్యాయం, లౌకికవాదం, జాతీయ ఏకతా సమగ్రతా విలువలను అర్థం చేసుకోలేనివారు ఎప్పటికీ ఉత్తమ పౌరులు కాలేరు. నేను, నాది అన్న సంకుచిత ఆలోచనల్లోంచి బయటికి రాలేరు. అలా వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు వెంపర్లాడే వాళ్లు ఎక్కువయ్యే కొద్దీ సమాజంలో అరాచకత్వం ప్రబలుతుంది. అది దేశాభివృద్ధిని దిగమింగుతుంది. ఇలాంటి ప్రమాదాన్ని తప్పించాలన్న ఉద్దేశంతో నవతరానికి రాజ్యాంగ విలువలూ ప్రజాస్వామ్య సంప్రదాయాలపై అవగాహన కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఓ మంచి ప్రయోగం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన బడి పిల్లలతో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించింది. నిరుడు ఇలాగే హైదరాబాద్‌లో జరిగిన విద్యార్థుల శాసనసభా భేటీలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. నాలుగేళ్ల క్రితం రాజస్థాన్ అసెంబ్లీలో చిన్నారులే ప్రజాప్రతినిధులై గంటసేపు ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఇలాంటి కార్యక్రమాలు ఆహ్వానించదగినవే కానీ పౌరహక్కులు, బాధ్యతలు, పాలనా యంత్రాంగం తీరుతెన్నుల వంటివి భావితరానికి పూర్తిగా బోధపడాలంటే- విద్యాలయాల్లో సామాజిక శాస్త్రాలపై శీతకన్ను వేయకూడదు!

మూడున్నర దశాబ్దాల క్రితం మన దేశంలో ఓటుహక్కు పొందడానికి అర్హమైన వయసును 21 ఏళ్ల నుంచి పద్దెనిమిదేళ్లకు తగ్గించారు. మరి ఎందుకు కచ్చితంగా ఓటు వేయాలో, ఎలాంటి వారిని ప్రజాప్రతినిధులుగా ఎంచుకోవాలో యువతకు ఎవరు నేర్పుతున్నారు? పాఠశాలల్లో కళాశాలల్లో అలాంటి అంశాల గురించి చెప్పట్లేదు కాబట్టే ఓటరుకార్డు ఉందా అని అడిగితే- 'ఏమో, అమ్మానాన్నలను అడగాలి' అని బదులిచ్చే యువతీ యువకులు చాలాచోట్ల కనపడుతున్నారు. ఇంకా అనేకమంది పోలింగ్ రోజును సెలవు దినంగా భావించి వినోద విహారయాత్రలకు వెళ్లిపోతున్నారు. ఎమ్మెల్యేకూ ఎంపీకీ, లోక్‌సభకూ రాజ్యసభకూ తేడా తెలియకుండానే పట్టభద్రులవుతున్న వారు ఇంకెందరో! జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేల పేర్లు అడిగినా తడుముకునే కుర్రకారుకూ లోటులేదు. ఇలాంటి కనీస తెలివిడిని కూడా అలవరచని చదువుల మూలంగా సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో, ప్రజా సేవకులైన పాలకులూ అధికారుల్లో జవాబుదారీతనం కోసం ఎలా పట్టుబట్టాలో నవతరంలో చాలామందికి తెలియట్లేదు. ఈ దుస్థితి దేశీయంగా ప్రజాస్వామ్య భవితకు ఏమాత్రం మంచిది కాదు!

శాస్త్ర సాంకేతిక వాణిజ్య విద్యాబోధనకు మాత్రమే ప్రాధాన్యమిచ్చే జాతి ప్రగతి ప్రస్థానం స్థిరంగా ఉండదు. సామాజిక శాస్త్రాలను నిర్లక్ష్యం చేసే సమాజానికి కుల మత ప్రాంత భాషా భేదాలకు అతీతంగా కలిసికట్టుగా ముందడుగు వేసే శక్తి సమకూరదు. దురదృష్టవశాత్తూ దేశీయంగా ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా ఇంటర్‌లో నలభై శాతం మందే సామాజిక శాస్త్రాలను చదువుతున్నారని కేంద్ర విద్యాశాఖ రెండేళ్ల క్రితం వెల్లడించింది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనైతే అలాంటి విద్యార్థుల సంఖ్య కేవలం రెండు శాతమేనని పేర్కొంది. 2021 సివిల్స్‌లో నెగ్గినవారిలో 75శాతం మంది ఇంజినీరింగ్, సైన్స్, మెడికల్ పట్టభద్రులే. కానీ, ఆ విజేతల్లో 80శాతం మంది ఆప్షనల్స్ మాత్రం సామాజిక శాస్త్రాలే! ఇలా ఆ సబ్జెక్టులను ముక్కునపడితే కొలువులు వస్తాయేమో కానీ, వాటి అంతస్సారం అవగతం కాదు. చరిత్ర, భౌగోళిక, పౌర, ఆర్థిక శాస్త్రాలు, సాహిత్యాలపై మమకారం లేనివారు జనభారత సంపూర్ణ స్వరూపాన్ని, భిన్నత్వంలో ఏకత్వ భావనను ఒంటబట్టించుకోలేరు. శాస్త్ర సాంకేతిక కోర్సులకు సామాజిక శాస్త్రాలను జతచేస్తే- భావిపౌరుల్లో సృజనాత్మకత, నవకల్పన-సమస్యా పరిష్కార సామర్థ్యాలు, నైతిక విలువలు పెరుగుతాయని 2020 జాతీయ విద్యావిధానం పేర్కొంటోంది. యువతను వ్యక్తిత్వ సంపన్నులుగా తీర్చిదిద్దే అలాంటి సమగ్ర విద్యే ఇప్పుడు దేశానికి కావాలి!



చదువుకుని కూడా అన్యాయాన్ని ఎదిరించి మాట్లాడలేకపోతే అది చదువుకున్నట్లు కాదు, బానిసత్వ పాఠాలు నేర్చుకున్నట్లు! అన్యాయం మనకి జరిగినా మరొకరికి జరిగినా విద్యావంతులెవరూ సహించకూడదు.

– మహాత్మా జ్యోతిరావు పులె

సుఖాలే కావాలా?

సమాజంలో మూడు రకాల మనుషులను చూస్తుంటాం. ఏమాత్రం శ్రమించకుండా సుఖభోగాలను అనుభవించాలనుకునేవారు ఒక రకం. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తే చాలనుకుంటారు ఇంకొందరు. సౌఖ్యాన్ని దృష్టిలో పెట్టుకోకుండా జీవితాంతం శ్రమిస్తూండే వాళ్లు మూడో రకం. ఈ చివరి రకం వాళ్లను ఉత్తములుగా భావించవచ్చు. ఇటువంటి నిస్వార్థపరుల వల్లే సమాజానికి శ్రేయస్సు చేకూరుతుంది. జాతి అభ్యున్నతి చెందుతుంది.

'శ్రమ ఏవ జయతే'... శ్రమ వల్లనే విజయం చేకూరుతుంది. అది శాశ్వతకీర్తిని తెచ్చిపెడుతుంది. కష్టపడకుండా అడ్డదారుల్లో సంపద, పదవి, కీర్తిని కాంక్షించేవాళ్లుంటారు. ఎప్పుడో ఒకప్పుడు అటువంటి వారి అసలు రంగు బయటపడుతుంది. చరిత్రహీనులవుతారు. దేవుడిచ్చిన జన్మను మనిషి సార్థకం చేసుకోవాలి. ఉన్నంతలో ఇతరులకు ఇవ్వడానికే ఆలోచించాలి తప్ప పుచ్చుకోవడానికి అంగలార్చకూడదు. కానీ నేడు మనిషి అదే చేస్తున్నాడు. చిన్న చిన్న కష్టాల్ని కూడా భరించలేకపోతున్నాడు. వేసవి వస్తే చినుకులు పడాలనుకుంటాడు. కాస్త చలిగా ఉంటే ఎండ కోరుకుంటాడు.



ఎప్పుడూ సుఖంకోసం వెంపర్లాటే. ఈ ఆరాట-పోరాటాలతో కాలాన్ని వ్యర్థంగా గడిపేస్తున్నాడు. కార్యసాధకుడనేవాడు బద్ధకించడు, వాయిదాలు వేయడు. పనిని పరమాత్మ పూజగానే భావిస్తాడు.

ఆకలి తీర్చుకోవడానికి ఎవరైనా శ్రమించాల్సిందే. ఆ శ్రమ ఫలితంగా తన అవసరాన్ని మించి సంపాదిస్తే దాన్ని దాచుకోకుండా వితరణ చేయాలని 'సాధన పంచకం' చెబుతోంది. అంతులేని సంపాదన సంతాపం కలగజేస్తుందే తప్ప సంతృప్తినివ్వదు. అసలైన సౌఖ్యం సంతృప్తిలోనే ఉంది. 'ఇవాళ్టికి... నాకు, నా కుటుంబానికి, నా ఇంటికొచ్చే అతిథులకు సరిపడే ఆహారం ఇస్తే చాలు స్వామీ!' అని ప్రార్థిస్తాడు సంత్ కబీర్‌దాసు. రేపు పనిచేస్తే, మళ్లీ ఆయనే ఇస్తాడులే... అని ఆయన ధైర్యం. పోతనామాత్యుడు తన పొలాన్ని, హలాన్నే నమ్ముకున్నాడు. గ్రంథాలను అమ్ముకోలేదు. ఎవరెంత ప్రలోభపెట్టినా అప్పుడప్పు భుజించుటకన్న కందమూలాలను తింటూ బతకలేనా? అని దీటుగా బదులిస్తాడు. ధర్మబద్ధమైన శ్రమ సత్ఫలసిద్ధినే కలిగిస్తుంది. లౌకిక సుఖాల కోసం ధనార్జన అనివార్యమైనా పారలౌకిక ధార్మిక సాధనే సర్వోత్తమ లక్షణం. ఋషులు, అవధూతలు, తపోధనులు లోకకల్యాణం కోసమే శ్రమించారు తప్ప సొంత సుఖాల కోసం కాదుకదా! వారు పంచిన ఉపనిషద్, పురాణ, కావ్య ప్రబంధ, విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం సమస్త మానవజాతి పురోగతి కోసం, రేపటి తరాల ఆనందమయ జీవితం కోసమన్నది అక్షర సత్యం.

'నాకు రాజ్యం, స్వర్గం, పునర్జన్మ- ఇవేవీ వద్దు. కష్టాల్లో ఉన్నవారి కన్నీరు తుడిచే శక్తి ప్రసాదించు ప్రభూ!' అని పరమాత్మను ప్రార్థించాడు రంతి దేవుడు. నేను చేస్తున్న శ్రమ నా కోసం కాదు అనుకోవడంలో ఎంత సుఖం ఉంది! ఒక కష్టానికి, మరో కష్టానికి మధ్యలో దొరికే కొద్ది క్షణాల ఆనందం ఎంతో సౌఖ్యాన్నిస్తుంది. పనిచేసే వాడికి దారి దొరుకుతుంది. చేయనివాడికి సాకు దొరుకుతుంది.

అంతర్యామి

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

ఆహార శుద్ధిలో అవకాశాల వెల్లువ!

ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ ఆహార శుద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ మేరకు ఏపీ ఆహార శుద్ధి విధానం-4.0ను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమ విస్తరణకు మౌలిక వసతులు సమకూరుస్తారు. నవీకరణను ప్రోత్సహిస్తారు. ఆర్థిక సాయం అందిస్తారు. ఈ విధానం కింద రూ.30వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 3 లక్షల కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అంచనా!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాడి పరిశ్రమ, వరి, మిర్చి, మామిడి, అరటి, చేపలు, రొయ్యలు, మసాలా ద్రవ్యాల సాగుకు ప్రధాన కేంద్రం. దేశంలోని ఇతర వ్యవసాయ ప్రధాన రాష్ట్రాల్లాగే ఏపీలోనూ పంటలు బాగా పండినప్పుడు దళారుల దెబ్బకు ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతల తరవాత వివిధ దశల్లో పంట వ్యర్థం కావడంతో నష్టం ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి వాటిని ఎదుర్కొనేందుకు ఆహార శుద్ధి ప్రక్రియ చేపట్టాలని, తద్వారా నష్టాలు నివారించి రైతులకు లాభాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్షిస్తోంది. ఆహార



శుద్ధి ద్వారా వ్యవసాయోత్పత్తులకు అదనపు విలువ చేకూరుతుంది. మామిడికాయలతో పచ్చళ్లు పెట్టడం, మామిడి రసంతో జామ్‌లు, తాండ్ర, పండ్ల రసాలు తయారుచేసి మార్కెట్‌కు తీసుకెళ్లడం, రొయ్యలను శుభ్రపరిచి ఎగుమతి చేయడం, ఎండు మిర్చిని దంచి కారం తయారు చేయడం వంటి ఆహార శుద్ధి ప్రక్రియలు చేపట్టవచ్చు.

ఉత్పత్తులకు అదనపు విలువ

పంట ఉత్పత్తులను ముడి రూపంలో అమ్మడం వల్ల వచ్చే రాబడి కన్నా ప్రాసెసింగ్ ద్వారా అదనపు విలువ జోడించడం వల్ల వచ్చే లాభం ఎక్కువగా ఉంటుంది. ఆహార శుద్ధితో వచ్చే ఆదాయం రెండు, మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని చైనా, బ్రెజిల్, వియత్నాం వంటి దేశాల్లో నిరూపితమైంది. ఏపీ రైతులు శుద్ధి ద్వారా 15-30 శాతం ఎక్కువ గడించవచ్చని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ అంచనాలను వాస్తవ రూపంలోకి తీసుకొచ్చేందుకు ఏపీ ఆహార ప్రాసెసింగ్ విధానం-4.0 పూనుకుంటోంది. అది ఆహార శుద్ధి పరిశ్రమకు ఫుడ్ పార్కులు, శీతలీకరణ కేంద్రాల వంటి మౌలిక వసతులను కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తుంది. ఆహార శుద్ధి రంగంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా(ఎంఎస్ఎంఈ) యూనిట్లకు మూలధన సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. మహిళలు, వెనకబడిన కులాలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, మైనారిటీలు, దివ్యాంగులు ఏర్పాటుచేసే ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు పది శాతం మూలధన సబ్సిడీ ఇచ్చి సమ్మిళిత అభివృద్ధి సాధించనుంది. ప్రాసెసింగ్ రంగంతో కర్మాగారాలు, ప్యాకేజింగ్, రవాణా, చిల్లర వర్తకంలో వేలాదిగా ఉద్యోగ అవకాశాల కల్పన జరుగుతుంది. ఏపీలో ఇప్పటికే 9 సమగ్ర ఫుడ్‌పార్కులు పనిచేస్తున్నాయి. వాటిలో రెండు మెగా ఫుడ్ పార్కులున్నాయి. చిత్తూరులోని శ్రీని మెగా ఫుడ్ పార్క్స్‌తోపాటు, పశ్చిమ గోదావరి జిల్లాలోని గోదావరి మెగా ఆక్వా పార్కుల్లో శీతలీకరణ వసతులు, ల్యాబ్‌లు, సరకుల గిడ్డంగులు ఉన్నాయి. వ్యవస్థాపకులు అక్కడి వసతులను లీజుకు తీసుకుని యూనిట్లను నడుపుకోవచ్చు. వ్యవస్థాపకులందరికీ 35 శాతం మూలధన సబ్సిడీ లభిస్తోంది. విద్యుత్ ఛార్జీల్లో రాయితీ, ఏక గవాక్ష పద్ధతిలో అనుమతులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ మెగా ఫుడ్ పార్క్స్, ప్రధానమంత్రి సూక్ష్మఫుడ్ ప్రాసెసింగ్ పథకం(పీఎంఎఫ్ఎంఈ)తో కలిసి ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ(ఏపీఎఫ్‌పీఎస్) సౌకర్యాలను కల్పిస్తోంది. పీఎంఎఫ్ఎంఈ కింద ఏపీలో 10,035 సూక్ష్మ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పడ్డాయి. వీటిలోకి రూ.9,178 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు పొలం నుంచి మార్కెట్ వరకు రైతులకు అండగా నిలుస్తాయి. రైతు ఉత్పత్తి సంస్థలు (ఎఫ్‌పీవో), స్వయం సహాయక బృందాలు చిన్న రైతుల నుంచి ఉత్పత్తుల్ని సేకరించి ప్రామాణీకరిస్తాయి. గ్రేడింగ్, శుద్ధి, ప్రాసెసింగ్ చేసి తుది ఉత్పత్తిగా మార్చడానికి ఆధునిక సౌకర్యాలను సమకూరుస్తాయి. కోల్డ్ చెయిన్స్, ఆధునిక గిడ్డంగులు సరకు చెడిపోకుండా భద్రపరిచి, ఎప్పుడైనా అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తాయి. శుద్ధి చేసిన వ్యవసాయ సరకులను ఆన్‌లైన్ ద్వారా వినియోగదారులకు అందించే మార్కెటింగ్ సౌకర్యాన్నీ అందిస్తాయి. ఎగుమతులకు, చిల్లర వర్తకులకు తేలిగ్గా సరకులు పంపే ఏర్పాట్లు చేస్తాయి. దళారుల ప్రమేయాన్ని తొలగించి రైతులే నేరుగా లాభాలు పొందే వెసులుబాటును కల్పించడం వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాల విశిష్టత.

రైతులకు ఉపయుక్తం

ప్రస్తుతం ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తోంది. హార్వెస్టెడ్ రోబోటిక్స్, ఆక్వా ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలు కోతల తరవాత నష్టాల తగ్గింపునకు, ఉత్పత్తి ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చూడటానికి తోడ్పడుతున్నాయి. అనంతపురం జిల్లాలో కృషి విజ్ఞాన్ కేంద్రాలు చిరుధాన్యాల ప్రాసెసింగ్‌లో మహిళా స్వయంసహాయక బృందాలను ప్రోత్సహిస్తున్నాయి. శ్రీకాకుళం రైతులు సొంత బ్రాండ్‌పై తేనె, ఆర్గానిక్ పసుపు విక్రయిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్ కేంద్రాలు కోస్తా ఆక్వా రైతులకు నేరుగా ఎగుమతిదారులతో సంబంధాన్ని ఏర్పరిచాయి. చిత్తూరు జిల్లాలో మామిడిపండ్లు, టమాటాలను జామ్‌లు, గుజ్జుగా మార్చడానికి, గుంటూరు జిల్లాలో మిర్చి, పసుపు ప్రాసెసింగ్ జరుగుతోంది. కోస్తాంధ్ర రొయ్యలు, చేపల సాగు, ఎగుమతి కేంద్రంగా నిలుస్తుంటే, రాయలసీమలో పండ్లు, పాడి పరిశ్రమ, సిద్ధాహారాలు, పచ్చళ్లు, సాస్‌ల ఉత్పత్తి జరుగుతోంది. ఉత్తరాంధ్ర జీడి పప్పు, గిరిజన తేనె, కాఫీ ఉత్పత్తి కేంద్రంగా ఉంది. ప్రకాశం, నెల్లూరులలో పట్టు, ఆహార ప్రాసెసింగ్ జరుగుతోంది. దేశంలో మొత్తం ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తిలో ఏపీ వాటా 9 శాతంగా ఉంది. రైతుల ఆదాయాలు 20 నుంచి 50 శాతందాకా పెరిగే అవకాశం ఉండటం వల్ల కర్షకులు ఆహార శుద్ధి రంగంలో అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి.




డాక్టర్ షేక్ ఎన్.మీరా

డైరెక్టర్, ఐకార్-అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్

చెడు అలవాట్లను మానేయాలనీ, మంచి అలవాట్లు చేసుకోవాలనీ అందరం అనుకుంటాం. కానీ ఎంతమంది అందులో విజయం సాధిస్తారు? సిగరెట్లు, మద్యం లాంటి అలవాట్లు మానుకోలేక వ్యసనం స్థాయికి దిగజారేవారు ఎందరో. అంతెందుకు... ఫిట్‌నెస్ పెంచుకోవాలనీ, బరువు తగ్గాలనీ చాలామంది అనుకుంటారు. కానీ అందుకు పక్కా ప్రణాళిక వేసుకుని ఆచరణలో పెట్టేది ఎందరు? చిన్న చిన్న అలవాట్లు మానుకోవడానికే తలకిందులవుతూ, వల్ల కాదని వదిలేసేవారు పోలెండ్‌కి చెందిన జెర్జీ గోర్స్కీ గురించి తెలుసుకోవాలి.

తలచుకోవాలే కానీ...



జెర్జీ గోర్స్కీకి ఆటలంటే ఇష్టం. దాంతో స్నేహితులూ ఎక్కువే. అంతవరకూ అయితే బాగానే ఉండేది కానీ వారిలో వ్యసనపరులూ ఉన్నారు. కొంతకాలానికే వాళ్ల వ్యసనాలు అతనికి అంటుకున్నాయి. ఒకటీ రెండూ కాదు, ఎన్నో! సిగరెట్, మద్యం చాలవన్నట్లు మాదకద్రవ్యాలూ అలవాటయ్యాయి. ఎంతగా అంటే అవి లేకుండా ఒక్క పూట కూడా ఉండలేని పరిస్థితి. దాంతో ఆటలూ చదువూ ఉద్యోగం అన్నీ వదిలేశాడు. చిన్న చిన్న నేరాలు చేసి జైలుకు వెళ్లాడు. మానసిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నాడు. క్రమంగా భౌతిక ఆరోగ్యమూ క్షీణించింది. వ్యసనాలంటే అర్థం అదే కదా! తాత్కాలికంగా ఎంత ఆనందాన్నిస్తాయో, శాశ్వతంగా శరీరాన్నీ, మనసునీ అంతగా దెబ్బతీస్తాయి. జెర్జీ పరిస్థితీ అలాగే తయారైంది. అదే సమయంలో అతడి స్నేహితురాలు కూడా వ్యసనాలకు బలైపోయింది. నిజానికి ఆమెలాగే జెర్జీ కూడా ఒక అనామకుడిలా ముగిసిపోయేవాడే. ఒక్కటే తేడా. తన పరిస్థితి అతడికి అర్థమైంది. దాంట్లోనుంచి బయటపడాలని బలంగా కోరుకున్నాడు. కుటుంబ సహకారంతో పునరావాస కేంద్రంలో చేరి చికిత్స పొందాడు. నిజానికి వ్యసనాలను వదిలించుకోవడం అంత తేలికేమీ కాదు. చెడు అలవాట్లవైపు మనసు లాగకూడదంటే దాన్ని మరోపక్కకు మళ్లించాలి. ఒక కోచ్ సాయంతో ఆటలమీద దృష్టి పెట్టాడు జెర్జీ. విపరీతంగా కష్టపడ్డాడు. పాత జీవితం మళ్లీ గుర్తు రాకుండా చెమటోడ్చి సాధన చేసేవాడు. పద్నాలుగేళ్ల వ్యసనాల ప్రభావం నుంచి బయటపడటానికి అయిదారేళ్లు పట్టింది. ట్రయాథ్లాన్ సాధన చేసి ఏకంగా డబుల్ ఐరన్ మ్యాన్ పోటీ గెలిచాడు. అది అలాంటిలాంటి పోటీ కాదు... 8 కి.మీ. ఈత, 360కి.మీ. సైక్లింగ్, 84కి.మీ. పరుగు... మూడూ కలిస్తే ఆ ట్రయాథ్లాన్. అందులో గెలిచి యావత్ ప్రపంచాన్నే అబ్బురపరిచాడు. జెర్జీ సాధారణ క్రీడాకారుడు కాదనీ ఒకప్పటి డ్రగ్ అడిక్ట్ అనీ తెలిసి విస్తుపోయారు అభిమానులు.

ఆ తరవాత మరెన్నో విజయాలు అందుకున్న జెర్జీ- వ్యసనాల నుంచి బయటపడటాన్నే అన్నిటికన్నా పెద్ద గెలుపుగా పేర్కొంటాడు. సంకల్పబలంతో చెడు అలవాట్లపై పైచేయి సాధించడం సాధ్యమేనంటాడు. మారాలనుకునేవారికి మరో అవకాశం ఎప్పుడూ ఉంటుందనే జెర్జీ ఈ విషయాలపై యువతలో చైతన్యం తేవడమే ఆశయంగా బతుకుతున్నాడు. అతడి జీవిత కథ ఆధారంగా 'ద బెస్ట్- వెన్ వీక్నెస్ బికమ్స్ స్ట్రెంగ్త్' అనే పుస్తకమూ, దాని ఆధారంగా 'బ్రేకింగ్ ద లిమిట్స్' అన్న సినిమా వచ్చాయి. ఎందరిలోనో స్ఫూర్తినింపుతున్నాయి.

– నల్ల కవిత

సామాజిక శాంతిపై వేటు

విద్వేష ప్రసంగాలు ప్రజల్లో భయాందోళనలు పెంచి సామాజిక ప్రశాంతతకు భంగకరంగా మారుతున్నాయి. నిరుడు దేశవ్యాప్తంగా అలాంటి ఉన్మత్త ఉపన్యాసాలు 1,165 వెలుగు చూశాయి. వాటిలో ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్ని చోటుచేసుకున్నాయంటే...

ఉత్తర్ ప్రదేశ్	242
మహారాష్ట్ర	210
మధ్యప్రదేశ్	98
ఝార్ఖండ్	85
రాజస్థాన్	74
ఉత్తరాఖండ్	65
బిహార్	52
హిమాచల్ ప్రదేశ్	48
దిల్లీ	45
గుజరాత్	41
కర్ణాటక, హరియాణా	32
ప.బెంగాల్	30
తెలంగాణ	25
ఛత్తీస్‌గఢ్	21
ఒడిశా	18
అస్సాం, గోవా	13
కేరళ, పంజాబ్	7

(ఆధారం: ఇండియా హేట్ ల్యాబ్ నివేదిక)

వాయు నాణ్యతపై ఏఐ నిఘా

పారిశ్రామిక, వాహన ఉద్గారాలతో పాటు ఇళ్లలో కట్టెలు, బొగ్గులు వంటి వాటిని వాడటం వల్ల వాయుకాలుష్యం పెరుగుతోంది. శిలాజ ఇంధనాలను మండించడం వల్ల కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ గాలిలోకి విడుదలవుతున్నాయి. పాతైన, కాలంచెల్లిన వాహనాలు, పరిశ్రమల్లో ఇంధనాన్ని పూర్తిగా మండించకపోవడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ వెలువడుతోంది. ఇవి వాతావరణంలో పరిమితికి మించి పోగుపడితే రకరకాల అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది ఆకస్మిక మరణాల్లో రెండింటికి వాయుకాలుష్యమే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఈ నేపథ్యంలో సూపర్ కంప్యూటర్లు, సెన్సర్లు, డ్రోన్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), ఏఐ లాంటి అత్యాధునిక సాంకేతికతలతో వాయు కాలుష్య నియంత్రణకు, నివారణకు మానవ సమాజం మార్గాలు అన్వేషిస్తోంది.

అత్యాధునిక సెన్సర్లతో...

గాలి నాణ్యతను, కాలుష్య తీవ్రతను గుర్తించడానికి ప్రస్తుతం సెమీకండక్టర్ సెన్సర్లను ఉపయోగిస్తున్నారు. కాలుష్యం వల్ల సంభవిస్తున్న భౌతిక, రసాయనిక మార్పుల సమాచారాన్ని అవి స్మార్ట్‌ఫోన్లకు, కంప్యూటర్లకు అందిస్తున్నాయి. నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, అమ్మోనియా, సూక్ష్మ ధూళికణాలు (పీఎం 2.5, పీఎం 10) లాంటి వాటిని గుర్తించడానికి మెటల్ ఆక్సైడ్ సెమీకండక్టర్లు(ఎంఓఎస్‌లు), పీఎం సెన్సర్లను వాడుతున్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో బయోసెన్సర్లను అనుసంధానించి గృహ వాతావరణంలో పెరుగుతున్న బ్యాక్టీరియా, కాలుష్యాలను గుర్తిస్తున్నారు. అతి తక్కువ ఖర్చుతో నానోటెక్నాలజీ ఆధారిత బయోసెన్సర్లు రూపొందించి గాలిలో పురుగుమందులు, లోహకణాల ఉనికి గురించి తెలుసుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో నానాటికీ పెరిగిపోతున్న మైక్రో, నానో ప్లాస్టిక్ కణాలను, పీఎం 2.5లను గుర్తించడానికి హైపర్ స్పెక్ట్రల్ సెన్సర్లను వినియోగిస్తున్నారు. గాలిలో విషపూరిత కాలుష్యకారకాలను గుర్తించడానికి రామన్ ఎఫెక్ట్ ఆధారిత మాలిక్యులర్ డిటెక్షన్ సెన్సర్లు తోడ్పడుతున్నాయి.

కాలుష్య కారకాల సమాచారాన్ని సేకరించడానికి అత్యాధునిక సెన్సర్లను, ఆ డేటాను విశ్లేషించి పరిష్కారాలు కనుగొనడానికి కృత్రిమ మేధ(ఏఐ) బాగా ఉపయోగపడుతుంది. భారీగా ఉండే సమాచారాన్ని ఆసాంతం పరిశీలించి పర్యావరణం, ప్రాణికోటిపై కాలుష్య ప్రభావాన్ని తెలుసుకోవడానికి ఏఐ అల్గారిథంలు అక్కరకొస్తున్నాయి. ఉపగ్రహ, డ్రోన్ చిత్రాలను విశ్లేషించి త్వరితగతిన అడవుల పెంపకం, గ్రీన్‌జోన్ల విస్తరణకు ఏఐ తగిన పరిష్కారాలు సూచిస్తోంది. వాతావరణంలోని కాలుష్యకారకాలను వర్గీకరించడానికి, వాటి భౌతిక, రసాయనిక లక్షణాలను గుర్తించడానికి డీప్ లెర్నింగ్ సాంకేతికత ఊతమవుతోంది. కాలుష్య సమాచారాన్ని, స్థానికుల ఆరోగ్య వివరాలను సేకరించి వాటి సాయంతో ప్రజారోగ్యంపై కాలుష్య ప్రభావాన్ని తెలుసుకోవడానికి బిగ్ డేటా అనలిటిక్స్ సాయపడుతోంది. ఐఓటీ సాంకేతికతతో సెన్సర్ల వ్యవస్థను రూపొందించి కర్బన ఉద్గారాలు, వాహన కాలుష్యాల హాట్‌స్పాట్లను గుర్తించవచ్చు. ఆధునిక సాంకేతికత సాయంతో అనుక్షణం కాలుష్య వివరాలను సేకరించి విశ్లేషిస్తూ సమాజాన్ని అప్రమత్తం చేయవచ్చు.

పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, మితిమీరిన శిలాజ ఇంధనాల వినియోగం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్యం పెరుగుతోంది. దానిమూలంగా బ్రెయిన్ స్ట్రోకులు మొదలు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్లు వంటివెన్నో కోరచాస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాయుకాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతికత ఎంతో అక్కరకొస్తోంది.



పరిశ్రమల్లో హానికర కాలుష్యాన్ని గ్రహించే పరికరాలను రూపొందించడానికి, పైప్‌లైన్ల నుంచి విషవాయువుల లీకేజీలను గుర్తించడానికి ఏఐని వాడుకోవచ్చు. కాలుష్యానికి పెద్దగా ఆస్కారం లేకుండా వాహన ఇంజిన్లను మెరుగ్గా తీర్చిదిద్దడానికీ కృత్రిమ మేధ తోడ్పడుతోంది. నగరాల్లో వాహనాల రద్దీ పర్యవేక్షణకు, కాలుష్య హాట్‌స్పాట్లను తగ్గించి తగిన పట్టణ ప్రణాళికలు రూపొందించడానికి ఏఐ సాయం తీసుకోవచ్చు. గాలిలో చేరిన విషపదార్థాల వాసన, రుచులను గుర్తించడానికి ఏఐ సాయంతో ఇ-నోస్, ఇ-టంగ్ సాంకేతికతలను అభివృద్ధి చేశారు. ఏఐ పరిష్కారాలతో 2035 నాటికి ప్రపంచవ్యాప్తంగా విద్యుత్, రవాణా రంగాల్లోని కర్బన ఉద్గారాలను 540 కోట్ల టన్నుల దాకా తగ్గించవచ్చని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అంచనా వేస్తోంది.

అదే ఆలంబనగా...

ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత దేశాల్లో ఇండియా అయిదో స్థానంలో నిలుస్తోంది. కట్టుతప్పిన కాలుష్యం వల్ల భారతీయుల ఆయుర్దాయం సగటున మూడున్నర ఏళ్లు క్షీణిస్తోందని యూనివర్సిటీ ఆఫ్ షికాగో పరిశీలన హెచ్చరించింది. ప్రధాన నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి భారతదేశం గూగుల్, మైక్రోసాఫ్ట్ మొదలు స్టార్టప్‌ల సహకారమూ తీసుకుంటోంది. కాలుష్య సమస్యపై పోరాటానికి ఆధునిక సాంకేతికతను ఇండియా మరింత ప్రభావవంతంగా వినియోగించుకోవాలి. పారిస్ ఒప్పందంలో భాగంగా తొలిదశలో అటవీ నిర్మూలనలను నిలువరించి, హరిత ఇంధనాల వినియోగాన్ని పెంచుతూ 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలను 45శాతం మేర తగ్గించాలని నిర్ణయించారు. పారిశ్రామికీకరణ ముందు నాటితో పోల్చితే ఈ శతాబ్దం చివరికి భూతాప పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలని నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ఆధునిక సాంకేతికతను అన్ని దేశాలు సమర్థంగా ఉపయోగించుకోవాలి.



భరత్ వేదాంతం

సాంకేతిక రంగ నిపుణులు

అర్థమైంది నాన్నా!

అనూప్ ఎప్పుడూ చురుగ్గా ఉంటాడు. కానీ, చాలా గట్టిగట్టిగా మాట్లాడతాడు.. అరుస్తూనే ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో అందరూ 'కాస్త మెల్లగా మాట్లాడొచ్చు కదా!' అంటుంటారు. తను మాత్రం ఎవరు చెప్పినా పద్ధతి మార్చుకోవట్లేదు. ఇంకా అందరికీ చిరాకు తెప్పిస్తున్నాడు. ఒకరోజు అనూప్ వాళ్ల అమ్మ చెప్పింది వినకుండా ఏదేదో మాట్లాడుతూ ఉన్నాడు. అప్పుడు వాళ్ల నాన్న పిలిచి.. 'అనూప్! నీకు ఒక వింత చూపించనా?' అన్నాడు. 'ఏంటి నాన్నా! చూపించండి' అన్నాడు. ఒక పాత్రలో కొద్దిగా నీళ్లు పోసి.. దాని మీద ఒక ప్లాస్టిక్ డబ్బా లాంటిది ఉంచాడు నాన్న. తరవాత దాని పైన కొద్దిగా ఉప్పు వేసి.. కాస్త దూరంగా నిలబడి అనూప్ అంటూ గట్టిగా పిలిచాడు. అప్పుడు ఆ ఉప్పు కణాలన్నీ కదిలాయి. మళ్లీ ఒకసారి గట్టిగా అనూప్ అన్నాడు వాళ్ల నాన్న. అప్పుడు ఆ ఉప్పు ఇంకాస్త పైకి ఎగిరింది. 'భలేగా ఉంది నాన్నా! మీరు గట్టిగా అరిస్తే ఉప్పు కదులుతోంది. అరిస్తే చుట్టుపక్కల ఉన్న వస్తువులు కదిలేంత శబ్దం వస్తుందా' అన్నాడు అనూప్. 'నేను బిగ్గరగా



అరిచినప్పుడు, నా నుంచి శబ్దతరంగాలు బయటికి వచ్చాయి. అవి ఈ ప్లాస్టిక్‌ను కంపించేలా చేశాయన్నమాట. శబ్దం ఒక రకమైన శక్తి. అది వస్తువులను కదిలిస్తుంది. మరీ ఎక్కువైతే దాన్ని శబ్దకాలుష్యం అంటాం' అని చెప్పాడు నాన్న. 'అంటే నేను రోజూ గట్టిగా మాట్లాడటం వల్ల.. శబ్దకాలుష్యం ఏర్పడి.. దాని వల్ల అందరూ ఇబ్బంది పడుతున్నారా నాన్నా!' అడిగాడు అనూప్. 'అదొక్కటే కాదు, గట్టిగా మాట్లాడటం వల్ల కొన్నిసార్లు ఇతరుల మనసు కూడా బాధపడుతుంది. మాట్లాడే విధానం బాగుంటేనే ఎదుటివాళ్ల నుంచి చక్కటి సమాధానం వస్తుంది. అప్పుడు మన చుట్టుపక్కల వాతావరణమూ ప్రశాంతంగా ఉంటుంది' అన్నాడు నాన్న. అదంతా అర్థం చేసుకున్న అనూప్.. 'సారీ నాన్నా! ఇన్నిరోజులు అందరూ నా వల్ల చాలా ఇబ్బంది పడి ఉంటారు. ఇప్పటి నుంచి నేను నెమ్మదిగానే మాట్లాడతాను' అన్నాడు.

– కె.వి.సుమలత

దాగున్న పదమేది?

ఇక్కడ ఇచ్చిన ప్రతి పదంలో ఒక జీవి పేరు దాగుంది. అదేంటో కనిపెట్టండి.

1. BILLION
2. PIGMENT
3. CATERPILLAR
4. RATIO
5. SELFISH

జవాబు: 1.LION 2.PIG 3.CAT 4.RAT 5.FISH







వేంకటా చలపతి.. శోభిల్లేను అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసింది. వెంకటపాలెంలో తిరుమల తిరుపతి తరహాలో శ్రీవారి ఆలయాన్ని రూ. 260 కోట్లతో అభివృద్ధి చేయడానికి మరో అడుగు పడింది. తితిదే వేద పండితుల మంత్రోచ్ఛారణలు.. మంగళవాయిద్యాల నడుమ ద్వితీయ మహా ప్రాకార నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు.

- న్యూస్‌టుడే, తుళ్లూరు

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం నవంబరు 28, 2025


పన్ను గప్పి.. దందా!

రూ.1.75 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

ఈనాడు, అమరావతి

పన్నులు చెల్లించని విదేశీ సిగరెట్లు.. విజయవాడ, సమీప ప్రాంతాలకు భారీగా వచ్చేస్తున్నాయి. పారిస్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ లేబుల్ పేర్లతో ఉన్న రూ. 1.75 కోట్ల విలువైన అక్రమ విదేశీ సిగరెట్లను.. తాజాగా వాణిజ్య పన్నులశాఖ సిబ్బంది పట్టుకున్నారు. విజయవాడ డివిజన్ 01 సిబ్బంది ఆధ్వర్యంలో భవానీపురం పార్సిల్ కార్యాలయం, గొల్లపూడిలో ఐదు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ అట్కిన్సన్ పాఠశాల సమీపంలో ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో.. ఏకంగా 23 పెద్ద కార్టన్లను పట్టుకున్నారు. మూడో డివిజన్‌లో మచిలీపట్నం సర్కిల్ ఆధ్వర్యంలో దాడులు చేసి.. తోట్లవల్లూరు రోడ్డులోని గోదాములో మరో 90 కార్టన్ల సరకు గుర్తించారు.





తోట్లవల్లూరు: పట్టుకున్న సిగరెట్ ప్యాకెట్ల కార్టన్లు..

అక్రమ సరకు తెచ్చిన కంటైనర్

నేపాల్ సరిహద్దుల నుంచి... నేపాల్, బిహార్ నుంచి ఈ సరకును రోడ్డు మార్గంలో కంటైనర్లు, లారీల్లో ఇక్కడికి తెచ్చినట్లు అధికారులు గుర్తించారు. సరకు తమదేనని కొందరు యజమానులు వచ్చినట్లు సమాచారం. సిగరెట్ ప్యాకెట్ రూ. 20 అనీ.. అయితే ఎమ్మార్పీ రూ. 50 ముద్రించినట్లు చెబుతున్నట్టు తెలిసింది. ఈ సరకును వేలం వేయాలని నిర్ణయించారు. వీటిని తెచ్చిన కంటైనర్ అధికారుల ఆధీనంలోనే ఉంది.

దొరుకుతున్నది నాలుగో వంతే.. విజయవాడ పరిధిలోని డివిజన్ 01, 02 సహా అందరినీ వారి కార్యాలయ పరిధిలో కాకుండా.. పక్కనున్న ప్రాంతాలకు తనిఖీలకు పంపిస్తున్నారు. ఎవరి డివిజన్‌పై వాళ్లకే అవగాహన, పూర్తి పట్టు ఉంటుంది. పక్క డివిజన్ వాళ్లు ఇక్కడికొచ్చి తనిఖీలు చేస్తుంటే.. వీళ్లు సహకరించడం లేదు. అలాగే వీళ్లు వేరేచోటకు వెళ్లినా అదే తీరు. దీంతో అక్రమంగా దిగుమతయ్యే సరకులో.. అధికారులు పట్టుకుంటున్నది నాలుగో వంతూ ఉండదనే విమర్శలు వస్తున్నాయి.

రూ.కోటి వరకూ ఖజానాకు రావాలి..

సిగరెట్లపై 28 శాతం పన్ను చెల్లించాలి. అందుకే.. అక్రమార్కులు.. వక్రమార్గాల్లో పన్నులు చెల్లించకుండా విదేశీ బ్రాండ్ సిగరెట్లను దిగుమతి చేసుకుంటున్నారు. తాజాగా దొరికిన సరకులో.. ఒక్కో సిగరెట్ ప్యాకెట్‌పై రూ. 50 ఎమ్మార్పీ ఉంది. పంచనామా ద్వారా మొత్తం ప్యాకెట్లను లెక్కించి.. రూ. 1.75 కోట్ల సరకుగా తేల్చారు. పన్ను, దానికి సమానంగా జరిమానా చెల్లించాలి. ఈ లెక్కన.. 28 శాతం చొప్పున రూ. 50 లక్షల పన్ను, మరో రూ. 50 లక్షల జరిమానా కలిపి.. రూ. కోటి వరకూ సర్కారు ఖజానాకు రావాలి.

ఫిట్‌నెస్ గుట్టు.. కమీషన్ల కనికట్టు

ఏజెంట్లు, ఏటీఎస్ కేంద్రం నిర్వాహకుల కుమ్మక్కు

ఈ ఆటో 2013లో కొనుగోలు చేశారు. వాహనం ఇంజిన్ అవసాన దశకు చేరుకుంది. వాహనం బాడీ మొత్తం తుప్పు పట్టింది. దాన్ని బయటికి కనపడకుండా రబ్బరు మ్యాట్లతో కప్పి మాయ చేశారు. నిబంధనల ప్రకారం ఈ వాహనానికి ఫిట్‌నెస్ పత్రం జారీ చేయడం కుదరదు. ఏజెంట్ రూ. 7వేలు వసూలు చేసి అడ్డగోలుగా ఫిట్‌నెస్ పత్రం ఇప్పించారు.



విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన ఆటో. ఫిట్‌నెస్ పరీక్షకు నున్న ఏటీఎస్ కేంద్రానికి తీసుకొచ్చారు. రేడియం స్టిక్కర్లు ఉన్నా మళ్లీ ఇలా అంటించి డ్రైవర్ దగ్గర రూ. 100 వసూలు చేశారు. ఇలా రోజుకు దాదాపు 300 నుంచి 400 వాహనాలకు అవసరం ఉన్నా లేకున్నా స్టిక్కర్లు వేసి రోజుకు రూ. 40వేలకు పైగా దండుకుంటున్నారు. ప్రశ్నించిన వారికి ఫిట్‌నెస్ పత్రం రాకుండా కాళ్లరిగేలా తిప్పిస్తున్నారు.

నున్న ఏటీఎస్(ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్)లో ఫిట్‌నెస్ ధ్రువపత్రం మంజూరులో దోపిడీ రాజ్యమేలుతోంది. వాహన స్థితి ప్రమాణాలకు తగ్గట్టుగా ఉందా లేదా అన్నది అనవసరం. ముడుపులు అందాయా లేదా అన్నదే ముఖ్యం అన్నట్లు దందా సాగుతోంది. ఏజెంట్ల ముసుగులో కొందరు నిర్వాహకులు వాహనదారులను దోచుకుంటున్నారు.

అడ్డగోలు తీరిది..

- వాహనాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా లేదా అని నిర్ధారించేందుకు సమయానికి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి.
- ఇందులో టైర్ల అమరిక, ఇంజిన్ పనితీరు, వేగం, హారన్ శబ్దం, బ్రేక్, అండర్‌ఫిట్, హెడ్ లైట్స్ తదితర పరీక్షలు చేస్తారు. ప్రమాణాలకు తగ్గట్టు ఉంటేనే ఫిట్‌నెస్ ధ్రువపత్రం మంజూరు చేయాలి.
- నున్న ఏటీఎస్ కేంద్రంలో కనీస ప్రమాణాలు లేని వాహనాలకు సైతం అడ్డగోలుగా పత్రాలు ఇచ్చేస్తున్నారు.
- ఏజెంట్లు, ఏటీఎస్ కేంద్రంలో కొందరు సిబ్బంది కుమ్మక్కై కథ నడిపిస్తున్నారు. ఏజెంట్ల ద్వారా వస్తేనే పరీక్షలు లేదంటే కొర్రీలు పెడుతున్నారని వాహనదారులు వాపోతున్నారు.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలోనే ఏజెంట్లు వసూళ్ల కథ ముగిస్తున్నారు.
- చలానా కట్టాల్సింది రూ. 950లోపే అయినా ఒక్కో వాహనదారుడి నుంచి రూ. 2500 నుంచి రూ. 3500 వరకు వసూలు చేస్తున్నారు. వీరి కమీషన్ల కక్కుర్తి వల్ల కాలుష్యం తీవ్రత, రహదారి ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది.

బాధ్యులపై చర్యలు

ప్రస్తుతం ఏటీఎస్ కేంద్రాలు ప్రైవేటు నిర్వహణలో నడుస్తున్నాయి. ఈ కేంద్రాలను కమిషనర్ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధిరుల దృష్టికి తీసుకువెళ్తాను. అధికంగా వసూలు చేస్తున్న ఏజెంట్లు, వారితో కుమ్మక్కైన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- మోహన్, డీటీసీ

– ఈనాడు, అమరావతి

నిత్యం నీటి పరీక్షలు చేయాలి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిత్యం తాగునీటి పరీక్షలు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. పాతరాజరాజేశ్వరీపేటలో గురువారం ఆయన పర్యటించారు. ప్రజలకు శుద్ధి జలాన్ని డబ్బాల్లో అందించాలనీ.. నిత్యం నీటి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. తాగునీటి సరఫరా పైపులైన్లను మార్చి, కొత్తవాటిని అమర్చాలని ఆదేశించారు. ఇంటింటికీ ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు.

ఈనాడు ప్రాపర్టీ షో-2025 లోగో ఆవిష్కరణ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ బృందావన కాలనీ ఎ కన్వెన్షన్ సెంటర్లో ఈ నెల 29, 30 తేదీల్లో 'ఈనాడు' ప్రాపర్టీ షో -2025 నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం లోగోని టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న సన్‌సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ భాష్యం కిరణ్‌కుమార్, పవర్డ్ బై హరివిల్లు ప్రమోటర్స్, డెవలపర్స్ సీఈవో జాస్తి ప్రసన్నకుమార్, గోల్డ్ స్పాన్సర్ వీఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి ఎన్. నారాయణరెడ్డి, సిల్వర్ స్పాన్సర్ చతుర్భుజ ప్రాపర్టీస్, ఇన్‌ఫ్రా ఎండీ కె. నాగేశ్వరరావు, ప్రతినిధి హనుమాన్‌లు ఆటోనగర్ స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్స్‌లోని 'ఈనాడు' కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాష్యం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 'ఈనాడు' పాఠకులకు నాణ్యమైన వార్తలను అందించడంతో పాటు సొంతింటి కలను సాకారం చేసుకునే వారి కోసం కొన్నేళ్లుగా ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది కొనుగోలుదారులు, స్థిరాస్తి సంస్థలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న భాష్యం కిరణ్‌కుమార్, జాస్తి ప్రసన్నకుమార్, హనుమాన్, సీహెచ్‌కే కిషోర్‌కుమార్, నాగేశ్వరరావు, నారాయణరెడ్డి

వందేభారత్‌కు స్లీపర్ బోగీలు

ట్రయల్ రన్ విజయవంతం..

విజయవాడ రైల్వే: వందే భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండడంతో వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టబోతుంది. ఇప్పటికే విజయవంతంగా ట్రయల్స్ పూర్తి చేయగా ఎప్పుడు పట్టాలెక్కిస్తారోనని ఆసక్తిగా ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. మెరుగైన, సురక్షిత ప్రయాణం అందించేందుకు తొలి వందే భారత్ స్లీపర్ రైలును త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

అత్యాధునిక సౌకర్యాలు.. తొలి స్లీపర్ రైలు ప్రయాణికులకు ఉన్నతస్థాయి సౌకర్యాలు, వేగం రెండింటినీ అందిస్తుంది. ప్రయాణికుల సౌకర్యం, భద్రత విషయంలో రాజీ పడకుండా వందే భారత్ స్లీపర్ రైలు ర్యాక్‌లను రూపొందించారు. ఇప్పటికే పలు స్థాయిల్లో పరీక్షించారు. ట్రయల్స్ తర్వాత సీట్లు, బోగీలకు సంబంధించి పలు మార్పులు చేశారు.

విజయవాడ డివిజన్ మీదుగా.. ఈ రైళ్లు విజయవాడ డివిజన్ మీదుగా నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముందుగా రద్దీ ఎక్కువగా ఉండే విజయవాడ-సికింద్రాబాద్, విజయవాడ-విశాఖకు తొలి రైళ్లు నడపనున్నారు. అన్ని అనుకూలిస్తే డిసెంబర్‌లో ప్రారంభించేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తుంది.



గురుకులం.. విజ్ఞాన విహారం



విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానమూ అందాలి. ఇందుకోసం ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు సైతం ప్రైవేటుతో పోటీ పడుతున్నాయి. ప్రత్యేకంగా బస్సు వేసి రెడ్డిగూడెం మండలం రంగాపురం గురుకుల పాఠశాల విద్యార్థులను రానుపోను 140 కి.మీ ప్రయాణించి విజయవాడలోని బాపూ మ్యూజియం, ఇతర దర్శనీయ ప్రాంతాలకు తీసుకొచ్చారు.

-ఈనాడు, అమరావతి

కంట్లో పడితే.. కాస్త తడబడితే..



ఇబ్రహీంపట్నం-జూపూడి రోడ్డులో నిత్యం బూడిద లారీలు, కంకర టిప్పర్లు తిరుగుతుంటాయి. వాటిపై కవర్లు కప్పకుండా తీసుకెళ్తుండడంతో రోడ్డుపై కంకర రాళ్లు పడుతున్నాయి. లారీల వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలో బూడిద పొడి పడుతోంది. కంకర రాళ్లపై వాహనాల టైర్లు పట్టుతప్పి కిందపడిపోతున్నారు. జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది వీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, లారీల యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి







అడుగు దివ్యమై.. వెలుగు భవ్యమై!

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను కలెక్టర్ లక్ష్మీశ విచ్చేసి ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతులు... చక్కని చిరునవ్వుతో.. కొండంత ఆత్మవిశ్వాసంతో... క్రీడల్లో భాగస్వాములై సరిలేరు మాకెవ్వరు అని చాటిచెప్పారు.

- విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

పెట్టుబడుల పేరుతో విశ్రాంత ఉద్యోగికి టోకరా

రూ.78.5 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సరైన డీ మ్యాట్ ఖాతా ఉంటేనే పెట్టుబడులు పెట్టాలని.. ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడులకు ఎక్కువ మొత్తంలో ఆదాయం వస్తుందని ఎవరైనా చెబితే నమ్మవద్దని పోలీసులు చెబుతున్నా.. అమాయకులు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్ల తియ్యని మాటలతో.. విజయవాడకు చెందిన ఒక విశ్రాంత ఉద్యోగి (77) నుంచి రూ. 78.5 లక్షలు కొట్టేశారు. వివరాల్లోకి వెళితే.. మొగల్రాజపురానికి చెందిన విశ్రాంత ఉద్యోగి నటరాజన్ గుల్జార్ రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 22న అతని చరవాణి వాట్సాప్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని అందులో ఉంది. దాన్ని క్లిక్ చేయగానే.. వెంటనే ఒక వ్యక్తి అతని చరవాణికి ఫోన్ చేశాడు. పెట్టుబడులకు ఎంతెంత లాభాలు వస్తాయో తియ్యని మాటలతో ప్రలోభపెట్టాడు. ఆ మాటలు నమ్మిన వృద్ధుడిని 'స్టాక్ మార్కెట్ లెర్నర్స్ 2' అనే ట్రేడింగ్ గ్రూపులోకి చేర్చారు. ఫోన్ చేసిన వ్యక్తి.. లాభాల గురించి విపరీతంగా చెప్పడంతో ఆయన పూర్తిగా నమ్మేశారు. అవతలి వ్యక్తి చెప్పిన విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా, బంధన్ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, యూకో బ్యాంకులకు చెందిన మొత్తం 12 ఖాతాలకు విడతల వారీగా రెండు నెలల్లో రూ. 78.5 లక్షలు పంపారు. తర్వాత యాప్‌లోని తన ఖాతాలో కనిపిస్తున్న డబ్బులను వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించగా.. అవి రాలేదు. మోసపోయినట్లు గుర్తించిన ఆయన.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

మితిమీరిన వేగం.. మింగుతోంది ప్రాణం

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలో వాహనంతో రోడ్డెక్కితే క్షేమంగా తిరిగి వస్తామనే నమ్మకం కొరవడింది. రోడ్లపై వాహనాలు అడ్డదిడ్డంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఎలాంటి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా పలువురు మైనర్లు కూడా ఇష్టారీతిన దూసుకొస్తున్నారు. అసలే ఇరుకిరుకు రోడ్లు.. దీనికితోడు నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మితిమీరిన వేగ నియంత్రణలో పోలీసులు విఫలం అవుతున్న వేళ.. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

నగరంలో రోడ్డు ప్రమాదాల తీరిది (జనవరి–అక్టోబరు 31)

526	ప్రమాదాలు
423	మరణాలు
148	గాయాలు



ప్రకాశ్‌నగర్‌లో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (పాతచిత్రం)

అడ్డదిడ్డంగా నడుపుతున్నారు..

- రెండు వారాల కిందట.. ప్రకాష్‌నగర్‌లో రాత్రి వేళ ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చి.. రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది.
- భానునగర్‌వాసి రాజారావు.. ఇటీవల అల్పాహారం కోసం బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా.. అతివేగంగా ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలైన రాజారావు చికిత్స పొందుతూ మరణించాడు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్న గుణదల పోలీసులు, బాలుడి తండ్రిపై కేసు పెట్టారు.

ప్రమాద కారణాలలో అతి వేగంతో జరుగుతున్నవే అధికం. నగరంలో రద్దీ రోడ్లపై కూడా స్పోర్ట్స్ బైక్‌లతో శరవేగంగా నడుపుతున్నారు. రాత్రుళ్లు పట్టపగ్గాలు లేకుండా వ్యవహరిస్తున్నారు. బైక్ రేసింగ్‌లతో హడలెత్తిస్తున్నారు. మత్తులో ఇష్టానుసారం నడిపి దారిన పోయే వారి ప్రాణాలు తీస్తున్నారు. తాగి నడపడంతో 20 శాతం పైగా చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ యువకులు చేస్తున్నవే. గతంలో రాత్రి పూట, నిర్మానుష్య రోడ్లపై కనిపించే ర్యాష్ డ్రైవింగ్.. ఇప్పుడు రద్దీవేళల్లోనూ తారసపడుతోంది. బాగా రద్దీగా ఉండే బందరు రోడ్డు, ఏలూరు రోడ్లపైనా ఏమాత్రం భయం లేకుండా అతివేగం, స్నేక్ డ్రైవింగ్ చేస్తున్నారు. తమ కళ్ల ముందే చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు కనీసం ఆపడం లేదు. పోలీసులకు పట్టదనే ధీమాతో ఇష్టారీతిన వాహనాలు నడిపేందుకు తెగిస్తున్నారు.

20%

సరిహద్దున వారధి.. సమకూరే దారిది

చకచకా ముక్త్యాల-మాదిపాడు వంతెన నిర్మాణం

న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్య చేపట్టిన ముక్త్యాల- మాదిపాడు వంతెన పనులు.. కూటమి ప్రభుత్వం వచ్చాక వేగం పుంజుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ. 60.54 కోట్ల అంచనాతో చేపట్టిన పనులు నత్తలా సాగాయి. ఇటీవల రెండు జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారుల ప్రత్యేకశ్రద్ధతో పనులు ముందుకు సాగుతున్నాయి.



నిర్మాణంలో వంతెన

- జగ్గయ్యపేట మండలం ముక్త్యాల, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడుల మధ్య కృష్ణా నదిపై చేపట్టిన వారధి నిర్మాణం ఇప్పటికి 10 శాతమే పూర్తయ్యింది.
- రానున్న వేసవిలో పనులు వేగవంతమయ్యేలా ఆర్అండ్‌బీ అధికారులు కార్యాచరణ రూపొందించారు.
- 480 మీటర్ల పొడవు, 14.80 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు.
- మొదటి స్తంభాన్ని మాదిపాడు వైపు నుంచి మొదలుపెట్టి చివరి ఎబెండ్‌మెంట్‌ను జగ్గయ్యపేట వైపు నిర్మిస్తారు.
- ప్రస్తుతం పల్నాడు జిల్లా వైపు నుంచి చేపట్టిన పి1, పి2 నిర్మాణాలు పూర్తయి శ్లాబ్ స్థాయికి చేరుకున్నాయి.
- 12 స్పాన్లుగా సాగే వంతెన నిర్మాణంలో పది స్పాన్లను 35 మీటర్ల వెడల్పుతో, మధ్యలో రెండు స్పాన్లను జల రవాణాకు అనుకూలంగా.. 55.20 మీటర్ల వెడల్పు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.
- ఆర్‌సీఎల్ ఎత్తు 17 మీటర్లు, వంతెనపై ఇరువైపులా 2.5 మీటర్ల నడకదారి ఉండేలా రూపుదిద్దుకోనుంది.
- మాదిపాడు వైపు అర కి.మీ అప్రోచ్ రోడ్డు సరిపోతుండగా జగ్గయ్యపేట వైపు 2 కి.మీ. మేర అప్రోచ్ రోడ్డు అవసరం కావడంతో భూసేకరణ పూర్తి కావచ్చింది.

> ఈ వంతెన సాకారమైతే అమరావతి పరిధిలోనే కాక ఆంధ్ర, తెలంగాణల మధ్య కూడా రవాణా అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం ప్రమాదకరంగా సాగుతున్న పడవల ప్రయాణం బాధలు తప్పుతాయి. ఈ సీజన్‌లో ఐదు స్తంభాలను పూర్తి చేసి 2026లో వంతెనను పూర్తిగా అందుబాటులోకి తేవాలనేది లక్ష్యం.

ధాన్యం సేకరణ వేగవంతం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం సేకరణను వేగవంతం చేసినట్లు జేసీ ఎస్. ఇలక్కియా తెలిపారు. గురువారం మండలంలోని కేతవీరునిపాడు, అంబారుపేట గ్రామాల వద్ద ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మునగచర్ల వద్ద రైస్ మిల్లును సందర్శించి.. దస్త్రాలు తనిఖీ చేశారు. ధాన్యంలో తేమశాతం, తూకం నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో టార్పాలిన్ పట్టలు, తేమశాతం పరిశీలన యంత్రాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కె. బాలకృష్ణ, తహసీల్దారు ఎన్. సురేష్‌బాబు, మండల ఏవో గింజుపల్లి నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ డీటీ రామ్మూర్తి రెడ్డి, రైతుసేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సృష్టి నిందితురాలికి బెయిల్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ ఇతర నగరాల్లో కలకలం సృష్టించిన హైదరాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు డా.నమ్రత (ఏ1 నిందితురాలు) గురువారం బెయిల్‌పై మహిళా జైలు నుంచి విడుదలయ్యారు. సరోగసీ, ఇరత అంశాలపై ఆమెపై 8 కేసులు నమోదయ్యాయి. అన్ని కేసుల్లోనూ న్యాయస్థానాల నుంచి బెయిల్ లభించింది. ఆగస్టులో ఈమెను నగరంలోని గోపాలపురం రాణా పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు


పరుగు పందెంలో దివ్యాంగ విద్యార్థినులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణించడం ద్వారా విభిన్న ప్రతిభావంతులు.. సకలాంగులకు ఏమాత్రం తీసిపోబోమని నిరూపించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన తోడ్పాటు అందిస్తే ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకుంటారన్నారు. అందుకు నిదర్శనమే.. ఇటీవల అంధుల టీ20 క్రికెట్ ప్రపంచకప్ విజయమన్నారు. భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన క్రికెటర్లు టి.దీపిక, కరుణకుమారిలను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహకార సంస్థ ఛైర్మన్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు అవసరమైన సహకారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వి.కామరాజు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జూనియర్, సీనియర్ (స్త్రీ, పురుషుల)విభాగాల్లో చెస్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, రన్నింగ్, ట్రైసైకిల్ రేస్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ పర్యవేక్షకురాలు ప్రశాంతి, పలు పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావు కోరారు. ఎన్టీఆర్ జిల్లా సబ్జెక్ట్


మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

టీచర్ల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు నుంచి అమలుకాబోయే వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అదనపు సమయాన్ని కేటాయించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. వెనుకబడిన సబ్జెక్టుల బోధనకు అదనపు సమయం కేటాయించాలని కోరారు. త్వరలో అందుబాటులోకి రానున్న స్లిప్ టెస్టు, మోడల్ పేపర్లపై పూర్తి అవగాహన కల్పించాలి. డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా పాస్ అయ్యేలా చేయాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు 550 నుంచి 600 మార్కులు సాధించేలా ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉమర్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తింపునకు చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై చర్చ


సమావేశంలో మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహనరావు

పాయకాపురం, న్యూస్‌టుడే : క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన లినాక్ పరికరం ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావులు మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. దీనికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. క్యాన్సర్ లక్షణాలను నాశనం చేసేందుకు ఉపయోగించే లినాక్ పరికరం ఏర్పాటుకు ప్రత్యేకంగా బంకరు ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. నిపుణులను రప్పించి ఆ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి గృహం ఇబ్బందులను కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఔషధ నియంత్రణ శాఖ భవనాన్ని తాత్కాలికంగా ఉపయోగించుకునేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. పాత ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు వైద్య సేవల విస్తరణలో భాగంగా నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. సేవలు పొందేవారి సంఖ్య భారీగా పెరిగిందని, అభివృద్ధి పనులకు సుమారు రూ.80 కోట్ల వరకు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారని... దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. పీజీ వైద్య సీట్ల పెంపునకు తగినట్లుగా కేంద్రం నుంచి వచ్చిన నిధులు వినియోగం, ఆసుపత్రి అభివృద్ధికి చేపట్టిన పనులు వివరాలను తనకు నివేదించాలని డీఎంఈ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎంఈ రఘునందన్‌రావు, అదనపు డీఎంఈ వెంకటేశ్, ఆర్థో విభాగాధిపతి శ్యామ్, అంకాలజిస్టు విభాగాధిపతి నెహ్రూ, రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

దసరా స్ఫూర్తితో భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు


క్యూలైన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా అధికారులు దసరా ఉత్సవాల స్ఫూర్తితో భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం డిసెంబరు 11 నుంచి 15 వరకు నిర్వహించే భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సీపీ రాజశేఖరబాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్‌లతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకొని లోపాలకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆరు లక్షల మంది భవానీ దీక్షాధారులు విరమణ సందర్భంగా వచ్చే అవకాశం ఉందని. . అందుకు తగిన విధంగా గిరిప్రదక్షిణ, హోమగుండాలు, ఘాట్ల వద్ద ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. 36 సెక్టార్లు ఏర్పాటు చేసి ప్రతి సెక్టారుకు ప్రత్యేక అధికారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. పది వేల మందికి పైగా కలశ జ్యోతుల ఊరేగింపుగా దీక్షాధారులు వస్తారని అంచనా వేశామన్నారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. 3 వేల మంది పోలీసులతో పాటు 3 వందల సీసీ కెమెరాలతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల తరహాలో భవానీ దీక్షల విరమణ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 14 కౌంటర్ల ద్వారా లడ్డు ప్రసాదాల విక్రయం, 24 గంటలు కేశఖండన శాలలో భక్తుల తలనీలాలు సమర్పించేందుకు నాయీబ్రాహ్మణులు సహకరిస్తారన్నారు. 20 లక్షల లడ్డు ప్రసాదాలను భక్తులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీ షిరీన్ బేగం, ఏడీసీపీ రామకృష్ణ, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

పాతరాజరాజేశ్వరీపేటలో డయేరియా అనుమానిత లక్షణాలు..!


స్థానిక ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: విజయవాడ పాతబస్తీ 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరీపేటలో అల్లు అప్పలనాయుడు నగర్ ప్రాంతానికి చెందిన ఎ.వినోద్ కుమార్ పోలీస్ శాఖలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 15 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. తొమ్మిది రోజుల కిందట కార్పొరేషన్ సరఫరా చేసే మంచినీటిని తాగి వీరేచనాలు, నీరసం, వాంతులు అవ్వడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన భార్య, తల్లికి లక్షణాలు బయట పడడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడి వైద్యులు వారిని డయేరియా లక్షణాలుగా అనుమానిస్తున్నారు. మంచినీటి పైప్‌లైన్ల పక్కనే కాలువలు ఉన్నాయని... వాటి వల్లే కలుషిత నీరు అవుతుందని వినోద్‌కుమార్ ఇప్పటికే కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేసు గుర్తించలేదు - డీఎంహెచ్‌వో

పాతరాజరాజేశ్వరీపేటలో అనుమానిత అక్యూట్ డయేరియా డీజ్(ఏడీడీ) కేసు నమోదు కావడంతో స్థానికంగా క్షేత్రస్థాయిలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ.. వినోద్ కుమార్ భార్య 26 ఏళ్ల మహిళ స్వల్ప లక్షణాలతో ఉండి చికిత్స అవసరం లేకుండా కోలుకున్నారని, అదే కుటుంబంలో వారు కూడా కోలుకున్నారని వివరించారు. ఇవి డయేరియా లక్షణాలు కావని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ముందు జాగ్రత్తగా 14 వైద్య బృందాల ద్వారా 1,234 గృహాల్లో 3,745 జనాభాకు సర్వే నిర్వహించామని తెలిపారు. ఎక్కడా ఏడీడీ కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. మూడు స్వల్ప లూజ్ మోషన్ కేసులు మాత్రమే నమోదయ్యాయని.. వారు కూడా కోలుకున్నారని చెప్పారు. సురక్షిత తాగునీటి కోసం క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. వైద్య బృందాలు ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్, జింక్ మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ మంచి నీటితో పాటు పరిశుభ్రత వ్యవస్థను మెరుగుపరుస్తున్నట్లు వివరించారు. రంగుమారిన నీటి నమూనాలను ప్రయోగశాలకు పంపించామన్నారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి స్వాగతం



అమరావతి పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి విమానాశ్రయం చేరుకున్న కేంద్ర మంత్రికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, భాజపా నాయకులు పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరాం, చిగురుపాటి కుమార స్వామి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి డి.రొనాల్డ్‌రోస్, జిల్లా ఆడిట్ అధికారి సూర్యభాస్కరరావు, విమానాశ్రయ డైరెక్టర్ ఎమ్.లక్ష్మీకాంతరెడ్డి, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ నోవాటెల్‌కు బయలుదేరి వెళ్లారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

భోజనం పెట్టలేదని భక్తులపై దాడి


గాయపడిన రత్తయ్య

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులపై కొందరు దాడికి పాల్పడ్డారు. కర్రలతో దాడి చేయడంతో ఒకరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన హరిదాసు రత్తయ్య, కుటుంబసభ్యులు, ఇతరులు అమ్మవారి దర్శనానికి గురువారం ఆలయానికి వచ్చారు. అమ్మవారి సత్రాల్లో ఉండి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సమయంలో స్థానిక మహిళ వచ్చి భోజనం పెట్టమని భక్తులను అడగడంతో వారు నిరాకరించారు. దీంతో ఆమెతో పాటు మరో ఇద్దరు దాడి చేసి కర్రలతో కొట్టారు. దీంతో రత్తయ్య తలకు తీవ్ర గాయం కాగా, వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నందిగామలో ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. చికిత్స అనంతరం ఒంగోలుకు వెళ్లారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులపై తరచూ దాడులు జరుగుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆలయం వద్ద భక్తులకు రక్షణ కల్పించేలా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్మికుల హక్కులు కాపాడేందుకు కృషి


మాట్లాడుతున్న మంత్రి సుభాష్. పక్కన శేషగిరిబాబు, చంద్రుడు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం గుణదలలోని ఓ హోటల్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అసంఘటిత రంగ, గిగ్ వర్కర్లను సామాజిక భద్రత కిందకు తీసుకురావడంతో లక్షలాది మందికి రక్షణ లభిస్తుందన్నారు. మహిళలకు మాతృత్వ సెలవులు, అవసరమైతే ఇంటి నుంచే పని సౌకర్యం కల్పించనట్లు పేర్కొన్నారు. పరిశ్రమలతో సమన్వయం పెంచి.. ఉద్యోగావకాశాలు, పెట్టుబడులు పెరిగేలా చూస్తున్నామని తెలిపారు. కార్మికశాఖ కమిషనర్ శేషగిరిబాబు మాట్లాడుతూ.. నూతన లేబర్ కోడ్స్‌లో ఉద్యోగులకు వార్షిక ఆరోగ్య పరీక్షలు, పరిశ్రమల్లో భద్రత కమిటీలు తప్పనిసరన్నారు. కార్మిక శాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు, పరిశ్రమల డైరెక్టర్ మోహన్‌రావు, కార్మిక శాఖ అధికారులు లక్ష్మీనారాయణ, ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏమరుపాటుగా ఉన్న ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీలు

పోలీసుల అదుపులో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై భానుప్రసాద్

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఏమరపాటుగా ఉన్న ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన నలుగురిని కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్‌స్టేషన్ ఔట్‌పోస్ట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రైమ్ ఎస్సై భానుప్రసాద్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్ రాజేంద్ర బోస్లే, కవితా భగవాన్ బోస్లే, మంజు పవార్ బోస్లే, భవన్ ఆనంద్ బోస్లేలు.. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో సామాన్య ప్రయాణికుల్లా వ్యవహరిస్తూ ఏమరపాటుగా ఉన్న ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులు అపహరిస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 22న మహారాష్ట్ర నుంచి విజయవాడ చేరుకున్నారు. రద్దీ ప్రదేశాలపై రెక్కీ నిర్వహించి, 23న బస్‌స్టేషన్‌కు చేరుకుని బస్సు ఎక్కుతున్న ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లోని రూ.44వేలు అపహరించారు. 25న ఇద్దరు మహిళా ప్రయాణికుల హ్యాండ్ బ్యాగ్‌లను దొంగిలించి సుమారు 50 గ్రాముల విలువైన ఆభరణాలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కృష్ణలంక పోలీసులు కేసులు నమోదు చేపట్టి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బస్‌స్టేషన్ పరిసరాల్లోని సీసీ కెమెరాల పుటేజీల సాయంతో ఆధారాలు సేకరించారు. అందిన సమాచారం మేరకు ప్రకాశం బ్యారేజీ సమీపంలోని సీతమ్మవారిపాదాల వద్ద నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు. . నిందితులు మహారాష్ట్ర పార్థీ గ్యాంగ్‌కు చెందినట్లుగా నిర్ధారించారు. వారి నుంచి రూ.44వేల నగదు, సుమారు రూ.5లక్షల విలువైన 50గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన కృష్ణలంక పోలీసులు, క్రైమ్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో ఎస్సై గిరిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైకాపా నేత కొండారెడ్డికి రిమాండ్

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో విశాఖపట్నం నగరానికి చెందిన వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డికి ఎంఎస్‌జే కోర్టు రిమాండ్ విధించింది. డ్రగ్స్ కేసులో అరెస్టు అయి విశాఖలో రిమాండ్‌లో ఉన్న నిందితుడిని మాచవరం పోలీసులు గురువారం పీటీ వారెంట్‌పై విజయవాడలోని ఎంఎస్‌జే కోర్టులో హాజరుపరిచారు. కొండారెడ్డికి డిసెంబరు 5 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి సత్యానంద్ ఉత్తర్వులిచ్చారు. అనంతరం రిమాండ్ నిమిత్తం విశాఖలోని కేంద్ర కారాగారానికి తరలించారు.

ముగ్గురి ముందస్తు బెయిళ్లు డిస్మిస్

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల ముందస్తు బెయిళ్లను కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో పరారీలో ఉన్న తేలప్రోలు రాము, యర్రంశెట్టి రామాంజనేయులు, వజ్రకుమార్‌లు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై గత వారం విచారణ ముగిసింది. వీటిపై గురువారం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో వీరి పాత్ర ఉందనీ, వీరిని విచారించాల్సి ఉందనీ, ముందస్తు బెయిళ్లను తిరస్కరించాలనే ప్రాసిక్యూషన్ వాదనలతో న్యాయాధికారి ఏకీభవిస్తూ పిటిషన్లను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

కొండపల్లి పోస్టాఫీస్ రోడ్డులో మురుగు కాలువ నిండిన స్థానికుల సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పారిశుద్ధ్య అధికారి శ్రీను స్పందించి కార్మికులను పంపించి ఆ ప్రాంతంలోని కాలువల్లో పూడిక తీయించారు.



స్థానిక చెరువు బజారులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందితో పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

★ తిరువూరు 18వ వార్డు డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రసాదరావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

? కొండపల్లి కిల్లా రోడ్డు నాలుగు రహదారుల కూడలిలో ఉదయం 8 నుంచి 9 వరకు తీవ్రమైన రద్దీ ఉంటోంది. ఈ సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. - దామెర్ల నరసింహారావు, స్థానికుడు ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. - లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సై - న్యూస్‌టుడే, కొండపల్లి

? జి.కొండూరు బీసీ కాలనీలోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడద ఉంటోంది. - రామకృష్ణ గ్రామస్థుడు ✔ సిబ్బందితో కాలువల పూడిక తీయించి దోమల నివారణ చర్యలు చేపడతాం. - బసవ లింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

ప్రజాదర్బార్ నేడు

జి.కొండూరు : స్థానిక సామాజిక భవనం ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. మండలంలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ కి.మీ నియంత్రిక నుంచి 800 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదల చేసినట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

గొల్లపూడి, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం పరిధిలో పని చేస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ లక్ష్మీశ ఉత్తర్వులు జారీ చేశారు. గొల్లపూడి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఎం.సరస్వతీ, రెడ్డిగూడెం, ఎనికేపాడు పంచాయతీ కార్యదర్శి సోమా విద్యాధరరావు విజయవాడ గ్రామీణ మండలం డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అన్నదానం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని విజయాస్ సేవా సంస్థలో గురువారం విజయవాడ ఏరీస్ ఆగ్రోస్ కంపెనీ స్థాపించిన రోజు సందర్భంగా వృద్ధులు, అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. సంస్థ డైరెక్టరు అవ్వారి శౌరి తదితరులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ వేంకటేశ్వరుని కల్యాణం

అన్నేరావుపేట(రెడ్డిగూడెం), న్యూస్‌టుడే : అన్నేరావుపేటలో శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణం గురువారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. రాత్రికి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి కె.రామ్‌చంద్ ప్రత్యేక పూజలు చేశారు.

ఆశలు వదులుకుని.. చేలను దున్నేసి

మైలవరం, న్యూస్‌టుడే

అలవిగాని నిబంధనలతో పత్తి రైతులు బెంబేలు

మేమింతే.. మా నిబంధనలు మారవంతే.. అంటున్నారు భారతి పత్తి సంస్థ (సీసీఐ) అధికారులు. వర్షాలతో పంట దిగుబడి, నాణ్యత తగ్గడంతో దిగులు చెందుతున్న పత్తి రైతులకు సీసీఐ నిబంధనలు అలవిగాని విధంగా తయారయ్యాయి. పేరుకు కేంద్రాలు ప్రారంభించినా, నాణ్యత లేమి పేరిట కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో యార్డు వైపు చూసేందుకు అన్నదాతలు వెనుకాడుతుంటే, వచ్చిన ఒకరిద్దరూ తిరిగి బయటకు తీసుకెళ్తున్నారంటే సీసీఐ తీరును అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా పత్తి పంటను అధిక వర్షాలు దెబ్బతీశాయి. తీతల సమయంలో మొంథా తుపాను ముంచెత్తగా, తొలి తీత నష్టపోయారు. తర్వాత తీతల సమయానికి అంతంత మాత్రంగానే దిగుబడి ఉండగా, వర్షాల ప్రభావం కొంత నాణ్యతపై పడింది. అప్పటికీ సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో, క్వింటా రూ.5 వేల చొప్పున బయట వ్యాపారులకు విక్రయించారు.



బయటకు తరలించేందుకు బుట్టలతో పత్తి ఎగుమతి చేస్తున్న కూలీలు

క్వింటా కూడా.. : పేరుకు కేంద్రం తెరిచినా, వారి నిబంధనల మేరకు నాణ్యత గల పత్తిని తేవడం లేదంటూ కొనుగోలు చేయడం లేదు. పైగా రైతులే నేరుగా యార్డుకు కేటాయించిన గుంటూరులోని జిన్నింగు మిల్లులకు తరలించుకో వచ్చంటూ సూచనలు ఇస్తున్నారు. దాంతో చిన్న సన్న కారు రైతులు అంత దూరం వెళ్లినా, నాణ్యత పేరిట తిరస్కరిస్తారన్న భయంతో గ్రామాల్లోని వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం నాణ్యత ఉన్న పత్తిని క్వింటా రూ.6,200ల చొప్పున వ్యాపారులు కొంటున్నారు. ఆ ధర సైతం నష్టం కలిగిస్తున్నా, ప్రత్యామ్నాయం కానరాక విక్రయిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఎకరానికి సరాసరి 10 క్వింటాళ్ల దిగుబడులు ఆశించిన రైతులకు 5 క్వింటాళ్లు మించి రావడం లేదు. దాంతో పెట్టుబడులపై ఆశలు వదులుకుని కాయలున్నా, చేలను దున్నేసి మొక్కజొన్న సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే నాలుగో వంతు పత్తి చేలు ఎండుముఖం పట్టాయి.

తిరస్కరిస్తే దిక్కెవరు?

కౌలుకు సాగు చేస్తున్న పొలం నుంచి తెచ్చిన పత్తిని, నాణ్యత లేమి పేరిట సీసీఐ కొనడం లేదు. చేసేది లేక, తెచ్చిన దాన్ని ఖమ్మం జిల్లాలో విక్రయించుకోవడానికి తీసుకెళ్తున్నాను. కూలీలతో పత్తిలో కాయను వేరు చేయించుకునేందుకు ఖర్చు అవుతోంది. ప్రభుత్వమే నాణ్యత పేరిట తిరస్కరిస్తే రైతులకు దిక్కెవరు.

- గద్దె వెంకటేశ్వరరావు, రైతు, సబ్జపాడు

సబ్సిడీపై డీఏపీ విక్రయాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం సబ్సిడీ ధరలతో రైతులకు అందిస్తున్న ఎరువులు తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలని కొటికలపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం అధ్యక్షుడు యేడ్లూరి వెంకట శివరావు సూచించారు. సహకార కేంద్రానికి మంజూరైన 25 టన్నుల డీఏపీ, తదితర ఎరువుల విక్రయాలను ఆయన గురువారం ప్రారంభించారు. రైతుల అవసరాల మేరకు మూడు నుంచి ఐదు బస్తాల వరకు డీఏపీతో పాటు ఎరువులు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సహకార కేంద్రం త్రిసభ్య కమిటీ సభ్యులు, కేంద్రం సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో జాబ్ మేళా

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆదేశాల మేరకు కొండపల్లి అర్బన్ జీవనోపాధుల కల్యాణ మండపంలో శనివారం జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. దీనికి పదో తరగతి చదువుకున్న వారితో పాటు పీజీ, ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులని చెప్పారు. జాబ్ మేళాకు వచ్చే వారు ఆధార్ ధ్రువపత్రాల నకళ్లు తీసుకురావాలని చెప్పారు. వివరాలకు 79016 10174, 91548 18200 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

అనర్గళ ఉపన్యాసాలతో బహుమతులు



మైలవరం : ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో కరస్పాండెంట్ మల్లికార్జునన్, సిబ్బంది



విస్సన్నపేట : విజేతలతో పుల్లారావు, ఉపాధ్యాయులు సాయి సురేష్, చరణ్య

మైలవరం, న్యూస్‌టుడే : సమకాలీన అంశాలపై అనర్గళ ఉపన్యాసాలతో ప్రతిభ చాటిన విద్యార్థులు బహుమతులు సాధించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం శ్రీ సాయి సెయింట్ మేరీస్ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై డిజిటల్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో 10వ తరగతి విద్యార్థిని కుమిశెట్టి దీపిక, 9వ తరగతి విద్యార్థులు షేక్ షఫియా, ఓబులరెడ్డి హారిక వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. కరస్పాండెంట్ మల్లికార్జునన్, సిబ్బంది దీపిక, నాగయ్య, పవన్ విజేతలకు బహుమతులు అందజేశారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక శ్రీచైతన్య స్కూల్లో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ఎ.దీపిక(9వ తరగతి), కె.లయ హారిక(9వ తరగతి), ఎం.ఉద్భవి (7వ తరగతి) విద్యార్థులు ప్రతిభ చాటి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రిన్సిపల్ నాగ పవన్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. స్కూల్ ఇన్‌ఛార్జి ఎ.పుల్లారావు, ఉపాధ్యాయులు ఎ.సాయి సురేష్, ఎం.చరణ్య పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో అనారోగ్యాలు అధికం

ఈనాడు మీతోడు

కొండపల్లి, న్యూస్‌టుడే : పోషకాహార లేమి, జీవనశైలిలో చోటు చేసుకున్న మార్పులతోనే అనేక వ్యాధులు సంభవిస్తున్నాయని వైద్యులు విజయవాణి, రాథోడ్ తెలిపారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో కొండపల్లి బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆహార అలవాట్లను మార్చుకోవడంతో వయసుకు మించిన వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. కౌమారంలో ఉన్న విద్యార్థినులకు పెద్దస్థాయి సమస్యలకు కారణం ఆహారం, జీవనశైలి మార్పుల వల్లనే అన్నారు. అన్ని విషయాల్లో క్రమశిక్షణ కలిగి ఉంటే భవిష్యత్తును అనుకున్న విధంగా మలచుకోవచ్చన్నారు. విద్యార్థినుల్లో అత్యధికులు నేత్ర సమస్యతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో లయన్స్ క్లబ్ వీఆర్‌కే నగర మహిళా ఆధ్వర్యంలో పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని మాజీ సర్పంచి అమ్మాజీ తెలిపారు. వైద్యులు విజయ్ కుమార్, మాజీ సర్పంచి అమ్మాజీ, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఏఎన్ఎం కామేశ్వరి, ఆశాలు రాజ్యలక్ష్మి, శివపార్వతి, ప్రసన్న పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు విజయవాణి, రాథోడ్



వైద్య శిబిరంలో బారులు తీరి ఇలా..

క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఆటలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ ఎ.రవినాయుడు వివరించారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కేతనకొండలోని శ్రీస్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో గురువారం ఆయన గురుకుల్ ఒలింపిక్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్వామి నారాయణ్ గురుకుల్ పాఠశాల యాజమాన్యం జిల్లా స్థాయిలో గురుకుల్ ఒలింపిక్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బోటో వరల్డ్ ఛాంపియన్ శివారెడ్డి, స్వరూప్ దాస్ స్వామీజీ, కృష్ణమూర్తి దాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



క్రీడా వందనం స్వీకరిస్తున్న రవినాయుడు, నిర్వాహకులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో గత మూడ్రోజులుగా ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో ప్రతి రోజు నాలుగు లీగ్ మ్యాచులు జరుగుతున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. గురువారం నాలుగు మ్యాచులు నిర్వహించగా, అందులో ఒక మ్యాచు సమాన స్కోర్లతో డ్రాగా ముగిసినట్లు చెప్పారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ పి.సుభాష్ బాబు, ఏరియా లీడర్ ఎం.ఉపేంద్ర తదితరులు అతిథులుగా హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.



ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న సుభాష్‌బాబు, నాయకులు

ఆ రేటు చెల్లించకపోతే అంతే ఇక!

కొండపల్లి పురపాలికలో అనధికారంగా నగదు వసూలు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

★ కొండపల్లికి చెందిన ఓ అపార్టుమెంటు నివాసితులు వ్యర్థాలను పడేయడానికి మలుపు వరకు వెళ్లాల్సి వస్తోంది. అందుకు చెత్తను బండిలో వేసుకెళ్లాలని సిబ్బందిని కోరారు. అపార్టుమెంటు కింద ఉంచిన తర్వాత దాన్ని బండిలో వేయాలంటే నెలకు రూ.300 కడితేనే తరలిస్తామని వారు చెప్పారు. ఈ విషయాన్ని అపార్టుమెంటు వాసులు పురపాలిక కార్యాలయంలో చెబితే అవును నిజమే.. రూ.300 కడితేనే జరుగుతుందన్నారు. దీంతో చేసేది లేక నగదు చెల్లించారు.

★ శ్రామిక నగర్ ఫంక్షన్ హాల్ వద్ద డ్రమ్ము నిండా చెత్త పేరుకుంది. దాన్ని తొలగించాలంటే రూ.వెయ్యి కడితేనే తీస్తామని సిబ్బంది చెప్పారు. చేసేది లేక ఫంక్షన్ హాల్ నిర్వాహకులు నగదు చెల్లించి పని చేయించుకున్నారు.

కొండపల్లి పురపాలిక పరిధిలోని పారిశుద్ధ్యం తదితర పనులకు ఓ రేటు ఉంటుందన్నది వాస్తవం. ఆ రేటు చెల్లించకపోతే పనులు జరిగే పరిస్థితి లేదు. ఇది స్థానికంగా ప్రతి ఒక్కరూ తెలుసుకుంటున్న విషయం. శుభకార్యాలు జరిగిన సందర్భంలో కొందరు అల్లరి చేసే వారికి సమర్పించుకుంటున్నట్లే పారిశుద్ధ్యంకు కొంత చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఆ రేటు ఎంత అనేది వారు సూచించిన పట్టీ మేరకు ఉంటోంది. అలా చెల్లింపులు జరిగితే గానీ పనులు జరగవు.



కొండపల్లి రహదారి పక్కన చెత్త

కొన్ని డివిజన్లకే..: పురపాలికలో పూర్తి స్థాయి పారిశుద్ధ్య పనులు కొన్ని డివిజన్లకే పరిమితమయ్యాయి. పురపాలికలోని రెండు ప్రాంతాలకు కలిపి 29 డివిజన్లు ఉన్నాయి. అయితే అజమాయిషి చెల్లించుకునే కౌన్సిలర్లకే ఆయా డివిజన్లలో పనులు అవుతున్నాయన్నది సత్యం. వారి ఆధ్వర్యంలోనే పురపాలిక సిబ్బంది పనులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇతర డివిజన్లలోని ప్రధాన వీధులకే పారిశుద్ధ్యం పరిమితమైంది. పురపాలికలోని రెండు ప్రాంతాలకు కలిపి 186 పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. వీరిలో వివిధ పనులకు కొందరిని వేరు చేయగా 155 మంది మాత్రమే పారిశుద్ధ పనులు నిర్వహిస్తున్నారు. వీరు కూడా కొన్ని డివిజన్లకే పరిమితం కావడంతో ఇతర చోట్ల పనులు చేసే వారికి డిమాండ్ పెరిగింది. దీంతో చెత్త ఎత్తాలన్నా.. తరలించాలన్నా.. రుసుము చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రుసుము ఏమీ లేదు : చెత్త తొలగింపునకు, పారిశుద్ధ్య పనులకు ఎటువంటి చెల్లింపులు లేవు. పురపాలిక పరిధిలో చెత్త పన్ను వసూలు చేయడం లేదు. ఈ విషయాన్ని ప్రజలు అందరూ గమనించాలి. - వెంకటరత్నం, పురపాలిక ఇన్‌ఛార్జి

దుగ్గిరాలపాడు, గంగినేని సర్పంచుల చెక్ పవర్ రద్దు!?

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు గ్రామాల సర్పంచుల చెక్ పవర్ రద్దు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు గురువారం జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. గతంలో ఈ రెండు గ్రామాల్లో సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపిస్తు పీజీఆర్ఎస్‌లో దాఖలు అయిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. ఇందుకు కారణమైన గంగినేనిపాలెం సర్పంచి పిల్లి రామారావు, దుగ్గిరాలపాడు సర్పంచి జడ రాంబాబులకు మూడు నెలలు చెక్ పవర్ రద్దు, పంచాయతీ కార్యదర్శి డి.రామకృష్ణని సస్పెండ్ చేస్తూ డీపీవో ఉత్తర్వులిచ్చారు. దుర్వినియోగమైన నిధులు సర్పంచులు 50 శాతం, కార్యదర్శి 50 శాతం చెల్లించాలని, తదుపరి ఆయా గ్రామాల్లో నిధులు వినియోగానికి ఎంపీడీవోకు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయమై డీఎల్‌పీవో రాఘవన్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఎటువంటి ఆర్డర్ కాపీలు తమకు అందలేదని చెప్పారు. డీపీవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

బూడిద రవాణాతో తీవ్ర కాలుష్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్ నిర్లక్ష్య ధోరణితో రూ.కోట్లు గుత్తేదారులు ఆర్జిస్తుంటే.. రోగాలు ప్రజలు భరిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి మహేష్ అన్నారు. బూడిద చెరువు రోడ్డులో బూడిద లారీలను స్థానికులు గురువారం అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బూడిద రవాణా అవుతున్నప్పుడు రహదారులపై పడటంతో పాటు తీవ్ర కాలుష్యం వెదజల్లుతుందన్నారు. గత నెలలో బూడిద రవాణా నిలిచిపోవడంతో కాలుష్యం సాధారణ స్థాయికి చేరుకొని స్థానికులు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఎంతో ఆనందించారన్నారు. గతంలో బూడిద మాఫియాకు చెందిన వ్యక్తులు, ఇప్పుడు సంస్థ గుత్తేదారుడు బూడిద రవాణా చేసే క్రమంలో నిర్లక్ష్యం వహిస్తూ కాలుష్యం ఏర్పడటానికి కారణమవుతున్నారన్నారు. దీనిపై ఎన్టీటీపీఎస్ యాజమాన్యం స్పందించి మొబైల్ టీంను ఏర్పాటు చేయాలన్నారు. తెదేపా నాయకులు ఫణి, గాంధీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం మహేష్ తదితరులు

'తిరుమల పవిత్రత దెబ్బతీయాలనే ప్రయత్నం'

గొల్లపూడి, న్యూస్‌టుడే : తిరుమల పవిత్రతను దెబ్బతీయాలనే తాడేపల్లి ప్యాలెస్ అజెండాను వైవీ.సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి అమలు చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తితిదేలో చేసిన పాపాల వల్లనే వైకాపాకు 11 సీట్లు వచ్చాయని ఆరోపించారు. పరకామణి దోపిడీ నుంచి కల్తీ నెయ్యి వరకు అనేక అక్రమాలు జరిగాయన్నారు. పరకామణిలో భక్తులు ఇచ్చిన కానుకలను అడ్డగోలుగా దోచుకున్నారన్నారు. తితిదే మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి చేసిన పాపాలు, అక్రమాల నుంచి తప్పించుకోలేరని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న దేవినేని

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

జి.కొండూరు, న్యూస్‌టుడే : కవులూరు గ్రామంలో మానసిక ఆరోగ్య సమస్యలపై వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ కేశవ్, కౌన్సిలర్ ఝాన్సీ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు మానసిక కుంగుబాటుకు గురి కాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలు సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది బట్టపర్తి స్వాతి, ప్రియాంక పాల్గొన్నారు.



కవులూరులో అవగాహన కల్పిస్తున్న కేశవ్

శ్మశానవాటిక ఏర్పాటు చేయండి

మైలవరం, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా తమ గ్రామంలో శ్మశానవాటిక లేక వాగు వెంబడి అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నామని మండలంలోని సబ్జపాడుకు చెందిన ఎస్సీలు వాపోయారు. తమ ఇబ్బందులు తొలగేలా శ్మశాన వాటిక ఏర్పాటు చేయించాలంటూ వారంతా గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అబ్దుల్ దరియాను కలిసి వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బి.శరత్, ఎం.ప్రభాకర్, సుదర్శనం, కోటేశు, స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీలు

చికిత్స పొందుతూ వ్యవసాయ సహాయకుడి మృతి

ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే : ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉయ్యూరు మండలం గండిగుంట-1 సచివాలయంలో వ్యవసాయ సహాయకుడు ఉప్పుటాల సాయి కిరణ్ (24) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. తిరువూరు మండలం రాజుపేట సొంత గ్రామం. తండ్రి బాల్యంలోనే చనిపోవడంతో తల్లి కూలీ పనులు చేసుకుంటూ చదివించారు. ఉద్యోగం చేస్తూ తనకు అండగా నిలుస్తున్న సమయంలో ప్రమాదం రూపంలో తమ కుమారుడు దూరం కావడం పై తల్లి నాగమణి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఉద్యోగ బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్న సాయికిరణ్ మృతిపై గండిగుంట గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవతో రైతులకు ఆసరా

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు ఆసరా కలుగుతుందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పొందుగలలో తెదేపా నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. రామారావు, రాజగోపాల్, శివబాబు, వెంకటేశ్వరరావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : మండలంలోని ఆంజనేయపురంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి పాల్గొన్నారు. పంట దిగుబడి, గిట్టుబాటు ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.



పొందుగలలో కరపత్రాలు చూపుతున్న తెదేపా నాయకులు, రైతులు



ఆంజనేయపురం: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి

కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : అఖిల భారత కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, రాజస్థాన్ రాజ్యసభ సభ్యుడు నీరజ్ డాంగి కోరారు. గురువారం తిరువూరు రాజీవ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకే జిల్లా, నగర కమిటీల అధ్యక్షులను నియమిస్తామని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరసా రాజీవ్‌రతన్, జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీరజ్ డాంగి, వేదికపై నాయకులు

నిబంధనలు అతిక్రమించ రాదు

విస్సన్నపేట: మండల కేంద్రంలోని మెడికల్, రేషన్, పెట్రోల్ బంకులను తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణి గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను అతిక్రమించ వద్దని తప్పక పాటించాలని సూచించారు. డీటీ నాగరాజు, ఆర్ఐ సుజాత, వీఆర్వోలు పాల్గొన్నారు.



తాతకుంట్ల: రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ లక్ష్మికల్యాణి

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : గంపలగూడెం మార్కెట్ యార్డులో, తిరువూరు మండలం రోలుపడిలో ఆరబెట్టిన ధాన్యాన్ని ఆర్డీవో కె.మాధురి గురువారం పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను సాగుదారులకు వివరించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి లబ్ధి పొందాలని రెడ్డిగూడెం తహసీల్దార్ జె.సుశీలాదేవి పేర్కొన్నారు. గురువారం నాగులూరు, రంగాపురం, రెడ్డిగూడెం, మద్దులపర్వ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఏవో డి.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి నరేంద్ర కుమార్, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.



రంగాపురం: ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ సుశీలాదేవి

పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న వెలగపూడిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విస్సన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పసుపులేటి నాగ వెంకటేష్ పాల్గొని ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కుటుంబం వెంకటేష్‌ని అభినందించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం కె.రెడ్డయ్య గ్రేడ్ టీచర్ యన్.కాశి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎ.కొండూరు: మాక్ అసెంబ్లీలో కీలకంగా పని చేసిన ఎ.కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడు మేడుకొండూరు నరసింహారావును రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు



నాగ వెంకటేష్‌ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెరవేరని సివిల్స్ సంకల్పం
బోధకుడిగా ఎందరికో మార్గదర్శకం

వ్యవసాయ కూలీ కుమారుడైన అనిల్‌కుమార్ ఐఏఎస్ అధికారి కావాలని కలలు కన్నారు. గ్రామం నుంచి పట్నాకు చేరుకొని పలుమార్లు యూపీఎస్సీ, బీపీఎస్సీ పరీక్షలు రాసినా లక్ష్యం సాధించలేకపోయారు. చివరకు స్నేహితుల సాయంతో 1986లో చిన్న బుక్‌స్టాల్ ప్రారంభించి.. నేడు బిహార్‌లో సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమవుతున్న ఎందరో విద్యార్థులకు మార్గదర్శిగా ఎదిగారు. తన దగ్గర పుస్తకాల కొనుగోలుకు వచ్చే విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ అనిల్‌కుమార్ క్రమంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన దుకాణం కూడా విస్తరించి పెద్ద షాపుగా మారింది. దిల్లీలోని ముఖర్జీ నగర్‌లోనూ ఓ పుస్తక దుకాణం తెరిచిన అనిల్‌కుమార్ ఇటు బిహార్, అటు దిల్లీ విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైనులో పోటీ పరీక్షల బోధన తరగతులను నిర్వహిస్తున్నారు.



సివిల్ సర్వెంట్ కావాలన్న అనిల్‌కుమార్ కల నెరవేరకపోయినా.. నేడు ఆయన కుటుంబంలో ఐఏఎస్, ఐపీఎస్ సహా నలుగురు అధికారులు ఉన్నారు.

ఈటీవీ భారత్

ఎలక్ట్రికల్ ఇంజినీరును
చేపల వ్యాపారిగా మార్చిన కరోనా

కాలం విన్యాసాల్లో కొన్నిసార్లు మన జీవిత గమ్యాలు, ప్రాధమ్యాలు మారిపోతుంటాయి. మధ్యప్రదేశ్‌లోని అనూప్పుర్ జిల్లా రామ్‌నగర్ డోలాకు చెందిన పవన్‌కుమార్ షా ఎలక్ట్రికల్ ఇంజినీరింగు చదివి భోపాల్‌లో రెండేళ్లు ఉద్యోగం చేశారు. అయిదేళ్ల కిందట.. కరోనా లాక్‌డౌనులో ఇంటికి తిరిగి రావాల్సి వచ్చింది. ఈ సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధి వేట సాగించి చేపల పెంపకంతో సొంత స్టార్టప్‌నకు ఆయన శ్రీకారం చుట్టారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన పవన్ మూతబడి ఉన్న ఓ బొగ్గుగనిని ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకొని కేజ్ కల్చర్ ద్వారా చేపల పెంపకం ప్రారంభించారు. మార్కెట్ స్థితిగతులను అధ్యయనం చేశాక.. బతికున్న చేపలను (లైవ్ ఫిష్) అందుబాటులోకి తేవడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకున్నారు. క్రమంగా వ్యాపారం ఇరుగు పొరుగు జిల్లాలకు.. యూపీకి, ఛత్తీస్‌గఢ్‌కు సైతం విస్తరించింది. నత్తల ఉత్పత్తి కూడా తోడై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 30 మందికి పవన్ ఉపాధి కల్పిస్తున్నారు. చేపల పెంపకంలో ఇప్పుడు ఇతర రైతులకు శిక్షణ ఇస్తూ సీడ్ ఏజెన్సీ ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు.



కాంగ్రెస్‌కు గణనీయంగా పెరిగిన విరాళాలు
గతేడాది 83.80 శాతం వృద్ధి

ఈనాడు, దిల్లీ: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో 2024-25 ఆర్థిక సంవత్సరం తమకు 2,501 మంది దాతల నుంచి రూ.517.37 కోట్ల విరాళాలు అందినట్లు వెల్లడించింది. ఈ మొత్తం అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 83.80 శాతం ఎక్కువ. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29సీ(3) ప్రకారం రాజకీయ పార్టీలన్నీ రూ.20వేలకు మించి అందిన విరాళాల వివరాలు వెల్లడించాలన్న నిబంధనకు లోబడి కాంగ్రెస్ పార్టీ కోశాధికారి అజయ్‌మాకెన్ తాజాగా సమర్పించిన నివేదికను ఎన్నికలసంఘం విడుదల చేసింది. అత్యధికంగా ముంబయికి చెందిన ఏబీ జనరల్ ఎలెక్టోరల్ ట్రస్ట్ రూ.15కోట్లు, ఉదయ్‌పుర్‌లోని హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ సంస్థ రూ.10కోట్లు, కోల్‌కతాకుచెందిన సజ్జన్ బజాంక రూ.6 కోట్లు, న్యూడెమోక్రటిక్ ఎలెక్టోరల్ ట్రస్ట్ రూ.5కోట్లు, సంజయ్ అగర్వాల్ రూ.5కోట్లు, ఐటీసీ లిమిటెడ్ రూ.4కోట్లు, డిరైవ్ ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.4కోట్లు, కేంద్ర మాజీమంత్రి చిదంబరం రూ.3కోట్లు, స్టార్ సిమెంట్ లిమిటెడ్ రూ.3కోట్లు, బెంగుళూరుకు చెందిన క్లాసిక్ ఫెదర్‌లైట్ వాటర్‌ఫ్రంట్ డెవలపర్స్ రూ.3కోట్లు, గురుగ్రామ్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ భజాంక రూ.3కోట్లు పార్టీకి విరాళంగా ఇచ్చారు. 2023-24లో ఆ పార్టీ రూ.281.48 కోట్లు విరాళంగా పొందింది.



కాఫీ తాగే ముందు ఇది మరవకండి

ఆఫీసులో మీ డెస్క్‌టాప్ పక్కన ఓ నీళ్ల సీసా పెట్టుకోండి. కాఫీ మేకర్ మెషిన్ వద్దకు వెళ్లే ముందు తప్పనిసరిగా నీళ్లు తాగండి. ఆ తర్వాతే కాఫీ తాగడం అలవాటు చేసుకోండి. దీనివల్ల మీ ఒంట్లో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్త పడొచ్చు.

– లోరీ షెమెక్, హెల్త్ ఎక్స్‌పర్ట్

పాలిస్టరైన్ బోర్డుల వల్లే
మంటల తీవ్రత!

- హాంకాంగ్ భవనాల అగ్నిప్రమాదంపై అంచనా
- 83కు పెరిగిన మృతుల సంఖ్య.. గల్లంతైనవారు 280 మంది

హాంకాంగ్; బీజింగ్: హాంకాంగ్‌లోని ఏడు బహుళ అంతస్తుల భవనాల్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య 83కు పెరిగింది. మరో 280 మంది ఆచూకీ దొరకడం లేదు. ఈ ప్రమాదానికి సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భవంతుల మరమ్మతుల సందర్భంగా కిటికీల వద్ద ఏర్పాటుచేసిన పాలిస్టరైన్ బోర్డుల వల్లే బుధవారం మంటల తీవ్రత పెరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే మండే స్వభావం ఎక్కువగా కలిగిన బోర్డులకు మంటలు అంటుకున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో వేగంగా పలు అపార్ట్‌మెంట్లకు అగ్నికీలలు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ బోర్డులను ఎందుకు ఏర్పాటుచేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే భవనాలకు కప్పిన రక్షణ వలలు, జలనిరోధక కాన్వాస్, ప్లాస్టిక్ వస్త్రాలు అగ్ని నిరోధక ప్రమాణాలకు అనుగుణంగా లేవని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మరమ్మతు పనుల కోసం వెదురు బొంగులు, నిర్మాణ మెష్‌ను భవనాలకు ఏర్పాటు చేశారు. వీటివల్ల కూడా మంటల తీవ్రత పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణమేంటన్నది ఇంకా తెలియరాలేదు. భవనానికి చెందిన ఇద్దరు డైరెక్టర్లు, మరమ్మతుల కాంట్రాక్టు కన్సల్టెంట్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



అగ్నిప్రమాదం జరిగిన బహుళ అంతస్తుల భవన సముదాయం నుంచి వెలువడుతున్న పొగ

మృతుల్లో అగ్నిమాపక సిబ్బంది ఒకరు

మృతుల్లో అగ్నిమాపక సిబ్బంది కూడా ఒకరు ఉన్నారు. గాయపడిన 76 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిలో 15 మంది పరిస్థితి విషమంగా, 28 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

ఇంకా మంటల్లోనే..

ప్రమాదానికి గురైన ఏడు బ్లాకుల్లో నాలుగింట మంటలు అదుపులోకి రాగా, మిగిలిన బ్లాకుల్లోని పై అంతస్తుల్లో గురువారం సాయంత్రానికి కూడా చల్లారలేదు. వాటిని అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఆయా భవనాల్లో చిక్కుకుపోయిన పలువురు బాధితులను ఇంకా బయటకు తీసుకొస్తున్నారు. 304 ఫైరింజన్లు, డ్రోన్లతో అగ్నిమాపక విభాగం సహాయక చర్యలు కొనసాగిస్తోంది.


4,600 మంది నివాసం

ప్రమాదం జరిగిన హౌసింగ్ కాంప్లెక్స్‌ను తై పో జిల్లాలో 1983లో నిర్మించారు. ఇందులో ఒక్కోటి 31 అంతస్తులతో మొత్తం 8 టవర్లు ఉన్నాయి. ఇవన్నీ చాలా దగ్గర దగ్గరగా ఉన్నాయి. మొత్తం 1,984 ఫ్లాట్లు ఉండగా.. ఇందులో దాదాపు 4,600 మంది నివసిస్తున్నారని అధికారులు తెలిపారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో 40 శాతానికి పైగా 65 ఏళ్ల పైబడినే వారేనని తెలుస్తోంది.

■ హాంకాంగ్‌లో ఈ స్థాయిలో అగ్నిప్రమాదం జరగడం 60 ఏళ్లలో ఇదే తొలిసారి. 1962లో షామ్ షుయ్ పో ప్రాంతంలో ఓ భవనంలో మంటలు చెలరేగి 44 మంది మృతి చెందారు. 1996లో గార్లే బిల్డింగ్‌లో జరిగిన ప్రమాదంలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఇమ్రాన్ క్షేమమే
మృతి వార్తలను ఖండించిన జైలు అధికారులు

పెషావర్: పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతిచెందినట్లు వస్తున్న వార్తలను రావల్పిండిలోని అడియాలా జైలు అధికారులు ఖండించారు. ఆయన పూర్తి ఆరోగ్యంగా ఉన్నారంటూ ఓ ప్రకటనలో తెలిపారు. "జైలు నుంచి ఇమ్రాన్‌ను తరలించారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదు. ఆయన పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఆయన మృతి చెందారంటూ జరుగుతున్న ప్రచారం నిరాధారమైంది" అని అధికారులు పేర్కొన్నారు. పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. ఇమ్రాన్ బయట కంటే జైలులో సౌకర్యవంతంగా ఉన్నారని తెలిపారు. ఫైవ్‌స్టార్ హోటళ్లలో కూడా లభించని మంచి ఆహారాన్ని ఆయన పొందుతున్నారని, విలాసవంతమైన సౌకర్యాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇమ్రాన్ ప్రాణాలతోనే ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించాలని, ఆయన్ను కలిసేందుకు అనుమతినివ్వాలని పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులు డిమాండు చేస్తున్నారు. తోషఖానా, సైఫర్ సహా సుమారు 200 కేసులు ఆయనపై నమోదయ్యాయి. 2023 ఆగస్టు నుంచి ఆయన అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.



బహుభార్యాత్వానికి పదేళ్ల జైలు
చట్టం తెచ్చిన అస్సాం సర్కారు

గువాహటి: బహుభార్యాత్వాన్ని నేరంగా పరిగణిస్తూ అస్సాం శాసనసభ ఒక చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం ఈ నేరానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల కారాగార శిక్ష విధించవచ్చు. దీనికి కొన్ని మినహాయింపులు కల్పించారు. ఆరో షెడ్యూలు పరిధిలోని ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగలకు ఈ చట్టం వర్తించదు. దీనిపై శాసనసభలో అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. బహుభార్యాత్వ నిషేధ చట్టం అన్ని మతవర్గాలకూ వర్తిస్తుందని, ఇది కేవలం ఇస్లాంకు వ్యతిరేకంగా తెచ్చింది కాదని అన్నారు.

శ్వేతసౌధం సమీపాన బలగాలపై కాల్పులు

- గాయపడ్డ ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యుల పరిస్థితి విషమం


వాషింగ్టన్: అధ్యక్ష భవనానికి అతి సమీపంలో భద్రతాబలగాలపైనే కాల్పులు జరగడంతో అగ్రరాజ్యం అమెరికా ఉలిక్కిపడింది. శ్వేతసౌధానికి రెండు బ్లాకుల దూరంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన కాల్పుల్లో వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్ సభ్యులిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్, వాషింగ్టన్ మేయర్ మురియల్ బౌజర్ తెలిపారు. నిందితుడిని అఫ్గాన్‌కు చెందిన రెహ్మనుల్లా లకన్‌వాల్‌గా గుర్తించారు. సీఐఏ మద్దతు ఉన్న అఫ్గాన్ ప్రత్యేక సైనిక విభాగంలో అతడు కొన్నాళ్లు పనిచేసి అమెరికాకు వలస వచ్చినట్లు తెలిసింది. కాల్పుల ఉద్దేశమేంటో వెంటనే తెలియరాలేదు. కాల్పుల్ని ఉగ్రదాడిగానే పరిగణిస్తున్నారు. బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో నిందితుడు గాయపడ్డాడని భావిస్తున్నారు. వాషింగ్టన్లో భద్రతాబలగాల వినియోగంపై వాదోపవాదాల వేళ ఈ ఘటన చోటుచేసుకుంది.



నిందితుడు రెహ్మనుల్లా

దివ్యాంగులను కించపరిస్తే శిక్షించేలా చట్టం

- ఎస్సీ,ఎస్టీల కోసం తెచ్చిన శాసనంలా ఉండాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన



దిల్లీ: ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు, వివక్ష నిరోధకానికి రూపొందించినట్లుగానే దివ్యాంగులను కించపరిచే వారిని కఠినంగా శిక్షించేందుకు చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ఈ విషయాన్ని పేర్కొంది. దివ్యాంగులకు కావాల్సింది గౌరవ, మర్యాదలని.. వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్లకు సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణ నిబంధనల ఖరారుకు 4 వారాల గడువు

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌పై ఎవరో ఒకరు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. సొంతంగా ఛానళ్లు ప్రారంభించి, ఆ తర్వాత బాధ్యతారాహిత్యంగా ఉండటం వింతగా ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారం గురించి ప్రశ్నించి యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసుపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. "భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది ఓ అమూల్యమైన హక్కు. అయితే దాన్ని వక్రీకరించడం సరికాదు" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణ నిబంధనలను తీసుకురావడానికి కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇస్తున్నట్లు తెలిపారు.

20 ఏళ్లుగా రబ్రీదేవి అక్కడే..

- ఇప్పుడెందుకు ఖాళీ చేయమన్నారు..



ఈటీవీ భారత్: బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజులకే మళ్లీ రాజకీయ రగడ ప్రారంభమైంది. అందుకు కారణం బిహార్ మాజీ సీఎం, లాలూ ప్రసాద్ యాదవ్ సతీమణి రబ్రీదేవి రెండు దశాబ్దాలుగా నివసిస్తున్న బంగ్లాను ఖాళీ చేసి వేరే నివాసంలోకి మారాలంటూ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడమే. అయితే రెండు దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రభుత్వ బంగ్లాను రబ్రీదేవి ఖాళీ చేసే ప్రసక్తే లేదని ఆర్జేడీ స్పష్టం చేసింది. ఖాళీ చేసి తీరాల్సిందేనని ప్రభుత్వం పట్టుబడుతోంది.

పట్నాలో సీఎం అధికారిక నివాసం 1, అన్నే మార్గ్ సమీపంలోని 10, సర్క్యులర్ రోడ్డులోని బంగ్లాలో రబ్రీదేవి దాదాపు 20 ఏళ్లుగా నివసిస్తున్నారు. శాసన మండలిలో ప్రతిపక్ష నాయకురాలి హోదా కింద ఆమె 39, హర్డింగ్ రోడ్డులోని నివాసంలోకి మారాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో అధికార, విపక్షాల మధ్య వివాదం మొదలైంది. రబ్రీ దేవీకి కేటాయించిన బంగ్లాను లాక్కోవడం వెనుక భాజపా ఉందని ఆర్జేడీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ ఆరోపించారు. 'కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎన్డీయే ప్రతీకారంతో వ్యవహరించడం ప్రారంభించింది. సీఎం నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం భాజపా ఒత్తిడితో పని చేస్తుందని ఈ నిర్ణయంతో స్పష్టంగా తెలుస్తోంది' అని ఎజాజ్ పేర్కొన్నారు.

■ తన తల్లి రబ్రీదేవిని అధికారిక నివాసం ఖాళీ చేసి వేరే బంగ్లాకు మారమనడంపై ఆమె కుమార్తె రోహిణి ఆచార్య మండిపడ్డారు. 'ఒకరిని వారి ఇంటి నుంచి వెళ్లగొట్టడం చాలా సులభం. కానీ ప్రజల హృదయాల నుంచి వెళ్లగొట్టడం అసాధ్యం' అని మండిపడ్డారు.

■ 28 ఏళ్లుగా లక్షల మంది బిహార్ ప్రజలు, ఆర్జేడీ కార్యకర్తలతో భావోద్వేగ బంధాన్ని కలిగి ఉన్న నివాసాన్ని ఖాళీ చేయాలని ప్రభుత్వం నోటీసు ఇవ్వడాన్ని రబ్రీదేవి చిన్న కుమారుడు తేజస్వీ యాదవ్ తప్పుబట్టారు. ఈ ఇంటిని ఖాళీ చేయిస్తే నీతీశ్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్‌ల మధ్య ఉన్న సోదర నైతిక సంబంధం ముగిసినట్లేనని స్పష్టం చేశారు.

సహజీవన భాగస్వామిని చంపి.. గుర్రుపెట్టి నిద్రపోయాడు

దిల్లీ: మద్యం మత్తులో సహజీవన భాగస్వామితో గొడవపడిన ఓ వ్యక్తి ఆమెను గొంతు నొక్కి చంపాక మృతదేహాన్ని కారులో వదిలేసి.. ఇంట్లోకి వెళ్లి గాఢ నిద్రలోకి జారుకున్నాడు. నైరుతి దిల్లీలోని ఛావ్లా ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. బస్ కంపెనీలో పనిచేస్తున్న వీరేంద్ర (35)కు భార్యాపిల్లలు ఉన్నారు. గత రెండేళ్లుగా మరో మహిళ (44)తో ఇతడు సహజీవనం చేస్తున్నాడు. ఈ మహిళకు పాలంలో ఉన్న ఇల్లు విక్రయించగా వచ్చిన డబ్బుతో గత ఆగస్టులో వీరేంద్ర తన పేరుపై ఛావ్లాలో మూడంతస్తుల ఇల్లు కొన్నాడు. మిగిలిన రూ.21 లక్షల డబ్బు కూడా తన వద్దే ఉంచుకున్నాడు. ఈ డబ్బు కోసం వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. బుధవారం తెల్లవారుజామున ఇద్దరూ మద్యం తాగి మళ్లీ గొడవపడ్డారు. ఆగ్రహంతో వీరేంద్ర మంచంపై ఉన్న ఆమె గొంతును మోచేత్తో అదిమిపట్టి ఊపిరాడకుండా చేయడం ద్వారా హత్య చేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని మాయం చేయడం కోసం తన స్నేహితులైన ఓ పురుషుణ్ని, మరో మహిళను ఫోను చేసి పిలిచాడు. ముగ్గురూ కలిసి మృతదేహాన్ని కింద ఉన్న కారులోకి తీసుకువచ్చాక స్నేహితులు వెళ్లిపోయారు. పూటుగా తాగి ఉన్న వీరేంద్ర కారు నడిపేందుకు విఫలయత్నం చేశాక, వెనక్కు ఇంట్లోకి వెళ్లి మళ్లీ మద్యం తాగి గుర్రుపెట్టి నిద్రపోయాడు. ఉదయం 9.00 గంటల ప్రాంతంలో పొరుగింటి వ్యక్తి కారులో మృతదేహాన్ని చూసి ఫోను చేయడంతో తాము ఘటనా స్థలానికి చేరుకొన్నట్లు పోలీసులు వివరించారు. అప్పటికీ నిద్రలోనే ఉన్న వీరేంద్రను అరెస్టుచేసి, అతడి సహచరుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

- కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం డిమాండ్

దిల్లీ: కొత్తగా ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే కేంద్రం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన, అసంఘటిత కార్మికులు ఉద్యోగుల కాంగ్రెస్ ఛైర్మన్ ఉదిత్‌రాజ్ డిమాండ్ చేశారు. పాత కార్మిక చట్టాలు అసంఘటిత శ్రామికుల ప్రయోజనాలు పరిరక్షించాయని, వాటిని మోదీ ప్రభుత్వం హత్య చేసిందని ఉదిత్‌రాజ్ విమర్శించారు. అసంఘటిత రంగంలో ఉన్న 44 కోట్ల మంది కార్మికుల్ని బడా కార్పొరేట్లు, క్రోనీ కేపిటలిస్టుల దయాదాక్షిణ్యాలపై వదిలేశారని ఆయన అన్నారు.


■ మరోవైపు కేంద్ర పర్యావరణ శాఖ ఆరావళి పర్వతాలకు ఇచ్చిన కొత్త నిర్వచనంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మైనింగ్ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన ఈ నిర్వచనం 90 శాతం ఆరావళి పర్వతాలను ఆరావళిగా గుర్తించడం లేదని, ఇది ఆ ప్రాంతంలో విచక్షణా రహిత మైనింగ్‌కు దారితీస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ తన సోషల్‌మీడియా పోస్టులో పేర్కొన్నారు.

శ్రీలంకలో కుండపోత వర్షాలు.. 31 మంది మృతి

కొలంబో: శ్రీలంకను కుండపోత వర్షాలు ముంచెత్తాయి. దీంతో వరదలు తలెత్తి, కొండచరియలు విరిగిపడటం వంటి కారణాలతో 31 మంది మృతి చెందారు. దాదాపు 4,000 మంది ప్రభావితమయ్యారు. వరదల్లో చిక్కుకున్న ఓ బస్సు నుంచి 23 మంది ప్రయాణికులను అత్యవసర బృందాలు కాపాడినట్లు ఓ మీడియా కథనం వెల్లడించింది. మరో 14 మంది గల్లంతయ్యారని తెలిపింది. ఇండోనేసియా వరదల్లో 49కి పెరిగిన మృతుల సంఖ్య.

డాక్టర్ షాహీన్ నా భార్య.. గర్ల్‌ఫ్రెండ్ కాదు
దర్యాప్తులో ఉగ్ర వైద్యుడు ముజమ్మిల్

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో జరిగిన కారు బాంబు పేలుడు కేసులో మరో సరికొత్త విషయం వెలుగు చూసింది. ఈ కేసులో నిందితురాలైన డా.షాహీన్ షహీద్ తన గర్ల్‌ఫ్రెండ్ కాదని, ఆమె తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు వెల్లడించాడు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపంలోని మసీదులో 2023 సెప్టెంబరులో తాము వివాహం చేసుకున్నట్లు అతడు తెలియజేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.



వివాదాస్పద మ్యాప్‌తో నేపాల్ కొత్త రూ.100 నోట్లు

కాఠ్‌మాండూ: భారత్-నేపాల్ మధ్య వివాదాస్పదంగా ఉన్న కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలతో కూడిన మ్యాప్‌తో నేపాల్ కేంద్ర బ్యాంక్ (నేపాల్ రాష్ట్ర బ్యాంక్- ఎన్ఆర్‌బీ) కొత్త రూ.100 నోట్లను గురువారం విడుదల చేసింది. 2024 సంవత్సరంలో తయారైనట్లుగా చూపించిన ఈ కొత్త నోట్ల వెనుకవైపు మధ్య భాగంలో లేత ఆకుపచ్చ రంగుతో వివాదాస్పద నేపాల్ మ్యాప్ ఉంది. దీనిపై ఎన్ఆర్‌బీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ.. రూ.100 నోట్లపై ఇదివరకే తమ దేశ మ్యాప్ ఉందని, 2020లో సవరించిన మ్యాప్‌ను ప్రభుత్వం విడుదల చేయడంతో దానికి అనుగుణంగా కొత్త నోట్లను తాజాగా జారీ చేసినట్లు వివరించారు. మూడు ప్రాంతాలను తమవిగా భారత్ పేర్కొంటుండగా.. వాటిని తమ ప్రాంతాలుగా చూపుతూ సవరించిన మ్యాప్‌ను కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం 2020లో విడుదల చేసింది. దీనిపై అప్పట్లోనే భారత్ తీవ్ర నిరసన తెలిపింది.

జీ20 సదస్సుకు దక్షిణాఫ్రికాను ఆహ్వానించే ప్రసక్తే లేదు: ట్రంప్

న్యూయార్క్: వచ్చే ఏడాది అమెరికాలోని మయామి నగరంలో జరగనున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకి దక్షిణాఫ్రికాను ఆహ్వానించబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. జీ20 సభ్యత్వానికి ఆ దేశం ఏ విధంగానూ అర్హమైంది కాదని ఎద్దేవా చేశారు. ఆఫ్రికా, డచ్, ఫ్రెంచ్, జర్మన్ మూలాలున్న శ్వేతజాతీయులపై దక్షిణాఫ్రికాలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, అయినా అక్కడి సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ట్రూత్ వేదికగా బుధవారం ధ్వజమెత్తారు. ఈ దారుణాలను అమెరికా మీడియా దాచిపెడుతోందని దుయ్యబట్టారు. 'న్యూయార్క్ టైమ్స్' ఓ ఫేక్ మీడియా అని విమర్శించారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన సదస్సులో పాల్గొన్న అమెరికా ప్రతినిధికి జీ20 సారథ్య బాధ్యతల్ని అప్పగించడానికి ఆ దేశ అధికారులు నిరాకరించడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. దక్షిణాఫ్రికాకు తమ నుంచి చెల్లింపులు, రాయితీలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

ట్రంప్‌ది తప్పుడు ప్రచారం: దక్షిణాఫ్రికా

ట్రంప్ ప్రకటనపై దక్షిణాఫ్రికా స్పందించింది. జీ20లో సభ్య దేశంగా చురుకైన పాత్ర కొనసాగిస్తామంది. శిఖరాగ్ర సదస్సుకు ట్రంప్ హాజరుకానందున.. ఆయనకు అందించాల్సిన పత్రాలను తమ దేశంలోని అమెరికా రాయబార కార్యాలయ అధికారికి అప్పగించినట్లు అధ్యక్షుడు రమఫోసా కార్యాలయం తెలిపింది. అమెరికాతో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నా ట్రంప్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడింది.



దిల్లీలో చాణక్య డిఫెన్స్ డైలాగ్ సెమినార్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఇతర అధికారుల బృంద చిత్రం

మన సత్తాను చాటిన ఆపరేషన్ సిందూర్

- 'చాణక్య డిఫెన్స్ డైలాగ్'లో రాష్ట్రపతి ముర్ము

దిల్లీ: ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, దానిని నిలువరించడంలో మన సత్తా గురించి 'ఆపరేషన్ సిందూర్' చాటిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. శాంతిని నెలకొల్పే విషయంలో మన సైనిక సామర్థ్యం ఏమిటనేదే కాకుండా ఉగ్రవాదుల అంతు చూడటంలో ఎంత దృఢంగా, ఎంత జవాబుదారీతనంతో వ్యవహరిస్తామనేది ప్రపంచం తెలుసుకుందని చెప్పారు. గురువారం దిల్లీలో భారత సైన్యం నిర్వహించిన కీలకమైన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్'లో ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. "వసుధైక కుటుంబమనే భావన మన నాగరికత విలువలను నడిపిస్తోంది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి.. ప్రపంచం పట్ల బాధ్యత కలిసి పయనిస్తాయని మనం రుజువు చేశాం. భారత్ శాంతికాముక దేశమే అయినా సరిహద్దుల్ని, తన ప్రజల్ని రక్షించుకునేందుకు కృతనిశ్చయంతో అడుగులు వేస్తుందని చాటాం. సార్వభౌమత్వ పరిరక్షణలో మన సాయుధ బలగాలు దేశభక్తిని, వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించాయి. భద్రతపరమైన సవాళ్లయినా, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలోనైనా, మానవతా సాయంలోనైనా తిరుగులేని సత్తా ఉందని రుజువు చేసుకున్నాయి. దేశాభివృద్ధికీ మూలస్తంభంగా నిలుస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నాయి" అని రాష్ట్రపతి కొనియాడారు. వికసిత భారత్ లక్ష్యాలను చేరుకోవడంలోనూ సైన్యం కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు.

ఆత్మనిర్భరత, నవీకరణలే సైన్యానికి కీలకం: ద్వివేది

ఆత్మనిర్భరత, నవీకరణలే భారత సైన్య ప్రగతికి సోపానాలని ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేది గురువారం పేర్కొన్నారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో రెండు ధ్రువాలుగా చీలివున్న ప్రపంచం కొద్దికాలం ఏకధ్రువ జగతిగా నిలిచి ప్రస్తుతం అనిశ్చితమైన చీలిక పేలికలుగా తయారైందని జనరల్ ద్వివేది తెలిపారు.'చాణక్య డిఫెన్స్ డైలాగ్'లో ఆయన ప్రసంగించారు. "మనమిప్పుడు ప్రధాన ప్రపంచ శక్తులు నిరంతరం పోటీ పడుతున్న బహుళధ్రువ ప్రపంచంలో ఉన్నాం" అని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 50కి పైగా సంఘర్షణలు జరుగుతున్న కల్లోలిత జగతిలో ఉన్నామని, ఈ పరిస్థితుల్లో భారత సైన్యం తన సంసిద్ధతను, నిర్ణయాత్మకతను నిలబెట్టుకోడానికి ఏం చేయాలన్నదే ప్రశ్న అని ద్వివేది అన్నారు. ప్రధాని మోదీ సూచించిన సమ్మాన్ (గౌరవం), సంవాద్ (చర్చలు), సహయోగ్ (సహకారం) సమృద్ధి, సురక్ష అనే ఐదు అంశాలే ఈ ప్రశ్నకు సమాధానం అని ప్రధానాధికారి అన్నారు.

మా వద్ద మంత్ర దండం లేదు
దిల్లీ కాలుష్య మూలాలను గుర్తించాలి: సుప్రీంకోర్టు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అధికమవుతోన్న వాయు కాలుష్యం సమస్య తక్షణ నివారణకు తమ వద్ద మంత్ర దండం ఏమీ లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోన్న సమస్య ఏమిటో అందరికీ తెలుసు. అందుకు కారణాలను గుర్తించాలి. పరిష్కారాన్ని కనుగొనాలి. ఇది నిపుణులే చేయగలరు' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. దిల్లీలో కాలుష్యం అంశంపై తక్షణమే విచారణ జరపాలన్న సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ విజ్ఞప్తిపై సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం గురువారం స్పందించింది. 'తరచూ తలెత్తుతున్న ఈ సమస్యకు ప్రభుత్వం ఏదైనా పరిష్కారంతో ముందుకు వస్తుందని ఆశిస్తున్నాం. కాలుష్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం. ఈ అంశంపై డిసెంబరు 3న విచారణ చేపడుతామ'ని తెలిపింది.

ఆన్‌లైన్లో టికెట్లు కొన్నవారికే ప్రమాద బీమా ఇవ్వడమేంటి?
రైల్వేను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: కేవలం ఆన్‌లైన్‌లో టికెట్లు కొన్నవారికే ప్రమాద బీమా కవచాన్ని ఇచ్చి ఆఫ్‌లైన్లో కొన్నవారికి ఎందుకు ఇవ్వడం లేదో తెలపాలని రైల్వేశాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆన్‌లైన్ టికెట్లున్నవారికే బీమా వర్తిస్తుందని అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జీత్ బెనర్జీ రైల్వేశాఖ తరఫున తెలిపిన మీదట జస్టిస్ అహ్‌సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం ఈ ప్రశ్న సంధించింది. ఈ తేడా ఎందుకో తెలుసుకుని నివేదించాలని ధర్మాసనం ఈ నెల 25న ఆదేశించి, తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 13కి వాయిదా వేసింది.

బ్రిటన్‌ను వీడుతున్న భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు

లండన్: వీసా కలిగివుండీ బ్రిటన్ వదిలి వెళ్తున్నవారిలో భారతీయ విద్యార్థులు, ఉద్యోగులే అధికంగా ఉన్నారని యూకే ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్ (ఓఎన్ఎస్) పేర్కొంది. ఈ గణాంకాల ప్రకారం.. 2025 జూన్‌లో 45 వేల మంది స్టడీ వీసా కలిగివున్న భారతీయులు, 22 వేల మంది వృత్తి నిపుణులు వీసా కలిగివున్నప్పటికీ బ్రిటన్ వదిలి వెళ్లారు. వీసా కేటగిరీల్లో ఇతరులుగా నమోదైన మరో ఏడు వేల మంది భారతీయులు కూడా ఇదే బాట పట్టారు. దీంతో 2025 జూన్ నాటికి 74 వేల మంది భారతీయ ప్రవాసులు బ్రిటన్ వదిలిన ట్లైంది. ఈ విషయంలో 45 వేల మందితో చైనా రెండో స్థానంలో ఉంది. బ్రిటన్ చేరుకుంటున్న వలసదారుల్లో కూడా అత్యధిక సంఖ్యాకులు భారతీయులే కావడం విశేషం.

వసుంధర

vasundhara@eenadu.in



గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలు... పేదరికం, ఆంక్షలు దాటి బడికెళ్లడమే కష్టం... దీనికి నెలసరి కూడా భారంగా మారితే చదువు అటకెక్కేసినట్లే... ఈ పరిస్థితినే అర్థం చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చారు. అదేంటంటే...

చదువుకి ఆటంకం కాకూడదని..!



గరిమా

మనమెంత పురోగతి సాధించామని చెప్పుకొన్నా... ఇప్పటికీ ఎంతోమంది ఆడపిల్లలు పేదరికం కారణంగా నెలసరి పరిశుభ్రతకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేయాలంటే వారికి అవగాహన కల్పించడంతోనే సరిపోదు... ఆర్థిక భారమూ తగ్గాలని భావించారు కలెక్టర్ రాజర్షి షా. ఇందుకోసం తనే స్వయంగా చొరవ తీసుకుని పింకీషీ, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ విద్యాసంస్థలకు శానిటరీ ప్యాడ్స్ తయారీ యంత్రాలను అందజేశారు. అంతేకాదు, ఆ సమయంలో ఆడపిల్లలు ఇబ్బంది పడకుండా జైనథ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో బాలికలకోసం ప్రత్యేకంగా 'ఎమినిటీస్ రూమ్'ని ఏర్పాటుచేశారు. శానిటరీ ప్యాడ్లు, వాటి వెండింగ్ మెషీన్, రెండు మంచాలు, హాట్ ప్యాక్, ప్రథమ చికిత్స కిట్, ఓఆర్ఎస్‌లను అందుబాటులో ఉంచారు. బాలికలు తమ అనారోగ్య సమస్యలను తెలిపేందుకు ఫిర్యాదుల పెట్టెను పెట్టారు. ఆరోగ్యపరమైన అంశాలను వివరిస్తూ పోస్టర్లనూ అతికించారు. ఈ పాఠశాలలోని 630 మంది విద్యార్థుల్లో 288 మంది బాలికలు ఉన్నారు. అంతేకాదు, ఈ పాఠశాలను సమీపంలోని పీహెచ్‌సీకి అనుసంధానం చేశారు. ఒక ఏఎన్ఎం ప్రతివారం వచ్చి బాలికల సమస్యలు తెలుసుకుంటారు. కావాల్సిన సహాయం చేస్తారు. అవసరమైతే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తారు.

తాజాగా ఇక్కడి ఏర్పాట్లను పరిశీలించేందుకు మంగళవారం దిల్లీ నుంచి పింకీషీ సంస్థ ప్రాజెక్టు సమన్వయకర్త గరిమా శర్మ, మహిళా సాధికారత, బాలికల ఆరోగ్యంపై పనిచేస్తున్న స్విట్జర్లాండ్ దేశస్థురాలు జినేవ్ర బొనీన పాఠశాలలను సందర్శించారు. ఇటలీకి చెందిన బృందంతో కలిసి డాక్యుమెంటరీనీ చిత్రీకరించారు.

– నోముల రవికుమార్ రెడ్డి, జైనథ్

చిన్న వయసులో పెద్ద బాధ్యత...

పేదరికం వల్ల నెలసరి పరిశుభ్రత, చదువులకు ఆడపిల్లలు దూరం కాకూడదనుకున్నారు దిల్లీకి చెందిన ఖ్యాతి గుప్తా. అప్పటికి ఆమె వయసు కేవలం పదహారేళ్లే. ఓ రోజు వాళ్లింట్లో పనిచేసే మహిళ కూతురు పీరియడ్స్ సమయంలో బడికి వెళ్లకపోవడాన్ని గుర్తించారు. శానిటరీ న్యాప్‌కిన్లు కొనుక్కునే స్థోమత లేకపోవడం వల్లే ఇలా జరిగిందని తెలిసి ఆలోచించారు. నెలసరి ఆరోగ్యం గురించి అవగాహన పెంచాలనుకున్నారు. ఇందుకోసమే తండ్రి అరుణ్‌తో కలిసి 2017 పింకీషీ ఫౌండేషన్‌ని స్థాపించారు. ఆమె తండ్రి అరుణ్ కూతురు లక్ష్యాన్ని అర్థం చేసుకుని తన కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి మరీ ఆ సంస్థలో భాగమయ్యారు. అలా గత కొన్నేళ్లుగా పింకీ షీ మెన్‌స్ట్రువల్ హైజీన్ క్యాంపులను ఏర్పాటుచేసి నెలసరి పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంచడమే కాదు... ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లను అందిస్తోంది. ఇప్పటివరకూ 29 రాష్ట్రాల్లో వేలమంది వాలంటీర్లతో 5000లకు పైగా ఈ తరహా కార్యక్రమాలను నిర్వహించింది. 50 లక్షలకు పైగానే శానిటరీ న్యాప్‌కిన్లు ఉచితంగా పంపిణీ చేశారు. రీయూజబుల్ క్లాత్ ప్యాడ్స్ తయారీతో మహిళలకు ఉపాధి కల్పిస్తూ ఆర్థిక భరోసా అందించారు. ప్రస్తుతం ఖ్యాతి ఓ బహుళజాతి సంస్థలో సీనియర్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నారు.



ఖ్యాతి



పిల్లలతో బాధ పంచుకోండి!

సమయానికి పని పూర్తికాకపోవడం, అనుకున్న ఫలితాలు దక్కక పోవడం, ఇంట్లో తగాదాలు... ఇవన్నీ మహిళల రోజువారీ జీవితంలో భాగమే. వీటన్నింటి ఫలితమే ఒత్తిడి, అతి ఆలోచనలు. వీటితో సతమతం అవుతూ... మరుసటి రోజును ఉత్తేజంగా ఎలా ప్రారంభించగలం. అందుకే ఎప్పటి ఒత్తిడిని అప్పుడు దూరం చేసుకోవాలని చెబుతున్నారు నిపుణులు. దీనికి చాలానే సలహాలూ సూచనలూ చేస్తున్నారు కూడా. వాటితోపాటు మీ కష్టనష్టాల్ని ఇంట్లో చిన్న పిల్లలకు చెప్పమంటున్నారు. ఒత్తిడీ, యాంగ్జయిటీని నియంత్రించే కోపింగ్ టెక్నిక్స్‌లో ఇదీ ఓ భాగమట. దీనిద్వారా 30-40శాతం ఉపశమనం పొందొచ్చట.

'అమ్ములూ ఈరోజు ఏమైందో తెలుసా? అమ్మని వాళ్ల బాస్ తిట్టారు. అమ్మ సరిగా పనిచేయడం లేదని' అంటూ మొదలుపెట్టి రోజంతా జరిగిన విషయాలన్నీ వాళ్లకు కథగా, తేలికైన పదాలతో చెప్పి చూడండి. మీ సంభాషణ పూర్తయ్యేలోపూ ఒత్తిడి నుంచి బయటపడతారు అంటున్నారు నిపుణులు. ఎందుకంటే...

- చాలాసార్లు విషయాలు చిన్నవే అయినా, చెప్పుకోవడానికి ఎవరూ లేరనే ఆలోచనతోనే బాధ పెరిగిపోతూ ఉంటుంది. దీన్ని దూరం చేసుకోవాలంటే పిల్లలకు చెప్పడమే సరైన పద్ధతట. మెదడులో గుమిగూడే భావాలు బయటికి వస్తే ఒత్తిడి ఆటోమేటిక్‌గా తగ్గుతుంది.
- పైగా మనసులో మాట ఎవరికైనా చెబుదామంటే... జడ్జ్ చేస్తారని ఆగిపోయే సందర్భాలు చాలానే. పిల్లలైతే అలా చేయరు సరికదా, మనం బాధపడుతున్నట్లు వాళ్లకి అనిపిస్తే... ఆ చిన్ని చేతులు ఊరుకుంటాయా? ఎన్ని ఓదార్పు మాటలు చెబుతాయో. ఆ వచ్చీ రాని మాటలు, చేష్టలకు మనసు స్థిమిత పడుతుంది.

అయితే హద్దులు దాటిన పదజాలం, కోపం, చిరాకు, ద్వేషం లాంటివి వారి ముందు ప్రదర్శించకూడదు. అది వాళ్లకి హాని అని మరచిపోకండి.

ఊరు తప్ప మరో ప్రపంచమే ఆమెకు తెలియదు. అలాంటమ్మాయి ఏకంగా సముద్రాలు దాటింది. వేరే దేశంలో అడుగుపెట్టింది. ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లలకు స్ఫూర్తిగా మారిన సీమా కుమారి ప్రయాణం ఇది...

ఎల్లలు దాటిన స్ఫూర్తి!



సీమా

ఝార్ఖండ్‌లోని దాహూ అనే చిన్న గ్రామం సీమది. 19మంది సభ్యులున్న ఉమ్మడి కుటుంబం. అమ్మానాన్నలే ఊరు దాటలేదు. ఇక తనకి మాత్రం వేరే ప్రపంచం ఎలా తెలుస్తుంది? బాల్యవివాహాలు అక్కడ సహజం. దీంతో అమ్మాయిల డ్రాపవుట్లు ఎక్కువగా ఉండేవి. పైగా అక్కడ అమ్మాయిలంటే బాధ్యత కాదు భారం. పెళ్లి, కట్నాలంటూ బోలెడు ఖర్చులు. అందుకే ఎంత త్వరగా భారాన్ని దింపేసుకుందామా అనే ఆలోచిస్తారు తల్లిదండ్రులు. అలాంటిచోట కాళ్లకు కనీసం చెప్పుల్లేని పరిస్థితి సీమది. చదువేమో ప్రభుత్వ పాఠశాలలో. ఇంట్లో పనులున్నా, కుటుంబానికి తన అవసరం ఉన్నా ఆరోజు స్కూలుకి సెలవన్నట్లే. సీమకీ ఇంతకు మించిన ప్రపంచం తెలియదు. ఇలా సాగుతున్న తన జీవితంలోకి 'యువ' అనే ఫౌండేషన్ వచ్చింది. ఈ సంస్థ ఆడపిల్లలకు ఫుట్‌బాల్ నేర్పించేది. నచ్చి ఆటలో చేరింది సీమ. చదువు, ఇంట్లో పనులు చేస్తూనే ఆటనీ కొనసాగించింది.

ఆటలో రాణిస్తుండటంతో పక్కఊళ్లకు పోటీలకు తీసుకెళ్లారు 'యువ' వాలంటీర్లు. అలా తొలిసారి బయటి ప్రపంచాన్ని చూసింది సీమ. అదే సంస్థ ఈ పిల్లలకు మెరుగైన విద్య అందించాలని ఓ స్కూలు ఏర్పాటుచేసింది. దానిలో చేరిన తొలి ఆరుగురిలో సీమ కూడా ఉంది. ఇక్కడకు, విదేశాల నుంచి వచ్చీ టీచర్లు పాఠాలు చెబుతుంటారు. వాళ్ల శిక్షణలో రాటుతేలిన సీమ... స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కింద హైస్కూల్లో ఉన్నప్పుడే సియాటెల్‌కి వెళ్లింది. ఆపై కేంబ్రిడ్జ్‌లో సమ్మర్ ప్రోగ్రామ్, వాషింగ్టన్ యూనివర్సిటీలో మరో కోర్సు చేసింది. ఓసారి వాళ్ల స్కూలుకి హార్వర్డ్ పూర్వవిద్యార్థి టీచర్‌గా వచ్చారు. ఆవిడ అనుభవాలు విన్న సీమకి అక్కడ చదవాలనిపించింది. టీచర్ల సాయంతో దరఖాస్తు చేయగా అవకాశమూ వచ్చింది. అక్కడ గ్రాడ్యుయేషన్‌లో చేరిన సీమ తాజాగా చదువు పూర్తిచేసుకుంది.

'ఇప్పటికీ నా ప్రయాణం కలలాగే అనిపిస్తుంది. కరెంటు లేని ఊరు మాది. మా అమ్మానాన్నలకు హార్వర్డ్ అన్న పేరే తెలీదు. అలాంటిచోట పట్టుదలగా ప్రయత్నించి నేను అడుగు పెట్టా. వంద దేశాల విద్యార్థులతో కలిసి చదువు పూర్తిచేశా. ఇదంతా ఒకప్పుడు ఊహించుకోవడానికీ కష్టమే. ఇప్పుడది నిజమైంది. చదువుకున్న గొప్పతనమిది' అనే సీమ... తనకు అండగా నిలిచిన యువ సంస్థతో కలిసి పనిచేస్తోంది. బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూనే అమ్మాయిల చదువును ప్రోత్సహిస్తోంది. వారి కలలు నిజమయ్యే మార్గాన్ని చూపిస్తోంది. తన ఊరిలో మార్పునకూ కారణమైంది. 'నా లక్ష్యం ఒకటే... నాలాగే మిగతా అమ్మాయిలూ కలలు నిజం చేసుకునేలా సాయపడాలని' అంటోన్న సీమ... నేటి తరానికి స్ఫూర్తిదాయకమేగా మరి!

తల్లీకూతుళ్లది భావోద్వేగ బంధం!



శోధిత

'ఫీలింగ్ ఈచ్ అదర్స్ ఎనర్జీ'... ఇదో ఆంగ్ల పదబంధం. అంటే ఒకరి శక్తిని ఒకరు అనుభూతి చెందడం అని చెప్పవచ్చు. ఇది తల్లీకూతుళ్ల మధ్య ఉండే భావోద్వేగ-అదృశ్య బంధానికి కచ్చితంగా సరిపోతుంది. అదెలా అంటారా?

'అమ్మా...' వేల మైళ్ల దూరంలోని కూతురి గొంతు వినగానే... ఆమె మనసుని చదివేయగలదా తల్లి. ఆ అమ్మాయీ అంతే... అమ్మ గొంతులోని ప్రేమ, కోపం ఇట్టే పసిగట్టేస్తుంది. అంతెందుకు, కూతురు దేని గురించైనా తీవ్రంగా బాధపడుతుంటే... అమ్మ మనసులోనూ తెలియని అలజడి. ఇదేదో అతిశయోక్తిగా చెబుతున్నది కాదు. తల్లీకొడుకూ, తండ్రీకూతుళ్ల బంధంతో పోలిస్తే తల్లీకూతుళ్లది బలీయమైన భావోద్వేగ బంధం అని అధ్యయనాలూ చెబుతున్నాయి. ఇద్దరి మధ్య ఉన్న స్నేహం, అవగాహన, కూతురు పెరిగే క్రమంలో స్వేచ్ఛగా పంచుకున్న ఆలోచనలు, భావాలు, అనుభవాలతోపాటు హార్మోన్లూ ఇందుకు కారణమేనట. గర్భధారణ సమయంలోనూ తరవాతా తల్లిలో విడుదలయ్యే ఆక్సీటోసిన్ వీళ్ల మధ్య గాఢమైన అనుబంధం ఏర్పడటానికి కొంతవరకూ కారణమవుతున్నట్లు కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. అంతేకాదు, భావోద్వేగాల్ని నియంత్రించే మెదడు నిర్మాణం కూతుళ్లలో తల్లినే పోలి ఉంటుంది. ఈ సారూప్యతే ఇద్దరిలోనూ భావోద్వేగాల ప్రక్రియ ఒకేలా ఉండేందుకూ బంధం బలపడేందుకూ కారణమవుతుంది. మాటలతో చెప్పకున్నా ఒకరి గురించి మరొకరు తెలుసుకునే నిశ్శబ్ద భాష ఏర్పడేలా చేస్తుందనేది నిపుణుల అభిప్రాయం.

పాప విషయంలో... పొరపాటు జరిగిందా?

మా అమ్మాయి డిగ్రీ చదువుతోంది. ఈ మధ్య మూడు నెలలు నెలసరి రాకపోయేసరికి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లా. ఆవిడ కొన్ని పరీక్షలతోపాటు ప్రెగ్నెన్సీ టెస్ట్ కూడా చేశారు. ఇది సాధారణమేనా? పాప విషయంలో ఏదైనా పొరపాటు జరిగిందా? భయంగా ఉంది. సందేహం తీర్చండి. – ఓ సోదరి

నెలసరి సరిగ్గా రాకపోవడం... ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా చాలామందిలో కనిపిస్తోన్న సమస్య. దీనికి రకరకాల కారణాలున్నాయి. ప్రధాన ఇబ్బంది అంటే మన జీవనశైలిలో మార్పులే. మన శరీరంలో జీవక్రియలు సరిగ్గా జరిగేలా చేసే 'బయో ఫీడ్‌బ్యాక్ మెకానిజమ్' ఉంటుంది. ఒకరకంగా మనల్ని ఆరోగ్యంగా నడిపించడానికి ఎంత మొత్తం పోషకాలు, నిద్ర, ఎండ వేడి... వంటివి కావాలో చెప్పే ఒక సిస్టమ్ అన్నమాట. ఇది పగలు, రాత్రి... ఇంత శక్తి ఖర్చయ్యింది, ఇన్ని పోషకాలు అందాయి, ఇది విశ్రాంతి సమయం అని మనకు గుర్తు చేస్తూ ఉంటుంది. ఆహార, నిద్ర వేళలు పాటించకపోవడం, వ్యాయామాన్ని పక్కన పెట్టడం, ఒత్తిడి, గ్యాడ్జెట్లతో అతిగా గడపడం, జంక్‌ఫుడ్ తినడం, ఎండలోకి వెళ్లకపోవడం... వంటివన్నీ చేస్తూ ఈ సిస్టమ్‌ని మనం తికమకకి గురిచేస్తున్నాం. ఫలితమే నెలసరి, గర్భధారణ సమస్యలు. మీ అమ్మాయి టీనేజర్ కదా! జీవనశైలి లోపాలు వీళ్లలో మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాబట్టి, సమస్య వచ్చుండొచ్చు. ఇక ఈతరం పాశ్చాత్య ధోరణులను ఎక్కువగా అందిపుచ్చుకుంటోంది. అందుకనే కాకపోయినా... ఒక్కోసారి గర్భాశయంలో కొన్నిరకాల ట్యూమర్లు వస్తుంటాయి. వాటి కారణంగా ప్రెగ్నెన్సీలో విడుదలయ్యే బీటా హెచ్‌సీజీ హార్మోను ఈ సమయంలోనూ విడుదలవుతుంది. దాన్ని రూఢీ చేసుకోవడానికీ ప్రెగ్నెన్సీ టెస్ట్ తప్పనిసరి. ఎంతైనా తల్లి కాబట్టి, మీకు ఆ భయం ఉంటుంది. అయితే ఇదీ తప్పక చేయాల్సిన పరీక్షల్లో ఒకటే! కంగారు పడకండి.

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్



బంగారం - వెండి

27న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,29,900	1,17,500	1,66,854
విజయవాడ	1,25,710	1,17,100	1,66,100
ప్రొద్దుటూరు	1,25,500	1,15,460	1,67,200
రాజమహేంద్రవరం	1,27,750	1,17,100	1,80,000
విశాఖపట్నం	1,27,290	1,17,100	1,70,000
తమిళనాడు	-----	1,17,700	1,80,000

మీరేం ఆలోచిస్తున్నారు?

'ఛ... నిన్న అలా మాట్లాడాల్సింది కాదు', 'సాయంత్రం వర్షం పడితే ఎలా?', 'పాపకి జ్వరం వస్తుందేమో'... ఇలా ఎన్నో సందర్భాల్లో ఆలోచిస్తుంటాం కదా! అలాకాకుండా ఎప్పుడైనా ఇలా ఆలోచించారా? మన చేతుల్లో లేనివాటి గురించి ఆలోచించడం వృథా, మనసు భారం అవ్వడం మినహా ఏమీ ఉండదని! సహజంగానే అమ్మాయిలకు అతిగా ఆలోచిస్తారన్న ట్యాగ్ ఉంటూనే ఉంటుంది. ఏం చేస్తాం అదో అలవాటు అని కొట్టేయకండి. ఎందుకంటే ఈ చిన్న ఆలోచనతోనే గడిపేయడం వల్ల మన శ్రమంతా వృథా అవుతోంది మరి!



చీకట్లో వెళ్తున్నాం. టార్చ్‌లైట్ తీసుకెళతాం కదా! వెళ్లే దారిలో వేస్తామా... లేదంటే ఎటో లైట్ వేస్తూ మరోదారిలో వెళతామా? నడిచే మార్గం కనిపించడానికే వాడతాం కదా! ఆలోచనలూ ఫ్లాష్‌లైట్ లాంటివే! నిన్న జరిగిపోయిన, మన చేతిలో లేని వాటి గురించి ఆలోచించడం వల్ల లాభమేం ఉండదు. ఒక అధ్యయనం ప్రకారం మనం ఎక్కువగా కంగారుపడేది 90 శాతం నిజానికి జరిగిపోయిన, మన చేతుల్లో లేనివాటి గురించేనట. దీంతో శక్తి మొత్తం అక్కడే కరిగిపోయి అలసిపోతాం. కొత్త ఆలోచనలకు అడ్డుకట్ట పడుతుంది. అప్పుడు చదువైనా కెరియర్‌లో అయినా ముందుకెలా వెళ్లగలం? కాబట్టి, ఈసారి ఏదైనా ఆలోచన చుట్టుముడుతున్నా, కంగారు పెడుతున్నా... ఒక కాగితం మీద రెండు వృత్తాలు గీయండి. తొలిదానిలో ఆ విషయానికి సంబంధించి నేను చేయగలిగినవి, మరోదానిలో నా చేతిలో లేనివి అని రాసుకోండి. ఆపై రెండోదాన్ని వదిలి మొదటి దానిపైనే దృష్టిపెడితే సరి. ఫలితాలు మెరుగవుతాయి. కాబట్టి, మీ ఫ్లాష్ లైట్... అదే నండీ ఆలోచనలు ఎక్కడ కేంద్రీకరిస్తున్నారో అప్పుడప్పుడూ గమనించుకోండి. వాటి దిశ మార్చుకోండి. అప్పుడే ఆందోళనలూ దరిచేరవు, మనమూ ముందుకూ సాగగలరు. గమనించుకుంటారుగా మరి?



> బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) రంగాల్లోని ప్రాథమిక స్థాయి ఉద్యోగుల్లో 60 శాతం మంది మహిళలే. వాళ్లలో నాయకత్వ స్థానాలకు చేరుతున్నది మాత్రం 16 శాతం. నైపుణ్యాల కొరత, ప్రోత్సాహం లేకపోవడం, సామాజిక అంశాలు, ఆత్మవిశ్వాస లేమి ఇందుకు ప్రధాన కారణాలు. తలుపులు తెరవడమే కాదు, లోపల నుంచి ఆహ్వానం అందినప్పుడే మార్పు వస్తుంది.
>
> – ఈమా అజీమ్, సహ- వ్యవస్థాపకురాలు, విమెన్ ఇన్ ఇన్సూరెన్స్- ఇండియా

సంకల్ప బలం ఉండాలే కానీ, శారీరక వైకల్యం ఏమాత్రం అడ్డుకాదని నిరూపిస్తోంది కవితా దలై. తనకున్న లోపాలను దాటుకుంటూ ముందుకు సాగింది. పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధించొచ్చనీ చాటి చెబుతోంది. ఫలితం... జాతీయ స్థాయి పారా అథ్లెట్‌గా స్విమ్మింగ్‌లో ఆమె బంగారు పతకాన్ని గెలుచుకుంది.

పారా స్విమ్మర్... జాతీయ విన్నర్..!



కవిత

కవితా దలై... ఒడిశాలోని గంజాం జిల్లాలోని గిరియా గ్రామంలో పుట్టి పెరిగిందీమె. అమ్మ నర్మద, నాన్న స్వరాజ్. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతిలోనే చదువు మానేసింది. దాంతో క్రీడల్లో రాణించాలనుకుంది. స్విమ్మింగ్‌తో పాటు, హ్యాండ్ బాల్‌లో తనకున్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలనుకుంది. శిక్షణ కోసం 2019లో గంజాం నుంచి భువనేశ్వర్ వెళ్లింది. వెళ్లిన కొద్దిరోజులకే 'ఇంటి నుంచి తెచ్చుకున్న కొంచెం డబ్బు ఖర్చు అయిపోయింది. కనీస అవసరాలకూ కష్టం అవ్వడంతో ఓ బట్టలకొట్టులో పనికి కుదురుకుని జీవనం సాగించా. షాపు నుంచి వచ్చిన తర్వాత కళింగ స్టేడియంలో హ్యాండ్ బాల్, స్విమ్మింగ్ ప్రాక్టీస్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ఉచితంగా శిక్షణ ఇచ్చేవారు. అది నాకెంతో ఉపయోగపడింద'ంటోంది కవిత.

ఏడేళ్ల కల...

గొప్ప క్రీడాకారిణి కావాలనే లక్ష్యంతో ఐదేళ్లపాటు బట్టల కొట్టులో పనిచేసిన కవిత జాతీయస్థాయిలో తొమ్మిది పతకాలు... 2023-24లో గ్వాలియర్‌లో మూడు రజతాలూ, 2024లో రెండు రజతాలూ, ఒక కాంస్య పతకాన్నీ గెలుచుకుంది. 2025లో హైదరాబాద్‌లో ఒక పసిడి పతకం, రెండు రజతాలనూ సొంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలోనూ పతకాలు గెలిచినా... ఇంకా అదే దుకాణంలో పని చేస్తోందీమె. ఇందుకు తన సోదరుల్లో ఒకరైన రింకూ ప్రధాన్ ఆటే స్ఫూర్తి అంటుందీమె. 'నాలో లోపం ఉందని నేనెప్పుడూ బాధ పడలేదు. ఎందుకంటే నాకంటే కష్టమైన పరిస్థితుల్లో చాలామంది జీవిస్తున్నారు. వాళ్లకి నేను స్ఫూర్తిగా నిలిచి వాళ్లలో ధైర్యం నింపాలనుకుంటున్నా. అందుకే ఎన్ని కష్టాలొచ్చినా వెనకడుగు వేయలేదు. భవిష్యత్తులో ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని పతకాలు సాధించడమే లక్ష్య'మంటోంది కవిత.

డెనిమ్ ప్యాంటు కాదు... చీర

నేటి ఫ్యాషన్



ఫ్యాషన్ ట్రెండ్స్ వస్తాయి, పోతాయి. కానీ కొన్నుంటాయి... అవి మాత్రం ఎప్పటికీ పాతబడవు. అలాంటి కోవలోకే వస్తుంది చీర. ఊహ తెలిసినప్పట్నుంచీ ప్రతి అమ్మాయి... అమ్మ వార్డ్‌రోబ్‌లోని చీరలపై మనసు పారేసుకుంటూనే ఉంటుంది. దానికి ఈ తరం అమ్మాయిలూ అతీతం కాదు. ఇప్పటి జెన్ జీ తరాన్నే తీసుకోండి. అమ్మో ఫాస్ట్ అనుకుంటామా? వాళ్లు మాత్రం పనిలో ఆలోచనల్లో వేగాన్ని ప్రదర్శిస్తున్నా... జీవనశైలి, కట్టూబొట్టూ విషయంలో మాత్రం పాత విధానాలనే ఇష్టపడుతున్నారు. పైగా ఇప్పుడు వాళ్లు అలా వచ్చి ఇలా పోయే ఫ్యాషన్లను ఇష్టపడట్లేదు. సౌకర్యంతోపాటు సంప్రదాయానికీ ప్రాధాన్యం ఇస్తున్నారు. కాబట్టే, వాళ్ల ఎవర్‌గ్రీన్ ఫ్యాషన్ జాబితాలోకి చీర తప్పక చేరిపోతోంది. ఫెస్ట్‌లు, కాలేజ్ ఫ్యాషన్‌లు షోలు అంతెందుకు, రోజువారీ ఫ్యాషన్‌లోనూ వాళ్ల ఓటు చీరకే పడుతోంది. అలాగని 'యువతరం అమ్మమ్మలు, బామ్మలు' అనిపించుకోలేరుగా! అందుకే తమదైన స్టైల్ జోడిస్తున్నారు. అలా వాళ్లు మనసు పడుతున్న వాటిల్లోకి 'డెనిమ్ చీర'లు వచ్చేశాయి. నేటి అమ్మాయిల కంఫర్ట్ స్టైల్ ఏంటి? సింపుల్ డెనిమ్ జీన్స్, టీషర్ట్ లేదంటే కుర్తీ... అంతేగా! తమకి సౌకర్యాన్నిచ్చే దానికే సంప్రదాయాన్నీ, కాస్త స్టైల్‌నీ అద్దేద్దామనుకున్నట్టున్నారు అందుకే ఇలా సిద్ధమైపోతున్నారు. నిజానికి డెనిమ్ చీర పాత ఫ్యాషనే! వీళ్లు మాత్రం కొత్తగా... మెత్తగా, సౌకర్యంగా ఉండేలా విస్కోస్, మల్ వంటి మిక్స్‌డ్ నేతరకాలని ఎంచుకుంటున్నారు. వాటిల్లోనూ ప్రి స్టిచ్‌డ్ వాటికి మరింత ప్రాధాన్యమిస్తున్నారు. రిబ్బన్, ముత్యాలు, ఎంబ్రాయిడరీని జోడిస్తున్నవీ బోలెడే! ధోతీ, స్కర్ట్, లెహెంగా, రఫుల్... చెప్పుకొంటూ వెళ్లాలే కానీ ఎంచుకోవడానికీ ఎన్నో స్టైళ్లు. అందుకే తెగ ముచ్చటపడి కొనేసుకుంటున్నారు. పెళ్లి వేడుకల్లోనూ, ఫొటోషూట్లలోనూ చోటిస్తున్నారు. మరి మీ సంగతేంటి? మీకూ నచ్చాయా ఈ డెనిమ్ చీరలు? ఇంకేం ప్రయత్నించేయండి. ఇంతకీ వీటిల్లో మీ ఎంపికేది మరి!





‘స్క్రబ్ టైఫస్’తో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

స్క్రబ్ టైఫస్ బారిన పడినవారికి సాధారణ యాంటీబయాటిక్స్‌తో వ్యాధి నయమయ్యే అవకాశం ఉంది. కానీ అవగాహన లేక, సకాలంలో గుర్తించలేకపోవడంతో సమస్య వస్తోంది. జ్వరం ఎంతకీ తగ్గకపోతే మలేరియా, టైఫాయిడ్, డెంగీ అనే అనుమానంతో నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇలాంటి అనారోగ్య పరిస్థితుల్లో శరీరంపై నల్లని మచ్చలు, దద్దుర్లు కనిపిస్తే ఆలస్యం చేయకుండా స్క్రబ్ టైఫస్ అనుమానిత ఎలిసా పరీక్ష చేయించుకోవడం మేలని వైద్యులు సూచిస్తున్నారు.

పరీక్షలు చేరువైతే..

స్క్రబ్ టైఫస్ పీడితులకు సకాలంలో చికిత్స అందిస్తే మరణాల రేటు 2% లోపు ఉంటుంది. సకాలంలో చికిత్స అందకపోతే రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదముంది. పరిస్థితి తీవ్రతను బట్టి మరణాల రేటు 6-30% వరకు నమోదు కావొచ్చు. రాష్ట్రంలో ఇన్‌ఫెక్షన్లు గుర్తించే పరీక్షలు కొన్ని ప్రధాన ఆసుపత్రుల్లోనే ఉండడం వల్ల ఈ కేసులు పెద్దగా వెలుగులోకి రావడంలేదు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి లాంటి ప్రధాన ఆసుపత్రుల్లో ల్యాబ్‌లలో అనుమానిత పరీక్షలు చేస్తున్నారు. ఇవికాక పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు 17 జిల్లాల్లోనే ఉన్నాయి. అనుమానిత కేసులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా రావడంతో.. నమూనాల సేకరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేస్తే ఫలితం ఉంటుంది.

ఈ ఆరు నెలలు జాగ్రత్త

స్క్రబ్ టైఫస్ కీటకాల తాకిడి ఆగస్టు నుంచి ఫిబ్రవరి మధ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కాలంలో ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మనుషుల నుంచి మనుషులకు ఈ ఇన్‌ఫెక్షన్ సోకకపోయినా, కీటకం కాటుకు గురైన వ్యక్తి అస్వస్థతకు గురవుతారు. అందుకే తగిన జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

■ తడి నేలలు, పొదలు, తోటలు, పొలాలు, పశువుల పాకలు, వ్యర్థాలు పోగుచేసే ప్రాంతాల్లో పనిచేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలి. పూర్తి చేతులున్న చొక్కా, ప్యాంట్లు, కాలికి సాక్సులు, బూట్లు ధరించాలి.

■ ఇళ్లలో పాత మంచాలు, పరుపులు, దిండ్లలోకి ఈ కీటకాలు చొరబడే అవకాశం ఉన్నందున వాటిని మార్చాలి. లేదంటే శుభ్రం చేశాకే వాడాలి.

■ పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున, కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేసి, జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరుబయట ఆటలాడే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలి.

పంచాయతీల విభజనకు పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

తొలగించాలని ప్రభుత్వానికి ఈ ఏడాది అక్టోబరు 22న లేఖ రాశారు. స్థానిక ఎన్నికలకు ముందు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తుంటారు. కమిషనర్ లేఖపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది.

■ ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం ఒక పంచాయతీని రెండుగా చేయడం, ఒక పంచాయతీలో గ్రామాలను మరో పంచాయతీలో కలపడం, రెండు పంచాయతీలను విలీనం చేయడం, పంచాయతీలను సమీప పుర, నగరపాలక సంస్థల్లో కలపడం వంటివి చేస్తారు. ఇందుకోసం పాలకవర్గ సభ్యులు తీర్మానాలు చేయాలి.

■ మార్పులు, చేర్పులను ఆ మండల పరిధి వరకే అనుమతిస్తారు. పంచాయతీలు, వాటి పరిధిలోని గ్రామాలను పక్క మండలాల్లో చేర్చడానికి వీల్లేదు. పాలకవర్గం లేని పంచాయతీల్లో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు ఆమోదించాలి.

■ పంచాయతీల్లో చేసిన తీర్మానాలను సంబంధిత జిల్లా కలెక్టర్లు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయానికి అందజేస్తారు. ఇవి పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆమోదానికి వెళ్తాయి.



ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



ఆలయ విస్తరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు ఆనం, మనోహర్, నారాయణ, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, తితిదే బోర్డు సభ్యులు తదితరులు

శ్రీవారికి అప్రతిష్ఠ కలిగే ఏ పనీ చేయను.. చేయనివ్వను

(మొదటి పేజీ తరువాయి)

వెళ్తా. అక్కడ సామాన్యుడిగా ఉండాలనేదే నా భావన. కొంతమంది తప్పులు చేసి వేరే జన్మలో శిక్ష పడుతుందనుకుంటారు. కానీ, వేంకటేశ్వర స్వామి తప్పు చేసిన వారిని ఈ జన్మలోనే శిక్షిస్తారు. పాలకమండలి సభ్యులు, ఉద్యోగులు, అర్చకులు, అక్కడికెళ్లిన వారెవరైనా ఇది గుర్తుపెట్టుకోవాలి. తిరుమల పవిత్రతను స్వామే కాపాడుకుంటారు’ అని తెలిపారు.

స్వామి కృపతోనే రాజధానికి అమరావతి పేరు

‘2019లో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించాం. కృష్ణా నది ఒడ్డున 25 ఎకరాలు కేటాయించాం. స్వామి కృపతోనే రాజధానికి అమరావతిగా పేరు పెట్టాం. దేవతల రాజధాని అమరావతి ఎలా ఉంటుందో ఆ నమూనాగా మన అమరావతి ఉండాలని వేంకటేశ్వరస్వామిని కోరుతున్నా’ అని సీఎం పేర్కొన్నారు. ‘‘వైకాపా ప్రభుత్వం విధ్వంసం తప్ప ఏమీ చేయలేదు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ఐదేళ్లు నరకం చూపించారు. రైతులు శ్రీవారిని నమ్ముకొని ‘న్యాయస్థానం నుంచి దేవస్థానం’ పేరుతో పాదయాత్ర చేసి అమరావతిని కాపాడుకోవడానికి అనునిత్యం పనిచేశారు. వారికి అభినందనలు, కృతజ్ఞతలు’ అని తెలిపారు. 2003లో పేలుళ్ల నుంచి వేంకటేశ్వర స్వామే తనకు ప్రాణభిక్ష పెట్టారని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ‘శ్రీవారి సన్నిధిలో నిత్య అన్నప్రసాదం, ప్రాణదానం వంటి పథకాలతో పాటు ‘శ్రీవారి సేవ’ కార్యక్రమాన్ని ప్రారంభించాం. శ్రీవారి సేవలో నేడు స్వచ్ఛందంగా వేల మంది సేవలందిస్తున్నారు. అదే స్ఫూర్తితో అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నాం. ఇందుకు భక్తులు ముందుకు రావాలి. ముంబయిలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చింది’ అని తెలిపారు.

వైభవంగా ఆలయ విస్తరణ పనులకు భూమిపూజ

రాజధాని పరిధిలోని వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున వచ్చిన భక్తుల సమక్షంలో సీఎం చంద్రబాబు గురువారం భూమిపూజ చేశారు. తిరుమల నుంచి వచ్చిన వేదపండితులు, అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ ద్వితీయ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురంతో పాటు మరో 3 గోపురాలు, ఆర్జిత సేవా, వాహన, రథ మండపాలు, పంచముఖ ఆంజనేయస్వామి వారి విగ్రహం, పుష్కరిణి సహా పలు పనులకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు.

ఆలయ ప్రాంగణంలో పూజలను వీక్షించేందుకు భారీ వేదికను ఏర్పాటు చేశారు. శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాల్ని యాగశాలలో ఉంచి ప్రత్యేక పూజలు, కైంకర్యాలు నిర్వహించారు. చతుర్వేద పారాయణం, నివేదన, దివ్య సమర్పణ, హోమం తదితర క్రతువులు నిర్వహించారు. పూర్ణాహుతి క్రతువులో చంద్రబాబు, మంత్రులు, తితిదే బోర్డు సభ్యులు పాల్గొన్నారు. యాగశాల నుంచి చంద్రబాబు ఊరేగింపుగా వెళ్లి శంకుస్థాపన చేశారు. ఆలయ బృహత్ ప్రణాళికపై అధికారులు, ఇంజినీర్లకు సూచనలు చేశారు. ప్రధాన ఆలయంలోని స్వామిని దర్శించుకొన్నారు. ఆలయం వెలుపల ప్రజాప్రతినిధులు, అర్చక బృందంతో సీఎం గ్రూప్ ఫొటోలు దిగారు. వేడుకలో కేంద్ర మంత్రి పెమ్మసాని



ఆలయంలో జరిగిన పూజలో సీఎం చంద్రబాబు. చిత్రంలో భారత్ బయోటెక్ ఎండీ, తితిదే బోర్డు సభ్యురాలు సుచిత్రా ఎల్ల, తితిదే బోర్డు సభ్యులు నరేశ్‌కుమార్, భానుప్రకాశ్‌రెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎంఎస్ రాజు

చంద్రశేఖర్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ, నాదెండ్ల మనోహర్, తితిదే బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, తితిదే పాలకమండలి సభ్యులు సుచిత్ర ఎల్ల, పనబాక లక్ష్మి, ఎంఎస్ రాజు, జ్యోతుల నెహ్రూ, నన్నూరి నర్సిరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో విస్తరించేలా భవన నిర్మాణ ప్రణాళికలు

భక్తుల వసతికి 50 కాటేజీలు ● కృష్ణమ్మకు నిత్య హారతి ఇచ్చేలా ఏర్పాట్లు

అమరావతిలోని శ్రీవేంకటేశ్వర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై సీఎం సూచనలు

ఈనాడు, అమరావతి: ‘ప్రస్తుతం వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాదం అందించేలా భవనం నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో 20 వేల మందికి సరిపోయేలా విస్తరించే ప్రణాళిక ఉండాలి. అందుకు తగినట్లే ఫౌండేషన్ పనులు చేపట్టాలి. అన్ని నిర్మాణాల్లోనూ ఇదే విధానం అవలంబించాలి’ అని సీఎం చంద్రబాబు సూచించారు. క్లీన్, గ్రీన్, హైజినిక్.. మోడల్ ఉండాలని పేర్కొన్నారు. నిర్మాణాల్లో ఆధ్యాత్మికత కనిపించాలని, రాజధానికి ఆలయం అదనపు ఆకర్షణ కావాలన్నారు. అమరావతిలోని వెంకటపాలెం వద్ద తితిదే వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి.. అధికారులకు సూచనలు చేశారు. అవి..

■ 2 దశల్లో పనులు చేస్తామనే ప్రతిపాదన వద్దు. అన్నీ ఒకే దశలో, ఒకేసారి చేపట్టాలి.

■ తిరుమల ఆలయ తరహాలోనే నిర్మాణాలుండాలి. అదీ వాస్తు పరిమితి మేరకే చేపట్టాలి.

■ కృష్ణా నదికి అభిముఖంగా 2 ఎకరాల్లో 50 కాటేజీలు నిర్మించాలి.

■ పూజలు, భజనలు నిత్యం ఉండాలి. ఆలయం పక్కనున్న కృష్ణా నదిలో సాయంత్రం కృష్ణమ్మ హారతి ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయండి.

110 అడుగుల ఎత్తున మహా రాజగోపురం

■ తూర్పు వైపు 110 అడుగుల ఎత్తున 7 అంతస్తుల్లో మహా రాజగోపురం, మిగతా 3 వైపులా 60 అడుగుల ఎత్తుతో ఐదేసి అంతస్తుల్లో మరో 3 రాజగోపురాలు నిర్మిస్తారు.

■ కల్యాణ మండపం, అద్దాల మండపం, వాహన, రథ, ఆర్జిత సేవా మండపాలు, పుష్కరిణి తదితరాలు నిర్మించనున్నారు.

■ వీటికి గుత్తేదార్ల ఎంపిక పూర్తయింది. పనులు వెంటనే మొదలు కానున్నాయి.

మాస్టర్ ప్లాన్‌లో నిర్మాణాలివి..

■ ఆలయ ప్రాంగణంలో చేపట్టే నిర్మాణాలను ఆర్కిటెక్ సంస్థ ఇంజినీయస్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సీఎంకు వివరించారు.

■ ధ్యాన మందిరాన్ని గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో కలిపి నిర్మిస్తారు. ఇందులో ఎగ్జిబిషన్స్ హాల్స్ ఉంటాయి.

■ భవిష్యత్తులో విస్తరించేలా డైనింగ్ హాల్, కిచెన్ కాంప్లెక్స్ నిర్మాణం.

■ హెల్ప్ డెస్క్, కల్యాణ కట్ట, డార్మెటరీలు, లాక్ రూమ్, 3వెయిటింగ్ హాల్స్.

■ అడ్మినిస్ట్రేటివ్ భవనంలో రిజిస్ట్రేషన్ కౌంటర్లు, సిబ్బందికి గదులు, ప్రథమ చికిత్స గది. ■ 12 అర్చకుల క్వార్టర్లు, 12 సిబ్బంది క్వార్టర్లు. ■ 2 వీవీఐపీల సూట్స్, 3 వీఐపీ సూట్స్, డైనింగ్ హాల్, సమావేశ గది, ఏసీ సదుపాయంతో 20 గదులు, వీఐపీ లాబీ, కిచెన్, ప్యాంట్రీ, రిసెప్షన్ తదితరాలతో కలిపి రెస్ట్‌హౌస్. ■ 8 ప్రసాదం కౌంటర్లు. 3 ఎకరాల్లో ప్రకాశ్ ఉద్యానం. అందులో లేజర్ షో ఏర్పాట్లు. ■ ప్రహరీ, అంతర్గత రహదారులు, ప్రధాన ముఖద్వారం నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ■ సీఎం సూచనల మేరకు ప్లాన్‌లో కొన్ని మార్పులు చేయనున్నారు.

రాజధానికి కళ వచ్చింది

– నాగుల్‌మీరా, రైతుకూలీ, తాడికొండ



శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి రావడం సంతోషంగా ఉంది. ఈ గుడి నిర్మాణంతో రాజధానికే కళ వచ్చింది. కూటమి ప్రభుత్వం చేపట్టిన విస్తరణ పనులు పూర్తయితే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధిని చూస్తున్నాం.

చంద్రబాబుతోనే అభివృద్ధి

–షేక్ షమ్మి, వడ్డేశ్వరం, మంగళగిరి మండలం



వైకాపా పాలనలో రాజధాని నిర్మానుష్యంగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులతో కళకళలాడుతోంది. చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న నమ్మకం ఉంది. మా పిల్లలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉద్యోగాలు వస్తాయన్న భరోసా కలుగుతోంది.

అభివృద్ధికి కులమతాలతో పనిలేదు

–కె.రోజీమేరీ, వ్యవసాయ కూలీ, పెదపరిమి, తుళ్లూరు మండలం



అభివృద్ధి పనులకు కుల మతాలతో పని లేదు. అందుకే శ్రీవేంకటేశ్వర ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చా. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల జీవితాల్లో మార్పు వచ్చింది. అందరికీ ఉపాధి లభిస్తుందన్న నమ్మకం కలుగుతోంది.

తిరుపతిలో శ్రీవారి వైద్య సేవకులు

స్థానిక ఆసుపత్రుల్లో నిపుణులతో సేవలందించే ఏర్పాటు

● పుట్టపర్తిలో మాదిరిగా వారిని ఆహ్వానించాలన్న సీఎం

ఈనాడు, అమరావతి: వైద్య నారాయణులకు ఆ నారాయణుడి చెంత వైద్య సేవ చేసే అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తిరుపతిలోని ప్రధాన ఆసుపత్రులైన స్విమ్స్, రుయా, బర్డ్‌లలో వైద్యసేవలు అందించేందుకు అత్యుత్తమ వైద్యనిపుణులైన డాక్టర్లను శ్రీవారి సేవకులుగా ఆహ్వానించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పుట్టపర్తి సత్యసాయి ఆసుపత్రుల తరహాలోనే దీనిని చేపట్టాలని తెలిపారు. తితిదే ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచం నలుచెరగులా చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధ్యాత్మికం, అన్నదానం, విద్య, వైద్యానికి తితిదే చిరునామాగా మారాలని సూచించారు. సీఎం గురువారం దేవాదాయశాఖ, తితిదేలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు వేగంగా దర్శనాలు జరిగేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. భక్తుల రద్దీ మేనేజ్‌మెంట్ కోసం సాంకేతికతను వినియోగించుకోవాలని, తితిదే పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్‌లోకి తీసుకొచ్చి, భక్తులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

అన్ని తితిదే ఆలయాల్లో నిత్యాన్నదానం

■ వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పక్కాగా చేయాలి. వీలైనంత ఎక్కువమంది దర్శనాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

■ ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలి. అన్ని భాషల్లో రిజిస్ట్రేషన్ వెసులుబాటు కల్పించాలి.

■ అత్యవసర పరిస్థితి తలెత్తితే భక్తులను వేగంగా ఆసుపత్రులకు తరలించేలా ఏర్పాట్లు ఉండాలి.

■ తితిదే ఆధ్వర్యంలో నడిచే అన్ని ఆలయాల్లో నిత్యాన్నదానం ఏర్పాటుచేయాలి.

కొత్త ఆలయాల నిర్మాణాన్ని బోర్డు సభ్యులతో పర్యవేక్షణ

■ రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న ఐదు వేల ఆలయాలను రీడిజైన్ చేయండి. వాటిలో ఆధ్యాత్మికత, ప్రశాంతత ఉట్టిపడేలా ప్రణాళిక ఉండాలి.

■ వీటి నిర్మాణాన్ని తితిదే పాలకమండలి సభ్యుల కమిటీ పర్యవేక్షించాలి.

■ పురాతన ఆలయాల జీర్ణోద్ధరణపై కార్యాచరణ చేపట్టాలి.

■ మన దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు, విదేశాల్లో నిర్మించే ప్రతి ఆలయం తితిదే ప్రధాన ఆలయానికి అనుసంధానం కావాలి.

■ శ్రీవారి ధనానికి, ఆస్తులకు జవాబుదారీగా ఉండాలి. దుర్వినియోగానికి చోటు ఉండకూడదు.

■ తిరుమలలో అనుసరించే అత్యుత్తమ విధానాలను దేవాదాయశాఖలోని ప్రధాన ఆలయాల్లో అమలు చేయాలి.

అస్సాం సీఎంతో నేనే మాట్లాడతా

వివిధ రాష్ట్రాల్లో తితిదే కొత్తగా ఎనిమిది ఆలయాలు నిర్మిస్తున్నట్లు అధికారులు సీఎంకి వివరించారు. కోయంబత్తూరులో ఆలయ నిర్మాణానికి ఓ భక్తుడు ముందుకొచ్చారని తెలిపారు. అస్సాంలో తితిదే ఆలయ నిర్మాణానికి ఆ రాష్ట్ర సీఎం 10 ఎకరాలు కేటాయించారని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు.. తాను మాట్లాడి మరింత స్థలాన్ని కేటాయించాలని కోరతానని తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో నిమిషానికి 80 మంది భక్తులు చొప్పున దర్శనాలు చేసుకుంటున్నారని అధికారులు చెప్పారు. పండుగలు, ప్రత్యేక సమయాల్లో సాధారణ భక్తులకే పెద్దపీట వేస్తున్నామని వివరించారు. లడ్డూ నాణ్యత పెంచామని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వెంకయ్యచౌదరి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, తితిదే పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లకు ముందస్తు బెయిలివ్వొద్దు

హైకోర్టులో చెవిరెడ్డి అనుబంధ పిటిషన్లు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అప్రూవర్లుగా మారతామనే కారణంతో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ నిందితులు, ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి(ఏ-2), ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్(ఏ-3) హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాలలో ఇదే కేసులో నిందితుడు, వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుబంధ పిటిషన్లు దాఖలుచేశారు. తనను ప్రతివాదిగా చేర్చుకొని వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. వారిరువురికి ముందస్తు బెయిలివ్వొద్దని అభ్యర్థించారు. అప్రూవర్లుగా మారతామని చెప్పి ముందస్తు బెయిలుపై వారు బయటకొస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. అప్రూవర్లుగా మారేందుకు అవకాశం ఇస్తే దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. నిందితులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై శుక్రవారం హైకోర్టు విచారణ జరపనుంది.

టెక్ భారత్ సాకారం!

(మొదటి పేజీ తరువాయి)

రాకెట్ విడిభాగాలను సైకిల్‌పై తీసుకెళ్లిన రోజుల నుంచి ఎంతో విశ్వసనీయమైన ప్రయోగ వాహకాన్ని (లాంచ్ వెహికల్) రూపొందించిన ఘనత సాధించాం. అంతరిక్ష సేవల రంగంలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించాం. అంకుర సంస్థలు ఇస్రో సదుపాయాలను, సాంకేతికతను వినియోగించుకునే అవకాశం కల్పించాం. కేవలం 6-7 ఏళ్లలోనే బహుముఖంగా విస్తరించిన మన అంతరిక్ష రంగం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. చిన్న ఉపగ్రహాలకు గిరాకీ పెరుగుతోంది. దీనివల్ల ఎన్నో దేశాలు మనవైపు చూస్తున్నాయి. ఉపగ్రహ ప్రయోగాలూ పెరుగుతున్నాయి. అంతరిక్షం ఇప్పుడు వ్యూహాత్మక ఆస్తి. వచ్చే కొద్ది రోజుల్లోనే ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఎన్నో రెట్లు పెరుగుతుంది. ఇది మన యువతకు గొప్ప అవకాశం. భారత అంతరిక్ష రంగ స్టార్టప్‌ల నుంచి త్వరలో ఐదు యూనికార్న్‌లు వస్తాయనే నమ్మకముంది.

అణు విద్యుత్‌లోనూ సంస్కరణలు: అంతరిక్ష సేవల్లో ప్రైవేటు రంగానికి తలుపులు తెరిచినట్లుగానే అణు విద్యుత్తు రంగంలోనూ అవకాశం కల్పించనున్నాం. దీనివల్ల స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు, అడ్వాన్స్‌డ్ రియాక్టర్ల ఉత్పత్తి, అణు సాంకేతిక పరిజ్ఞానం విస్తృతికి వీలుకలుగుతుంది. ఇంధన భద్రత లభిస్తుంది. సెమీకండక్టర్ రంగంలోనూ ఇదేవిధంగా విస్తరిస్తున్నాం. యువతను శాస్త్ర ప్రయోగాల వైపు మళ్లించే లక్ష్యంతో ‘నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్’ను స్థాపించాం. పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలకు రూ.1 లక్ష కోట్లతో నిధి ఏర్పాటు చేశాం. ఇప్పటికే 10,000 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ప్రారంభించాం. త్వరలో మరో 50,000 ల్యాబ్‌లు నెలకొల్పుతాం”అని వెల్లడించారు.

“స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులైన పవన్ కుమార్ చందన, నాగ భరత్‌లు మన యువతలో దాగున్న అద్భుత ప్రతిభ, పట్టుదలకు ప్రతిరూపాలు”

– కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఏటా 50 ప్రయోగాలు

– ఇన్–స్పేస్ ఛైర్మన్ పవన్ కుమార్ గోయెంకా

ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించగలిగే సత్తా భారత్‌కు ఉంది. ఒక వారం శ్రీహరికోట నుంచి, మరో వారం తమిళనాడులోని కులశేఖర పట్టణంలోని ప్రయోగశాల నుంచి వీటిని నిర్వహించేందుకు వీలుంది. ఇస్రోకు చెందిన చిన్న ఉపగ్రహ వాహకనౌక (ఎస్ఎస్ఎల్‌వీ)కు 20 ప్రయోగాలకు ఆర్డర్లు వచ్చాయి. ఏటా 50 ప్రయోగాలంటే కనీసం 50 బహుళ పేలోడ్లు కలిగిన 50 ఉపగ్రహాలు నింగిలోకి వెళతాయి. దీనిద్వారా ఒక వ్యవస్థ వృద్ధి చెందుతుంది. తద్వారా చిన్న ఉపగ్రహాల తయారీ, ప్రయోగంలో భారత్... గ్లోబల్ హబ్‌గా ఎదుగుతుంది. అంతరిక్ష రంగానికి సంబంధించి దార్శనికతను ప్రదర్శించిన భరత్, పవన్‌లకు, ఈ సంస్థకు నిధులు సమకూర్చిన ముకేశ్ బన్సల్, గ్రీన్‌కోకు చెందిన అనిల్, మహేశ్‌లకు అభినందనలు.

విజయంపై విశ్వాసముంది

– ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్.సోమనాథ్

జీఎస్ఎల్‌వీ మార్క్-3 ప్రాజెక్టులో ఉన్నప్పుడు నా బృందంలో పవన్ సభ్యుడిగా ఉన్నారు. నాడు మా ఇద్దరి మధ్య మొదలైన బంధం ఇక్కడి వరకూ చేరుకుంది. అంతరిక్ష రంగంలో సంస్కరణలను ఇన్-స్పేస్ వేగవంతం చేసింది. విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా పనిచేస్తుందని పూర్తి భరోసా నాకు కలిగింది.



స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభ వేదికపై సంస్థ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగభరత్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఇన్–స్పేస్ ఛైర్మన్ పవన్ కుమార్ గోయెంకా



శుభాంశు శుక్లా

ఏపీలో ఏరోస్పేస్, డిఫెన్స్ జోన్‌లు

– టీజీ భరత్, ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి

అంతరిక్ష రంగంలో ప్రపంచశక్తిగా ఎదుగుతున్న నవ భారత ప్రస్థానంలో స్కైరూట్ ఒక మైలురాయి. ఇస్రోలో మంచి ఉద్యోగాలను వదిలి, ఎంతో రిస్కు తీసుకొని పవన్, భరత్‌లు దీన్ని స్థాపించారు. కొన్నేళ్లలోనే రూ.4వేల కోట్ల విలువైన కంపెనీని సృష్టించారు. అంతరిక్ష రంగం కోసం ప్రధాని ఇన్-స్పేస్‌ను ప్రారంభించారు. భారత అంతరిక్ష పరిశ్రమలో భాగస్వామ్యం వహించడానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ జోన్‌లను ఏర్పాటు చేస్తున్నాం.

విక్రమ్–1... భారత గుండె చప్పుడు

– గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా

2022లో ప్రయోగించిన విక్రమ్-ఎస్‌తో భారత ప్రైవేటు అంతరిక్ష శకం అధికారికంగా మొదలైంది. నేడు విక్రమ్-1 ఆ విజయపరంపరను మరింత ముందుకు తీసుకెళుతోంది. రాకెట్లు పేలోడ్లతోపాటు యువ హృదయాలనూ మోసుకెళతాయని అబ్దుల్ కలాం చెప్పారు. ప్రధాని మోదీ 2020లో సంస్కరణలు తీసుకురాకుంటే అంతరిక్ష రంగంలో ఈ పురోగతి సాధ్యమయ్యేది కాదు.

భారత్ హల్వాకు మంచి గిరాకీ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి శుభాంశు శుక్లా... హల్వా, మూంగ్ దాల్ హల్వా, మామిడి రసాన్ని తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ... అంతరిక్షంలో వీటి రుచి భిన్నంగా ఉందా అని అడిగిన ప్రశ్నకు శుభాంశు.. ఔనని సమాధానమిచ్చారు. “ఈ వంటకాలను మీ అమ్మగారు తయారు చేశారా అని అందరూ నన్ను అడిగారు. టిఫిన్ బాక్స్ పెట్టుకొని వెళ్లినంత సులభంగా రోదసిలోకి ఆహారాన్ని తీసుకెళ్లలేం. దాన్ని నాసా ఆమోదించాలి. నేను తీసుకెళ్లిన రెండు రకాల హల్వాలు పోలండ్, హంగరీ, అమెరికా, రష్యా వ్యోమగాములకు నచ్చాయి. ఈ హల్వాను మనం మార్కెట్ చేసుకోవచ్చు” అంటూ శుభాంశు చమత్కరించారు.

ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలుకు సవరణ నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: వర్గీకరణకు అనుగుణంగా ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం సవరణ నోటిఫికేషన్‌ను గురువారం జారీచేసింది. ఈ నోటిఫికేషన్ 2025 ఏప్రిల్ 18 నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. అంతకంటే ముందు ఏర్పాటైన ప్యానెల్స్ పూర్తిగా లేదా కొంతవరకు అమల్లో ఉంటే వాటిని యథావిధిగా కొనసాగించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఎస్సీలను గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3లుగా ఉప వర్గీకరణ చేసిన నేపథ్యంలో ఈ సవరణ నోటిఫికేషన్ జారీచేసింది.

– పూర్తి వివరాలు https://epaper.eenadu.net లో

రాష్ట్రానికి ‘దిత్వా’ ముప్పు!

(మొదటి పేజీ తరువాయి)

తీరం దాటే అవకాశాలు తక్కువని, తీరం వెంబడి పయనించి బలహీనపడొచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

20 సెం.మీ. కంటే ఎక్కువ వర్షం

తుపాను ప్రభావంతో శుక్రవారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం కొన్ని జిల్లాలకు ఆరెంజ్, ఆదివారం కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. శుక్రవారం సాయంత్రం నుంచి కోస్తా తీరం వెంబడి గాలుల వేగం పెరగనుందని తెలిపింది. శని, ఆదివారాల్లో గరిష్ఠంగా గంటకు 80 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీయొచ్చని చెప్పింది. విశాఖపట్నం, మచిలీపట్నం తదితర పోర్టుల్లో రెండో నంబరు హెచ్చరికలు జారీ అయ్యాయి.

వర్షాలు ఇలా..

శుక్రవారం: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం.

శనివారం: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, శ్రీసత్యసాయి, అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు భారీ వర్ష సూచన.

ఆదివారం: చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్ కడప, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, నంద్యాల, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చు.

సోమవారం: కృష్ణా, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చు.

■ మరోవైపు రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. బుధవారం రాత్రి అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఫోన్ పోయినా.. సొమ్ము భద్రంగా



బ్యాంకు, యూపీఐ ఖాతాల బ్లాకింగ్‌తో మోసానికి అడ్డుకట్ట

"తొరామతిపేటకు చెందిన రైతు ఇటీవల మార్కెట్‌కు వెళ్లాడు. అతని జేబులోని ఫోన్ కొట్టేసిన దొంగలు యూపీఐ యాప్ ద్వారా ఖాతాలోని రూ.4.26 లక్షలను బదిలీ చేసుకున్నారు. రైతు కొత్త ఫోన్ కొని సిమ్ కార్డు యాక్టివేట్ చేయించుకుని బ్యాంకు ఖాతాల్ని తనిఖీ చేయగా విషయం బయటపడింది."

"సోమాజిగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి బస్సులో వెళ్తుండగా ఫోన్ చోరీకి గురైంది. సిమ్ బ్లాక్ చేయించే లోపు.. రూ.34 వేలు కొట్టేశారు. బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేయించడంతో ఖాతాలోని మిగతా డబ్బును కాపాడుకోగలిగాడు."

ఈ రెండు ఉదంతాల్లో ఫోన్ పోగొట్టుకోవడం కంటే.. బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కొట్టేయడం బాధితుల్ని ఎక్కువ కలవరపెట్టింది. ఫోన్ పోయిన తర్వాత యజమానులు వాటి ఆచూకీ కోసం గంటల తరబడి వెతుకుతుంటే.. దొంగలు మాత్రం క్షణం ఆలస్యం చేయకుండా డబ్బంతా బదిలీ చేసుకుంటున్నారు. కొన్నాళ్లుగా రాజధానిలో ఈ తరహా కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాఫ్ట్‌వేర్ రాకతో కొట్టేసిన ఫోన్లను పోలీసులు రికవరీ చేస్తున్నా.. డబ్బు తిరిగిరావడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ఫోన్లు పోయినా, చోరీ అయినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా యూపీఐ యాప్‌లు, బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించాలని పోలీసులు సూచిస్తున్నారు.

మనమేం చేయాలంటే..?

- ఫోన్ పోగొట్టుకుంటే ఆలస్యం చేయకుండా మొదట సిమ్‌కార్డు, యూపీఐ ఖాతాలకు లింకైనా బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించాలి.

ఫోన్ పే ఉన్న వారు **080687 27374**

పేటీఎం వాడే వారు **012044 56456**

గూగుల్ పే వినియోగదారులు **18004 190157**

నంబర్లను సంప్రదించి ఖాతాలను బ్లాక్ చేయించాలి

- సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ చోరీ గురించి ఫిర్యాదు చేయాలి. దీనివల్ల సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుక్కోవచ్చు.

దొంగలు ఏం చేస్తున్నారు..?

- చాలామంది యూపీఐ పిన్/పాస్‌వర్డ్ తేలిగ్గా ఉండేవి.. ఫోన్ నంబరులోని తొలి అంకెల్ని పెట్టుకుంటున్నారు. ఇలాంటివి తేలిగ్గా గుర్తిస్తున్న దొంగలు డబ్బు బదిలీ చేసుకుంటున్నారు.
- కొట్టేసిన ఫోన్‌లో బ్యాంకు ఖాతాలకు అనుసంధానమైన సిమ్ ఉంటుంది. దీని ద్వారా కొత్త పిన్ క్రియేట్ చేస్తున్నారు. ఇదంతా గంట, అరగంటలోనే జరుగుతోంది.

ఈనాడు- హైదరాబాద్

జనార్దనరావు ఎవరో తెలియదు

- కస్టడీలో జోగి సోదరుల బుకాయింపు
- ఫోన్ డేటా వంటి ఆధారాలు ముందుపెట్టి అడిగినా అదే తీరు

ఈనాడు, అమరావతి: జనార్దనరావు ఎవరో నాకు తెలియదు, పరిచయం కూడా లేదు, నాతో ఎప్పుడు ఫొటో దిగాడో గుర్తు లేదు. ఇవీ నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ సిట్, ఎక్సైజ్ అధికారులకు ఇచ్చిన సమాధానాలు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దనరావుతో చాలా ఏళ్లుగా పరిచయమున్నా.. అసలు పరిచయమే లేదని బుకాయించారు. గతంలో ఇద్దరూ కలిసి మద్యం వ్యాపారం చేశారా అని ప్రశ్నించగా నాకు తెలియదు, గుర్తు లేదనే సమాధానం ఇచ్చారు. రెండో రోజు కస్టడీలో భాగంగా గురువారం ఎనిమిది గంటలపాటు విచారించినా ఒక్క ప్రశ్నకూ జోగి రమేష్ సూటిగా సమాధానమివ్వలేదు. రమేష్ సోదరుడు రాము, జనార్దనరావుల మధ్య పలు ఫోన్ కాల్స్ ఉన్నట్లు తేలింది. ఆ వివరాలన్నీ ముందుపెట్టి అడిగినా జనార్దనరావు ఎవరో తనకు తెలియదనే రాము బుకాయించారు. మీ ఇద్దరి మధ్య 18 ఫోన్ కాల్స్ ఉన్నాయి, పరిచయం లేనిదే ఎలా మాట్లాడుకున్నారని ప్రశ్నిస్తే గుర్తు లేదని సమాధానమిచ్చారు. జోగి సోదరుల విచారణకు ఇచ్చిన నాలుగు రోజుల గడువు శనివారంతో ముగియనుంది. విచారణకు వారు సరిగా సహకరించడం లేదని, మరో రోజు అదనంగా కస్టడీకి ఇవ్వాలని అధికారులు పిటిషన్ వేయగా కోర్టు సమ్మతించింది. దీంతో ఆదివారం కూడా వారిని విచారించనున్నారు.

స్లీప్‌వెల్ అగరొత్తులతో శ్వాసకోశ వ్యాధులు

- వ్యవసాయశాఖ తనిఖీల్లో వెల్లడి
- విజయవాడలో రూ.69.24 లక్షల సరకు స్వాధీనం

ఈనాడు, అమరావతి: దోమల నివారణకు వెలిగించే స్లీప్‌వెల్ బ్రాండ్ అగరొత్తుల్లో ప్రాణాంతకమైన మేపర్‌ఫ్లుత్రిన్ అనే పురుగుమందు బయటపడింది. వ్యవసాయశాఖకు అందిన సమాచారం మేరకు విజయవాడ గుణదలలోని సాయిహనుమాన్ ఏజెన్సీలో ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారులు ఇటీవల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరులోని ఆకికాస్ కంపెనీ తయారుచేసిన స్లీప్‌వెల్ అగరొత్తుల నమూనాలు సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం)కు పంపగా.. మేపర్‌ఫ్లుత్రిన్ అనే రసాయనం ఉన్నట్లు నిర్ధారణ అయింది. అది రిజిస్టర్ కాని పురుగుమందు. ఈ అగరొత్తుల నుంచి వెలువడే పొగ పీలిస్తే శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దీంతో విజయవాడలోని రాధాకృష్ణాస్వామి అనే వ్యక్తికి చెందిన నిల్వ కేంద్రంలో రూ.69.24 లక్షల విలువైన సరకును స్వాధీనం చేసుకుని అమ్మకాలు నిలుపుదలకు ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లోనూ వ్యవసాయశాఖ తనిఖీలకు ఆదేశించింది. ఎక్కడైనా నిల్వలుంటే క్రిమిసంహారక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. స్లీప్‌వెల్ అగరొత్తుల్ని కొనుగోలు చేస్తే అప్రమత్తంగా ఉండాలని ఒక ప్రకటనలో వినియోగదారులకు సూచించింది.

పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు మిథున్‌రెడ్డికి అనుమతి

ఉత్తర్వులిచ్చిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు వీలుగా వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతించింది. ఇందుకు వీలుగా బెయిల్ షరతులను సడలిస్తూ గురువారం ఏసీబీ కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 20 వరకు షరతులను సడలిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. పార్లమెంటు సమావేశాలకు హాజరుకావాల్సి ఉందని.. ఆ నేపథ్యంలో అనుమతించాలని ఎంపీ మిథున్‌రెడ్డి గత వారం పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై గురువారం న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పు వెలువరించారు.

మద్యం కేసులో అనిల్ చోఖ్రాకు 3 రోజుల కస్టడీ

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో ఇటీవల అరెస్టయిన ముంబయికి చెందిన వ్యాపారి అనిల్ చోఖ్రాను మూడు రోజుల పాటు సిట్‌కు కస్టడీకి అప్పగిస్తూ విజయవాడలోని ఏసీబీ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 28 నుంచి 30 వరకు కస్టడీకి ఇస్తున్నట్లు పేర్కొంది. చోఖ్రాను వారం రోజుల కస్టడీకి అనుమతించాలని కోరుతూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగిసిన నేపథ్యంలో తీర్పు వెలువడింది. ఇదే కేసులో చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై అతని తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. తదుపరి విచారణ నిమిత్తం కేసు శుక్రవారానికి వాయిదా పడింది. జైలులో అదనపు సౌకర్యాలు కల్పించాలని చెవిరెడ్డి వేసిన పిటిషన్ మేరకు ఇంటి నుంచి భోజనానికి కోర్టు అనుమతిస్తూ ఆదేశాలు ఇచ్చింది.

మంత్రి ఆమోదం లేకుండా ఫైళ్లు పంపారు

- పెన్నా లీజుల్లో శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగం
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన సీబీఐ



ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి సన్నిహితుడైన ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు లీజుల మంజూరులో.. పరిశ్రమల శాఖ అప్పటి కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ సీబీఐ గురువారం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. మంత్రి ఆమోదం కూడా లేకుండా లీజులకు సంబంధించిన ఫైళ్లను సర్క్యులేట్ చేశారని తెలిపింది. నిబంధనలను కాలరాసి పెన్నా సిమెంట్స్‌కు లీజులు మంజూరు చేస్తూ జీవోలు ఇచ్చారనే విషయాన్ని.. ఆమెపై విచారణకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొందని తెలిపింది. పెన్నా ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు అనంతపురం జిల్లా యాడికిలో 231 ఎకరాల భూకేటాయింపు, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కౌలపల్లిలో 304.70 హెక్టార్లలో ప్రాస్పెక్టింగ్ లీజు, రంగారెడ్డి జిల్లా తాండూరులో 822.13 ఎకరాల్లో లీజు రెన్యువల్‌తోపాటు హైదరాబాద్‌లో పయనీర్ హోటళ్ల నిర్మాణాలకు రాయితీల కల్పనలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, ఇందుకు వైఎస్ కుమారుడైన జగన్‌మోహన్‌రెడ్డి కంపెనీల్లో ప్రతాప్‌రెడ్డి రూ.68 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు సీబీఐ కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఇందులో నిందితురాలిగా ఉన్న శ్రీలక్ష్మి.. తనపై కేసును కొట్టివేయాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం సవరణ చట్టం కింద ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పాత చట్టం కింద అనుమతి మంజూరు కానప్పుడు ప్రాసిక్యూషన్ చేపట్టడానికి వీల్లేదన్నారు. అభియోగ పత్రాన్ని సీబీఐ కోర్టు విచారణ నిమిత్తం పరిగణన (కాగ్నిజెన్స్)లోకి తీసుకున్నప్పుడు ప్రభుత్వ అనుమతి అవసరంలేదని పేర్కొందని, తర్వాత ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరైందని తెలిపారు. కాగ్నిజెన్స్ ఉత్తర్వులు సక్రమంగా లేనపుడు కేసును కొనసాగించడానికి వీల్లేదంటూ దీనికి సంబంధించి పలు సుప్రీం కోర్టు తీర్పులను ప్రస్తావించారు.

నిర్దిష్ట గడువేమీ లేదా?

ఈ కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ సీబీఐ కోర్టు ఛార్జిషీటును 2020లో కాగ్నిజెన్స్ తీసుకుందని, దానికి ముందు 2016లో దాఖలు చేసిన ఛార్జిషీటులో ప్రాసిక్యూషన్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొందన్నారు. అంటే అప్పటికే సీబీఐ అనుమతి కోరిందని, 2022లో కేంద్రం అనుమతి కూడా మంజూరు చేసిందనగా న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ అనుమతి మంజూరుకు ఆరేళ్లు ఎందుకు సమయం పట్టిందని అడిగారు. దీనికి నిర్దిష్ట గడువు ఏమీ లేదా అని ప్రశ్నించారు. సీబీఐ న్యాయవాది సమాధానమిస్తూ శ్రీలక్ష్మి తెలంగాణ కేడర్ నుంచి ఏపీకి వెళ్లారని, అందువల్ల తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలతోపాటు సీవీసీల మధ్య సంప్రదింపుల కారణంగా అనుమతి మంజూరులో జాప్యం జరిగి ఉండవచ్చన్నారు. అనుమతి మంజూరుకు సంబంధించి నిర్దిష్ట గడువు అంటూ ఏమీ లేదన్నారు. కాగ్నిజెన్స్, అనుమతి మంజూరు ఉత్తర్వులు రెండింటినీ శ్రీలక్ష్మి సవాలు చేయలేదని తెలిపారు. కాగ్నిజెన్స్ ఉత్తర్వులు పూర్తి వివరాలతో జారీ చేసినందున అందులో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని చెప్పారు. కేంద్రం అనుమతి సబబా, కాదా అన్నది సీబీఐ కోర్టు విచారణ సమయంలో తేల్చుకోవాల్సి ఉందన్నారు. న్యాయమూర్తి విచారణను డిసెంబరు 4వ తేదీకి వాయిదా వేస్తూ సీఆర్‌పీసీ సెక్షన్ 197 కింద ఇటీవల సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పులపై స్పష్టత ఇవ్వాలన్నారు.



ఉండవల్లిలోని నివాసానికి వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణి

నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు విందు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు విందు ఇచ్చారు. ఆమెకు చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, లోకేశ్ సతీమణి బ్రాహ్మణి స్వాగతం పలికారు. అమరావతిలో వివిధ బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు నిర్మలా సీతారామన్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు.

పుస్తక పఠనంతో ఎంతో మేలు: మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: పుస్తక పఠనం ఎంతో విజ్ఞానదాయకమని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సూచించారు. పుస్తక పఠనంతో ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో 1986లో డాక్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు శంకుస్థాపన చేసిన గ్రంథాలయాన్ని ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో రూ.1.72 కోట్లు వెచ్చించి ఆధునికీకరించగా మంత్రి లోకేశ్ గురువారం దానిని ప్రారంభించారు. అక్కడే కూర్చుని కాసేపు పుస్తక పఠనం చేశారు. గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. నగరవాసులు సేద తీరేందుకు మంగళగిరి, తాడేపల్లి నగర పరిధిలోని కొండపనేని టౌన్‌షిప్ వద్ద సీఎస్ఆర్ నిధులు రూ.1.23 కోట్లతో నిర్మించిన పార్క్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. పవర్ మెక్ ఫౌండేషన్ దీనికి సీఎస్ఆర్ నిధులను సమకూర్చింది.





గ్రంథాలయ ప్రారంభ శిలాఫలకం వద్ద మంత్రి లోకేశ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు, రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ◆ మంగళగిరిలోని పౌర గ్రంథాలయం

200 గ్రంథాలయాల్లో ఇన్‌క్లూజన్ సెంటర్లు

ఈనాడు, అమరావతి: ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాలు పెంపొందించేందుకు రాష్ట్రంలో 200 గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన ఇన్‌క్లూజన్ సెంటర్లను మంగళగిరి నుంచి లోకేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సెంటర్‌లో భాగంగా మంగళగిరి గ్రంథాలయంతో పాటు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో 200 గ్రంథాలయాలకు డెల్, శిక్షణ ఫౌండేషన్ సంయుక్తంగా రెండు కంప్యూటర్లు, స్మార్ట్‌టీవీ, స్మార్ట్‌ఫోన్‌లను సరఫరా చేశాయి. ఏడాది పాటు ఇంటర్నెట్ సదుపాయాన్ని ఈ సంస్థలు కల్పించనున్నాయి. డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాలు, పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్‌కు సంబంధించిన సమాచారాన్ని కంప్యూటర్లలో అందుబాటులో ఉంచారు. గ్రంథాలయంలో ఎప్పుడైనా సందర్శకులు ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

రెండోదశ భూ సమీకరణ తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని రైతులే ముందు అందుకోవాలి. ఇక్కడ భూముల ధరలు పెరుగుతాయి. తొందరపడి మీ ప్లాట్లు అమ్ముకోవద్దు. నా అనుభవం, విజన్‌తో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో విజయం సాధించాను. ఒకప్పుడు ఎకరం రూ.లక్ష ఉన్న భూమి ఇప్పుడు రూ.170 కోట్లు పలుకుతోంది. మీకూ అలాంటి అభివృద్ధి కావాలో వద్దో ఆలోచించండి. మీరు నాపై నమ్మకంతో అడగ్గానే 33 వేల ఎకరాలు ఇచ్చారు. రాజధాని నిర్మాణానికి ఏ విజన్‌తో మీ పొలాలు తీసుకున్నానో.. ఆ ప్రకారమే అభివృద్ధి చేస్తాను. రెండోదశ భూసమీకరణకు వెళ్లబోతున్నాం. మీకు సమ్మతమే కదా?' అని రైతుల్ని చంద్రబాబు అడిగారు. రాజధాని ప్రణాళికకు కట్టుబడి అభివృద్ధి చేస్తూనే, రెండోదశ భూసమీకరణకు వెళ్తే తమకు అభ్యంతరం లేదని రైతులు చెప్పారు. 29 గ్రామాల పరిధిలో 2వేల మంది రైతులు భూసమీకరణలో ఇవ్వలేదని.. వాటిని భూసేకరణ ద్వారా మొదట తీసుకున్నాక, రెండోదశ భూసమీకరణకు వెళ్లాలని కొందరు రైతులు సూచించారు. ఇంకా ఇవ్వాల్సిన రైతులతో త్రిసభ్య కమిటీ మాట్లాడుతుందని, సమీకరణలో ఇచ్చేందుకు ముందుకు రాకపోతే, 15 రోజుల్లో నోటిఫికేషన్ జారీచేస్తామని సీఎం స్పష్టం చేశారు.





రాజధాని రైతుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

సంక్రాంతిలోగా సమస్యల పరిష్కారం

రాజధాని రైతులు లేవనెత్తిన సమస్యల్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ సంక్రాంతిలోగా పరిష్కరిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. రాజధానిలో రైతులకు కేటాయించిన నివాస స్థలాలకు ఎఫ్ఎస్ఐ 2.8గా నిర్ణయిస్తే గిట్టుబాటు కాదని బిల్డర్లు చెబుతున్నారని, తమ ప్లాట్‌ను కొనేందుకు, డెవలప్‌మెంట్‌కి తీసుకునేందుకు ముందుకు రావట్లేదని రైతులు పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఐ 3.5కి పెంచాలని కోరారు. దానిపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ◆ గతంలో కేంద్రం ఇచ్చిన క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ మినహాయింపు గడువు పూర్తయిందని, 2019-24 మధ్య స్థలాల క్రయవిక్రయాలు జరగలేదు కాబట్టి.. మరో ఐదేళ్లపాటు మినహాయింపు ఇచ్చేలా కేంద్రాన్ని కోరాలని కొందరు రైతులు విజ్ఞప్తిచేశారు. కేంద్ర ఆర్థికమంత్రితో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. ◆ సమావేశంలో అమరావతి జేఏసీ ప్రతినిధులు సహా 95 మంది రైతులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

తెదేపాకు రూ.83 కోట్ల విరాళాలు

ఈనాడు, దిల్లీ: తెలుగుదేశం పార్టీకి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.83 కోట్ల మేర విరాళాలు వచ్చినట్లు ఆ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29సీ(3) ప్రకారం ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేలకు పైబడి వచ్చిన విరాళాల వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు సమర్పించిన నివేదికను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. దీని ప్రకారం మొత్తం 267 మంది దాతల నుంచి రూ.83 కోట్ల విరాళాలు పార్టీ ఖజానాకు చేరాయి. 2023-24తో పోలిస్తే 2024-25లో పార్టీకి రూ.17.15 కోట్లమేర విరాళాలు తగ్గాయి.

జనసేనకు రూ.25.33 కోట్లు

జనసేన పార్టీకి 2024-25లో రూ.25,33,16,513 విరాళాల రూపంలో వచ్చినట్లు ఆ పార్టీ కోశాధికారి ఎ.వెంకటరత్నం కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. మొత్తం 175 మంది ఈ మొత్తం ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఏడాది వైకాపాకు రూ.140.03 కోట్లు, భారాసకు రూ.15.09 కోట్ల మేర విరాళాలు అందినట్లు ఇదివరకే ప్రకటించాయి. ఎంఐఎం మాత్రం తనకు రూ.20 వేలకు మించి ఎలాంటి విరాళాలూ రాలేదని తాజాగా ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది.



కామేశ్వరరావుకు భారతజ్యోతి పురస్కారం ప్రదానం చేస్తున్న ఎం.వెంకయ్యనాయుడు, వేదికపై బుద్ధప్రసాద్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

రామోజీరావుకు అదే నిజమైన నివాళి

- ఏపీ, తెలంగాణల్లో పరిపాలనా భాషగా తెలుగును అమలు చేయాలి
- ప్రభుత్వ ఉచితాలన్నీ అనుచితాలే; విద్య, వైద్యం మాత్రం ఇస్తే చాలు
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే-తెనాలి (కొత్తపేట): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా తెలుగును అమలుచేయడమే 'ఈనాడు' గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావుకు ఇచ్చే నిజమైన నివాళి అని.. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇటీవల రామోజీరావు జయంతి సందర్భంగా తాను సూచించినట్లు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గుర్తుచేసుకున్నారు. అందుకు ఇద్దరూ సమ్మతించారని.. అమలు చేస్తారని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. తెనాలి ప్రచురణలు, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం తెనాలి సంయుక్తంగా గురువారం గుంటూరు జిల్లా తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావుకు భారతజ్యోతి పురస్కారం ప్రదాన కార్యక్రమం నిర్వహించగా.. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన కట్టు, బొట్టు నుంచి తిట్టు వరకు మాతృభాషలోనే ఉండాలన్నారు. ఆంటీ, అంకుల్, బ్రో.. పిలుపులు ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాలు అందించే ఉచితాలు అనుచితాలని.. అవి దేశానికి, రాష్ట్రానికి మంచివి కావన్నారు. 'చేపలు పట్టడం నేర్పించు. చేప మాత్రం ఉచితంగా ఇవ్వొద్దు' అని ఓ సామెత ఉందని.. ముఖ్యమంత్రులు ఈ విషయాన్ని ఆలోచించాలని సూచించారు. పేదవారికి చదువు, వైద్యం ఉచితంగా ఇస్తే చాలని, ఇంకేమీ వద్దన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కావాలని మహిళలు అడగలేదని, దివ్యాంగుల్లాంటి అవసరమైన వారికి కల్పించాలన్నారు. సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి చేతికి ఆర్థిక సమస్యలతో కూడిన ప్రభుత్వాలు వచ్చాయన్న ఆయన.. అప్పులు తీర్చడంతో పాటు సంపద సృష్టించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. సమాజంలో మార్పులు ప్రభుత్వాలతోనే రావని, కామేశ్వరరావు లాంటి సేవాతత్పరులు కూడా తోడవ్వాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధులని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన పిల్లల మాక్ అసెంబ్లీని సీఎం చంద్రబాబు శభాష్ అని కితాబిచ్చారని.. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చక్కగా మాట్లాడేలా చూడాలన్నారు. ◆ తెలుగు నీతికథలు, పద్యాలు నేర్పించాల్సిన అంగన్‌వాడీల్లో ఆంగ్లంలో రైమ్స్ నేర్పించడం సిగ్గుచేటని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మండిపడ్డారు. కామేశ్వరరావు ఉత్తరాంధ్రకు వెలుగుదీపంగా నిలిచారని కీర్తించారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే విజయాలను అందుకోవచ్చని పురస్కార గ్రహీత పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్, ఓలేటి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

నేర చరితుల తుపాకీ లైసెన్స్‌లు రద్దు చేయండి

- కడప ఎస్పీకి డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశం
- 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, కడప: వైఎస్సార్ కడప జిల్లాలో నేర చరితుల వద్ద తుపాకీ లైసెన్స్‌లు ఉంటే వెంటనే రద్దు చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశించారు. ఎవరెవరికి తుపాకీ లైసెన్స్‌లు ఉన్నాయో పోలీసుస్టేషన్ల వారీగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌కు ఆదేశాలు జారీ చేశారు. వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు, మద్దతుదారులకు తుపాకీ లైసెన్స్‌లు ఇవ్వడంపై 'అరాచక శక్తుల చేతుల్లో తుపాకులు' శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. లైసెన్సుదారు నేపథ్యం, నేర చరిత్ర, వివాదాలు, అసలు తుపాకీ లైసెన్స్ పొందేందుకు అర్హత ఉందా? వంటి అంశాలన్నీ పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆయన ఆదేశించారు.

జాస్తి కృష్ణకిశోర్‌పై తదుపరి చర్యల ఉపసంహరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ) సీఈవోగా గతంలో పనిచేసిన విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణకిశోర్‌పై సీఐడీ కేసుకు సంబంధించిన తదుపరి చర్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఏపీఈడీబీ సీఈవోగా పనిచేసిన సమయంలో కృష్ణకిశోర్ అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చేలా నిర్ణయాలు తీసుకున్నారంటూ వైకాపా హయాంలో 2019 డిసెంబరు 15న సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తగిన ఆధారాలు లేవని, కృష్ణకిశోర్ నేరానికి పాల్పడ్డారనేందుకు సాక్ష్యాలు లేవని పేర్కొంటూ 2022 జులై 13న హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది. ఈ నేపథ్యంలో ఆ కేసుకు సంబంధించి ఆయనపై తదుపరి చర్యలన్నింటినీ ఉపసంహరించుకుంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

బడికెళ్లే వయసులో ప్రేమ!

- కలిసి ఉందామని ఇంటి నుంచి పరారైన మైనర్లు
- విజయవాడలో బస్సెక్కి హైదరాబాద్‌కు
- ఫోన్ లొకేషన్‌తో కనిపెట్టి, తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – కృష్ణలంక: ఆ బాలుడికి 13 ఏళ్లు. ఎనిమిదో తరగతి. బాలికకు 14 ఏళ్లు.. తొమ్మిదో తరగతి. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణకు లోనయ్యారు. కలిసి బతుకుదామని ఇంటి నుంచి పరారయ్యారు. పోలీసులు బాలుడి వద్దనున్న సెల్‌ఫోన్ ద్వారా లొకేషన్ గుర్తించి, వారిని విజయవాడ తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కృష్ణలంక ప్రాంతానికి చెందిన మైనర్లు ఇద్దరూ ఒకే పాఠశాలలో చదువుతున్నారు. రెండేళ్లుగా వీరికి పరిచయం ఉంది. ఇద్దరూ ప్రేమించుకుంటున్నామని భావించారు. బుధవారం బాలుడి పుట్టినరోజు కావడంతో బడికి వెళ్లలేదు. బాలిక ఉదయం 8.30కు స్కూల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బాలుడి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో అబ్బాయి తల్లిదండ్రులు లేరు. ఇద్దరూ కలిసి కేక్ కోశారు. అనంతరం బాలుడు బాలికను ఇంట్లో ఉంచి, స్కూల్‌కు వెళ్లి చాక్లెట్లు పంచి వచ్చాడు. తర్వాత బాలిక ఇంటికి వెళ్లిపోయింది. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత పాఠశాలకు అని బయలుదేరి బాలుడి ఇంటికి వెళ్లింది. బాలుడు తన తండ్రి ఫోన్, ఇంట్లో నుంచి రూ.10 వేల డబ్బులు తీసుకుని బాలికతో కలిసివెళ్లి హైదరాబాద్ బస్సెక్కాడు.

బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో వెలుగులోకి..

స్కూలు సమయం దాటినా బాలిక తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి వాకబు చేశారు. స్కూలుకే రాలేదని ఉపాధ్యాయులు చెప్పారు. బాలిక స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోయేసరికి కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు.. స్కూల్ యూనిఫాంలో బాలుడితో కలసి వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. ఇంతలో బాలుడి తల్లిదండ్రులు కూడా స్టేషన్‌కు వచ్చి తమ కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఇద్దరూ కలిసి హైదరాబాద్ వెళ్లినట్లు తేలింది. బాలుడి వద్ద ఉన్న ఫోన్‌పై పోలీసులు నిఘా పెట్టారు. ఆ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో అది ఆన్ చేసి, లొకేషన్ రాగానే వారు హైదరాబాద్‌లో దిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

హైదరాబాద్‌లో ఇల్లు అద్దెకు తీసుకునేందుకు ప్రయత్నించి..

బుధవారం రాత్రి 10 గంటల సమయంలో హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో దిగిన మైనర్లు.. ఆటో ఎక్కి తుక్కుగూడ వెళ్లారు. ఇల్లు అద్దెకు కావాలని ఆ పరిసర ప్రాంతాల్లో వాకబు చేశారు. ఇది గమనించిన ఓ ఆటోడ్రైవర్ వాళ్లిద్దరినీ ఇంటికి తీసుకెళ్లి వివరాలు ఆరా తీసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో పోలీసులు అక్కడికి వెళ్లి, బాలబాలికలిద్దరినీ అదుపులోకి తీసుకుని విజయవాడ తీసుకొచ్చారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆమె డెత్ సర్టిఫికెట్ పంపిన భర్త

జమ్మలమడుగు, ముద్దనూరు, కలసపాడు, న్యూస్‌టుడే: భార్య పుట్టింటి నుంచి రావడం లేదని ఆమె డెత్ సర్టిఫికెట్‌ను ఆమెకు పోస్టులో పంపాడో భర్త. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరుకు చెందిన మారుతిరాజుకు కలసపాడు మండలం దూలంవారిపల్లెకు చెందిన ఆదిలక్ష్మితో 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. దంపతులిద్దరు తరచూ ఘర్షణ పడేవారు. నెల రోజుల కిందట ఆదిలక్ష్మి చెప్పకుండా పుట్టింటి వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే భార్య పేరుతో డెత్ సర్టిఫికెట్ తయారు చేయించి పోస్టులో ఆమెకు పంపాడు. తను బతికి ఉండగానే మరణ ధ్రువీకరణ పంపడంతో ఆదిలక్ష్మి గురువారం కలసపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మారుతిరాజు, ముగ్గురు పిల్లలను ముద్దనూరు స్టేషన్‌కు పిలిచి విచారించారు. మారుతిరాజు తల్లి మరణ ధ్రువపత్రాన్ని ఆదిలక్ష్మి పేరుతో మార్పులు చేసి దాన్నే ఆమెకు పంపినట్లు తేలింది.



మారుతి రాజు

EENADU Vol: 52, Issue: 108 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

పసిడి రుణాల్లోకి పిరమల్ ఫైనాన్స్

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ పిరమల్ ఫైనాన్స్ త్వరలోనే బంగారం రుణాల విభాగంలోకి అడుగుపెట్టనుంది. దీంతో పాటు, గృహ, ఎంఎస్ఎంఈలకు రుణాలను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం తమ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.75,000 కోట్లు ఉండగా, ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.లక్ష కోట్లకు చేరుకుంటుందని పిరమల్ ఫైనాన్స్ రిటైల్ లెండింగ్ సీఈఓ జగదీప్ మల్లారెడ్డి వెల్లడించారు. 2027-28 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.1,50,000 కోట్ల లక్ష్యాన్ని విధించుకున్నట్లు వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో కలిపి 59 శాఖలున్నాయని, కొత్తగా మరిన్నింటిని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ విభాగంలో రుణాలకు బలమైన గిరాకీ కనిపిస్తోందన్నారు. పండగల వేళ గృహ, వ్యక్తిగత, వ్యాపార రుణాలకు 45 శాతం వరకూ గిరాకీ పెరిగిందన్నారు.

ఐఎస్‌బీలో ధర్మలైఫ్ ల్యాబ్ ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), సామాజిక సేవల సంస్థ అయిన ధర్మలైఫ్, లండన్ బిజినెస్ స్కూల్లోని వీలర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బిజినెస్ అండ్ డెవలప్‌మెంట్ కలిసి సంయుక్తంగా ఐఎస్‌బీ- హైదరాబాద్ క్యాంపస్‌లో ధర్మలైఫ్ ల్యాబ్ (డీఎల్) ను ఏర్పాటు చేయనున్నాయి. దీనిపై ఇటీవల ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. దాదాపు 45,000కు పైగా గ్రామాల్లో సామాజిక మార్పు, మహిళా సాధికారిత కార్యక్రమాలను ధర్మలైఫ్ ల్యాబ్స్ అమలు చేస్తోంది. ఐఎస్‌బీ, వీలర్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో క్షేత్ర స్థాయిలో పెద్దఎత్తున సామాజిక మార్పు తీసుకువచ్చేందుకు వీలుకలుగుతుందని ధర్మలైఫ్ వ్యవస్థాపకుడు, సీఈఓ గౌరవ్ మెహతా పేర్కొన్నారు.

కుప్పంలో ఏస్ ఇంటర్నేషనల్ ప్లాంట్

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పంలో పాల పదార్థాలు, పోషకాహార కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఏస్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. వ్యాపార విస్తరణ కోసం పెట్టుబడిదార్ల నుంచి 35 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.305 కోట్లు) సమీకరించినట్లు కంపెనీ గురువారం వెల్లడించింది. నెదర్లాండ్స్ సంస్థ ఎఫ్ఎమ్ఓ నుంచి ఈ మొత్తాన్ని సేకరించింది. ఆహార ఉత్పత్తుల తయారీలో అగ్రగామిగా ఏస్ ఇంటర్నేషనల్ ఉంది. న్యూట్రాస్యూటికల్స్, శిశు- స్పోర్ట్స్ న్యూట్రిషన్, ఔషధ ఆహారం, పానీయాలు, మిఠాయిలను కంపెనీ ఉత్పత్తి చేస్తోంది.

కోడి గుడ్లు

28న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	630
వరంగల్	632
విజయవాడ	640
తూ/ప గోదావరి	615
విశాఖపట్నం	610
చిత్తూరు	673

సీక్వెంట్ సైంటిఫిక్ పేరు మార్పు

ఈనాడు, హైదరాబాద్: సీక్వెంట్ సైంటిఫిక్ లిమిటెడ్ పేరు మారిపోనుంది. ఈ సంస్థకు వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ అనే పేరు ఖరారు చేశారు. ఈ మేరకు సీక్వెంట్ సైంటిఫిక్ లిమిటెడ్ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు మెమొరాండమ్ ఆఫ్ అసోసియేషన్, ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లో కూడా మార్పులు ప్రతిపాదించారు. సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం అవుతున్న విషయం విదితమే. దీనికి అనుగుణంగా పేరు మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటుకు అణు విద్యుత్తు?



- కానీ ఎన్నో సవాళ్లు..
- మొదటి న్యూక్లియర్ టెండర్‌కు అనుకోని అవాంతరాలు
- శీతాకాల సమావేశాల్లో అణు ఇంధన చట్ట సవరణ బిల్లు?

మనదేశం 2029 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల (దాదాపు రూ.445 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా ముందుకు సాగుతోంది. అలాగే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది సాధ్యం కావాలంటే కొన్ని కీలక రంగాల్లో ప్రైవేటు రంగానికి ద్వారాలు తెరవాల్సి వస్తోంది. అందుకే ప్రభుత్వం అణు విద్యుత్తు రంగంపై దృష్టి సారించింది. ఆర్థిక వ్యవస్థ విస్తరించే కొద్దీ సంప్రదాయ విద్యుత్తు వనరులు సరిపోవు. అంతేగాక కాలుష్యం సమస్య కూడా ఉంది. అధిక అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవటం దీనికి ఒక పరిష్కారం. ప్రస్తుతం రియాక్టర్ల తయారీ, అణు ఇంధనం, అణు విద్యుత్కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, విద్యుదుత్పత్తి... అంతా ప్రభుత్వ రంగ చేతిలోనే ఉంది. నెమ్మదిగా ఒక్కో విభాగంలో ప్రైవేటు రంగానికి భాగం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టింది. కానీ ఆశించిన రీతిలో ఫలితాలు రావటం లేదు.

తొలి ప్రైవేటు టెండర్‌కు అడ్డంకులు


అణు విద్యుదుత్పత్తిలో ప్రైవేటు సంస్థలకు భాగస్వామ్యం కల్పించే ఉద్దేశంలో కేంద్రం గతేడాది మార్చిలో తొలి న్యూక్లియర్ పవర్ టెండర్ జారీ చేసింది. దీని ప్రకారం ప్రైవేటు రంగ సంస్థలు తమ సొంత విద్యుత్తు అవసరాల కోసం స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్) ఏర్పాటు చేసుకోవచ్చు. 220 మెగావాట్ల సామర్థ్యం కల 'భారత్ స్మాల్ రియాక్టర్స్' ఏర్పాటు నిమిత్తం ఆసక్తి కల సంస్థలు దాఖలు చేసుకోవచ్చని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) టెండర్ జారీ చేసింది. కానీ ఇది, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే... అనే చందాన ఉంది. తొలుత దీనిపై జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, టాటా పవర్, అదానీ ఎనర్జీ, హిందాల్కో, రిలయన్స్ ఇండస్ట్రీస్... తదితర సంస్థలు ఆసక్తి చూపాయి. కానీ నిర్వహణ వ్యయాలు, ప్రాజెక్టుకు నిధుల సేకరణ పెద్ద అవరోధాలుగా మారాయి. ప్రాజెక్టు వ్యయం అధికంగా ఉండటంతో పాటు అధిక సర్వీసు ఛార్జీలను ఎన్‌పీసీఐఎల్ ప్రతిపాదించింది. దీనివల్ల ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఆసక్తి ప్రదర్శించిన సంస్థలు ఆ తర్వాత వెనక్కి తగ్గాయి. ప్రాజెక్టు యాజమాన్యం, నిధుల సమీకరణ, ఆర్థికంగా ఎదురయ్యే రిస్కును ఎవరు భరించాలి... లాభాల పంపిణీ ఎలా...? అనే అంశాలపై స్పష్టత లేకపోవటం కూడా నష్టం చేసింది. దీనివల్ల ఎన్‌పీసీఐఎల్ టెండర్ ముందుకు సాగకపోగా, భవిష్యత్తులో ప్రతిపాదించే ప్రాజెక్టుల భవితవ్యం కూడా అయోమయంగా మారినట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. నిధుల సమీకరణ విషయంలో స్పష్టత నివ్వటంతో పాటు రిస్కును తగ్గించే విధంగా నియమనిబంధనలు సవరిస్తేనే ఈ టెండర్ ముందుకు సాగుతుందని ఆ వర్గాలు వివరిస్తున్నాయి.

స్థల సేకరణ సమస్యలు

అణు విద్యుత్తు ప్రాజెక్టుకు భూసేకరణ ఎంతో సమస్యగా ఉంటోంది. స్థలం ఎంపిక, భూసేకరణ, ప్రాజెక్టు అనుమతులకే అయిదారేళ్లు పడుతోంది. అదీ అన్నీ సక్రమంగా జరిగితే. ఎక్కడ ఏ అవాంతరం ఎదురైనా ప్రాజెక్టు ఆలస్యమైతే ఆగిపోతుంది. అందుకే అణు విద్యుత్తు ప్రాజెక్టులను ప్రైవేటు రంగ సంస్థలను ఆకర్షించటం కష్టసాధ్యంగా మారుతోంది.

చట్టపరమైన ఆంక్షలు...

అణు ఇంధన చట్టం-1962 ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రమే అణు విద్యుత్తు ప్లాంటును ఏర్పాటు చేయటానికి వీలవుతుంది. ప్రైవేటు రంగ సంస్థలు అణు విద్యుత్తు ప్లాంటు నెలకొల్పటం, యజమానిగా ఉండటం, నిర్వహించటం కుదరదు. అందువల్ల చట్టసవరణ తప్పనిసరి అవుతోంది. దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆటమిక్ ఎనర్జీ బిల్-2025ను కేంద్రం ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిసింది. దీంతో పాటు సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డామేజ్ (సీఎల్ఎన్‌డీ) చట్టానికి సవరణలు చేయడమూ అవసరమే.



భారీ లక్ష్యం

అణు విద్యుత్తు సామర్థ్యాన్ని 2047 నాటికి 100 గిగావాట్లకు పెంచుకోవాలనే లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్లో నేషనల్ న్యూక్లియర్ ఎనర్జీ మిషన్ లక్ష్యాలను ప్రస్తావించిన విషయం విదితమే. ప్రస్తుతం దేశంలో 8.8 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తి సామర్థ్యం మాత్రమే ఉంది. దీన్ని 2032 నాటికి 22 గిగావాట్లకు పెంచాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం అణు విద్యుత్తు కేంద్రాలను ఎన్‌పీసీఐఎల్ నిర్వహిస్తోంది. కొత్తగా ఎన్టీపీసీ అణు విద్యుత్తు రంగంలోకి అడుగు పెడుతోంది. 2047 నాటికి 30 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సమకూర్చుకోవాలని ఎన్టీపీసీ భావిస్తోంది. రాజస్థాన్‌లోని మహి బన్స్‌వారాలో 2.8 గిగావాట్ల అణు విద్యుత్తు కేంద్ర నిర్మాణానికి సిద్ధమైంది. కానీ ఇదొక్కటే సరిపోదు. అణు ఇంధన రంగంలోని వివిధ విభాగాల్లో ప్రైవేటు రంగ సంస్థలు అడుగుపెడితే ఈ రంగం విస్తరించే వీలు కలుగుతుంది. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు తమ సొంత అవసరాలకు అణు విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటే ఇతర వినియోగదార్లపై ఒత్తిడి తగ్గుతుంది. అందుకే ఈ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం కల్పించాలనేది ఆసక్తికరమైన ప్రతిపాదనే. కానీ అమల్లో ఇబ్బందులు తప్పటం లేదు.

- ఈనాడు, హైదరాబాద్

రూ.1,000 కోట్లతో స్కైరూట్ ఏరోస్పేస్ విస్తరణ

రెండు నెలల్లో విక్రమ్-1 ప్రయోగం

ఈనాడు, హైదరాబాద్: అంతరిక్ష సేవల రంగానికి చెందిన అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ తన కార్యకలాపాలను బహుముఖంగా విస్తరించనుంది. ఇందుకు రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమవుతోంది. స్కైరూట్ వ్యవస్థాపకులైన పవన్ కుమార్, నాగభరత్ ఈ విషయాలు వెల్లడించారు. హైదరాబాద్ శివారులో స్కైరూట్ ఏరోస్పేస్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రారంభించారు. ఈ సంస్థ రూపొందించిన విక్రమ్-1 రాకెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ విక్రమ్-1, మనదేశంలో ప్రైవేటు రంగ సంస్థ రూపొందించిన తొలి ఆర్బిటల్ రాకెట్ అని అన్నారు. ఒక అంకుర సంస్థ రాకెట్‌ను నిర్మించటం కూడా ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ రాకెట్‌ను రెండు నెలల్లో ప్రయోగించనున్నట్లు తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతరిక్ష సేవల్లో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించినందువల్ల తమకు ఈ అవకాశం లభించిందని నాగ భరత్ అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ ఇప్పటి వరకూ వెయ్యి మంది టెక్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించినట్లు వెల్లడించారు.

విక్రమ్-1 రాకెట్‌తో ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ ఉపగ్రహాలను ప్రయోగించవచ్చు. దీన్ని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో రూపొందించారు. అందువల్ల రాకెట్ తక్కువ బరువుతో ఎంతో బలమైనదిగా రూపుదిద్దుకుంది. దీన్లో 3డీ ముద్రిత ఇంజిన్లను వినియోగించారు. స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు రాకెట్ తయారీ కేంద్రం కావటం ప్రత్యేకత. ఇది 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ నెలకు ఒక రాకెట్‌ను తయారు చేయవచ్చు.

సీఎన్‌హెచ్ కన్‌స్ట్రక్షన్‌తో సైయెంట్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ఇటాలియన్-అమెరికన్ మూలాలు కలిగిన బహుళ జాతి సంస్థ సీఎన్‌హెచ్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ విభాగంతో హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ లిమిటెడ్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం సీఎన్‌హెచ్ ఇండస్ట్రియల్ ఎక్విప్‌మెంట్ యంత్రాలకు అటానమస్ సామర్థ్యాలను సమకూర్చటానికి సైయెంట్ లిమిటెడ్ కృషి చేస్తుంది. ఈ రెండు సంస్థలు గత రెండున్నరేళ్లుగా వివిధ ప్రాజెక్టులపై కలిసి పనిచేస్తున్నాయి. 'అడ్వాన్స్‌డ్ పెర్‌సెప్షన్ సిస్టమ్ ఫర్ వీల్ లోడర్స్' ఇందులో ఒకటి. ఈ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం సీఎన్‌హెచ్ దూరదృష్టికి అనుగుణంగా రూపుదిద్దుకుంది. ప్రధానంగా కన్‌స్ట్రక్షన్ యంత్రాలు, పరికరాలకు అనువైనదిగా ఉంది. కన్‌స్ట్రక్షన్ యంత్రాలకు అటానమస్ సామర్థ్యాన్ని సమకూర్చటంలో సైయెంట్ లిమిటెడ్ విశేషమైన నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నట్లు, ఈ దిశగా కలిసి పనిచేయటానికి సిద్ధంగా ఉన్నట్లు సీఎన్‌హెచ్ కన్‌స్ట్రక్షన్ అధ్యక్షుడు హుమాయున్ ఛిష్టి వివరించారు. అటానమస్ కన్‌స్ట్రక్షన్ యంత్రాల విభాగంలో సరికొత్త సేవలను ఆవిష్కరిస్తామని సైయెంట్ లిమిటెడ్ సీఈఓ సుకమల్ బెనర్జీ తెలిపారు.

మహీంద్రా ఎక్స్‌ఈవీ 9ఎస్ ఈవీ



ప్రారంభ స్థాయి వేరియంట్ రూ.19.95 లక్షలు

బెంగళూరు: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) గురువారం తన విద్యుత్ వాహనం ఎక్స్‌ఈవీ 9ఎస్‌ను విడుదల చేసింది. ఈ మోడల్ ప్రారంభ స్థాయి వేరియంట్ ధర రూ.19.95 లక్షలు. టాప్-ఎండ్ వేరియంట్ ధర రూ.29.45 లక్షలు (ఎక్స్-షోరూమ్ ధర). ఈ మోడల్ కార్లను ఇంగ్లో ఎలక్ట్రిక్ ఆరిజన్ ప్లాట్‌ఫామ్‌పై రూపొందించామని, సౌకర్యవంతమైన ప్రయాణానికి తోడ్పడతాయని ఎం అండ్ ఎం ప్రెసిడెంట్ - ఆటోమోటివ్ బిజినెస్ ఆర్.వేలుసామి వెల్లడించారు.

- ఈ 7 సీట్ల విద్యుత్ వాహనంలో 7 ఎయిర్‌బ్యాగ్‌లు ఉన్నాయి. వేరియంట్ల ఆధారంగా ఒకసారి ఛార్జింగ్‌తో 521-679 కిలోమీటర్లు ప్రయాణించే అవకాశం ఉంది. జనవరి 14 నుంచి బుకింగ్‌లు, 23 నుంచి డెలివరీలు ఉండనున్నాయి.
- వచ్చే ఏడాది జనవరి నుంచి వాహన ధరలు పెంచే ఆలోచన లేదని ఎం అండ్ ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ రాజేశ్ జెజురికర్ వెల్లడించారు.

25,000 మందికి ఐటీ విభాగం నుంచి ఎస్ఎంఎస్‌లు!

దిల్లీ: 2025-26 అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) ఆదాయపు పన్ను రిటర్ను (ఐటీఆర్)ల్లో విదేశీ ఆస్తుల వివరాలను వెల్లడించని సుమారు 25,000 మందికి ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం ఎస్ఎంఎస్‌లు/ఇ-మెయిళ్లు పంపిస్తోంది. ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ (ఏఈఓఐ) ఫ్రేమ్‌వర్క్ కింద విదేశీ అధికార పరిధి నుంచి అందుకున్న సమాచారం ఆధారంగా అధిక రిస్కుతో కూడిన కేసులను ఐటీ విభాగం గుర్తించింది. ప్రచారంలో భాగంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) తొలి దశలో 25,000 హై-రిస్క్ కేసుల్లో ఎస్ఎంఎస్/ఇ-మెయిళ్లను పంపడం లక్ష్యంగా చేసుకుంది. శిక్షా పరిణామాలను నివారించడానికి 2025 డిసెంబరు 31 నాటికి సవరించిన ఐటీఆర్‌లను దాఖలు చేయాలని వారికి సూచించింది. రెండో దశ నోటీసులు డిసెంబరు మధ్య నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో భూమి విక్రయించిన ఇండియన్ హ్యూమ్ పైప్

లావాదేవీ విలువ రూ.173.96 కోట్లు

ముంబయి: ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ లిమిటెడ్ హైదరాబాద్‌లోని ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో 18,311.57 చదరపు గజాల (15,210.80 చ.మీ.) భూమిని అశోకా బిల్డర్స్ ఇండియా ప్రై.లి.కు విక్రయించేందుకు భూ విక్రయ ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించింది. లావాదేవీ విలువ రూ.173.96 కోట్లు కాగా, ఇందులో రూ.100 కోట్లు ఇప్పటికే అడ్వాన్స్‌గా స్వీకరించినట్లు పేర్కొంది. లావాదేవీ విలువ ప్రకారం ఒక చదరపు గజం రూ.95,000 చొప్పున విక్రయించినట్లు లెక్క.

అవాడా గ్రూప్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

వచ్చే అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పునరుత్పాదక ఇంధన సంస్థ అవాడా గ్రూప్ వెల్లడించింది. విద్యుదుత్పత్తి, అనుబంధ వ్యాపార విస్తరణ కోసం ఈ పెట్టుబడులను వినియోగించనుంది. తమ సోలార్ ఫోటోవోల్టాయిక్ తయారీ సంస్థ ఐపీఓకు దరఖాస్తు చేసుకున్నట్లు గ్రూప్ ఛైర్మన్ వినీత్ మిత్తల్ పేర్కొన్నారు.

కెల్టన్ టెక్ చేతికి కుమోరి టెక్నాలజీస్

కుమోరి టెక్నాలజీ సర్వీసెస్‌ను కొనుగోలు చేసేందుకు కెల్టన్ టెక్ సొల్యూషన్స్ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. రూ.52.50 కోట్లతో ఒకటి లేదా అనేక దశల్లో ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయడం ద్వారా కుమోరి టెక్నాలజీని కెల్టన్ టెక్ చేజిక్కించుకోనుంది. ఈ లావాదేవీ పూర్తయిన తర్వాత కెల్టన్‌కు పూర్తి స్థాయి అనుబంధ సంస్థగా కుమోరి మారనుంది.

భారత్‌లోకి రూ.22,000 కోట్ల రష్యా చమురు

30 ఫాల్స్-ఫ్లాగ్ ట్యాంకర్లతో వచ్చాయ్: సీఆర్ఈఏ వెల్లడి

దిల్లీ: ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు మధ్య 30 ఫాల్స్-ఫ్లాగ్ (తప్పుదోవ పట్టించే జెండాలు) కలిగిన నౌకల ద్వారా 2.1 బిలియన్ యూరోలు (దాదాపు రూ.22,000 కోట్లు) విలువైన 5.4 మిలియన్ టన్నుల రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకుందని ఐరోపా మేధో సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) వెల్లడించింది. రష్యా 'షాడో ఫ్లీట్' ద్వారా ఒక దేశానికి పంపిన అత్యధిక చమురు ఇదేనని తెలిపింది. ఉక్రెయిన్ మీద రష్యా యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలు ఆ దేశ చమురుపై ఆంక్షలు విధించాయి. దీంతో నకిలీ పత్రాలు, తప్పుడు రిజిస్ట్రేషన్‌లు, ట్రాకింగ్ వ్యవస్థలను నిలిపివేయడం వంటి పనులతో చైనా, భారత్, తుర్కియేలకు రష్యా చమురు చేరిందని సీఆర్ఈఏ పేర్కొంది. ఈ ఏడాది మొదటి 9 నెలల్లో ఫాల్స్ ఫ్లాగ్‌ల ద్వారా 113 రష్యా నౌకలు చమురును ఎగుమతి చేశాయి. వీటి విలువ 4.7 బిలియన్ యూరోలు (11 మిలియన్ టన్నుల చమురు)గా ఉంది. సెప్టెంబరుకు ఫాల్స్ ఫ్లాగ్‌లతో 90 రష్యా 'షాడో' నౌకలు పనిచేస్తున్నాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే ఇవి ఆరు రెట్లు అధికం.



అక్టోబరులో తగ్గిన ఉద్యోగాల సృష్టి

ఇండీడ్ నివేదిక

ముంబయి: అక్టోబరులో దేశీయంగా ఉద్యోగాల సృష్టి తగ్గిందని అంతర్జాతీయ జాబ్ సైట్ ఇండీడ్ తమ నివేదికలో వెల్లడించింది. గతేడాది అక్టోబరుతో పోలిస్తే దాదాపు 20 శాతం, 2025 సెప్టెంబరుతో చూస్తే 5.6 శాతం క్షీణత నమోదైనట్లు తెలిపింది. ఉద్యోగాల సృష్టి తగ్గడం ఇది వరుసగా రెండో నెల అని పేర్కొంది. గత మూడు నెలల్లో ఉద్యోగ ప్రకటనలు దాదాపు మూడొంతులు తగ్గాయి. రంగాల వారీగా చూస్తే బ్యాంకింగ్- ఫైనాన్స్ (25.6%), న్యాయ (16.7%), లోడింగ్, స్టాకింగ్ (15%)ల్లో నియామకాలు నెమ్మదించాయి. భారత్‌లో ఉద్యోగాలు నెమ్మదిగా అధికారిక రంగానికి మారుతున్నాయని, దేశవ్యాప్తంగా ఉద్యోగాల వృద్ధిని అధికారిక రంగ ఉద్యోగాలు అధిగమించొచ్చని ఇండీడ్ అపాక్ సీనియర్ ఆర్థికవేత్త కాల్లం పికరింగ్ వివరించారు.

- క్లీనింగ్, పారిశుధ్యంలో ఉద్యోగ ప్రకటనలు 20 శాతం పెరిగాయి. ఆ తర్వాతి స్థానాల్లో కమ్యూనిటీ, సామాజిక సేవ (17.4%), దంతవైద్యం (13.1%), నర్సింగ్ (11.2%), ఆహార తయారీ, సేవలు (10.3%) ఉన్నాయి. మానవ వనరులు 2.3 శాతం పెరిగాయి.
- వర్క్ ఫ్రమ్ హోమ్ సౌలభ్యం కలిగిన ఉద్యోగాలు 9.1 శాతం ఉన్నాయి. గతేడాది అక్టోబరు కంటే ఇవి 7.6 శాతం అధికం.

జులై-సెప్టెంబరులో 2.2% పెరిగిన గృహ ధరల సూచీ: ఆర్‌బీఐ



ముంబయి: దేశ వ్యాప్తంగా 18 దిగ్గజ నగరాల్లో లావాదేవీల ఆధారంగా అఖిల భారత గృహ ధరల సూచీ (హెచ్‌పీఐ) ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 2.2 శాతం మేర పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఇది 7 శాతం పెరిగిందని తెలిపింది. రిజిస్ట్రేషన్ అధికారుల నుంచి త్రైమాసికంలో జరిగిన లావాదేవీ డేటాను సమీకరించి హెచ్‌పీఐను ఆర్‌బీఐ ప్రకటిస్తుంటుంది. గతంలో 2010-11ను బేస్ ఇయర్‌గా తీసుకుని కేంద్ర బ్యాంక్ హెచ్‌పీఐని వెల్లడిస్తుండగా, ప్రస్తుతం 2022-23 సంవత్సరాన్ని ఆధార సంవత్సరంగా పరిగణిస్తోంది. 2025-26 జులై-సెప్టెంబరులో హెచ్‌పీఐ పెరగడానికి నాగ్‌పుర్, ఘజియాబాద్, చండీగఢ్ వంటి నగరాల్లో ఇళ్ల ధరలు బాగా పెరగడమే కారణమని ఆర్‌బీఐ వెల్లడించింది. హౌస్ ప్రైస్ ఇండెక్స్ 2025-26 ఏప్రిల్-జూన్‌లో 113.4 కాగా, జులై-సెప్టెంబరులో 112.7కు తగ్గింది. కోల్‌కతా, చెన్నై, లఖ్‌నవూ, హైదరాబాద్ వంటి దిగ్గజ నగరాల్లో సూచీ తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది. ముంబయి, దిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లఖ్‌నవూ, అహ్మదాబాద్, జయపుర, కాన్పూర్, కోచి, హైదరాబాద్, తిరువనంతపురం, పుణె, ఘజియాబాద్, థానే, గౌతమ్ బుద్ధ నగర్, చండీగఢ్, నాగ్‌పుర్ నగరాలను పరిగణనలోకి తీసుకుని ఆర్‌బీఐ హెచ్‌పీఐను ప్రకటిస్తుంటుంది.

కొత్త శిఖరాలకు సూచీలు

సెన్సెక్స్ ▲ 111 — 85720
నిఫ్టీ ▲ 10 — 26216

- విదేశీ మార్కెట్ల సానుకూలతలతో లాభాలు

ఎఫ్ఐఐల అమ్మకాలు.. రూ.1255.20 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు.. రూ.3940.87 కోట్లు

వరుసగా రెండో రోజూ లాభాలు రావడంతో సూచీలు కొత్త శిఖరాలను అధిరోహించాయి. అయితే ఆ తర్వాత లాభాలు స్వీకరణ చోటుచేసుకోవడంతో రికార్డు గరిష్ఠాల నుంచి వెనక్కి వచ్చాయి. అమెరికా ఫెడ్ రేట్ల కోత అంచనాల నేపథ్యంలో విదేశీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడం సూచీల లాభాలకు కారణమైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 14 పైసలు తగ్గి 89.36 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.16% పెరిగి 63.23 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లోనే ముగియగా.. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ఆరంభమయ్యాయి.

- మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.59,000 కోట్లు తగ్గి రూ.474.33 లక్షల కోట్లకు (5.31 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.




స్వల్ప లాభాలు..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు (85,609.51)తో పోలిస్తే 136 పాయింట్ల లాభంతో 85,745.05 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత అదే ఒరవడిని కొనసాగిస్తూ 86,055.86 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. ఇది తాజా జీవనకాల గరిష్ఠ స్థాయి కావడం గమనార్హం. అనంతరం లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో తిరిగి నష్టాల్లోకి జారుకుంది. మళ్లీ పుంజుకున్న సూచీలు 110.87 పాయింట్ల లాభంతో 85,720.38 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 10.25 పాయింట్లు పెరిగి 26,215.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,310.45 పాయింట్ల వద్ద తాజా జీవన కాల గరిష్ఠాన్ని నమోదుచేసింది.

సగం అటు.. సగం ఇటు..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగం లాభాల్లో.. మిగతా సగం నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా బజాజ్ ఫైనాన్స్ 2.27% పెరిగింది. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్ 1.24%, హిందుస్థాన్ యునిలీవర్ 1.05%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.93%, హెచ్‌సీఎల్ టెక్ 0.68%, ఇన్ఫోసిస్ 0.54% లాభపడ్డాయి. మరోవైపు మారుతీ సుజుకీ 1.56%, ఎటెర్నల్ 1.35%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.15%, ఎస్‌బీఐ 1.14%, టాటా స్టీల్ 0.97%, టీసీఎస్ 0.8% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో ఆర్థిక సేవలు, ఐటీ, బ్యాంకెక్స్, టెక్ సూచీలు రాణించాయి. మరోవైపు స్థిరాస్తి, ఇంధనం, భారీ యంత్రపరికరాలు, మన్నికైన వినియోగ వస్తువుల సూచీలు డీలాపడ్డాయి.

- ఇ-కామర్స్ సంస్థ మీషో డిసెంబరు 3న రూ.4,250 కోట్ల ఐపీఓకు రానుంది. 5న ముగుస్తుంది. తాజా షేర్ల జారీతో పాటు 10.55 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) ద్వారానూ విక్రయించనుంది.

ఆరేళ్ల పాటు ఈక్విటీ మూలధనం అక్కర్లేదు

- 2025-26లో రూ.12,500 కోట్ల సమీకరణ: ఎస్‌బీఐ ఛైర్మన్



దిల్లీ: వచ్చే ఆరు సంవత్సరాల పాటు తమకు ఈక్విటీ మూలధనం అవసరం లేదని ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. ఈ ఏడాది జులైలో అర్హులైన సంస్థాగత మదుపర్ల ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా రూ.25,000 కోట్ల ఈక్విటీ మూలధనం సమీకరించామని, రూ.12 లక్షల రుణాల వృద్ధికి ఇది మద్దతుగా ఉంటుందన్నారు. వచ్చే 5-6 ఏళ్లలో 15 శాతం కనీస మూలధన నిష్పత్తిని కొనసాగించొచ్చని తెలిపారు. డెట్ మూలధనం పరంగా చూస్తే.. బాండ్ల ద్వారా రూ.12,500 కోట్లు సమీకరించనున్నట్లు తెలిపారు. క్యూఐపీకి ముందు కూడా రుణాల వృద్ధికి అవసరమైన నిధుల సమస్య లేదని, మూలధన నిష్పత్తిని బలోపేతం చేసుకోవాలని భావించామని, దీర్ఘకాలంలో క్యాపిటల్ టు రిస్క్ అసెట్ రేషియో (సీఆర్ఏఆర్)ను 15 శాతంగా, కామన్ ఈక్విటీ టైర్‌ను 12 శాతంగా ఉంచడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత లాభదాయకతను మరో 5-6 ఏళ్లు కొనసాగిస్తే.. మూలధన అవసరం ఉండదన్నారు.

సంక్షిప్తంగా

- వన్97 కమ్యూనికేషన్స్ (పేటీఎం) అనుబంధ సంస్థ **పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ లిమిటెడ్‌**కు పేమెంట్ అగ్రిగేటర్‌గా కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆర్‌బీఐ నుంచి అనుమతులు లభించాయి. అలాగే కొత్త వ్యాపారులను చేర్చుకునే విషయంలోనూ పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్‌పై ఆంక్షలను ఆర్‌బీఐ ఎత్తివేసింది.
- ఐటీ కార్యకలాపాలను స్ట్రీమ్‌లైన్ చేయడంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సామర్థ్యాలను మెరుగుపర్చడంలో ఐరోపాకు చెందిన సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ ఎస్ఏపీకి సహకారం అందించేందుకు ఐదేళ్లకుగాను **టీసీఎస్** ఒప్పందం కుదుర్చుకుంది.
- **ఏక్వస్** తొలి పబ్లిక్ ఆఫర్ డిసెంబరు 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా రూ.670 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 2.03 కోట్ల షేర్లను కంపెనీ విక్రయించనుంది.
- సౌర ఫలకాలు, మాడ్యూళ్లు, సెమీ కండక్టర్ల తయారీలో కీలక ముడి ఉత్పత్తులుగా వాడే కడ్డీలు, వేఫర్ల కోసం ఒడిశాలో ఒక ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు **టాటా పవర్** తెలిపింది. ఇందుకోసం రూ.10,000 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నట్లు వివరించింది.
- రెన్యువల్ రుసుము చెల్లించని కారణంగా 68 పెట్టుబడి అడ్వైజర్స్ సంస్థల రిజిస్ట్రేషన్‌ను **సెబీ** రద్దు చేసింది.
- బ్యాంకు డిపాజిట్లు, పింఛన్ ఫండ్, షేర్లు, డివిడెండ్లు తదితరాలకు సంబంధించి ఇప్పటివరకు క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న వాటి విషయంలో మదుపర్లకు సహకారం అందించేందుకు ఒక **ఏకీకృత పోర్టల్** త్వరలోనే అందుబాటులోకి రానుందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు తెలిపారు. పోర్టల్‌ను అభివృద్ధి చేసేందుకు ఆర్‌బీఐతో ఆర్థిక శాఖ కలిసి పనిచేస్తోందని పేర్కొన్నారు.
- **ఎఫ్ఎస్‌టీసీలో అదానీ గ్రూప్‌నకు 72.8% వాటా:** ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ)లో 72.8% వాటాను రూ.820 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు అదానీ గ్రూప్ గురువారం వెల్లడించింది. తద్వారా పైలెట్ శిక్షణ విభాగంలోకి అదానీ గ్రూప్ అడుగుపెట్టనుంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అయిన అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ ఈ వాటాను కొనుగోలు చేయనుంది.

బైజూస్ రవీంద్రన్ నష్టపరిహార దావా

జీఎల్ఏఎస్ ట్రస్ట్‌పై 2.5 బిలియన్ డాలర్ల (రూ.22,300 కోట్లు) నష్టపరిహారం దావాను బైజూస్ వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ దాఖలు చేయనున్నారు. అలాగే 'ఆల్ఫా ఫండ్స్'లోని 533 మి.డాలర్లను (సుమారు రూ.4,750 కోట్లు) కంపెనీ వ్యవస్థాపకులు మళ్లించారంటూ జీఎల్ఏఎస్ ట్రస్ట్ చేసిన ఆరోపణలు తప్పు అని రుజువు చేసేందుకు కొత్త ఆధారాలను కూడా ఆయన కోర్టుకు సమర్పించనున్నారు.

ఈనాడు సినిమా

స్పిరిట్.. పోరాటంతో మొదలు


ప్రభాస్

'స్పిరిట్' కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీని కోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

శివను 36ఏళ్ల నాటి సినిమా అనుకోరు


నాగార్జున

అగ్రహీరో నాగార్జున కెరీర్‌లో కల్ట్ క్లాసిక్ హిట్‌గా నిలిచిపోయిన చిత్రాలు 'శివ', 'గీతాంజలి'. ఇప్పుడీ విజయవంతమైన సినిమాల్ని గోవా వేదికగా ఘనంగా జరుగుతోన్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగార్జున హాజరయ్యారు. ప్రదర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఈ చిత్రాల్ని చూడటానికి వచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు. నాకు ఈ రెండూ చాలా ప్రత్యేకం. 'శివ' చిత్రం 80ల కాలం చివర్లో సినిమాలు తీసే విధానాన్ని పూర్తిగా మార్చివేసిందని నేను గర్వంగా చెప్పగలను. మీరు కూడా దీన్ని చూసినప్పుడు 36ఏళ్ల నాటి సినిమా ఇదని అనుకోరు. ఈ విషయంలో మీకు నేను హామీ ఇస్తున్నా. నటన, పాటలు.. ఇలా ఏ విధంగానూ దీన్ని చూసినప్పుడు మీరు ఈతరం సినిమాలాగే అనుభూతి చెందుతార"ని చెప్పారు. దీంతో పాటు యువతను విశేషంగా ఆకట్టుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని ఇండియన్ పనోరమా ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ విభాగంలో ప్రదర్శించారు. ఈ వేడుకలో నిహారిక కొణిదెలతో పాటు చిత్రబృందం పాల్గొని సందడి చేసింది.

ఖర్చు రూ.లక్షల్లో... వసూళ్లు రూ.కోట్లలో...

●బాక్సాఫీస్ వద్ద గుజరాతీ చిత్రం లాలో-కృష్ణ సదా సహాయతే మెరుపులు

●రూ.100 కోట్ల క్లబ్ దిశగా పరుగులు



భారీ బడ్జెట్, సరికొత్త హంగులు సినిమాకి ఓపెనింగ్స్ రాబట్టొచ్చేమో కానీ ఆ సినిమాని హిట్ బొమ్మగా నిలిపేది మాత్రం కంటెంట్. కథలో సత్తా ఉంటే అతి తక్కువ బడ్జెట్‌తో, భారీ వసూళ్లు అందుకోవచ్చు అనే దానికి తాజాగా ఉదాహరణగా నిలిచింది గుజరాతీ చిత్రం 'లాలో-కృష్ణ సదా సహాయతే'. సుమారు రూ.50లక్షల బడ్జెట్‌తో నిర్మితమై.. నోటి మాటే ప్రచారంగా ప్రేక్షకులకు చేరువై త్వరలో రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టబోతుంది.

కథాంశం: ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఓ ఆటో డ్రైవర్. గతంలో జరిగిన కొన్ని విషయాలకు ఎప్పుడూ బాధపడుతూనే ఉంటాడు. అనుకోకుండా ఓ రోజు ఫామ్‌హౌస్‌లో చిక్కుకుంటాడు. బయటికి రావాలని చాలా ప్రయత్నాలు చేస్తాడు. ఆ సమయంలోనే అతడికి మానవ రూపంలో ఉన్న శ్రీకృష్ణుడు దర్శనం ఇస్తారు. ఆ తరువాత వీరిద్దరి మధ్య స్నేహం చిగురిస్తుంది. కృష్ణుడు తన లీలలతో అతణ్ని ముక్తి మార్గంవైపు నడిచేలా చేస్తాడు. కృష్ణుడి సహాయంతో గతం తాలూకూ బాధలు, తన మనసులోని అలజడిని దాటుకొని కొత్త ఆశలతో ముందుకు పయనించడం ప్రారంభించిన ఆ ఆటో డ్రైవర్ జీవితమే ఈ చిత్ర కథాంశం.

నోటి మాటే ప్రచారాస్త్రం

ఎలాంటి అంచనాలు.. ప్రచార కార్యక్రమాలు లేకుండా విడుదలైన ఈ సినిమాకు తొలి వారం లభించిన ఆదరణ చాలా తక్కువే. కానీ ఆ నోటా ఈ నోటా సినిమా బాగుందనే మౌత్ టాక్ పెరగడంతో రెండో వారం నుంచి ప్రేక్షకులు ఈ సినిమా కోసం థియేటర్ బాట పట్టారు. అక్టోబరు 10న విడుదలైన ఈ సినిమా ఇప్పటికీ రూ.75 కోట్లకు పైగా రాబట్టింది. ఇప్పటికే నిర్మాతలకు మంచి లాభాలను తెచ్చిపెట్టిన ఈ చిత్రం ఇప్పుడు విజయవంతంగా ఏడోవారంలోకి అడుగుపెట్టి రూ.100కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టే దిశగా పరుగులు పెడుతోంది. 2019లో విడుదలైన 'చాల్ జీవీ లాయియే' రూ.50కోట్ల వరకు వసూలు చేసింది. అదే అత్యధిక వసూళ్లు సాధించిన గుజరాతీ చిత్రం. ఆ తరువాత ఈ రికార్డును అధిగమించి.. రూ.100కోట్లు సాధించిన తొలి గుజరాతీ సినిమాగా చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉంది. "ప్రేక్షకులు ఇది మన కథ.. మన గురించే" అని భావిస్తూ ఇందులో లీనమవుతున్నారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు ఈ చిత్ర దర్శకుడు అంకిత్ సఖియా. "మేము ఈ చిత్రాన్ని ఏదో అద్భుతం సృష్టిస్తుందని గొప్పగా ప్రారంభించలేదు. దేవుడు కనిపించి మనిషితో మాట్లాడితే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించాం" అని చెప్పారు.

నిర్మాత జాతీయ అవార్డు గ్రహీత

శ్రీకృష్ణుడి లీలలు.. మానవుడి జీవన పోరాటం మధ్య రూపుదిద్దుకొని గుజరాతీ ప్రేక్షకుల మనసుల్ని హత్తుకున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత మానసి పరేఖ్ నిర్మాతగా వ్యవహరించడం విశేషం. 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ నటిగా నిత్యామేనన్‌తో పాటు అవార్డును అందుకున్న మానసి.. పార్థివ్ గోహిల్‌తో కలిసి ఈ సినిమాని నిర్మించారు. ఇందులో కృష్ణుడి పాత్రలో తన సహజమైన నటనతో సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలిచారు శ్రుహద్ గోస్వామి. ఇందులో ఆటో డ్రైవర్ పాత్రలో కరణ్ జోషి, ఆయన భార్యగా రీవా రచ్ నటించారు. 'లాలో'... విజయం ఈ చిత్రబృందం గురించి భారతీయ చిత్రసీమ మాట్లాడుకొనేలా చేసింది. ఈ సినిమా త్వరలో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది.

వానరుడి లాంటి హీరో.. రావణుడి లాంటి విలన్!


శంతను, మనోజ్, అవినాశ్

అవినాశ్ తిరువీధుల హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'వానర'. అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి అంకిత్ రెడ్డి నిర్మించారు. శంతను సమర్పిస్తున్నారు. సిమ్రాన్ చౌదరి కథానాయిక. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర టీజర్‌ను హీరో మంచు మనోజ్ గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. "వానరుడి లాంటి హీరోకి ఇష్టమైన బైక్‌ను రావణుడి లాంటి విలన్ తీసుకెళ్లిపోతే దాన్ని తిరిగి తెచ్చుకునేందుకు ఎంత దాకా వెళ్లాడు.. ఎలాంటి పోరాటం చేశాడు అన్నది ఈ చిత్ర కథాంశం. ఇది ఆద్యంతం ఊహకందని మలుపులతో థ్రిల్ పంచుతుంది" అన్నారు హీరో, దర్శకుడు అవినాశ్ తిరువీధుల. ఈ కార్యక్రమంలో హర్ష, జానకీరామ్, శివాజీ రాజా, సాయిమాధవ్ బుర్రా, సుజాత సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చిత్రానికి శ్రీకారం


శ్రీవిష్ణు, శ్రేయ రుక్మిణి, నరేశ్ అగస్త్య

నరేశ్ అగస్త్య హీరోగా చైతన్య గండికోట దర్శకత్వంలో ఓ చిత్రం శ్రీకారం చుట్టుకుంది. ఎం.రాజేంద్ర నిర్మాత. శ్రేయ రుక్మిణి కథానాయిక. ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి శ్రీవిష్ణు క్లాప్ కొట్టగా.. రఘుబాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. సునీల్ శర్మ, షాలిని శర్మ దంపతులు చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. అందర్నీ అలరించే కొత్తదనం నిండిన కథతో ఈ సినిమా రూపొందనుంది. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, ఛాయాగ్రహణం: విద్యాసాగర్ చింతా.

వినరా మాదేవ...


సతీశ్, సప్తమి గౌడ

కన్నడ నటుడు సతీశ్ నినాసం కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. సప్తమి గౌడ కథానాయిక. వినోద్ వి. ధోండలే దర్శకత్వం వహిస్తున్నారు. వర్ధన్ హరి, జైష్ణవితో కలిసి సతీశ్ నినాసం నిర్మిస్తున్నారు. 'వినరా మాదేవ...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని ఇటీవల విడుదల చేశారు. పూర్ణచంద్ర తేజస్వి స్వరకల్పనలోని ఈ పాటకు శ్రీనివాస్ కాశే సాహిత్యం సమకూర్చగా, సతీశ్ నినాసం, సాధ్విని కొప్ప, సిద్ధు కలిసి ఆలపించారు. "ఊరంతా కలిసి చేసుకునే జాతర నేపథ్యంలో వచ్చే శివుడి గీతమిది. ఆ ఊరి ప్రజలు శివుడిని ఎంతగా ఆరాధిస్తారు? ఎలా పూజిస్తారనే వర్ణన ఆకట్టుకునేలా ఉంటుంద"ని చిత్రవర్గాలు తెలిపాయి.

ప్రేమ ప్రయాణం మరువతరమా


అవంతిక, హరీశ్, నారా రోహిత్

ఒక జంట ఎప్పుడు ఎలా ప్రేమలో పడిందో... ఆ ప్రేమ ప్రయాణం ఇద్దరికీ ఎలాంటి అనుభవాల్ని మిగిల్చిందో తెలియాలంటే 'మరువతరమా' చూడాల్సిందే. హరీశ్ ధనుంజయ, అతుల్యా చంద్ర, అవంతిక హరి నల్వా ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. చైతన్యవర్మ నడింపల్లి దర్శకత్వం వహించారు. రమణమూర్తి గిడుతూరి, రుద్రరాజు.ఎన్.వి, విజయ్‌కుమార్ రాజు నిర్మాతలు. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, కథానాయకులు నారా రోహిత్, శ్రీవిష్ణు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి రఘు రామ కృష్ణరాజు మాట్లాడుతూ "ట్రెండ్‌కి తగ్గ కథతో తెరకెక్కించాడు దర్శకుడు చైతన్య. ట్రైలర్ చాలా బాగుంది. ఇది ప్రేక్షకులు మెచ్చే చిత్రం అవుతుంది" అన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ "మంచి సినిమా వచ్చినప్పుడల్లా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఈ చిత్రం కూడా అందరి మెప్పు పొందాలని కోరుకుంటున్నా" అన్నారు. "హరీశ్‌లో మంచి టైమింగ్ ఉంది. ఇకపై వేగంగా సినిమాలు చేయాలని కోరుకుంటున్నా. నటి రోహిణి కీలకమైన పాత్ర చేశారు. ఆమె ఓ పాత్రని ఒప్పుకున్నారంటే ఆ సినిమాపై ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన నమ్మకం ఉంటుంది. ఈ చిత్రం విజయవంతం అవుతుందనే నమ్మకం ఉంది" అన్నారు శ్రీవిష్ణు. కథానాయకుడు హరీశ్ ధనుంజయ్ మాట్లాడుతూ "దర్శకుడు చైతన్య నాకు చిన్నప్పటి నుంచి మంచి స్నేహితుడు. తన మిత్రుడి జీవితంలో జరిగిన సంఘటనలతోనే ఈ చిత్రం తెరకెక్కించాడు. ఇందులోని ప్రతి పాత్రకీ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతార"న్నారు. మేం చేసిన ఓ నిజాయతీ ప్రయత్నమిదన్నారు దర్శకుడు చైతన్యవర్మ. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

భీమవరం బల్మా.. బాఘూ బీచ్ పోదమా


నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

కారేమో బెంజీ.. ప్యార్ ఏమో జెంజీ.. స్టోరీ మొదలెట్టేద్దామా అంటూ ప్రేమ పాటలు పాడుకుంటూ ప్రేయసితో హుషారుగా స్టెప్పేస్తున్నారు నవీన్ పొలిశెట్టి. మరి ఆ ప్రేమకథ ఎలా మొదలైంది.. ఏ రీతిలో సాగింది తెలియాలంటే 'అనగనగా ఒక రాజు' చూడాల్సిందే. నవీన్.. మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రమిది. మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఇది సంక్రాంతి సందర్భంగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం భీమవరంలో ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "భీమవరం బల్మా.. బాఘూ బీచ్ పోదమా.." అంటూ హుషారుగా సాగిన ఈ పాటను నవీన్ పొలిశెట్టి, నూతన మోహన్‌తో కలిసి ఆలపించారు. మిక్కీ జే మేయర్ స్వరాలందించగా.. చంద్రబోస్ సాహిత్యమందించారు. శేఖర్ మాస్టర్ నృత్య దర్శకుడిగా వ్యవహరించారు.

నా జీవితంలో అన్నీ ధర్మేంద్రే: హేమామాలిని

ప్రముఖ సీనియర్ నటుడు ధర్మేంద్ర ఇటీవలే కన్ను మూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన లేని జీవితాన్ని.. బాధను మాటల్లో చెప్పలేనని భావోద్వేగానికి గురవుతూ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు ధర్మేంద్ర భార్య, నటి హేమామాలిని. సామాజిక మాధ్యమాల వేదికగా ఆయనతో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్నారు. "నా జీవితంలో అన్నీ ధర్మేంద్రనే. భార్యను అమితంగా ప్రేమించే భర్త, పిల్లల్ని బాధ్యతగా చూసుకునే తండ్రి, మంచి స్నేహితుడు, మార్గదర్శకుడు, గొప్ప కవి.. ఇలా అన్నీ ఆయనే. కష్టసుఖాల్లో నాకు అండగా నిలిచారు. కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా ఉంటూ వాళ్లే సర్వస్వం అనుకొని బతికారు. ఒక నటుడిగా ఆయన ప్రతిభే తనని లెజెండ్‌ను చేసింది. ధర్మేంద్ర కీర్తి ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతుంది. ఇక వ్యక్తిగతంగా ఈ శూన్యత నా జీవితాంతం ఉంటుంది. ఆయన లేని లోటు తీర్చలేనిది. ఇన్నేళ్లు ఆయనతో కలిసి ప్రయాణించిన తర్వాత.. ఆ ప్రత్యేక క్షణాలను తిరిగి పొందడానికి నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయ"ని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు హేమామాలిని.


హేమామాలిని, ధర్మేంద్ర

దారి పొడవునా దాచింది కథలే...

సీతారాముల వనవాసానికి సాక్ష్యమైన అడవి ఓ ప్రేమ జంటకు అమ్మలా ఎలా తోడై నిలిచిందో తెలియాలంటే 'మోగ్లీ 2025' చూడాల్సిందే. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా నటించిన చిత్రమిది. సందీప్‌రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిసెంబరు 12న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఇందులోని వనవాసం పాటని గురువారం విడుదల చేశారు. కాలభైరవ స్వరాలు సమకూరుస్తూ, సోని కోమండూరితో కలిసి ఆలపించారు. కల్యాణ్ చక్రవర్తి రచించారు. 'ఆ సీతారామ వనవాసాన్ని చూసిన అడవే మనదే. .. ఆ అంతటి ప్రేమే వస్తానంటే ఖాళీ లేదని అనదే... దారి పొడవునా తానే దాచింది కథలే. .. మాటలాడకా మనకే చెబుతుంది బదులే...' అంటూ మొదలయ్యే ఈ పాట శక్తిమంతంగా సాగుతుంది. రామాయణంతో ముడిపెడుతూ, అడవిలో ఒక ప్రేమజంటకు ఎదురైన సంఘర్షణని ఆవిష్కరిస్తూ సాగే ఈ పాట కథలో భాగంగా వస్తుందని, చిత్రానికి ప్రధాన బలమని సినీ వర్గాలు చెప్పాయి.


రోషన్

అఖండ-2 ప్రత్యేక వాహనం ఆవిష్కరణ


రాక్స్ ఆవిష్కరణలో అమర్, బోయపాటి శ్రీను

ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలైనా, వాటిలో కనిపించే వాహనాలైనా ప్రేక్షకుల్ని ప్రత్యేకంగా ఆకర్షిస్తుంటాయి. 'అఖండ-2' సినిమా కోసం కూడా ఆయన ప్రత్యేకంగా ఓ వాహనాన్ని డిజైన్ చేయించారు. రాక్స్ అనే పేరుతో డిజైన్ చేసిన ఆ వాహనం సినిమాలో శక్తిమంతమైన బాలకృష్ణ పాత్రకి ప్రతిబింబంలా ఉంటుందట. ఎక్స్ డ్రైవ్ సంస్థ అత్యాధునిక సాంకేతికతతో ఆ వాహనాన్ని సిద్ధం చేయగా, ఎక్స్ స్టూడియోస్ దానికి సినిమాటిక్ లుక్‌ని అందించింది. ఆ వాహనాన్ని గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ "తెరపైన ఈ వాహనాన్ని చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు. ఒక శక్తిమంతమైన పాత్ర కోసం దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేయించాం. పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో, ఈ వాహనం కూడా అలాగే ఉంటుంది. అమర్ రాత్రింబవళ్లు కష్టపడి నాలుగు రోజుల్లో డిజైన్ చేసి మాకు అందించారు. నా సినిమాల కోసమే ఏడెనిమిది వాహనాలు డిజైన్ చేశారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు. 'అఖండ 2' ఒక సినిమా కాదు, భారతదేశపు ఆత్మ. సినిమా చూశాక ఆ విషయం అందరికీ అర్థమవుతుంది" అన్నారు. వాహనాన్ని డిజైన్ చేసిన అమర్ మాట్లాడుతూ "ప్రతిష్టాత్మకమైన 'అఖండ 2' సినిమాలో మేం డిజైన్ చేసిన వాహనం ఒక భాగం కావడం ఆనందంగా ఉంది" అన్నారు.

సినిమా పేరు... శ్రీనివాస మంగాపురం


జయకృష్ణ

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, రమేశ్‌బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే పేరుని ఖరారు చేశారు. అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. రషా థడానీ కథానాయిక. సి.అశ్వనీదత్ సమర్పణలో... చందమామ కథలు పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా పేరుని ప్రకటిస్తూ, ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. 'రెండు జీవితాలు - ఒక ప్రయాణం. రెండు చేతులు - ఒక వాగ్దానం. రెండు మనసులు - ఒక విధి' అని రాసున్న ఆ పోస్టర్ కథ ఎలా ఉంటుందో చాటి చెబుతోంది. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్ కుమార్.

వివాహ బంధంలోకి రాహుల్ సిప్లిగంజ్


రాహుల్, హరిణ్య

ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఓ ఇంటివాడయ్యారు. గురువారం తెల్లవారుజామున తన ప్రియురాలు హరిణ్య మెడలో మూడుముళ్లు వేసి వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన వీరి పెళ్లి వేడుకకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి. నెటిజన్లు ఈ జంటకు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రైవేట్ మ్యూజిక్ ఆల్బమ్స్‌తో గాయకుడిగా ప్రయాణం ప్రారంభించిన రాహుల్.. 'ఆర్ఆర్ఆర్'లోని "నాటు నాటు" పాటతో ఆస్కార్ వేదికపై సందడి చేసిన సంగతి తెలిసిందే. 'రంగమార్తాండ' చిత్రంలో నటుడిగానూ అలరించారు.



మార్కెట్ అస్థిరత కొనసాగుతున్న తరుణంలో బంగారం, వెండిలాంటి సురక్షిత పెట్టుబడులు చాలామందిని ఆకర్షిస్తున్నాయి. మీ పెట్టుబడి పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకునేటప్పుడు ఈ విలువైన లోహాలకు ఎంత శాతం కేటాయించాలనే సందేహం వస్తుంది. ఈ నేపథ్యంలో బంగారం, వెండిలో మదుపు చేసేటప్పుడు తప్పకుండా పరిశీలించాల్సిన కొన్ని విషయాలను చూద్దాం..

బంగారం, వెండిలో మదుపు చేస్తారా?

మధ్య, దీర్ఘ కాలానికి బంగారం ఇప్పటికీ విశ్వసనీయ పెట్టుబడి మార్గంగా కనిపిస్తోంది. చరిత్రను గమనిస్తే, ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే సాధనంగా దీనికి పేరుంది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల సమయంలోనూ స్థిరత్వాన్ని అందించడంలో బంగారం ఎంతో కీలకం. అందుకే, మెరుగైన సమతుల్య పోర్ట్‌ఫోలియోలో ఈ లోహాలకు చోటు ఉండాల్సిన అవసరమూ ఉంది.

- ఇప్పటికే పెట్టుబడి ఉన్న వారు కొనసాగించాలని ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. కొత్తగా పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్న వారు క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా దశలవారీగా బంగారం, వెండిని జమ చేసుకోవచ్చు.
- గోల్డ్, సిల్వర్ ఫండ్లు లేదా ఫండ్ ఆఫ్ ఫండ్లలో చిన్న మొత్తాలను క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో 5-7 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలంలో మంచి మొత్తాన్ని కూడబెట్టుకోవచ్చు. ఈ విధంగా జమైన డబ్బును మీ అవసరాలను బట్టి, ఆభరణాలను కొనుగోలు చేయడం, పిల్లల పెళ్లి సమయంలో ఉపయోగించుకోవచ్చు.
- బంగారంతో పోలిస్తే వెండిలో అస్థిరత కాస్త భిన్నంగా ఉంటుంది. కాబట్టి, అధిక నష్టభయం భరించగలం అనుకున్న వారే వెండిని ఎంచుకోవాలి. నష్టభయం తట్టుకోలేని వారు, తక్కువ మొత్తంతోనైనా బంగారంలో పెట్టుబడి పెట్టడమే ఉత్తమం.
- ఒక పెట్టుబడిదారుడి పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండి రెండూ కలిపి 10 శాతం వరకూ ఉండొచ్చు. గరిష్ఠంగా 15 శాతానికి మించకూడదు అని నిపుణులు చెబుతుంటారు. దీన్ని పాటించడం వల్ల ఈ విలువైన లోహాలు పోర్ట్‌ఫోలియోకు రక్షణ ఇస్తాయి. అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తినీ అందిస్తాయి.

బాండ్లతో జాగ్రత్త

పెట్టుబడుల ప్రపంచంలో ఒక్కోసారి ఒక్కో పథకం వెలుగులోకి వస్తుంటుంది. ఇలాంటివే బాండ్లు. డిజిటల్ వేదికల ద్వారా సులువుగా మదుపు చేసేందుకు వీలుండటంతో చాలా మంది యువ, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న పెట్టుబడిదారులు వీటిపై ఆసక్తి చూపిస్తున్నారు.



siri@eenadu.net

బాండ్లపై పెరుగుతున్న ఈ ఆకర్షణ నేపథ్యంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పెట్టుబడిదారులకు కొన్ని సూచనలు జారీ చేసింది. ముఖ్యంగా గుర్తింపు లేని సంస్థలు జారీ చేసిన బాండ్లకు దూరంగా ఉండాలని సలహానిచ్చింది. నియంత్రణ అనుమతులు లేకుండానే పెట్టుబడి సేవలను అందిస్తున్నాయని తెలిపింది.

ఆసక్తి ఎందుకంటే?

పెట్టుబడులకు స్థిరమైన రాబడి రావాలని చాలామంది కోరుకుంటున్నారు. నెలవారీగా ఎంతో కొంత రాబడి అందుకునే ఏర్పాట్ల కోసం చూస్తున్నారు. ఇలాంటి వారిని బాండ్లు ఆకర్షిస్తున్నాయి. పెట్టుబడుల్లో వైవిధ్యానికీ ఇవి తోడ్పడుతున్నాయి. కొన్ని బాండ్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మించి వడ్డీని అందిస్తున్నాయి. డెట్ మ్యూచువల్ ఫండ్లకూ పోటీగా నిలుస్తుండటంతో చాలామంది వీటిని పరిశీలిస్తున్నారు. సంప్రదాయ పెట్టుబడిదారులకు, పదవీ విరమణ పొందిన వారికీ కాస్త అధిక రాబడిని అందిస్తున్న ఈ బాండ్లు నచ్చుతున్నాయి. మరోవైపు హామీతో కూడిన రాబడి, మార్కెట్లతో పోలిస్తే తక్కువ హెచ్చుతగ్గులు ఉంటాయి.

రాబడి సంగతేమిటి?

డిజిటల్ బాండ్ వేదికలు ప్రధానంగా లిస్టెడ్ కార్పొరేట్ బాండ్లను (ఎక్కువగా ఎన్‌బీఎఫ్‌సీ), ప్రభుత్వ సెక్యూరిటీలనూ అందిస్తున్నాయి. క్రెడిట్ రేటింగుల ఆధారంగా బాండ్ల రాబడులు మారుతూ ఉంటాయి.

- ✦ గరిష్ఠ రేటింగ్ ఉన్న కార్పొరేట్, ప్రభుత్వ బాండ్లు సాధారణంగా 7-9 శాతం వరకూ రాబడులను ఇస్తాయి.
- ✦ ఎన్‌బీఎఫ్‌సీ బాండ్లు 10-12 శాతం వరకూ రాబడిని అందించవచ్చు.
- ✦ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు సాధారణంగా 5-6 శాతం ఆదాయాన్నిస్తాయి.
- ✦ ప్రభుత్వ సెక్యూరిటీలు దీర్ఘకాలంలో 6-7.5శాతం వరకూ రాబడిని ఇస్తున్నాయి.
- ✦ ప్రభుత్వ సంస్థలు (పీఎస్‌యూ) అందించే బాండ్లు 5.5-6.5శాతం వరకూ పన్ను రహిత వడ్డీని ఇస్తాయి.

ఏఏఏ రేటింగ్ ఉన్నవి మంచివి.. సీ లేదా డీ రేటెడ్ బాండ్ల జోలికి వెళ్లకూడదు.

ఇవి గమనించండి..

ఏదైనా డిజిటల్ వేదిక నుంచి బాండ్లలో మదుపు చేయాలని ఆలోచిస్తున్నప్పుడు ఈ విషయాలు పరిశీలించాలి.

- ✦ పెట్టుబడిదారుల రక్షణ కోసం సెబీ నిబంధనలు పాటించే డిజిటల్ సంస్థలనే ఎంచుకోవాలి. ఒక బాండ్ ప్లాట్‌ఫారానికి సెబీ నుంచి ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్ ప్రొవైడర్ (ఓబీపీపీ), స్టాక్ బ్రోకర్ రిజిస్ట్రేషన్, ఆర్‌బీఐ రిజిస్ట్రేషన్లు ఉండాలి.
- ✦ అధిక రాబడి అంటే.. 12 శాతం కంటే ఎక్కువ ఇస్తాం అంటే అది అధిక అంచనా కావొచ్చు. కాబట్టి, ఈ బాండ్లను ఎంచుకునేప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండాలి.
- ✦ ఏదైనా బాండ్ రాబడి 20 శాతానికి మించి కనిపిస్తూ ఉందంటే.. అది స్పష్టమైన హెచ్చరికే. మంచి సంస్థకు అంత అధిక వడ్డీ రేటుకు రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు.
- ✦ సెబీ, మార్కెట్ నిబంధనలకు మించి రాబడి హామీలనిచ్చే సంస్థలకూ దూరంగా ఉండాలి.
- ✦ విశ్వసనీయమైన రేటింగ్ సమాచారం లేని వాటిని పట్టించుకోవద్దు

ఆర్థిక స్థిరత్వం, ఆదాయం కోసం బాండ్లు ఒక మంచి ఎంపికే. అధిక రేటింగ్ ఉన్న వాటిలో మదుపు చేసినప్పుడే మనకు భరోసా ఉంటుందని మర్చిపోవద్దు.

పాసివ్ ఆదాయం వచ్చేలా

కొత్త పథకం

డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ ఒకేసారి నాలుగు మ్యూచువల్ ఫండ్ పథకాలను ఆవిష్కరించింది. ఇవన్నీ పాసివ్ పద్ధతిలో నిర్వహించే పథకాలు కావడం గమనార్హం. డీఎస్‌పీ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్, డీఎస్‌పీ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఈటీఎఫ్, డీఎస్‌పీ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, డీఎస్‌పీ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఈటీఎఫ్‌లు ఇందులో ఉన్నాయి. ఈ నాలుగు పథకాల ఎన్ఎఫ్‌ఓ ముగింపు తేదీ వచ్చే నెల 8. డీఎస్‌పీ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్, డీఎస్‌పీ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్‌లలో ఎన్ఎఫ్‌ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. ఈటీఎఫ్ పథకాల్లో కనీస పెట్టుబడి రూ.100. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ తరగతికి చెందిన షేర్లలో పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించటం ఈ పథకాల ప్రధాన లక్ష్యం. తక్కువ నిర్వహణ వ్యయాలతో, ముందుగా నిర్దేశించుకున్న పెట్టుబడి నిబంధనల ప్రకారం నిర్వహించే ఈ పథకాల ద్వారా ఎంతో వృద్ధి అవకాశాలు ఉన్న కంపెనీల్లో పెట్టుబడి పెట్టే అవకాశం మదుపరులకు లభిస్తుందని డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ వివరించింది.

మధ్య, చిన్న స్థాయి కంపెనీల్లో

నవీ మ్యూచువల్ ఫండ్ ఒక సరికొత్త మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ పథకాన్ని తీసుకొచ్చింది. నవీ నిఫ్టీ మిడ్‌స్మాల్ క్యాప్ 400 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్‌ఓ ముగింపు తేదీ వచ్చే నెల 5. ఎన్ఎఫ్‌ఓలో కనీసం రూ.100 పెట్టుబడి పెట్టాలి. నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 400 ఇండెక్స్ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. దీనికి ఫండ్ మేనేజర్ అశుతోష్ షిర్వైకర్.

ధరలు పెరుగుతున్న షేర్లలో

కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. ఇది మొమెంటమ్ తరగతికి చెందిన పథకం. కోటక్ నిఫ్టీ 500 మొమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్‌ఓ ముగింపు తేదీ వచ్చే నెల 4. కనీస పెట్టుబడి రూ.100. మొమెంటమ్ పథకాల్లో రిస్కు ఎక్కువ, అదే సమయంలో అన్నీ కలిసి వస్తే లాభాలూ అధికమే. ధరలు ఆకర్షణీయంగా పెరుగుతున్న కంపెనీల షేర్లపై పెట్టుబడి పెట్టుబడి పెట్టటమే 'మొమెంటమ్ ఇన్వెస్టింగ్' అని వ్యవహరిస్తారు. నిఫ్టీ 500 మొమెంటమ్ 50 ఇండెక్స్‌లో 50 కంపెనీలు ఉన్నాయి. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన కంపెనీలను గత ఏడాది వ్యవధిలో మొమెంటమ్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ పథకానికి దేవేందర్ సింఘాల్, సతీష్ దొండపాటి, అభిషేక్ బైసెన్ ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు.



స్టాక్ మార్కెట్ సూచీల కదలికల్లో కొంత హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. మ్యూచువల్ ఫండ్ల పెట్టుబడుల్లోనూ పెద్దగా రాబడి కనిపించడం లేదు. దీంతో ఇప్పుడు యూనిట్లను విక్రయించి, తక్కువకు వచ్చినప్పుడు తిరిగి కొనొచ్చు అనే ఆలోచనతో చాలామంది ఉంటున్నారు. భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) గణాంకాలు చూసినా, పెట్టుబడులు వెనక్కి తీసుకుంటున్నవారు అధికంగా ఉంటున్న సంగతిని చూస్తున్నాం. మరి, ఇది సరైన వ్యూహమేనా?

మ్యూచువల్ ఫండ్లు పెట్టుబడి ఆపేస్తుంటే

పెట్టుబడులు పెట్టడానికీ, వాటిని వెనక్కి తీసుకునేందుకూ సరైన సమయం అంటూ స్టాక్ మార్కెట్లో ప్రత్యేకంగా ఏదీ ఉండదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే పెట్టుబడి మొత్తాన్ని వెనక్కి తీసుకోవాలి. ముఖ్యంగా క్రమానుగత పెట్టుబడి పెట్టిన మ్యూచువల్ ఫండ్ల విషయంలో ఇది మరింత కచ్చితంగా పాటించాలి.

ఒక ఆర్థిక లక్ష్యాన్ని సాధించేందుకు పెట్టుబడులు ప్రారంభిస్తాం. కాబట్టి, ఆ లక్ష్యాన్ని చేరుకునే వరకూ మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా మదుపు కొనసాగించాలి. మనం అనుకున్న లక్ష్యం సమీపిస్తున్న కొద్దీ, పెట్టుబడికి నష్టభయం తగ్గించే ఏర్పాటు చేయాలి. మీరు అనుకున్నదానికన్నా ముందే అవసరమైన డబ్బు సమకూరితే.. ఈక్విటీ ఫండ్ల నుంచి ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. లేదా క్రమానుగతంగా లిక్విడ్ ఫండ్లలోకి మళ్లించాలి. బ్యాంకులో ఫ్లెక్సీ డిపాజిట్లలోకి మార్చుకోవచ్చు. దీర్ఘకాలం పెట్టుబడుల తర్వాత రెండుమూడేళ్ల ముందుగానే ఈ ప్రక్రియను ప్రారంభించాలి. అప్పుడు మార్కెట్లు తగ్గినా ఇబ్బందులు రావు.

- ✦ మ్యూచువల్ ఫండ్ల నుంచి క్రమం తప్పకుండా ఆదాయం రావాలనుకున్నప్పుడు డివిడెండ్ ఆప్షన్లోకి మారేందుకు ప్రయత్నిస్తుంటారు. దీనికి బదులుగా క్రమానుగతంగా వెనక్కి తీసుకునేందుకు (ఎస్‌డబ్ల్యూపీ) ప్రయత్నించాలి. దీనివల్ల పన్ను భారమూ అంతగా ఉండదు.
- ✦ ఫండ్ పథకం ఎంచుకున్నప్పుడు ఉన్న వ్యూహానికి బదులుగా కొత్త విభాగానికి మారినప్పుడు మీ నష్టభయం భరించే సామర్థ్యంపై ప్రభావం చూపిస్తుంది. ఒకవేళ ఫండ్ మేనేజర్ మారినా గమనించాల్సిన అంశమే. కొత్త మేనేజర్ పనితీరును పరిశీలించాలి. గతంతో పోలిస్తే పనితీరు బాగాలేకపోతే ఫండ్‌లో నుంచి పెట్టుబడిని వెనక్కి తీసుకోవచ్చు.
- ✦ కొన్ని పథకాలు రెండుమూడేళ్లపాటు చూసినా... సానుకూల పనితీరును చూపించకపోవచ్చు. ఇలాంటి వాటి నుంచి పెట్టుబడులు వెనక్కి తీసుకునేందుకు ఆలోచించాల్సిన అవసరం లేదు. వివిధ కాలాల్లో ఫండ్ పనితీరు ఎలా ఉంది.. ఇదే విభాగంలోని ఇతర పథకాలతో పోలిస్తే ఎలాంటి రాబడులు ఇస్తున్నాయి.. ప్రామాణిక సూచీతో పోల్చినప్పుడు పనితీరు ఎలా ఉంది.. ఇలాంటివన్నీ చూసుకోవాలి. ఈక్విటీ పథకం వరుసగా మూడేళ్లపాటు పనితీరు సరిగా లేకపోతే.. దాన్ని వదిలించుకోవాలి.
- ✦ పెట్టుబడుల్లో వైవిధ్యం ఎప్పుడూ పాటిస్తూ ఉండాలి. అదే సమయంలో మీ అవసరాలు, లక్ష్యాలకు అనుగుణంగా కేటాయింపులు ఉండాలి. మార్కెట్‌లో వృద్ధి వల్ల మీ ఈక్విటీ పెట్టుబడుల విలువ పెరిగితే.. దాన్ని ముందుగా అనుకున్న నిష్పత్తికి సర్దుబాటు చేయాలి. ఉదాహరణకు ఈక్విటీల్లో 75 శాతం, డెట్‌లో 25 శాతం ఉండాలని అనుకున్నారనుకోండి. ఈక్విటీ పెట్టుబడుల విలువ 85 శాతానికి చేరితే.. దాన్ని మీరు అనుకున్న నిష్పత్తిలోకి మార్చుకోవాలి.

అత్యవసరాల్లో మ్యూచువల్ ఫండ్ల నుంచి అవసరమైన మొత్తాన్ని తీసుకునే ప్రయత్నం చేయొచ్చు. కానీ, దీన్ని చివరి అవకాశంగానే చూడాలి. ఒకవేళ సిప్‌ను కొనసాగించడం వీలుకాకపోతే.. దాన్ని తాత్కాలికంగా నిలిపివేయొచ్చు. అవసరం ఉంది అనుకుంటే, ముందుగా పనితీరు బాగాలేని పథకాల నుంచి పెట్టుబడి మొత్తాన్ని వెనక్కి తీసుకోండి. ఆ తర్వాతే మంచి రాబడి ఇస్తున్న వాటిని చూడండి.

ఆర్థికారోగ్యాన్ని సాధించాలంటే క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉండాలి. దీన్ని సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. క్రెడిట్ కార్డును ఉపయోగించేటప్పుడు కొన్ని వ్యూహాలు పాటిస్తే చాలు. స్కోరుతో ఎప్పటికీ ఇబ్బంది రాదు.

రుణ వినియోగం తగ్గించండిలా




క్రెడిట్ కార్డుకు కొంత పరిమితి ఉంటుంది. అంతమాత్రాన దాన్ని మొత్తం వాడాలని కాదు. మీ కార్డు పరిమితి రూ.1,00,000 అనుకుంటే.. మీరు రూ.30,000 ఖర్చు చేశారనుకుందాం. అప్పుడు మీ వినియోగ నిష్పత్తి 30 శాతం అవుతుంది. సాధారణంగా ఎంత తక్కువ పరిమితిని వాడితే అంత ఆర్థిక క్రమశిక్షణ ఉన్నట్లు బ్యాంకులు భావిస్తాయి. రుణాలపై అధికంగా ఆధారపడటం లేదని ఇది సూచిస్తుంది. అధిక వినియోగం ఉంటే, మీరు ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్నారని సంకేతం. రుణదాతలు మిమ్మల్ని చూసే విధానాన్ని ప్రభావితం చేస్తుంది.

రుణ వినియోగాన్ని నియంత్రించేందుకు, మెరుగైన క్రెడిట్ స్కోరును నిర్మించుకునేందుకు అనుసరించాల్సిన కొన్ని వ్యూహాలను చూద్దాం..

- ◗ క్రెడిట్ కార్డు వినియోగ నిష్పత్తిని తగ్గించాలంటే.. సులభమైన విధానం.. ఏదైనా వస్తువును కొన్న రెండు మూడు రోజులకే ఎంతో కొంత మొత్తం చెల్లించేయండి. బిల్లింగ్ తేదీ వరకూ ఎదురుచూడొద్దు. మీ క్రెడిట్ కార్డుతో కొన్న రోజునే కొంత మొత్తం చెల్లిస్తే.. మీ కార్డు వినియోగం తక్కువ మొత్తం నమోదవుతుంది.
- ◗ క్రెడిట్ కార్డును తరచూ వివిధ ఖర్చుల కోసం వినియోగిస్తుంటే.. నెలకోసారి చెల్లిస్తే సరిపోదు. ఒక నెలలో అనేకసార్లు చెల్లింపులు చేస్తూ ఉండాలి. చిన్న మొత్తాలను తరచూ చెల్లిస్తూ ఉండటం ద్వారా మీ నెలవారీ బాకీ తగ్గుతుంది. దీనిద్వారా వినియోగ నిష్పత్తి బాగుంటుంది.
- ◗ క్రెడిట్ కార్డును ఉపయోగించి, ఎంత ఖర్చు చేస్తున్నారో ఒక అంచనా వేసుకోండి. ఉదాహరణకు మీ పరిమితి రూ.1,00,000 ఉండి, మీరు సాధారణంగా నెలకు రూ.70వేలు వాడుకుంటారనుకుందాం. అంటే, మీ క్రెడిట్ వినియోగం 70శాతం అన్నమాట. కానీ, మీ ఖర్చులను రూ.40వేలకు తగ్గించుకొని, మిగతా మొత్తాన్ని డెబిట్ కార్డు ద్వారా వాడుకోవడం మేలు. అవసరమైన కొనుగోళ్లకు మాత్రమే క్రెడిట్ కార్డును వాడటం మంచిది.
- ◗ కొన్ని సందర్భాల్లో అందుబాటులో ఉన్న క్రెడిట్ పరిమితిని పెంచుకోవడం మంచి పద్ధతి. బ్యాంకును సంప్రదించి, మీ పరిమితిని పెంచాల్సిందిగా కోరండి. ఉదాహరణకు మీ కార్డు పరిమితి రూ.50,000 ఉందనుకోండి. దాన్ని రూ.75,000 లేదా రూ.1,00,000కు పెంచాలని దరఖాస్తు చేయండి. దీనివల్ల మీ వినియోగ నిష్పత్తి సగానికి తగ్గుతుంది.
- ◗ ఒకే కార్డుపై ఎప్పుడూ ఆధారపడొద్దు. కనీసం రెండు క్రెడిట్ కార్డులు తీసుకొని, వాటిని క్రమశిక్షణతో వాడుకోవాలి.
- ◗ చాలా రోజుల నుంచి వినియోగిస్తున్న కార్డులను కొనసాగించండి. అప్పుడే మీ రుణ చరిత్ర గురించి బ్యాంకులకు ఒక అంచనా వస్తుంది. దీనివల్ల క్రెడిట్ స్కోరుపైనా సానుకూల ప్రభావం ఉంటుంది.

టర్మ్‌కు తోడుగా

తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా రక్షణ కావాలనుకున్నప్పుడు అందుబాటులో ఉన్న మార్గం టర్మ్ ఇన్సూరెన్స్. ఇది చాలా సులభమైన పాలసీ. అనుకోని విధంగా పాలసీదారుడికి ఏదైనా జరిగితే కుటుంబానికి ఈ పాలసీ అండగా ఉంటుంది. దీన్ని మరింత భరోసా కల్పించేలా మార్చుకోవాలంటే కొన్ని రైడర్ల (అనుబంధ పాలసీలు)ను జోడించుకునే ప్రయత్నం చేయొచ్చు.



ప్రాథమిక టర్మ్ పాలసీకి అదనంగా కొన్ని ప్రయోజనాలను అందించేవే ఈ రైడర్లు. ఏడాదికి రూ.500 నుంచి రూ.5,000 వరకూ ప్రీమియంతో ఇవి అందుబాటులో ఉంటాయి.

ఇందులో కొన్ని ముఖ్యమైనవి గమనిస్తే..

యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ రైడర్: పాలసీదారుడు మరణిస్తే, ప్రాథమిక పాలసీ పరిహారం ఇస్తుంది. దీంతోపాటు అదనపు పరిహారాన్ని ఈ రైడర్ చెల్లిస్తుంది. దీన్ని రూ.50లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ తీసుకోవచ్చు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ఈ రోజుల్లో ఇది తప్పనిసరి.

శాశ్వత వైకల్యం (పర్మినెంట్ డిజేబిలిటీ): ప్రమాదంలో శాశ్వత వైకల్యం సంభవిస్తే.. ఉదాహరణకు రెండు కళ్లు లేదా రెండు చేతులు పోయినప్పుడు మొత్తం సొమ్ము ఒకేసారి ఇస్తుంది. ప్రమాదంలో గాయపడినప్పుడు ఇది ఆర్థికంగా అండగా నిలుస్తుంది.

తీవ్ర వ్యాధులు (క్రిటికల్ ఇల్‌నెస్): క్యాన్సర్, గుండెపోటు, మూత్రపిండాల వైఫల్యంలాంటి 10-40 రకాల తీవ్ర వ్యాధులు వస్తే.. వెంటనే పూర్తి సొమ్ము చేతికి అందుతుంది. సాధారణంగా ఆ రైడర్‌ను రూ.20 లక్షల నుంచి రూ.50లక్షల వరకూ తీసుకోవచ్చు. చికిత్స ఖర్చులు లక్షల రూపాయలు అవుతున్న ఈ రోజుల్లో ఇది ఒక ముఖ్యమైన రైడర్ అని చెప్పాలి.

ప్రీమియం రద్దు: తీవ్ర వ్యాధుల బారిన పడినా, శాశ్వత వైకల్యం వచ్చినా.. మీ తరఫున టర్మ్ పాలసీకి మిగతా ప్రీమియాలను కంపెనీయే చెల్లిస్తుంది. పాలసీ రక్షణ ఆగదు. టర్మ్ పాలసీతోపాటు దీన్ని తప్పనిసరిగా ఎంచుకోవడం మంచిది. దీనికి ప్రీమియం రూ.500-రూ.1,500 వరకూ ఉంటుంది.

ఆదాయం లభించేలా: పాలసీదారుడు మరణిస్తే, ఒకేసారి మొత్తం సొమ్ము కాకుండా నెలనెలా ఆదాయం వచ్చేలా ఏర్పాటూ చేయొచ్చు. దీనికోసం ఇన్‌కమ్ బెనిఫిట్ రైడర్‌ను ఎంచుకోవాలి. నెలవారీగా 10-20 ఏళ్లపాటు కుటుంబానికి ఆదాయం లభించే ఏర్పాటు చేయొచ్చు. పిల్లల చదువు, ఈఎంఐల వంటివాటికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

ఎవరికి అవసరం?

టర్మ్ పాలసీ తీసుకున్నప్పుడు ఇందులో మనకు ఏవి అవసరం అని నిర్ణయించుకొని, వాటిని తీసుకోవాలి. 30-45 ఏళ్ల మధ్యలో ఉన్నవారు మాత్రం కచ్చితంగా వీలైనన్ని ఎక్కువ రైడర్లను తీసుకోవడమే మేలు. గృహరుణం ఉండి, ఒక్కడే సంపాదిస్తున్న వారికీ ఇదే వర్తిస్తుంది. కుటుంబంలో క్యాన్సర్, గుండె జబ్బుల్లాంటి చరిత్ర ఉన్నవారూ క్రిటికల్ ఇల్‌నెస్ వంటి రైడర్లను పరిశీలించాలి.

ఇప్పుడు పాలసీ కష్టమే

నా వయసు 43. ఇటీవలే గుండె శస్త్రచికిత్స జరిగింది. ఇప్పటి వరకూ ఎలాంటి జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోలేదు. ఇప్పుడు రూ.2కోట్లకు టర్మ్ పాలసీ తీసుకోవాలని ఆలోచిస్తున్నాను. సాధ్యమేనా?

- ఆదినారాయణ

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలను ఎప్పుడూ ఆరోగ్యం బాగున్నప్పుడే తీసుకోవాలి. ఒకసారి ఆరోగ్యం క్షీణించడం, తీవ్ర వ్యాధుల బారిన పడిన తర్వాత ఈ పాలసీలు రావడం కష్టం కావచ్చు. మీకు గుండె శస్త్ర చికిత్స జరిగింది అంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో బీమా సంస్థలు వేచి ఉండే వ్యవధిని నిర్ణయిస్తాయి. కనీసం 3-4 ఏళ్ల తర్వాతే పాలసీలను జారీ చేస్తాయి. అదీ కొన్ని వైద్య పరీక్షలు చేశాక, వాటి ఫలితాలను బట్టి, నిర్ణయం తీసుకుంటాయి. అదనపు ప్రీమియాన్నీ వసూలు చేయొచ్చు. ఒకసారి బీమా సంస్థలను సంప్రదించి, పూర్తి వివరాలు తెలుసుకోండి. మీ ఆరోగ్య వివరాలు దాచి పెట్టకూడదు.



ఆదాయపు పన్ను మినహాయింపు గురించి ఇప్పటి వరకూ ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో (ఈఎల్ఎస్ఎస్) మదుపు చేశాను. ఇప్పుడు కొత్త పన్ను విధానంలోకి మారాను. కాబట్టి, వీటితో అవసరం లేదు. ఇందులో పెట్టుబడిని కొనసాగించాలా? లేకపోతే ఇతర పథకాల్లోకి మారాలా? **- సురేందర్**

ప్రస్తుతం మన దేశంలో సరళమైన పన్ను విధానాలు అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా కొత్త పన్ను విధానంలో రూ.12,75,000 వరకూ ఎలాంటి పన్ను భారమూ ఉండదు. దీనికిలోపు ఆదాయం ఉన్నవారికి పన్ను ఆదా పథకాలతో అవసరం లేదు. కానీ, పెట్టుబడులను ఎప్పుడూ పన్ను కోణంలోనే చూడొద్దు. వాటిని మన లక్ష్యం తీరే వరకూ కొనసాగిస్తూనే ఉండాలి. అప్పుడే ప్రయోజనం. మీరు ఈఎల్ఎస్ఎస్‌లో నుంచి డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి మారే ప్రయత్నం చేయొచ్చు. కనీసం 5-7 ఏళ్లపాటు పెట్టుబడి పెట్టినప్పుడు మంచి రాబడి వచ్చే వీలుంది.

మార్గదర్శి

నేను గృహరుణం తీసుకుని, నెలకు రూ.33వేల ఈఎంఐ చెల్లిస్తున్నాను. నా వ్యక్తిగత రుణం తీరడంతో మరో రూ.17వేల వరకూ మిగులుతున్నాయి. వీటిని గృహరుణం వాయిదాలో కలిపి చెల్లించాలా? పెట్టుబడి పెట్టడం మంచిదా? **- సర్వోత్తమ్**

రుణాలపై వడ్డీ రేట్లు క్రమంగా తగ్గుతున్నాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు 8-8.5 శాతం లోపే గృహరుణాలను అందిస్తున్నాయి. మీరు మిగిలిన రూ.17వేలను కొన్నాళ్లపాటు పెట్టుబడి పథకాల్లోకి మళ్లించండి. ఇందుకోసం డైవర్సిఫైడ్ ఈక్విటీ లేదా బ్యాలెన్స్‌డ్ ఫండ్లను ఎంచుకోవచ్చు. కనీసం 5 ఏళ్లు పెట్టుబడి పెట్టిన తర్వాత, జమైన మొత్తంతో రుణం తీర్చే ప్రయత్నం చేయొచ్చు.

– తుమ్మ బాల్‌రాజ్,
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.netకు పంపించండి)

మాదిరి ప్రశ్నలు



■ 2025, అక్టోబరు 1 నుంచి టాటా మోటార్స్ ఎండీ, సీఈఓగా ఎవరు నియమితులయ్యారు? (2028, సెప్టెంబరు 30 వరకు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.) **జ:** శైలేష్ చంద్ర

■ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 37వ అధ్యక్షుడిగా ఇటీవల ఎవరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు? (2025, ఆగస్టులో పదవీ విరమణ చేసిన రోజర్ బిన్నీ స్థానంలో ఈయన ఎన్నికయ్యారు.) **జ:** మిథున్ మన్హాస్

కరెంట్ అఫైర్స్

■ అమెరికాకు చెందిన గాలప్ సంస్థ రూపొందించిన గ్లోబల్ సేఫ్టీ రిపోర్ట్–2025 ప్రకారం రాత్రి పూట ఒంటరిగా నడవడానికి ప్రపంచంలోనే అత్యుత్తమ సురక్షిత దేశంగా ఏది నిలిచింది? **జ:** సింగపూర్ (తజకిస్థాన్, చైనా, ఒమన్, సౌదీ అరేబియాలు తర్వాత స్థానాల్లో నిలిచాయి.)

■ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? **జ:** సెప్టెంబరు 27

■ ఆసియా క్రికెట్ కప్–2025 ఫైనల్లో భారత్.. పాకిస్థాన్ జట్టుపై ఎన్ని వికెట్ల తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది? (దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ ఫైనల్ మ్యాచ్ జరిగింది.) **జ:** 5 వికెట్లు


■ అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (అంతర్జాతీయ అనువాదకుల సమాఖ్య 1991లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది.) **జ:** సెప్టెంబరు 30

మరింత సమాచారం

సకల జీవకోటికి ప్రాణాధారం!

ప్రతి రోజూ సూర్యుడు ఉదయించగానే భూమిపై ఒక నిశ్శబ్ద విప్లవం మొదలవుతుంది. కంటికి అతి సాధారణంగా కనిపించే ఆకుపచ్చని ఆకులు ఈ భూమండలానికి అవసరమైన శక్తిని అందించే నిరంతర శక్తి కేంద్రాలుగా మారతాయి. ఆ అద్భుతమే కిరణజన్య సంయోగక్రియ. ఇది కేవలం ఒక రసాయన చర్య కాదు. విశ్వంలోని జీవ ప్రపంచానికి శక్తిని సమకూర్చే జీవ మాయాజాలం. ఈ చర్యలో మొక్కలు సూర్యుడి నుంచి శక్తిని, గాలి నుంచి కార్బన్‌డయాక్సైడ్‌ను, భూమి నుంచి నీటిని తీసుకుంటాయి. ఈ సామాన్య పదార్థాల నుంచి జీవులకు ఆహారంగా ఉపయోగపడే గ్లూకోజ్‌ను, అందరికీ అవసరమైన ప్రాణవాయువు ఆక్సిజన్‌ను తయారు చేస్తాయి. భూగోళాన్ని సజీవంగా ఉంచుతున్న ఈ ఇంద్రజాల చర్యల వెనుక ఉన్న రహస్యాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. జీవకోటిపై వాటి ప్రభావాన్నీ అర్థం చేసుకోవాలి.

> ఆకుపచ్చని మొక్కలు కాంతి, పత్రహరితం సమక్షంలో నీరు, కార్బన్ డయాక్సైడ్‌ను వినియోగించుకుని ఆహారాన్ని సొంతంగా తయారుచేసుకునే ప్రక్రియను 'కిరణజన్య సంయోగక్రియ' అంటారు. ఈ విధంగా మొక్కలు తమ ఆహారాన్ని తామే తయారుచేసుకుంటాయి కాబట్టి వాటిని 'స్వయంపోషకాలు' అని పేర్కొంటారు.



జనరల్ స్టడీస్ బయాలజీ

కిరణజన్య సంయోగక్రియ

ప్రపంచంలో మానవులతో సహా అన్ని జీవులకు అవసరమైన ఆహారం తయారుచేసే ప్రక్రియ కిరణజన్య సంయోగక్రియ. మొక్కలు, కొన్ని కిరణజన్య సంయోగక్రియ జరిపే బ్యాక్టీరియాల్లో మాత్రమే సంభవించే ఈ ప్రక్రియ సమస్త జంతుజాలానికి కావాల్సిన శక్తిని ఆహారం రూపంలో అందిస్తుంది. మానవుడు కృత్రిమంగా జరపలేని చర్యల్లో ఒకటి కిరణజన్య సంయోగక్రియ. ఇంతటి ప్రాధాన్యం ఉన్న దీనిని అభ్యర్థులు పరీక్షల కోణంలో చదువుకోవాలి.

కార్బన్ డయాక్సైడ్: కిరణజన్య సంయోగక్రియలో ఉపయోగపడే వాయువు కార్బన్ డయాక్సైడ్. దీనిని మొక్కలు పత్రరంధ్రాల ద్వారా గ్రహించి వినియోగించుకుంటాయి. ఆరు అణువుల కార్బన్ డయాక్సైడ్ ఈ ప్రక్రియలో చివరకు ఒక అణువు గ్లూకోజ్‌గా మారుతుంది. కిరణజన్య సంయోగక్రియలో నేరుగా ఏర్పడి, శక్తినిచ్చే రసాయనం గ్లూకోజ్. ఇది మొక్కల్లో వివిధ ప్రక్రియల్లో మార్పు చెంది పిండి పదార్థంగా మారుతుంది. దీనిని మొక్కలు.. పత్రాలు, కాండాలు, ఫలాలు, గింజలు తదితరాల్లో నిల్వ ఉంచుకుంటాయి. వీటినే జీవులు ఆహారంగా తీసుకుంటాయి.

కాంతి: కిరణజన్య సంయోగ ప్రక్రియకు మూలం సూర్యకాంతి. కిరణజన్య సంయోగక్రియలో కాంతి నీటిని విశ్లేషిస్తుంది (విచ్ఛేదన చేస్తుంది). ఈ ప్రక్రియలో ఆక్సిజన్ వెలువడుతుంది. దీనినే 'కాంతి నీటి విశ్లేషణ' అంటారు. ఈ విధంగా కిరణజన్య సంయోగ క్రియలో నీటి నుంచి వెలువడిన ఆక్సిజన్ భూమిపై ఉన్న జీవరాశులకు శ్వాసక్రియలో ఉపయోగపడుతుంది. చివరగా కిరణజన్య సంయోగక్రియలో కాంతిశక్తి రసాయన శక్తిగా మారుతుంది.

కిరణజన్య సంయోగక్రియ జరిగే ప్రదేశం

ఇది మొక్కల్లో ఆకుపచ్చని భాగాలైన పత్రాల్లో ఎక్కువగా జరుగుతుంది. కిరణజన్య సంయోగక్రియ చర్యలు కణంలోని హరితరేణువుల్లో జరుగుతాయి. కాబట్టి హరితరేణువులను మొక్కల కణంలో 'ఆహార పదార్థాల కర్మాగారం' లేదా 'కిచెన్స్ ఆఫ్ ది సెల్' అని పిలుస్తారు. హరితరేణువులు మొక్కల్లో ఉండే వర్ణయుత ప్లాస్టిడ్‌లకు ఉదాహరణ. వీటిలో రంగునిచ్చే, కాంతిని శోషించుకునే వర్ణద్రవ్యాలు ఉంటాయి.

మొక్కల్లో వర్ణద్రవ్యాలు

మొక్కల్లో రంగునిచ్చే పదార్థాలను వర్ణద్రవ్యాలు అంటారు. ఇవి మూడు రకాలు. అవి 1) క్లోరోఫిల్స్ 2) కెరోటినాయిడ్స్ 3) ఫైకోబిలిన్స్

1) క్లోరోఫిల్స్: ఇవి ఆకుపచ్చ రంగునిస్తాయి. వీటిని తిరిగి క్లోరోఫిల్-ఎ, క్లోరోఫిల్-బి లాంటి అనే రకాలుగా విభజించారు. ఇవన్నీ ఉన్నత శ్రేణి మొక్కల్లో ఉంటాయి. మొక్కల్లో ముఖ్యమైన వర్ణద్రవ్యం క్లోరోఫిల్-ఎ. ఇది కాంతిని గ్రహించి ఉపయోగించుకుంటుంది.



2) కెరోటినాయిడ్స్: ఇవి బ్యాక్టీరియా, శైవలాలు, ఉన్నత శ్రేణి మొక్కల్లో ఉంటాయి. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి ఎ) కెరోటిన్స్ బి) జాంథోఫిల్స్

ఎ) కెరోటిన్స్: ఇవి నారింజ రంగులో ఉంటాయి. వీటిని తిరిగి ఆల్ఫా, బీటా, గామా కెరోటిన్‌లుగా విభజించవచ్చు. వీటిలో క్యారెట్‌లో ఉండేది బీటా కెరోటిన్. ఇది శరీరంలో విటమిన్-ఎ గా మారుతుంది. కాబట్టి బీటా కెరోటిన్‌ను ప్రోవిటమిన్-ఎ అని పిలుస్తారు. జాంథోఫిల్స్ పసుపు వర్ణంలో ఉంటాయి. వీటిని మళ్లీ వయోలాజాంథాల్, ఫ్యూకోజాంథాల్ అనే రకాలుగా విభజింపవచ్చు.

3) ఫైకోబిలిన్స్: ఇవి ఎరుపు, నీలి వర్ణంలో ఉంటాయి. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి ఎ) ఫైకోసయనిన్స్... నీలి రంగులో ఉంటాయి. ఎక్కువగా నీలి ఆకుపచ్చ శైవలాల్లో కనిపిస్తాయి. బి) ఫైకోఎరిథ్రిన్... ఇవి ఎరుపు రంగులో ఉంటాయి. ఎక్కువగా ఎరుపు శైవలాల్లో కనిపిస్తాయి.

కెరోటినాయిడ్స్, ఫైకోబిలిన్స్ కాంతిని గ్రహించుకుంటాయి కానీ వినియోగించుకోలేవు. ఇవి తాము గ్రహించిన కాంతిని తిరిగి క్లోరోఫిల్స్‌కు ఇచ్చేసి క్లోరోఫిల్‌ను కాంతి ఆక్సీకరణం బారి నుంచి రక్షిస్తాయి. కాబట్టి వాటిలో క్లోరోఫిల్-ఎ మినహా మిగతా అన్ని రకాల వర్ణద్రవ్యాలను 'రక్షక వర్ణద్రవ్యాలు' లేదా 'అదనపు వర్ణద్రవ్యాలు' అంటారు.

ఈ వర్ణద్రవ్యాలే కాకుండా టమాటలో రంగుకు కారణమైన 'లైకోపిన్' అనే కెరోటినాయిడ్, పుష్పాలు, ఫలాల్లో పర్పుల్ (ముదురు నీలం) రంగుకు కారణమైన ఆంథోసయనిన్‌లు ఉంటాయి.

కిరణజన్య సంయోగ క్రియ ఉపయోగాలు

❋ కిరణజన్య సంయోగ క్రియ వల్ల అన్ని జీవులకు ఆహారం అందుతుంది.
❋ వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను మొక్కలు శోషిస్తాయి. దీనినే 'మొక్కల కర్బన స్థిరీకరణ' అంటారు. ఈ ప్రక్రియ ద్వారా వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ క్షీణించి గ్లోబల్ వార్మింగ్ (భూతాపం) తగ్గుతుంది. ❋ భూమిపై వాతావరణంలో ఉన్న ఆక్సిజన్‌కు మూలం కిరణజన్య సంయోగక్రియ. జీవులన్నింటికి శ్వాసక్రియలో ఉపయోగపడే ఆక్సిజన్ ఈ ప్రక్రియ ద్వారానే లభిస్తుంది. ❋ కిరణజన్య సంయోగ ప్రక్రియ వల్లే భూమిపై బయోమాస్ (జీవద్రవ్యరాశి) ఎక్కువగా ఏర్పడుతుంది.
❋ కిరణజన్య సంయోగక్రియ చర్యలతో ఏర్పడే మాధ్యమిక పదార్థాలు మొక్కల్లో ఇతర రసాయనాల ఏర్పాటుకు ఉపయోగపడతాయి.

కిరణజన్య సంయోగ క్రియలో దశలు

కిరణజన్య సంయోగ క్రియలో కాంతి వినియోగాన్ని బట్టి రెండు దశలు ఉన్నాయి. అవి: 1) కాంతి దశ 2) నిష్కాంతి దశ

కాంతి దశ: ఈ దశలో చర్యలన్ని కాంతి సమక్షంలో జరుగుతాయి. దీనిలో కాంతి శోషితమై, నీరు విచ్ఛిన్నం చెంది, ఆక్సిజన్ విడుదలై శక్తిజనకాలైన ATP, NADPHలు ఏర్పడతాయి.

నిష్కాంతి దశ: ఈ దశలోని చర్యలకు కాంతి ప్రమేయం అవసరం లేదు. అంటే కాంతి ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఇవి జరుగుతాయి. ఈ దశలోని కాంతి చర్యల్లో ఏర్పడిన ATP, NADPH ఉపయోగపడి చివరకు గ్లూకోజ్ తయారవుతుంది. ఈ చర్య కాంతి దశ తర్వాత మాత్రమే జరుగుతుంది. కాంతి దశ లేకపోతే ఇది జరగదు.

❋ కిరణజన్య సంయోగ క్రియ మొక్కల్లో జరిగే నిర్మాణాత్మక క్రియకు, ఉష్ణగ్రాహక సేంద్రియ రసాయన చర్యకు ఉదాహరణ. ❋ భూమిపై అత్యధిక కిరనజన్యసంయోగక్రియ సముద్రాల్లోని శైవలాలు వల్ల జరుగుతుంది. ❋ కిరణజన్య సంయోగక్రియ ఆకుపచ్చని మొక్కల్లోనే కాకుండా కొన్ని బ్యాక్టీరియాల్లో కూడా జరుగుతుంది. ❋ అతిఎక్కువ కిరణజన్యసంయోగ క్రియ ఎరుపుకాంతిలో జరుగుతుంది. ❋కిరణజన్య సంయోగక్రియలో నీటి ఆక్సీకరణ, కార్బన్‌డై ఆక్సైడ్ క్షయకరణ చర్యలు జరుగుతాయి.

మొక్కల్లో పోషణ: ఇది అనేక రకాలుగా ఉంటుంది. భూమిపై ఉన్న ఆకుపచ్చని మొక్కలు, శైవలాలు 99% స్వయంపోషకాలుగా ఉంటాయి. కొన్ని మొక్కలు పరాన్నజీవులుగా, పూతికాహారులుగా కూడా ఉంటాయి.

పరాన్నజీవ మొక్కలు: ఆతిథేయిపై పోషణ కోసం ఆధారపడే వాటిని 'పరాన్న జీవులు' అంటారు. మొక్కల్లో కొన్ని ఇతర మొక్కలపై పాక్షికంగా లేదా పూర్తిగా పోషకాల కోసం ఆధారపడతాయి. వీటినే 'పరాన్నజీవ మొక్కలు' అంటారు. ఇవి రెండు రకాలు అవి-

పాక్షిక పరాన్నజీవ మొక్కలు: ఇవి ఆతిథేయి మొక్కపై కేవలం లవణాలు, నీటి కోసం ఆధారపడతాయి. వీటికి ఉదాహరణ 1) పాక్షిక వేరు పరాన్నజీవ మొక్కలు -స్ట్రైగా. 2) పాక్షిక కాండ పరాన్నజీవ మొక్కలు-లొరాంథస్.


స్ట్రైగా



పూర్తి పరాన్నజీవ మొక్కలు: ఇవి ఆతిథేయిపై ఆహారం, లవణాల కోసం పూర్తిగా ఆధారపడతాయి. వీటికి ఉదాహరణ 1) పూర్తి వేరుపరాన్న జీవ మొక్కలు - ఒరబాంకి, బెలనోఫోరా. 2) పూర్తి కాండపరాన్న జీవమొక్కలు- కస్క్యూటా.

పూతికాహార మొక్కలు: చనిపోయిన వృక్ష, జంతుదేహాల మీద, కుళ్లుతున్న పదార్థాలపై నివసిస్తూ వాటి నుంచి పోషకాలను తీసుకునే జీవులను 'పూతికాహారులు' అంటారు. ఉదా: మోనోట్రోపా, నియోట్టియా.


> గ్లోబల్ వార్మింగ్‌ను కలిగించే ముఖ్య వాయువు కార్బన్ డయాక్సైడ్. దీనిని తగ్గించడానికి సులువైన, చవకైన, మార్గం మొక్కలను నాటడం, అడవులను పెంచడం. మొక్కలు కిరణజన్య సంయోగ క్రియలో కార్బన్ డయాక్సైడ్‌ను శోషించుకోవడం వల్ల వీటిని 'కార్బన్ సింక్స్' (కార్బన్ డయాక్సైడ్ తొట్టెలు) అంటారు. మొక్కల కంటే సముద్రాలు ఎక్కువగా కార్బన్ డయాక్సైడ్‌ను శోషించుకుంటాయి. కాబట్టి మొదటి, అత్యధిక కర్బన శోషకాలని సముద్రాలను పేర్కొంటారు.



రచయిత: డాక్టర్ బి.నరేష్

ధ్రువాల్లో పూలమొక్కలు.. ఎడారుల్లో ముళ్ల పొదలు!

భూగోళంపై ప్రాంతాల వారీగా భిన్నమైన శీతోష్ణస్థితులు, నైసర్గిక స్వరూపాలు ఉంటాయి. జీవనానికి అనుకూలంగా, ఆహ్లాదకరంగా ఉండే మైదానాలు, సముద్ర తీర ప్రాంతాలతో పాటు విపరీత వాతావరణ పరిస్థితులు ఉండే ధ్రువాలు, ఎడారులు మొదలైన భూస్వరూపాలు ఉన్నాయి. భూమిపై కనిపించే ఈ వాతావరణ వ్యత్యాసం, జీవజాలం స్థితిగతులను అర్థం చేసుకోవడానికి, అధ్యయనం చేయడానికి మొత్తం భూభాగాన్ని ప్రకృతిసిద్ధ మండలాలుగా వర్గీకరించారు. వాటి ప్రకారం పెరిగే వృక్షజాలం, జంతుజాలం, ఆర్థిక వ్యవస్థల తీరుతెన్నులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రధాన ఎడారులు, మైదానాలు, అడవులు, పచ్చికబయళ్లు విస్తరించిన దేశాలు, అక్కడి ఉష్ణోగ్రతలు, నివసించే తెగలు, లభ్యమయ్యే సహజ వనరులు, ఖనిజ సంపద గురించి తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

ప్రకృతిసిద్ధ మండలాలు

1. కింది వాటిలో భూమధ్య రేఖా మండలానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇది ప్రధానంగా భూమధ్యరేఖకు ఇరువైపులా 5° నుంచి 10° వరకు, ఉత్తర దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంటుంది.
బి) దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదీ పరీవాహక ప్రాంతం, ఆఫ్రికాలోని కాంగో నదీ పరీవాహకం, ఆగ్నేయ ఆసియా ప్రాంతంలో విస్తరించి ఉంటుంది.
సి) ఇక్కడ సరాసరి వర్షపాతం సంవత్సరానికి సగటున 200 సెం.మీ.గా ఉంటుంది.
డి) ఈ మండలంలోని దట్టమైన అడవులతో నిండి ఉన్న ప్రాంతాన్ని 'సెల్వాలు' అంటారు. ఇక్కడ జనాభా తక్కువ.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.


సెల్వాలు

2. కింది వాటిని జతపరచండి.

ఆదిమ తెగ	నివసిస్తున్న ప్రాంతం
ఎ) సమాంగ్	1) సుమత్రా దీవులు
బి) రెడ్ ఇండియన్స్	2) కాంగోనదీ ప్రాంతం
సి) పిగ్మీలు	3) అమెజాన్ పరీవాహక ప్రాంతం
డి) కాబు	4) మలేసియా

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-4, బి-2, సి-1, డి-3
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

3. అయనరేఖా ఎడారుల ప్రాంతానికి చెందిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇది ప్రధానంగా భూమధ్యరేఖకు ఇరువైపులా 15° నుంచి 30° ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది.
బి) ఇక్కడి వృక్షజాలం వేళ్లు పొడవుగా, దట్టమైన బెరడు, మందమైన చిన్న ఆకులు, ముళ్లపొదలతో ఉంటాయి.
సి) సంవత్సర సగటు వర్షపాతం 25 సెం.మీ. కంటే తక్కువ. పగటి ఉష్ణోగ్రతలు దాదాపుగా 50°C వరకు ఉంటాయి.
డి) ఈ ప్రాంతంలో వేసవిలో అధికంగా సంభవించే దుమ్ము తుపాన్లను 'సైమూన్స్' అంటారు.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి, సి, డి సరైనవి.

4. కింది వాటిని జతపరచండి.

ఎడారులు	విస్తరించిన ప్రాంతాలు
ఎ) కలహరి	1) ఆస్ట్రేలియా
బి) అటకామా	2) ఉత్తర అమెరికా నైరుతి భాగం
సి) సోనారన్	3) దక్షిణ అమెరికాలోని పెరు, చిలీ దేశాలు
డి) గిబ్సన్	4) ఆఫ్రికా నైరుతి ప్రాంతం

1) ఎ-1, బి-4, సి-3, డి-2 2) ఎ-4, బి-1, సి-2, డి-3
3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-4, బి-3, సి-2, డి-1

5. కింది వాటిలో మధ్యధరా ప్రకృతిసిద్ధ మండలానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇది ప్రధానంగా ఖండాలకు పశ్చిమ భాగాన దాదాపుగా 30° - 40° ల ఉత్తర దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది.
బి) ఇక్కడి ప్రధాన వృక్షసంపదలో లావెండర్, ఆలీవ్, మెర్టెల్, కార్క్ ఓక్ ముఖ్యమైనవి.
సి) వీటిని 'ఆర్చర్ భూములు' అంటారు. విశాలపత్ర సతతహరిత వృక్షాలు పెరుగుతాయి.
డి) ఈ మండలంలో నారింజ, ద్రాక్ష, ఆలీవ్ ప్రధానంగా సాగు చేస్తారు. చిలీ ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాలను 'హసియోండాలు' అంటారు.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, సి సరైనవి; బి, డి సరికావు.



కార్క్ ఓక్

6. కింది వాటిని జతపరచండి.

మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతంలో లభించే ఖనిజాలు	ప్రాంతాలు
ఎ) పాదరసం, కరారా పాలరాయి	1) ఫ్రాన్స్ (గ్రాసే)
బి) సీసం, యశదం(జింక్)	2) కాలిఫోర్నియా
సి) పెట్రోలియం	3) ఇటలీ
డి) సుగంధ పరిమళద్రవ్యం	4) ఆస్ట్రేలియా (బ్రోకెన్ హిల్స్)

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

7. కింది వాటిలో సవన్నా గడ్డిభూములకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇవి ప్రధానంగా భూమధ్యరేఖకు ఇరువైపులా 10° నుంచి 20° ఉత్తర దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉన్నాయి.
బి) ఇక్కడి వృక్షజాలం ప్రధానంగా భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో దట్టంగా, ఉన్నత అక్షాంశాల వద్దకు వెళ్లే కొద్దీ ఎత్తయిన గడ్డిభూములుగా మారతాయి.
సి) ఇక్కడ సరాసరి వర్షపాతం కొంత భిన్నంగా, కొన్ని ప్రాంతాల్లో వార్షిక వర్షపాతం 25 సెం.మీ. ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో 125 సెం.మీ.గా ఉంటుంది.
డి) ఈ ప్రాంతాల్లోని గడ్డి సరాసరిగా ఒక మీటరు నుంచి ఆరు మీటర్ల వరకు ఉంటూ ఏనుగులు సైతం కనిపించవు.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, డి సరైనవి; బి, సి సరికావు.



8. కింది వాటిని జతపరచండి.

సవన్నా గడ్డి భూములు	ప్రాంతాలు
ఎ) క్యాంపోస్	1) అర్జెంటీనా
బి) లానోలు	2) ఆఫ్రికా
సి) గ్రాన్‌చాకో	3) బ్రెజిల్, బోలీవియా
డి) సవన్నా	4) వెనుజువెలా

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-1, డి-2
3) ఎ-3, బి-1, సి-2, డి-4 4) ఎ-1, బి-2, సి-3, డి-4

9. సమశీతోష్ణమండల గడ్డిభూములకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇవి భూమధ్యరేఖకు ఇరువైపులా 35°-55° ఉత్తర,దక్షిణ అక్షాంశాలమధ్య విస్తరించి ఉంటాయి.
బి) ఈ మండలంలో అధిక వేడిమి, తీవ్రమైన చలి ఉంటాయి. అంటే వేసవిలో సరాసరిగా 38°C శీతాకాలంలో -90°C వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.
సి) ఈ మండలంలో పెరిగే అడోనిస్ వెర్నాలిస్ అనే గడ్డి మూత్రపిండాల వైద్యానికి; హోమియోపతిలో గుండె సంబంధిత వ్యాధులు నయం చేయడానికి ఉపయోగిస్తారు.
డి) ఇక్కడ పెరిగే ఆల్ఫా ఆల్ఫా గడ్డిలో ఎక్కువ పోషకాలుంటాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరికావు.
4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.



ఆల్ఫా ఆల్ఫా గడ్డి

10. కింది వాటిని జతపరచండి.

సమశీతోష్ణ గడ్డి భూములు	ప్రాంతాలు
ఎ) పుస్తాజ్	1) దక్షిణాఫ్రికా
బి) కాంటర్బరీ	2) ఆస్ట్రేలియా
సి) డౌన్స్	3) హంగేరి
డి) వెల్డ్స్	4) న్యూజిలాండ్

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-3, బి-1, సి-2, డి-4

11. కింది వాటిలో టైగా మండలానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇది 55° ల నుంచి 70° ఉత్తర అక్షాంశాల మధ్య మాత్రమే విస్తరించి ఉంటుంది.
బి) ఇక్కడ ప్రపంచంలో అధిక వాతావరణ వ్యత్యాసాలు ఉంటాయి. అంటే సైబీరియాలోని వెర్కోయాన్స్క్‌లో 68° ఉష్ణోగ్రత నమోదైంది.
సి) ప్రపంచంలోనే అతిపెద్ద సతతహరిత అరణ్యాలున్న ప్రాంతం. ప్రధానంగా స్ప్రూస్, లార్చ్, ఫిర్, పైన్ లాంటి వృక్షాలు ఉంటాయి.
డి) ఈ ప్రాంతంలో ఉన్ని ఉత్పత్తి చేసే జంతువులు అధికం. అందుకే ఉన్నితో చేసే వాణిజ్యం ఎక్కువ.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, డి సరైనవి; బి, సి సరికావు.



12. అయన రేఖ మండలంలో లభించే ఖనిజాలకు సంబంధించిన ప్రాంతాలను జతపరచండి.

ఖనిజాలు	ప్రాంతం
ఎ) వజ్రాలు	1) కుల్‌గార్డీ, కాల్‌గుర్లీ (ఆస్ట్రేలియా)
బి) రాగి	2) పశ్చిమాసియా
సి) బంగారం	3) కలహరి ఎడారి
డి) ముడిచమురు	4) చిలీ

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-1, డి-2
3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-2, సి-3, డి-4

13. కింది వాటిలో టండ్రా మండలానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇది సరాసరిగా 70° నుంచి 90° ఉత్తర అక్షాంశాల మధ్య విస్తరించి ఉంటుంది.
బి) ఇక్కడ దాదాపు నవంబరు, డిసెంబరు, జనవరిల్లో మూడు నెలల పాటు సూర్యుడు కనిపించడు. కానీ, చీకటి ఏర్పడకుండా అరోరా బొరియాలిస్ అనే ధ్రువపు వెలుగులు ఉంటాయి.
సి) ఈ మండలంలో నాచు, లైకెన్స్, సెడ్జ్‌లతో కూడిన విశాల గడ్డి భూములు ఉంటాయి.
డి) ధ్రువాల వైపు పాపీలు, లిల్లీలు బటర్‌కప్ అనే పూలమొక్కలు కూడా పెరుగుతాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, సి, డి సరైనవి
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు


అరోరా బొరియాలిస్

14. కింది వాటిని జతపరచండి.

ధ్రువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు	ప్రాంతాలు
ఎ) ఎస్కిమోలు	1) ఈశాన్య ఆసియా
బి) సమోయిడ్స్	2) స్కాండినేవియా
సి) లాపులు	3) సైబీరియా
డి) చుక్కీ	4) గ్రీన్‌లాండ్

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-4, బి-1, సి-2, డి-3
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

15. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) ఉష్ణమండల గడ్డిభూముల ప్రాంతమైన నైజీరియాలో ప్రధానంగా 'హౌసా పులానీ' అనే తెగ నివసిస్తోంది.
బి) అయనరేఖ ఎడారిలో భాగంగా అరేబియా, ఉత్తర ఆఫ్రికా ప్రాంతాల్లో 'బోదోయయున్'; కలహరి ఎడారిలో బుష్‌మెన్ అనే సంచర జాతులు నివసిస్తున్నాయి.
సి) అమెరికాలో ప్రయరీలు సమశీతోష్ణ మండల గడ్డి భూముల ప్రాంతంలో భాగం. ఇక్కడ అంగోరా జాతి మేకల ద్వారా శ్రేష్ఠమైన ఉన్ని లభిస్తుంది.
డి) ఉష్ణమండల గడ్డిభూముల ప్రాంతంలో భాగంగా దక్షిణ అమెరికాలోని అడవుల్లో పెరిగే క్యూబ్రాబో వృక్షాల నుంచి చేసిన టానిన్‌ను తోళ్ల పరిశ్రమలో ఉపయోగిస్తారు.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.



రచయిత: బండ్ల శ్రీధర్


సమాధానాలు

1-2; 2-1; 3-4; 4-4; 5-1; 6-2; 7-3; 8-2; 9-3; 10-2; 11-1; 12-2; 13-3; 14-1; 15-1.

ద్రాక్ష లాంటి సంచులు.. వాయు వినిమయ గోణులు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

మానవుల్లోని అవయవాలు సరిగా పనిచేయడంలో, జీవక్రియలు సక్రమంగా సాగడంలో శ్వాసవ్యవస్థ ప్రముఖపాత్ర పోషిస్తుంది. మానవ శరీరంలో జరిగే ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస ప్రక్రియలను శ్వాసక్రియ అంటారు. కణాలు ఆక్సిజన్‌ను గ్రహించి, శరీరానికి అవసరమైన శక్తిని విడుదల చేయడంలో శ్వాసక్రియ పాత్ర అత్యంత కీలకం. ఆంగ్లంలో దీన్ని Respiration అంటారు. ఇది Respire అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. అంటే పీల్చడం అని అర్థం. ఒక నిమిషంలో జరిగే శ్వాసక్రియ వేగాన్ని శ్వాసక్రియ రేటు అంటారు.



మానవ శ్వాసవ్యవస్థ

శరీర కణాలకు ఆక్సిజన్ (O_2) సరఫరా చేసి, కార్బన్ డైఆక్సైడ్ (CO_2)ను తొలగించడాన్నే శ్వాసక్రియ అంటారు. ఈ వ్యవస్థ ప్రధానంగా మూడు విధులను నిర్వర్తిస్తుంది. అవి:

- గాలిలోని ఆక్సిజన్‌ను రక్తంలోకి తీసుకోవడం.
- శరీరంలోని CO_2ను బయటకు విడుదల చేయడం.
- pH నియంత్రణతో పాటు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం.

శ్వాసవ్యవస్థ నిర్మాణం

శ్వాసవ్యవస్థ ప్రధానంగా నాసికా కుహరం, గ్రసని, శ్వాసనాళం, ఊపిరితిత్తులు అనే భాగాలను కలిగి ఉంటుంది.

నాసికా కుహరం: ఇది ముక్కు లోపలి భాగం. ఇందులో రోమాలు, శ్లేష్మం ఉంటాయి. ఇవి గాలిని గాలితం చేయడం, తేమగా మార్చడం, వేడి చేయడం లాంటి పనులు చేస్తాయి.

గ్రసని: ముక్కు, నోటి వెనుక ఉండే సాధారణ మార్గం. ఇది గాలి, ఆహార మార్గంలా పని చేస్తుంది.

- స్వరపేటిక లేదా కంఠనాళికను వాయిస్ బాక్స్ అంటారు. ఇందులో ఎపిగ్లాటిస్ ఉంటుంది. ఇది ధ్వనిని ఉత్పత్తి చేయడంతో పాటు ఆహారం ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించకుండా నివారిస్తుంది.

శ్వాసనాళం: ఇది 10-12 సెం.మీ. పొడవు ఉంటుంది. ఇందులో C ఆకారపు కార్టిలేజ్ రింగులు ఉంటాయి. ఇది గాలిని ఊపిరితిత్తులకు తీసుకెళ్తుంది.

- శ్వాసనాళం బ్రాంకైలు అనే రెండు పెద్ద శాఖలుగా, బ్రాంకియోల్స్ అనే చిన్న శాఖలుగా విభజితమై ఉంటుంది. బ్రాంకైలు గాలిని ఊపిరితిత్తులకు పంపిణీ చేస్తాయి.
- బ్రాంకియోల్స్ కార్టిలేజ్ లేదా మృదులాస్థి లేకుండా ఉండి, గాలి ప్రవాహాన్ని నియంత్రిస్తాయి.
- ఊపిరితిత్తుల్లో సుమారు 300 మిలియన్ల ద్రాక్ష లాంటి సంచులు ఉంటాయి. వీటిని ఆల్వియోలై లేదా వాయు గోణులు అంటారు. ఇవి వాయు వినిమయం ద్వారా O_2ను రక్తంలోకి తీసుకుని, CO_2ను రక్తం నుంచి బయటకు విడుదల చేస్తాయి.

శ్వాసక్రియ యాంత్రికం

పీడనం కలిగించే దశలో డయాఫ్రమ్ కిందికి, ఉరఃపంజరం బయటకు వెళ్తాయి. దీంతో ఊపిరితిత్తుల ఘనపరిమాణం పెరిగి, పీడనం తగ్గడంతో గాలి లోపలికి వస్తుంది. ఈ ప్రక్రియలో డయాఫ్రమ్, ఇంటర్‌కాస్టల్ మజిల్స్ పనిచేస్తాయి.

- ఉచ్ఛ్వాస దశలో డయాఫ్రమ్ పైకి, ఉరఃపంజరం లోపలికి వెళ్తాయి. దీంతో ఘనపరిమాణం తగ్గి, పీడనం పెరిగి గాలి బయటకు వెళ్తుంది.
- ఆల్వియోలైలో వాయు వినిమయ సమయంలో O_2 ఆల్వియోలస్ నుంచి క్యాపిలరీ రక్తంలోకి వ్యాపనం ద్వారా వెళ్తుంది. అనంతరం CO_2 రక్తం నుంచి ఆల్వియోలస్‌లోకి వెళ్తుంది.
- రక్తంలో O_2 రవాణా 97% హిమోగ్లోబిన్‌లో (HbO_2), 3% ప్లాస్మాలో జరుగుతుంది. CO_2 రవాణాలో 70% బైకార్బొనేట్ (HCO_3) రూపంలో, 20% Hbలో, 10% ప్లాస్మాలో జరుగుతుంది.
- శ్వాసక్రియ నియంత్రణ మెడుల్లా, పాన్స్ (బ్రెయిన్‌స్టెమ్) ద్వారా జరుగుతుంది. కెమోరిసెప్టర్స్ CO_2, H^+, O_2 స్థాయులను గుర్తిస్తాయి. హెరింగ్-బ్రూయర్ రిఫ్లెక్స్‌లో ఊపిరితిత్తులు ఎక్కువగా నిండితే ఉచ్ఛ్వాసాన్ని ప్రేరేపిస్తుంది.

శ్వాసవ్యవస్థ - వ్యాధులు

శ్వాసవ్యవస్థ వ్యాధులు ఊపిరితిత్తులు, శ్వాసనాళం, నాసికా కుహరం మొదలైన భాగాలను ప్రభావితం చేస్తాయి. ఇవి ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, కాలుష్యం, ధూమపానం లాంటి కారణాల వల్ల వస్తాయి. ఈ వ్యాధులు శ్వాసక్రియను దెబ్బతీసి ఆక్సిజన్ సరఫరాను తగ్గిస్తాయి. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణం COPD, ఆస్తమా మొదలైనవి.

ఆస్తమా: ఆస్తమా అంటే బ్రాంకై, బ్రాంకియోల్స్‌కి దీర్ఘకాలిక వాపు, సన్నబారడం. ఇది అలర్జెన్లు (పొడి, పొగ), ఇన్ఫెక్షన్ల వల్ల మొదలవుతుంది. ఊపిరి ఆడకపోవడం, ఛాతీ బిగుతు, దగ్గు, శ్వాసలో ఈల లాంటి శబ్దం ఈ వ్యాధి లక్షణాలు. నివారణలో ఇన్‌హేలర్స్ (సాల్బుటమాల్), అలర్జీ నివారణ, స్టెరాయిడ్స్ ఉపయోగిస్తారు.

బ్రాంకైటిస్: బ్రాంకైటిస్ అంటే బ్రాంకై వాపు. ఇది ఎక్యూట్ (వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల, 1-3 వారాలు) లేదా క్రానిక్ (ధూమపానం, COPDలో భాగం) రకాలుగా ఉంటుంది. దగ్గు, శ్లేష్మం ఉత్పత్తి పెరగడం, జ్వరం, ఛాతీ నొప్పి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. నివారణకు యాంటీబయాటిక్స్ వాడటం, విశ్రాంతి తీసుకోవడం, ధూమపానం మానేయడం లాంటివి సూచిస్తారు.

న్యూమోనియా: న్యూమోనియా అంటే ఆల్వియోలైలో ఇన్ఫెక్షన్, ద్రవం నిండటం. ఇది బ్యాక్టీరియా (స్ట్రెప్టోకాకస్ న్యూమోనియా), వైరస్ లేదా ఫంగస్ వల్ల వస్తుంది. అధిక జ్వరం, దగ్గు (శ్లేష్మం లేదా రక్తం), ఊపిరి ఆడకపోవడం, ఛాతీ నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయి. దీని నివారణకు యాంటీబయాటిక్స్, వ్యాక్సిన్ (PCV, PPSV), ఆక్సిజన్ థెరపీని ఉపయోగిస్తారు.

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (COPD): COPD అంటే దీర్ఘకాలిక బ్రాంకైటిస్, ఎంఫిసీమా కలయిక. ఇది ప్రధానంగా ధూమపానం లేదా కాలుష్యం వల్ల వస్తుంది. దీర్ఘకాలిక దగ్గు, శ్వాస ఆడకపోవడం, అలసట ప్రధాన లక్షణాలు. నివారణలో బ్రాంకోడైలేటర్స్, స్టెరాయిడ్స్‌ను వాడతారు.

ఎంఫిసీమా: ఎంఫిసీమా అంటే ఆల్వియోలై గోడలు దెబ్బతిని విస్తరించడం. ఇది ధూమపానం వల్ల ఆల్ఫా-1 యాంటీట్రిప్సిన్ లోపం లేదా కాలుష్యం వల్ల వస్తుంది. శ్వాస ఆడకపోవడం (ముఖ్యంగా ఉచ్ఛ్వాసంలో), బారెల్ చెస్ట్, బరువు తగ్గడం లక్షణాలుగా ఉంటాయి. ధూమపానం మానేయడం, ఆక్సిజన్ థెరపీ నివారణ మార్గాలు.

ఊపిరితిత్తుల క్యాన్సర్: ఊపిరితిత్తుల కణాల అనియంత్రిత వృద్ధిని ఊపిరితిత్తుల క్యాన్సర్ అంటారు. ఇది ధూమపానం (85% కేసులు), రెడాన్ గ్యాస్ లేదా ఆస్‌బెస్టాస్ వల్ల వస్తుంది. దీర్ఘకాలిక దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడటం, ఛాతీ నొప్పి, బరువు తగ్గడం ముఖ్య లక్షణాలు. సర్జరీ, కీమోథెరపీ, రేడియేషన్, ధూమపానం మానేయడం నివారణ మార్గాలు.

ట్యూబర్క్యులోసిస్: ఇది మైకోబ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ వల్ల వచ్చే ఊపిరితిత్తుల వ్యాధి. ఇది బిందురూప ఇన్ఫెక్షన్ ద్వారా వ్యాపిస్తుంది. దగ్గు (రక్తంతో), జ్వరం, రాత్రి చెమటలు పట్టడం, బరువు తగ్గడం మొదలైన లక్షణాలు ఉంటాయి. నివారణకు DOTS థెరపీ, BCG వ్యాక్సిన్‌ను ఉపయోగిస్తారు. ఇతర వ్యాధులు...

సైనసైటిస్: సైనస్ కుహరాల ఇన్‌ఫ్లమేషన్. ఇది అలర్జీ లేదా ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. తలనొప్పి, ముక్కు మూసుకుపోవడం లక్షణాలుగా ఉంటాయి.

- సిస్టిక్ ఫైబ్రోసిస్ అనే జన్యు వ్యాధి. ఇది మందమైన శ్లేష్మాన్ని ఉత్పత్తి చేసి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది.

శ్వాస వ్యాధులు – ప్రధాన కారణాలు

ధూమపానం, కాలుష్యం, ఇన్ఫెక్షన్లు, అలర్జీలు మొదలైనవి ఈ వ్యాధులకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. వీటి నివారణ కోసం ధూమపానం మానేయడం, మాస్క్ ధరించడం, వ్యాక్సినేషన్ (ఇన్‌ఫ్లూయెంజా, న్యూమోకాకల్), ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



రచయిత
డా.కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

మాదిరి ప్రశ్నలు

1. ఆల్వియోలైలో వాయు వినిమయం జరిగే ప్రధాన వాయువులు ఏవి?
   1) O_2, N_2 2) O_2, CO_2
   3) CO_2, H_2O 4) N_2, H_2
2. సర్ఫాక్టెంట్ ఉత్పత్తి చేసే కణాలు?
   1) Type I 2) Type II
   3) గాబ్లెట్ 4) మాక్రోఫేజెస్
3. శ్వాసక్రియలో CO_2 ఎక్కువగా ఏ రూపంలో రవాణా అవుతుంది?
   1) కార్బమినో Hb 2) $HbCO_2$
   3) కరిగిన CO_2 4) HCO_3^-
4. ఊపిరితిత్తుల వైటల్ కెపాసిటీ సగటు విలువ?
   1) 1200 ml 2) 4600 ml
   3) 6000 ml 4) 3100 ml
5. ఆహారం శ్వాసనాళంలోకి ప్రవేశించకుండా కంఠనాళికలోని ఏ భాగం ఆపుతుంది?
   1) ఎపిగ్లాటిస్ 2) గ్లాటిస్
   3) యువులా 4) టాన్సిల్స్
6. ఆస్తమా ప్రధాన లక్షణం ఏమిటి?
   1) రక్తంతో దగ్గు 2) వీజింగ్
   3) బారెల్ చెస్ట్ 4) రాత్రి చెమటలు
7. TBకి కారణమయ్యే బ్యాక్టీరియా?
   1) స్ట్రెప్టోకాకస్
   2) కరోనా వైరస్
   3) మైకోబ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్
   4) ఫంగస్

సమాధానాలు
1-2, 2-2, 3-4, 4-2, 5-1, 6-2, 7-3

Word of the Day 844

Liberal

Telugu meaning: ఉదారవాద, ఔదార్యంగల
English meaning: Liberal (లిబరల్) is an adjective that describes someone who is open-minded, generous, or supportive of progressive ideas and freedoms.
Synonyms: Open-minded, Generous
Antonyms: Conservative, Narrow-minded
Usage: 1. She has a liberal attitude toward education, encouraging creativity and free expression.
2. The company is known for its liberal policies that support employee growth and flexibility.

నోటిఫికేషన్స్

ఇంటర్న్‌షిప్ ఉద్యోగాలు

ఎక్రాస్ ద గ్లోబ్ (ఏటీజీ) కంపెనీ డిజిటల్ మార్కెటింగ్ ఇంటర్న్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 20. స్టయిపెండ్ నెలకు రూ.2,500 నుంచి రూ.10,000 వరకు ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు 2025 డిసెంబరు 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

బీఈసీఐఎల్‌లో పోస్టులు

నోయిడాలోని బ్రాడ్ కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ), డ్రైవర్ తదితర ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 18. దరఖాస్తు ఫీజు రూ.295. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 2025 డిసెంబరు 7.

అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

గురుగ్రామ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్).. నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ జోన్‌లలో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 400. దరఖాస్తు ఫీజు రూ.600. అర్హులైన అభ్యర్థులు 2025 డిసెంబరు 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ ప్రవేశాలకు నేడే (నవంబరు 28) చివరి తేదీ


- ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో 17 ప్రొఫెషనల్ పోస్టులు. బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎండీఐలో పీజీడీఎం 2026 ప్రవేశాలు. బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఎన్‌ఐఈపీవీడీలో 14 లెక్చరర్ పోస్టులు. డిప్లొమా, డిగ్రీ, బీఎడ్, డీఎడ్, ఎంఎడ్, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులు అర్హులు.
- నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌లో ఆఫీసర్ ఉద్యోగాలు. సీఏ, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

శాస్త్రవేత్తలు విశేషాలు

ఎన్రికో ఫెర్మీ

ఈయన ఇటాలియన్ - అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో అనేక పరిశోధనలు చేశారు. ఫెర్మీని అణు యుగానికి మార్గదర్శకుడిగా పేర్కొంటారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అణుబాంబును రూపొందించడంలోనూ ఈయన ముఖ్య పాత్ర పోషించారు. ఫెర్మీ.. స్టాటిస్టికల్ మెకానిక్స్, క్వాంటం థియరీ, న్యూక్లియర్ - కణ భౌతికశాస్త్ర అభివృద్ధికి విశేషమైన కృషి చేశారు. నవంబరు 28న ఎన్రికో ఫెర్మీ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం – వృత్తి జీవితం

ఫెర్మీ 1901, సెప్టెంబరు 29న ఇటలీలోని రోమ్‌లో జన్మించారు. స్థానిక గ్రామర్ స్కూల్‌లో విద్యను అభ్యసించారు. చిన్నతనం నుంచే ఫెర్మీ చదువులో ముందుండేవారు. గణితం, భౌతికశాస్త్రాలపై ఎక్కువ ఆసక్తి చూపేవారు.


- 1926లో రోమ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరారు.
- ముస్సోలినీ నియంతృత్వ పోకడల కారణంగా ఆయన ఇటలీ విడిచి అమెరికా వెళ్లిపోయారు. 1939లో కొలంబియా యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా చేరారు.
- 1944లో అమెరికా పౌరసత్వం తీసుకున్నారు. అదే ఏడాది మెక్సికోలో ఉన్న లాస్ అలమోస్ నేషనల్ ల్యాబొరేటరీకి అసోసియేట్ డైరెక్టర్ అయ్యారు.
- 1946, జనవరిలో చికాగోలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. మరణించే వరకు అక్కడే పనిచేశారు.

ఫెర్మీ చేసిన పరిశోధనలు, పొందిన గౌరవాలు తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

భారతదేశ పారిశ్రామిక రంగ నిర్మాణం - ప్రాధాన్యత

ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదలకు పారిశ్రామిక రంగం దోహదపడుతుంది. భారత ఆర్థిక వ్యవస్థలో రెండో ప్రధాన రంగంగా పారిశ్రామిక రంగం ఉంది. దీన్నే ద్వితీయ రంగం అని కూడా అంటారు. పారిశ్రామిక రంగం ప్రాధాన్యత, పరిశ్రమల నిర్మాణం - రకాలు, పరిశ్రమల వర్గీకరణ మొదలైన అంశాలపై పోటీ పరీక్షార్థికి అవగాహన ఉండాలి.



ఉపరంగాలు

పారిశ్రామిక రంగంలో ప్రధానంగా నాలుగు ఉపరంగాలు ఉన్నాయి. అవి:

1. గనులు/తవ్వకాల రంగం
2. తయారీ రంగం
3. విద్యుత్, గ్యాస్ (సహజ వాయువు), నీటి సరఫరా, ఇతర ప్రయోజన సేవల రంగాలు
4. నిర్మాణ రంగం

పారిశ్రామిక రంగం – ప్రాధాన్యత

పారిశ్రామిక రంగం వివిధ ఉత్పత్తుల తయారీకి సంబంధించిన ఆర్థిక రంగాన్ని సూచిస్తుంది.

- దీనివల్ల ఆర్థిక వృద్ధి, ఆర్థికాభివృద్ధి పెరుగుతాయి.
- జాతీయాదాయం, తలసరి ఆదాయం అధికమవుతాయి.

పారిశ్రామిక విప్లవం, పరిశ్రమలు - రకాలు, భారతదేశంలో పరిశ్రమల నిర్మాణం, పారిశ్రామిక వెనుకబాటుతనానికి కారణాలు, భారతీయ పరిశ్రమలు - సమస్యలు, పంచవర్ష ప్రణాళికల్లో పారిశ్రామికాభివృద్ధి, భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి దశలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

NRSC is located in which Indian city?

Current Affairs

1. Who among the following Indian-origin leaders was elected as the Lieutenant Governor of Virginia in 2025?
   A) Rishi Sunak B) Ghazala Hashmi
   C) Nikki Haley D) Vivek Ramaswamy
2. Who has been appointed as the new Controller General of Defence Accounts (CGDA) in 2025?
   A) Rajeev Talwar B) Vishvajit Sahay
   C) Sanjay Malhotra D) Neeta Verma
3. Who has recently taken charge as the new Financial Advisor (Defence Services) under the Ministry of Defence in 2025?
   A) Ajay Seth B) T.V. Somanathan
   C) S. Somanath D) Raj Kumar Arora
4. Who has recently assumed charge as the Director General of the Bureau of Indian Standards (BIS)?
   A) Sanjay Garg B) Rajiv Bansal
   C) Arun Kumar Mishra D) Anil Kumar Jain
5. Which legendary footballer has been conferred with a Knighthood by the United Kingdom in recognition of his contributions to sports and philanthropy?
   A) Steven Gerrard B) Wayne Rooney
   C) Frank Lampard D) David Beckham
6. Which Indian city was recently recognised by UNESCO as the 'City of Gastronomy' for its rich Awadhi culinary heritage?
   A) Lucknow B) Hyderabad
   C) Amritsar D) Jaipur
7. Who took oath as the 53rd Chief Justice of India (CJI) by the President of India in 2025?
   A) Justice Sanjiv Khanna
   B) Justice B.R. Gavai C) Justice Surya Kant
   D) Justice Hima Kohli

General Knowledge

8. The Gaur Maria Dance, performed during marriage ceremonies, is a traditional dance of which Indian state?
   A) Chhattisgarh B) Jharkhand
   C) Madhya Pradesh D) Odisha
9. In which year did Priyanka Chopra win the Miss World pageant, before later receiving the Padma Shri in 2016?
   A) 1999 B) 2001 C) 2000 D) 2002
10. In which year was the Prime Minister Street Vendor's AtmaNirbhar Nidhi (PM-SVANidhi) scheme launched, which is fully funded by the Ministry of Housing and Urban Affairs?
    A) 2020 B) 2018 C) 2021 D) 2019

SSC Exams Special

General Awareness

11. The National Remote Sensing Centre (NRSC), which operates under ISRO, is located in which Indian city?
    A) Bengaluru B) Chennai
    C) New Delhi D) Hyderabad

History

12. Which ruler shifted his capital from Delhi to Devagiri (renamed Daulatabad) in Maharashtra to make it more centrally located?
    A) Alauddin Khilji
    B) Muhammad Bin Tughlaq
    C) Firoz Shah Tughlaq
    D) Ghiyasuddin Tughlaq
13. Who was the English diplomat sent by the East India Company in 1615 to the Mughal court of Emperor Jahangir?
    A) Ralph Fitch B) Thomas Roe
    C) William Hawkins D) Robert Clive
14. The Battle of Raichur (1520) was fought between which two powers?
    A) Vijayanagara Empire and Sultanate of Bijapur
    B) Mughal Empire and Bahmani Kingdom
    C) Marathas and Mughals
    D) Cholas and Hoysalas
15. The First Battle of Panipat (1526) was fought between Babur and which ruler?
    A) Sher Shah Suri B) Alauddin Khilji
    C) Sikandar Lodi D) Ibrahim Lodi

Polity

16. Which Article of the Indian Constitution provides that the President shall lay the recommendations of the Finance Commission before both Houses of Parliament along with an explanatory memorandum?
    A) Article 280 B) Article 282
    C) Article 281 D) Article 283
17. Which writ empowers the Supreme Court or High Courts to review and quash the orders of a lower court or tribunal that has acted beyond its jurisdiction?
    A) Mandamus B) Prohibition
    C) Quo Warranto D) Certiorari
18. The Constitution (100th Amendment) Act, 2015 ratified the Land Boundary Agreement between India and which neighbouring country?
    A) Bangladesh B) Nepal
    C) Bhutan D) Myanmar
19. Which Article of the Indian Constitution empowers the government to restrict Fundamental Rights while martial law is in force in any area?
    A) Article 32 B) Article 34
    C) Article 20 D) Article 35

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

మావోయిస్టుల కంచుకోటలో సిరులు



- ఏటీఎం మోడల్ పంటలతో రైతులకు స్థిర ఆదాయం

ఆ జిల్లా ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోట. పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్నా.. పెద్ద సంఖ్యలో సన్నకారు రైతులున్నా అక్కడ వ్యవసాయ రంగం అంతగా బలపడలేదు. మావోయిస్టుల ప్రభావం కారణంగా వ్యవసాయశాఖ కార్యక్రమాలు ఆ జిల్లాలో సరిగా అమలయ్యేవి కావు. ఇప్పుడు మావోయిస్టుల కదలికలు తగ్గడంతో ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో రైతులకు మంచి రోజులు మొదలయ్యాయి. జిల్లా అధికార యంత్రాంగం, వ్యవసాయశాఖ చేపడుతున్న కార్యక్రమాలతో అన్నదాతలు ఆర్థిక స్వావలంబన దిశగా పురోగమిస్తున్నారు. ప్రత్యేకించి తక్కువ టైంలో ఎక్కువ లాభాలను పండించే ఏటీఎం రైతులకు దొరికింది.

రైతులకు శిక్షణ

దంతెవాడ జిల్లా రైతులు మొదటి నుంచే పంటల సాగుకు రసాయనాలు, క్రిమిసంహారకాలను చాలా తక్కువగా వినియోగిస్తున్నారు. అందుకే దీన్ని సేంద్రియ జిల్లా అని పిలుస్తుంటారు. ఈ అంశాన్ని జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర వ్యవసాయశాఖ గుర్తించాయి. సేంద్రియ సాగు పద్ధతుల్లో పండించే పంటలకు మార్కెట్‌లో ఎక్కువ ధర లభిస్తోంది. అందుకే ఇకపైనా ఆ పద్ధతిలోనే పంటలను పండించాలని రైతులను ప్రోత్సహిస్తున్నారు. వీలైనంత ఎక్కువ మంది రైతులను సేంద్రియ సాగు బాటలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఇదే సమయంలో ఈ జిల్లాకు చెందిన 30 మంది రైతులను ఎంపిక చేసి ఏటీఎం మోడల్‌లో కూరగాయలను సాగు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఇది ఎంతో విప్లవాత్మక సాగు పద్ధతని వ్యవసాయ రంగ నిపుణులు అంటున్నారు. ఇప్పుడు అంతటా దీని గురించే చర్చ జరుగుతోంది.

ఏమిటీ మోడల్?

దంతెవాడ జిల్లాలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. వారికి ఉండే వ్యవసాయ భూమి అంతంతే. ఈ కొద్దిపాటి వ్యవసాయ భూమిని అత్యంత లాభదాయక రీతిలో సమర్థంగా వినియోగించుకునే మార్గాన్ని ఏటీఎం మోడల్ చూపిస్తుంది. ఇదొక బహుళ అంచెల వ్యవసాయ నమూనా. ఇందులో భాగంగా సన్నకారు రైతులు తమ భూమిలో ఒకేసారి మూడు నుంచి నాలుగు రకాల కూరగాయల విత్తనాలను విత్తుతారు. అనంతరం ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒక్కో పంట చేతికొస్తుంది. సగటున ప్రతి 20 రోజులకోసారి ఒక్కో పంట చేతికి వస్తుంటే రైతుల ఆర్థిక అవసరాలు తీరుతుంటాయి. వారు మళ్లీ కొత్త పంటలు వేసుకునే అవకాశం దక్కుతుంది. రెగ్యులర్ ఆదాయం, విభిన్న పంటల సాగు అనేది ఒక చక్రంలా తిరుగుతూ రైతుల జీవితాలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తుంది. ఇప్పటికే దక్షిణ భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో ఏటీఎం మోడల్ పంటల సాగు విజయవంతమైంది. ఇప్పుడు దంతెవాడలో ఇది వేగంగా విస్తరిస్తోంది.

సాగుచేసే పంటలివీ..

ఏటీఎం మోడల్ సాగు పద్ధతికి కూరగాయల పంటలు అనుకూలమైనవి. ఈ జాబితాలో పాలకూర, మెంతికూర, తోటకూర, ముల్లంగి, క్యారెట్, ఆవకూర, కొత్తిమీర, బీట్‌రూట్, టమాటాలు, వంకాయలు, క్యాప్సికమ్ జాతి మిరపకాయలు ఉన్నాయి. ఈ పంటలన్నీ సగటున 15 నుంచి 25 రోజుల్లోగా చేతికొస్తాయి. ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్ పంటలు చేతికి రావడానికి 25 రోజుల టైం పడుతుంది. టమాటాలు, వంకాయ, క్యాప్సికమ్ జాతి మిరపకాయలు చేతికి రావడానికి కొంత ఎక్కువ టైం అవసరం. ఏడాదంతా వీటిని పండిస్తూ, ప్రతినెలా నిర్దిష్ట ఆదాయాన్ని రైతులు అందుకోవచ్చు. దీనివల్ల వారు అప్పుల ఊబిలో కూరుకుపోయే అవకాశాలు ఉండవు.

ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

గాలిలో సాగు.. దిగుబడి బాగు

- అందుబాటులోకి అధునాతన సేద్యపు పద్ధతి
- 100 రెట్ల నాణ్యమైన పంట
- ఇండోర్‌లో ప్రయోగశాల సిద్ధం



ఇండోర్ ప్రయోగశాలలో సిద్ధమవుతున్న మొక్కలు

మట్టి అక్కర్లేదు. నీళ్ల తొట్టెల్లాంటివీ అవసరం లేదు. గాల్లోనే మొక్కలు పెరుగుతాయి. నిజం. 'మేం గాలి భోంచేస్తాము రామాహరీ..' అని పాడినట్లు గాలిలోనే సాగు పూర్తవుతుంది! వైరస్‌ల బెడద ఉండదు. ఇది కలకాదు. సాకారమవుతున్న నిజం. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ వ్యవసాయ కళాశాలలో దీనికోసం అత్యంత అధునాతనమైన ప్రయోగశాల (ఏరోఫోనిక్ ల్యాబ్)ను నెలకొల్పారు. సంప్రదాయ పద్ధతిలోనైతే బంగాళాదుంప మొక్కకు 5 నుంచి 7 దుంపలు వస్తాయి. మట్టి, నీరు లేకుండా చేసే ఏరోఫోనిక్ సాగులో 50 నుంచి 200 వస్తాయి. ఉత్పత్తి అన్నిరెట్ల మేర పెరగనుంది. సాధారణ పద్ధతితో పోలిస్తే 100-200 రెట్ల అధిక నాణ్యతతో, వైరస్ రహితంగా బంగాళాదుంపలు పండించవచ్చని రుజువైంది.

ముమ్ముందు రైతులు చేపట్టేలా..

మధ్యప్రదేశ్‌లోని మాల్వా-నిమాడ్ ప్రాంతం వ్యవసాయ పరంగా అత్యంత సుసంపన్నమైనది. ఇలాంటిచోట నేలపై, నీళ్లలోనే కాకుండా గాలిలోనూ పంటలు పండించాలని ఈ ప్రయోగశాలను నెలకొల్పారు. సేంద్రియ పద్ధతిలో పండించిన, వైరస్‌రహిత స్వచ్ఛమైన పంటలకు దేశంలో డిమాండు పెరుగుతుండటంతో రాజమాత విజయరాజె సింధియా వ్యవసాయ విశ్వవిద్యాలయం వినూత్న ప్రయోగాలు చేస్తోంది. ఇప్పటికే గ్వాలియర్, సీహోర్‌లలో ల్యాబ్‌లు ఏర్పాటుకాగా తాజాగా ఇండోర్‌లో నెలకొల్పారు. ఇక్కడ వాణిజ్యప్రాతిపదికన పంట సాగుకు రంగం సిద్ధం చేస్తారు. ముమ్ముందు రైతులు కూడా ఈ సాగును చేపట్టవచ్చని గ్వాలియర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ అరవింద్ శుక్లా 'ఈటీవీ భారత్'కు చెప్పారు. ల్యాబ్ నుంచి టిష్యూకల్చర్ మొలకలను ఉపయోగించి ఆలుగడ్డల దిగుబడి చేయించనున్నామని తెలిపారు. "ఈ విధానంలో.. చిన్న రాళ్ల పరిమాణంలో ఉన్న దుంపల్ని పండిస్తారు. మొక్కలు గాల్లో ఉంటాయి. తర్వాత ఆ మొక్కల్ని నెట్‌హౌస్‌కు తరలిస్తారు. మూడోదశలో వాటిని పొలాల్లో నాటుకోవచ్చు. ఇలా పండిన దుంపల్లో ఎలాంటి వైరస్ ఉండదు. టమాటా, క్యారెట్, ముల్లంగి, మెంతికూర, పాలకూర వంటివీ ఈ విధానంలో పండించుకోవచ్చు. వీటి వ్యయం మాత్రం ఎక్కువగా ఉంటుంది" అని వివరించారు.

ఎలా సాధ్యమవుతుందంటే..

ఏరోఫోనిక్ సాంకేతికతలో మట్టి అవసరం లేకుండా బలవర్ధక పోషకాలను ద్రవరూపంలోనే మొక్కలపై స్ప్రే చేస్తారు. దీనికోసం మొక్కల్ని గాలిలో వేలాడదీస్తారు. నీటి వినియోగం చాలా తక్కువ. నియంత్రిత వాతావరణంలో మేలైన పంటలు పండుతాయి. మొక్కలకు నేల నుంచి అందే పోషకాలనే నీళ్లలో కలిపి.. గాల్లోని మొక్కల వేళ్లపై జల్లుతామని ప్రాజెక్టు ఇంజినీర్ డాక్టర్ సుష్మా తివారీ వివరించారు. దీనివల్ల మొక్కలకు పోషకాలు చక్కగా అంది, వేర్లు బలంగా పెరుగుతాయని చెప్పారు. ఇండోర్‌లో ఆరు గదుల యూనిట్‌ను నెలకొల్పితే ప్రతి యూనిట్ నుంచి 70,000 - 1,50,000 విత్తనాలు వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో చిప్స్ ఎగుమతులకు నూతన దిగుబడులు ఉపయోగపడతాయన్నారు.

ఈవీఎంల పరిశీలనకు అభ్యర్థనలు రాలేదు: ఈసీ

దిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థుల నుంచి ఈవీఎంల పరిశీలనకు ఎటువంటి అభ్యర్థనలు రాలేదని ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈ తరహా అభ్యర్థనలు రాలేదని గురువారం తెలిపింది.

రెండు వాతావరణ రాడార్‌ల ప్రారంభం

దిల్లీ: తీవ్ర వాతావరణ మార్పుల్ని గురించిన సమాచారాన్ని కచ్చితత్వంతో అందజేసే తొలి ఐఎండీ డాప్లర్ వెదర్ రాడార్‌లను మిషన్ మౌసమ్ కింద కేంద్ర వాతావరణ విభాగం ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల్లో స్థాపించింది. రాయ్‌పుర్, మంగళూరుల్లో స్థాపించనున్న ఈ కొత్త రాడార్‌లు మధ్య, తీర భారతావనిలో సంభవించే భారీ వర్షాలు, ఉరుములతో కూడిన వర్షాలు, మెరుపులు, వడగళ్ల తుపానులు తదితర వాతావరణ మార్పుల్ని ముందస్తుగా తెలియజేస్తాయి. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో డువల్ పోలరైజ్డ్ సీ బ్యాండ్ రాడార్‌ను ఇందిరాగాంధీ కృషి విశ్వవిద్యాలయంలో స్థాపించారు. 250 కిలోమీటర్ల విస్తృతి కలిగిన భూభాగాన్ని కవర్ చేసే ఈ రాడార్ ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తూర్పు మధ్యప్రదేశ్, నైరుతి ఝార్ఖండ్, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లోని దక్షిణ ప్రాంతాల్లో వాతావరణాన్ని పర్యవేక్షిస్తుంది. అలాగే మంగళూరులో నెలకొల్పిన రాడార్ కర్ణాటకలోని అరేబియన్ సముద్ర ప్రాంతంతోపాటు కేరళ, గోవా, దక్షిణ కొంకణ్, ఉత్తర లక్షద్వీప్, దక్షిణ మహారాష్ట్ర ప్రాంతాల్లో వాతావరణాన్ని పరిశీలించబోతోంది. కేంద్ర భూ విజ్ఞానశాస్త్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ రెండు రాడార్‌లను ప్రారంభించారు.

హసీనాకు వ్యతిరేకంగా మరో తీర్పు

- 3 అవినీతి కేసుల్లో 21 ఏళ్ల జైలుశిక్ష

ఢాకా: ప్రభుత్వ గృహనిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించి ప్లాట్ల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా(78)కు ఢాకా ప్రత్యేక కోర్టు 21 ఏళ్ల జైలు శిక్షను విధించింది. పుర్బాచల్ గృహనిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు అవినీతి కేసుల్లో ఆమెను దోషిగా నిర్ధారిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చింది. ఒక్కో అవినీతి కేసులో 7 ఏళ్ల చొప్పున మొత్తం 21 ఏళ్లు హసీనాకు శిక్ష పడింది. అంతేకాకుండా ఒక్కో కేసులో లక్ష టాకా (బంగ్లా కరెన్సీ)లను జరిమానాగా విధించింది. ఈ మొత్తాన్ని కోర్టుకు జమ చేయడంలో విఫలమైతే మరో 18 నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కేసులో హసీనా కుమారుడు సజీబ్ వాజీద్, కుమార్తె సైమా వాజీద్ పుతుల్‌లకూ ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష, లక్ష టాకాల జరిమానాను విధించింది. హసీనా కుటుంబంతో పాటు గృహనిర్మాణ శాఖ మాజీ సహాయమంత్రి షరీఫ్ అహ్మద్ సహా 20 మంది అధికారులనూ ఈ కేసుల్లో న్యాయస్థానం దోషులుగా తేల్చి జైలు శిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న కేసులో పది రోజుల క్రితం బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ హసీనాకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే.

గినీ బిసావులో సైనిక తిరుగుబాటు

- ఎన్నికల ఫలితాల వేళ కీలక పరిణామం

బిసావు: ఆఫ్రికాలో 22 లక్షల జనాభా ఉన్న చిన్న దేశం గినీ-బిసావులో గురువారం సైన్యం తిరుగుబాటు చేసి సైన్యాధికారి జనరల్ హోర్టా ఎన్టాను ఏడాదిపాటు సైనిక ప్రభుత్వాధినేతగా ప్రకటించింది. ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడాల్సి ఉండగా తిరుగుబాటు జరిగింది. తనను సైనికులు అరెస్టు చేశారని ప్రస్తుత అధ్యక్షుడు ఉమరో సిసోకో ఎంబాలో బుధవారం ఫ్రెంచి వార్తాసంస్థలకు తెలిపారు. ఇదంతా పెద్ద నాటకమని ప్రతిపక్ష నాయకుడు ఫెర్నాండో డియాస్ ఆరోపించారు. పూర్వాశ్రమంలో సైన్యాధికారిగా ఉన్న ఎంబాలోకు ప్రస్తుత సైనిక పాలకుడు జనరల్ హోర్టా మిత్రుడే. అధ్యక్ష ఎన్నికలో తాను గెలిచానంటే తాను గెలిచానని ఎంబాలో, డియాస్‌లు పోటాపోటీగా ప్రకటించారు. 50 ఏళ్లక్రితం పోర్చుగల్ నుంచి స్వాతంత్ర్యం పొందిన గినీ బిసావు ప్రపంచంలో అత్యంత పేద దేశాల్లో ఒకటి. లాటిన్ అమెరికా నుంచి గినీ బిసావు మీదుగానే ఐరోపాకు మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతుంటాయి. తాజా ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ఒక మాదకద్రవ్య మాఫియా నాయకుడి సాయంతో స్థానిక రాజకీయ నాయకులు కుట్రపన్నారని సైనిక పాలకులు ఆరోపించారు.

ఎన్నికల నిర్వహణ ముసుగులో చట్టసభల విధుల్లో జోక్యం



- ఈసీపై సుప్రీంకోర్టులో న్యాయవాది సింఘ్వీ విమర్శలు
- తమిళనాడు, కేరళలో 'సర్' కసరత్తుపై కొనసాగుతున్న వాదనలు

దిల్లీ: వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కసరత్తు నిర్వహణలో ఎన్నికల సంఘం (ఈసీ) నిర్వహిస్తోన్న పాత్రపై పిటిషనర్ల తరఫు న్యాయవాది తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎన్నికల నిర్వహణ ముసుగులో చట్టసభల విధులను ఈసీ తనకు తాను చేపట్టినట్లుగా ప్రస్తుత కసరత్తు జరుగుతోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విమర్శించారు. రాజ్యాంగ పరిమితులను దాటి నిర్హేతుకమైన నిబంధనలతో పౌరులపై తీవ్ర భారాన్ని ఈసీ మోపుతోందని తెలిపారు. ఓటర్ల అర్హతను నిర్ణయించేందుకు 11 పత్రాలు సమర్పించాలనే నిబంధనలను ఏ చట్టం ప్రకారం ఈసీ విధిస్తోందని ప్రశ్నించారు. అలాంటి చట్టాన్ని చేయాల్సింది పార్లమెంటు లేదా అసెంబ్లీలు మాత్రమేనని, ఎన్నికల సంఘం కాదని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 'సర్' కసరత్తుపై ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ముందు రెండో రోజైన గురువారం కూడా వాదనలు కొనసాగాయి. 'సర్ ప్రక్రియను ఫొటో ధ్రువీకరణ కోసం కాకుండా పౌరసత్వ తనిఖీ కోసమే చేపట్టిన సామూహిక కసరత్తు అన్నట్లుగా ఉందని సింఘ్వీ ఆక్షేపించారు. పిటిషనర్లలో ఒకరి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా వాదనలు వినిపించారు. 'బూత్ స్థాయి అధికారులుగా ఉపాధ్యాయులను నియమించి వారి ద్వారా పౌరసత్వాన్ని నిర్ధారించడం, ఆ తర్వాత ఓటరుగా చేర్చాలో లేదో నిర్ణయించడం ప్రమాదకరమైన చర్య. 2003 ఓటరు జాబితాలో తండ్రి పేరును పొరపాటున చేర్చకపోయి ఉంటే ఆ కారణంతో అతని సంతానానికి ఇప్పుడు ఓటు తిరస్కరించడం సమంజసమేనా?' అని సిబల్ ప్రశ్నించారు. డిసెంబరు 2న వాదనలు కొనసాగనున్నాయి.

పౌరసత్వానికి ఆధార్ ప్రామాణికం కాదు: సుప్రీంకోర్టు

బుధవారం నాటి విచారణ సందర్భంగా ఆధార్ కార్డు మాత్రమే పౌరసత్వానికి ప్రామాణికం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై ఆందోళన వ్యక్తంచేసింది. పౌరులు కానివారు ఆధార్ కలిగి ఉంటే వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా? అని ప్రశ్నించింది. 'ఆధార్ అనేది సంక్షేమ పథకాలను పొందేందుకు రూపొందించిన చట్టబద్ధ పత్రం మాత్రమే. రేషన్ ఇవ్వడం కోసం ఆధార్‌ను మంజూరు చేసినందుకు గాను వాళ్లని తప్పసరిగా ఓటరుగా చేయాలా? పొరుగు దేశానికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే, అతనికి కూడా ఓటు హక్కు ఇవ్వాలా? ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే అధికారం ఈసీకి ఉంది' అని ధర్మాసనం పేర్కొంది.

కుటుంబానికి దూరమై 40 ఏళ్లు.. 'సర్' కసరత్తుతో అమ్మ చెంతకు



ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని భీల్వాడా జిల్లాలో 40 ఏళ్ల క్రితం జ్ఞాపకశక్తి కోల్పోయి కుటుంబానికి దూరమైన ఓ వ్యక్తి.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుతో తిరిగి తన కుటుంబసభ్యులను కలుసుకున్నాడు. కరేడా పంచాయతీలోని జోగి ధోరా గ్రామానికి చెందిన ఉదయ్‌సింగ్ స్వగ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలో చదివేవాడు. వేసవి సెలవుల్లో పని కోసం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లాడు. అక్కడ ప్రయివేటు కంపెనీలో గార్డుగా పనిచేస్తూ.. ఓ రోడ్డు ప్రమాదం కారణంగా జ్ఞాపకశక్తిని కోల్పోయి ఎక్కడెక్కడో తిరిగాడు. గ్రామంలోని కుటుంబసభ్యులు ఏళ్లతరబడి గాలించినా ఉపయోగం లేకపోయింది. ఈసీ చేపట్టిన 'సర్' ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ఇంటింటికీ తిరుగుతున్నారు. ఈ క్రమంలో జీవన్‌సింగ్ అనే ఉపాధ్యాయుడు ఒకప్పుడు తన సహ విద్యార్థి అయిన ఉదయ్‌సింగ్‌ను గుర్తుపట్టి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు, గ్రామస్థులు డ్రమ్స్, డీజేలతో ఊరేగింపుగా ఉదయ్‌సింగ్‌ను ఇంటికి తీసుకువెళ్లారు. 40 ఏళ్ల తర్వాత కుమారుణ్ని చూసి తల్లి చునీదేవి రావత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

గనుల రాయల్టీపై పిటిషన్ల మీద నిర్ణయం తీసుకుంటాం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: గనుల రాయల్టీ విషయంలో రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లను పరిశీలించి నిర్ణయం వెలువరిస్తామని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రికార్డులను పరిశీలించి ఆ తరువాత నిర్ణయం వెలువరిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం గురువారం వెల్లడించింది.

ఖనిజాల తవ్వకం హక్కులపై పన్నులు విధించే అధికారం చట్టరీత్యా రాష్ట్రాలకే ఉందని, వాటిపై వచ్చే రాయల్టీ పన్నుల కిందకు రాదని 2024 జులై 25న నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 8-1 మెజారిటీతో తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో అనేక రాష్ట్రాలు తమ వాటా కోసం సుప్రీం కోర్టులో పిటిషన్లు వేశాయి. దీనిని సీజేఐ ధర్మాసనం ఎదుట ఓ న్యాయవాది ప్రస్తావించారు. దీంతో వాటిపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

ఈ కేసులో కేంద్రం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. 2024 నాటి తీర్పునకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం క్యూరేటివ్ పిటిషన్ వేసిందని చెప్పారు. అది పరిష్కారమైన తరువాతే రాష్ట్రాల పిటిషన్లను విచారణకు స్వీకరించాలని కోరారు. దాంతో రికార్డులను పరిశీలించి ఒక నిర్ణయం తీసుకుంటానని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు.

భారీగా ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాక్

- భారత నౌకాదళ ఉన్నతాధికారి వ్యాఖ్య

ఇంటర్నెట్ డెస్క్: ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో పాకిస్థాన్ తన సైనిక సామర్థ్యాలను పెంచుకునే పనిలో నిమగ్నమైందని నౌకాదళ ఉన్నతాధికారి ఒకరు ప్రకటించారు. ప్రపంచం నలుమూలల నుంచీ పాక్ ఆయుధాలు, పేలుడు సామగ్రి కొనుగోలు చేస్తోందని, ఇది ఆందోళనకరమైన విషయమని ఆయన వ్యాఖ్యానించారు. పెరుగుతున్న చైనా శక్తి సామర్థ్యాల నేపథ్యంలో ఇదొక పెను సవాలుగా మారిందని అన్నారు. పశ్చిమ నేవల్ కమాండ్‌కు నాయకత్వం వహిస్తున్న వైస్ అడ్మిరల్ కె.స్వామినాథన్ ముంబయిలో బ్రహ్మ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన ఒక సమావేశంలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. హిందూ మహా సముద్రంలో చైనా ప్రాబల్యం పెరుగుతుండటంపైనా స్వామినాథన్ ఆందోళన వ్యక్తంచేశారు. "చైనా నౌకాదళం ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్దదిగా ఆవిర్భవించింది. గతంలో ఎన్నడూ లేనంతగా విస్తరిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. "చైనా నౌకాదళం మూడో తరం విమాన వాహక నౌక 'ఫుజియాన్'ను ప్రారంభించింది. ఇది చైనా వ్యూహాత్మక సిగ్నలింగ్ వ్యవస్థలో భాగం. ఆ దేశం హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఐదు నుంచి ఎనిమిది యుద్ధ నౌకల్ని మోహరించింది. ఇది ఆందోళనకరం" అని స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. చైనా చేతిలో యుద్ధనౌకలు, పరిశోధక నౌకలు, ఉపగ్రహ ట్రాకింగ్ నౌకలు, ఫిషింగ్ క్రాఫ్టులు ఉన్నాయని తెలిపారు. "దక్షిణ చైనా సముద్రంలో మాత్రమే కాకుండా హిందూ మహాసముద్ర ప్రాంతంలో కూడా చైనా మరింతగా బలపడుతోంది. అందువల్ల, చైనా శాశ్వత సవాలుగా కొనసాగనుంది" అని ఆయన అన్నారు.

వందేమాతరం, జైహింద్ నినాదాలపై అభ్యంతరమా?

- రాజ్యసభ సచివాలయం ఉత్తర్వులపై కాంగ్రెస్ ఆగ్రహం

దిల్లీ: రాజ్యసభ సభ్యులు సభ లోపల, వెలుపల 'వందేమాతరం', 'జైహింద్' వంటి నినాదాలు చేయరాదంటూ ఎగువసభ సచివాలయం ఈనెల 24న వెలువరించిన ఉత్తర్వులను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. స్వాతంత్ర్య సమరంలో పాల్గొనకుండా, బ్రిటిషర్లకు అనుకూలంగా వ్యవహరించిన వాళ్ల నుంచి ఇలాంటి సూచనలు వెలువడటంలో ఆశ్చర్యం లేదని భాజపాపై ఆరోపణలు చేసింది. ''స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ నినాదాలు బ్రిటిష్ వారికి ఇబ్బంది కలిగించాయి. ఇప్పుడవి భాజపాకు కర్ణకఠోరంగా మారాయి'' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియ శ్రీనేత్ విలేకరులతో అన్నారు.

రూ.10వేలే కొంపముంచింది

- బిహార్‌పై కాంగ్రెస్ సమీక్ష

దిల్లీ: మహిళలకు ఎన్డీయే ప్రభుత్వ రూ.10వేల నగదు బదిలీ, సీట్ల సర్దుబాటులో జాప్యం, మహాగఠ్‌బంధన్‌లో విభేదాలు బిహార్ ఓటమికి కారణమని ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అధిష్ఠానానికి విన్నవించారు. ఓటర్ల జాబితాల్లోని లోపాలు, ఇతర ఎన్నికల అవకతవకలూ కారణమేనని మరి కొందరు నేతలు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లు గురువారం బిహార్‌లో పోటీ చేసిన అభ్యర్థులతో దిల్లీలో సమావేశమయ్యారు. 10 మంది చొప్పున బ్యాచ్‌లవారీగా విడదీసి సమీక్ష జరిపారు. ఇందులో బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ కృష్ణ అల్లవారు, ఎంపీలు అఖిలేశ్ ప్రసాద్ సింగ్, పప్పూ యాదవ్ పాల్గొన్నారు. 10, 11 సీట్లలో స్నేహపూర్వక పోటీ ప్రజలకు తప్పుడు సంకేతాలను పంపిందని అరారియా ఎమ్మెల్యే అబీదుర్ రహ్మాన్ అభిప్రాయపడ్డారు.

ఒకే అంతరిక్ష నౌకలో ముగ్గురు అమెరికా, రష్యా వ్యోమగాములు

మాస్కో: ఖగోళ పరిశోధనలో అమెరికా, రష్యాల మధ్య సహకారంలో భాగంగా ఇరుదేశాలకు చెందిన ముగ్గురు వ్యోమగాములు గురువారం అంతరిక్షంలోని అంతర్జాతీయ ఖగోళ కేంద్రం (ఐఎస్ఎస్) చేరుకున్నారు. ఇరుదేశాల వ్యోమగాములు కలిసి రష్యాకు చెందిన సోయుజ్ బూస్టర్ రాకెట్‌లో అంతరిక్షానికి పయనం కావడం విశేషం. ఈ ముగ్గురిలో ఒకరు అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన వ్యోమగామి క్రిస్ విలియమ్స్ కాగా మిగిలిన ఇద్దరూ రష్యాకు చెందిన సెర్గీ మికేవ్, సెర్గీ కుడ్ స్వెర్చ్‌కోవ్‌లు. కజకిస్థాన్‌లో రష్యా లీజుపై నిర్వహిస్తున్న బైకొనూర్ ప్రయోగ కేంద్రం నుంచి ఈ ముగ్గురి వ్యోమనౌక గురువారం పయనమైంది. దాదాపు మూడు గంటల ప్రయాణం అనంతరం సాయంత్రం 5.34 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమైంది. ముగ్గురు వ్యోమగాములూ ఎనిమిది నెలలు అంతరిక్షంలో వివిధ విషయాలపై పరిశోధనలు జరుపుతారు.

మీట నొక్కితే చాలు.. వేడివేడి 'ఛోలే' సిద్ధం

ఇంటర్నెట్ డెస్క్: మనమిక్కడ పానీపూరీ కోసం ఎంతగా ఎగబడతామో.. ఉత్తర భారతంలో ఛోలే భటూరే అంటే అంతగా ఇష్టపడతారు. ఈ పంజాబీ చిరుతిండికి దేశవ్యాప్తంగా ప్రేమికులు ఉన్నారు. పానీపూరీకి ఇప్పటికే



వెండింగ్ మెషిను ఉండగా.. ఇప్పుడు 'ఛోలే కుల్చే' పేరుతో దిల్లీలో యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఈ మెషిను వద్ద నిలబడి కావాల్సిన మీట నొక్కగానే వేడి వేడి ఛోలే (శనగలు) క్షణాల్లో ప్లేట్లలోకి వచ్చేస్తాయి. పొంగిన పూరీలతో లేదా కుల్చా రొట్టెలతో లాగించేయవచ్చు.

సైకిల్‌లో దాచిన రూ.కోటి విలువైన బంగారం

- స్వాధీనం చేసుకున్న బీఎస్ఎఫ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) రూ.కోటికిపైగా విలువైన ఏడు బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. నిఘా సమాచారం మేరకు, దక్షిణ బెంగాల్ సరిహద్దులోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో బీఎస్ఎఫ్ 119 బెటాలియన్ బుధవారం ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకుందని వివరించారు. బంగారు బిస్కెట్లను ఒక సైకిల్‌లో దాచిపెట్టారని, తనిఖీ చేస్తుండగా రైడర్ దానిని వదిలిపెట్టి తప్పించుకున్నాడని బీఎస్ఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. స్వాధీనం చేసుకున్న బంగారం మొత్తం బరువు 816.41 గ్రాములు ఉండగా దాని మార్కెట్ విలువ రూ.1.02 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

అమ్మను 'మమ్మీ'గా చేసి పింఛను కోసం వేషం!

- ఇటలీలో వెలుగుచూసిన కాసుల యావ

రోమ్: పింఛను డబ్బు కోసం ఓ వ్యక్తి కొత్త అవతారమెత్తాడు. చనిపోయిన తల్లి మాదిరిగా వేషం వేసుకొని.. ఆమెకు రావాల్సిన పెన్షన్‌ను పొందడం మొదలుపెట్టాడు. అనుమానం వచ్చిన అధికారులు అతడి కదలికలపై దృష్టి సారించగా వ్యవహారం బయటపడింది. ఉత్తర ఇటలీలోని బోర్గో వర్జీలియోకు చెందిన ఓ వ్యక్తి (56) తల్లి గ్రాజియెల్లా డాల్‌ఓగ్లియో (85) మూడేళ్ల క్రితం మరణించింది. అయినప్పటికీ ఆమె పెన్షన్ మాత్రం ఆగడం లేదు. ఇటీవల ఆమె ఐడీ కార్డు రెన్యువల్ కోసం స్థానిక రిజిస్ట్రీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో అతడు తల్లి మాదిరిగా వేషం వేశాడు. అచ్చం ఆమెలా కనిపించేందుకు 1970ల మాదిరి బ్లౌజ్, పొడవాటి స్కర్టు, గోళ్లకు పాలిష్, లిప్‌స్టిక్, విగ్గు, ముత్యాల నెక్లెస్, చెవి రింగులు ధరించాడు. ఎంతగా ఏమార్చాలని చూసినా ఓ ఉద్యోగికి మాత్రం అనుమానం వచ్చింది. మెడ భాగం లావుగా, ముడతలు వింతగా ఉండటం, చర్మం కూడా 85 ఏళ్ల వృద్ధురాలిగా కనిపించకపోవడం, స్త్రీ మాదిరిగానే స్వరం ఉన్నా మధ్యలో అక్కడక్కడా పురుషుల మాదిరిగా మాటలు రావడంతో గ్రాజియెల్లా అసలు ఫొటోతో పోల్చి చూశారు. మోసం జరిగిందని గ్రహించి మర్నాడు రావాలని చెప్పి పంపించేశారు. రెండోసారి అలా వచ్చినప్పుడు పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. మోసాన్ని అంగీకరించాడు. అతడి ఇంట్లో సోదాలు చేయగా.. మమ్మీగా మార్చిన తల్లి మృతదేహాన్ని కనుగొన్నారు. ఆమెది సహజ మరణంగానే పోలీసులు భావిస్తున్నప్పటికీ పోస్టుమార్టం తర్వాత అసలు కారణం తెలుస్తుందని సమాచారం. నిందితుడికి నర్సుగా అనుభవం ఉంది.



గ్రాజియెల్లా, ఆమె కుమారుడు

పెళ్లినాటి ఉంగరంతో ఉషా వాన్స్ విడాకుల వదంతులకు చెక్!



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సతీమణి ఉషా వాన్స్ విడాకులు తీసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల ఉషా వాన్స్ ఓ కార్యక్రమానికి హాజరు కాగా, ఆమె చేతికి పెళ్లినాటి ఉంగరం లేకపోవడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఆ వదంతులకు ఉషా చెక్ పెట్టారు. ఓ కార్యక్రమంలో ఆమె వెడ్డింగ్ రింగ్‌తో కన్పించారు. బుధవారం కెంటకీలో అమెరికా సైనికులతో కలిసి ఉపాధ్యక్షుడి కుటుంబం థాంక్స్ గివింగ్ కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. అమెరికా దళాలకు జేడీ, ఉషాలతో పాటు వారి పిల్లలు కలిసి భోజనం వడ్డించారు. వారితో అనేక విషయాలు ముచ్చటించారు. ఈ క్రమంలో ఉషా వాన్స్ చేతికి పెళ్లినాటి ఉంగరం కనిపించింది. దీంతో జేడీ వాన్స్ దంపతులు విడిపోనున్నారంటూ జరుగుతున్న ప్రచారానికి చెక్ పెట్టినట్లైంది.

బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియాకు అస్వస్థత

ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినాయకురాలు, మాజీ ప్రధాని ఖలీదా జియా గురువారం హృద్రోగ సమస్యతో స్థానిక ఆస్పత్రిలోని కరోనరీ కేర్ యూనిట్ (సీసీయూ)లో చేరారు. ఆమె అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని బీఎన్‌పీ మీడియా విభాగం తెలియజేసింది. 80 ఏళ్ల ఖలీదా గత ఆదివారం రాత్రి గుండె, ఛాతీ ఇన్‌ఫెక్షన్‌లకు గురై ఆస్పత్రిలో చేరినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియాఉర్ రెహమాన్ భార్య అయిన ఖలీదా.. కాలేయం, మూత్రపిండాల వ్యాధులతోపాటు మధుమేహం, కీళ్లవాతం, కంటికి సంబంధించిన రోగాలతో బాధపడుతున్నారు.

క్రిమియా వంతెనపై దాడి చేసిన వారికి యావజ్జీవం

మాస్కో: రష్యాను క్రిమియాతో కలిపే కీలక వంతెనను ధ్వంసం చేయడానికి ట్రక్కు బాంబును పేల్చిన 8 మందిని ఉగ్రవాదులుగా ప్రకటిస్తూ రష్యాలోని కోర్టు ఒకటి గురువారం తీర్పు చెప్పింది. నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వారిలో రష్యన్లు, ఉక్రేనియన్లు, ఆర్మేనియన్లున్నారు. 2022 అక్టోబరులో వంతెనపై దాడి జరిపించింది తామేనని, ట్రక్కు నడిపిన వారికి అందులో బాంబు ఉన్న సంగతి తెలియదని ఉక్రెయిన్ గూఢచార సంస్థ ఎస్.బి.యు. ప్రకటించింది. ఈ వంతెన మీదుగానే క్రిమియాకు ఆయుధాలను, ఆహారం, ఇతర సామగ్రిని రష్యా పంపుతోంది. 2014లో క్రిమియాను రష్యా ఆక్రమించినప్పటి నుంచి రెండుసార్లు ఈ వంతెనపై దాడులు జరిగాయి.

క్లౌడ్‌లో 21 వేల సినిమాలు

- ఐబొమ్మ రవి విచారణలో గుర్తించిన పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: తెలుగునాట సంచలనం రేకెత్తించిన పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు మరోసారి కస్టడీకి తీసుకున్నారు. చంచల్‌గూడ జైలు నుంచి గురువారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయానికి తీసుకొచ్చారు. విచారణ సందర్భంగా పైరసీ వెబ్‌సైట్ కోసం డేటా నిర్వహణ, అందుకు అనుసరించిన విధానాల మీద లోతుగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. క్లౌడ్ సర్వర్‌లో ఏమేమున్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో క్లౌడ్ సర్వర్ తెరిచి చూడగా పైరసీ చేసిన 21 వేల సినిమాలు అందులో భద్రపర్చినట్లు బయటపడింది. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లోని డేటా నిశితంగా పరిశీలిస్తున్నారు. ఫోన్ ద్వారా ఎవరెవరిని సంప్రదించాడనే కోణంలో ఆరా తీస్తున్నారు. రవి మెయిల్‌ను పరిశీలించి డొమైన్ కొనుగోలు చేసిన బిల్లులు గుర్తించారు. ఇంకా రెండ్రోజులు విచారించాల్సి ఉంది. తొలుత ఐదు రోజులు కస్టడీకి తీసుకుని విచారించిన పోలీసులు.. మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని కోర్టును ఆశ్రయించగా మూడు రోజుల కస్టడీకి అనుమతిచ్చింది.

'ఏఐసీటీఈ' అనుమతులకు డిసెంబరు 20 వరకు గడువు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఇప్పటికే నడుస్తున్న ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఎంసీఏ, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలు వచ్చే విద్యా సంవత్సరానికి అనుమతుల కోసం శుక్రవారం నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) కోరింది. ఈ మేరకు ఆ సంస్థ షెడ్యూల్‌ను గురువారం జారీ చేసింది. కొత్తగా ఆయా కళాశాలలను ఏర్పాటు చేయాలనుకుంటే మాత్రం జనవరి 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. పాత, కొత్త కళాశాలలు ఆలస్య రుసుముతో జనవరి 13 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆయా డీమ్డ్ వర్సిటీలు సైతం ఏఐసీటీఈ అనుమతి పొందాల్సిందే. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈసారి కొత్త కోర్సులు, సీట్లు పెంచుకోవడానికి కళాశాలలు ఆసక్తి చూపుతాయా? లేదా? అన్నది వేచిచూడాలి.

11న విజయవాడలో ఏపీ బీసీ మహా సదస్సు

ఈనాడు, అమరావతి: బీసీల హక్కుల సాధన లక్ష్యంగా డిసెంబరు 11న విజయవాడలో 'ఏపీ బీసీ మహా సదస్సు'ను నిర్వహించనున్నట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తెలిపారు. తమ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ సదస్సులో 'స్థానిక సంస్థల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు, రాజధానిలో బీసీ భవనాల కోసం వెయ్యి ఎకరాలు, బీసీ రక్షణ చట్టం, నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం, అభివృద్ధిలో బీసీలకూ భాగస్వామ్యం కల్పించాలి' అనే అంశాలపై ఇందులో చర్చించనున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బార్‌కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. జనవరి 30న రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 1న ప్రాథమిక ఓటర్ల జాబితా, 10న తుది జాబితా విడుదలవుతుంది. 20న ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్‌లు డిసెంబరు 29 నుంచి జనవరి 9 వరకు ఉంటాయి. జనవరి 10న నామినేషన్‌ల పరిశీలన, ఉపసంహరణకు 13 వరకు అవకాశం, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ 17న ఉంటుంది. ఎన్నికలు 30న నిర్వహించి, ఫలితాలు ఫిబ్రవరి 10న వెలువడనున్నాయి.



అనిశ్చితికి భయపడకుండా తొలి అడుగు వేయండి

'నాకు ఫలానా పని చేయడానికి తగిన అర్హత లేదు'. 'ఆ పనిని ఇప్పటికే ఇంకొకరు మెరుగ్గా చేశారు'. 'ఆ పనిని ఇప్పుడు మొదలుపెట్టడానికి నాకు వయసు మించిపోయింది'- ఇలాంటివన్నీ మీకు మీరు భయంతో చెప్పుకొనే మాటలే తప్ప అవి నిజాలు కాదు. అనిశ్చితికి భయపడకుండా మీరు తొలి అడుగు వేసిన తర్వాతే మీ సామర్థ్యమేంటో మీకు తెలిసొస్తుంది.

– కోడీ శాంచెజ్, బిజినెస్ గ్రోత్ మెంటార్

కృష్ణా, గోదావరి జలాల్లో

రాష్ట్ర వాటాపై గళమెత్తండి

- ధరల పతనంతో అన్నదాతల ఇబ్బందుల్ని వివరించండి
- మొంథా తుపాను నష్టపరిహారం త్వరగా అందేలా చూడండి
- పార్లమెంట్ సమావేశాలపై తెదేపా ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేశ్, లోక్‌సభలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత శ్రీకృష్ణదేవరాయలు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

ఈనాడు, అమరావతి: పార్లమెంటుతో పాటు ప్రజల్లోనూ చురుగ్గా ఉండాలని, పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొనాలని తెదేపా ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 'పేదల సేవలో' వంటి కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. వైకాపా వాళ్లు చేస్తున్న విషప్రచారాల్ని తిప్పికొట్టాలన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంట్‌లో సమన్వయంతో పనిచేయాలన్నారు. కృష్ణా గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా, గోదావరి ట్రైబ్యునల్, సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులపై కేంద్రాన్ని ఒప్పించేలా పార్లమెంటులో గళమెత్తాలని తెలిపారు. ఉండవల్లి నివాసంలో తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. త్వరలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానుండడంతో అనుసరించాల్సిన విధానాలపై ఎంపీలకు మార్గదర్శనం చేశారు. మొంథా తుపాను నష్టపరిహారం రాష్ట్రానికి త్వరగా అందేలా చూడాలని పేర్కొన్నారు. అత్యధిక యువ పార్లమెంటేరియన్లు ఉన్న పార్టీ తెదేపా అని చంద్రబాబు గుర్తుచేశారు.

రైతు సంక్షేమం, నీటి భద్రత గురించి ప్రస్తావించండి: 'రాష్ట్రాభివృద్ధి, రైతుల సంక్షేమం, నీటి భద్రత, సాంకేతిక పురోగతి, పెట్టుబడులు మన కీలక అంశాలు. వీటి గురించి పార్లమెంటులో ప్రస్తావించండి. రాష్ట్రానికి వీలైనంత ఎక్కువ ప్రయోజనం చేకూరేలా చూడండి' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'పత్తి, మొక్కజొన్న, అరటి ధరల పతనం, సీసీఐ నిబంధనలతో రైతులు పడుతున్న ఇబ్బందుల్ని వివరించండి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యాన, ఆహారశుద్ధి రంగాల్లో పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. వంశధార-గోదావరి-నల్లమల సాగర్ అనుసంధానం, వెలిగొండ, ఉత్తరాంధ్ర జల ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయి. నీటి భద్రతే మన ప్రభుత్వ లక్ష్యం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు కేంద్ర మద్దతు అవసరం

రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, డేటా సెంటర్లకు కావాల్సిన వనరులను కేంద్రం నుంచి సాధించాలని చంద్రబాబు పేర్కొన్నారు. 'ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు, 4జీ, 5జీ అనుసంధానం, క్వాంటమ్ వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకో సిస్టంలకు కేంద్రం మద్దతు చాలా అవసరం. విశాఖ-విజయవాడ మెట్రో రైలు, విశాఖ-తిరుపతి-అమరావతి ఎకనామిక్ రీజియన్స్, భోగాపురం విమానాశ్రయం, విశాఖ రైల్వే జోన్, ఉక్కు కర్మాగారం తదితర అంశాల్లో కేంద్రంతో చురుగ్గా చర్చలు జరపాలి.

అనవసర వివాదాల జోలికి వెళ్లొద్దు..

అనవసర వివాదాల జోలికి వెళ్లొద్దని ఎంపీలతో చంద్రబాబు అన్నారు. 'పార్టీకి చెడ్డ పేరు తీసుకురావొద్దు. నియోజకవర్గంలో గుడ్‌విల్ సంపాదించండి. ప్రజాప్రతినిధుల పనితీరుపై సమాచారం తెప్పించుకుంటున్నాను. మీ పనితీరును అంచనా వేస్తున్నా' అని చంద్రబాబు తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరో మెట్టుగా ఎస్క్రో ఎకౌంట్ నిలవనుందని.. లాజిస్టిక్స్ కార్పొరేషన్ ద్వారా రవాణా రంగంలో మార్పులు తీసుకురానున్నామని వివరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద గత వైకాపా ప్రభుత్వం 42 శాతం సీట్లను మాత్రమే కేటాయించిందని.. కానీ కూటమి ప్రభుత్వం 50 శాతం సీట్లు ఇస్తోందని మంత్రి నారా లోకేశ్ వివరించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలుపై మూగనోము

- సీఎం చంద్రబాబు ఆదేశించినా.. కదలని మార్క్‌ఫెడ్
- ఎకరాకు రూ.20 వేలకు పైగా నష్టపోతున్న రైతులు

ఈనాడు–అమరావతి: రోజులు.. వారాలు.. నెలలు గడుస్తున్నాయి. మొక్కజొన్నకు మార్కెట్ ధర పెరగడం లేదు. ప్రభుత్వమూ మద్దతు ధరపై కొనుగోలు చేయడం లేదు. ఇప్పటికే చాలామంది రైతులు మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.700 తక్కువకు అమ్ముకుని ఎకరాకు రూ.20 వేలకు పైగా నష్టపోయారు. మొక్కజొన్న సేకరణ వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించి ఐదు రోజులవుతోంది. అయినా ఇప్పటికీ సేకరణ ప్రక్రియే మొదలు కాలేదు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల్లో ఉలుకూ, పలుకూ లేదు. ఆర్థికశాఖ అనుమతి ఇవ్వలేదు. రైతులు తమ జిల్లాల్లోని మార్క్‌ఫెడ్ అధికారుల్ని సంప్రదిస్తే.. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాక కొనుగోలు మొదలు పెడతామని చెబుతున్నారు.

నెల నుంచి ఇబ్బందులే

మొక్కజొన్న సమస్య నెలకు పైగా ఉంది. గతంలో క్వింటాలు రూ.2,400 చొప్పున కొనుగోలు చేశారు. ఉన్నట్టుండి క్వింటాలుపై రూ.700 తగ్గించారు. భారీ వర్షాలతో రైతుకు దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. అదీ కొనుగోలు చేయకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అధికారుల్ని కోరుతున్నారు. అయినా వ్యవసాయ శాఖ గానీ, మార్కెటింగ్ శాఖ గానీ స్పందించడం లేదు.

మొక్కజొన్న ధరలోనే కోత ఎందుకు?

పెట్రోలులో ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియకు కేంద్రం ప్రాధాన్యమిస్తోంది. దీంతో రాష్ట్రంలోనూ ఇథనాల్ తయారీ పెరిగింది. డిస్టిలరీలు ఏర్పాటయ్యాయి. గత కొన్నేళ్లుగా మొక్కజొన్న సేకరణ పెరుగుతోంది. ధరలు క్రమంగా క్వింటాలుకు రూ.2,000 నుంచి రూ.2,400 పైగా చేరడంతో రైతులు కూడా సాగు పెంచారు. మిరప, పత్తి, పొగాకు ఇతర పంటల సాగుతో నష్టపోతున్న రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఎకరాకు రూ.35 వేలకు పైగా పెట్టుబడి అవుతున్నా వెనకాడటం లేదు. పండిస్తే కొనుగోలు చేస్తారనే నమ్మకమే దీనికి కారణం. అయితే ఈ ఏడాది దిగుమతుల కారణంగా దేశీయంగా మొక్కజొన్న ధరలు తగ్గాయి. రైతులకు ఇచ్చే ధరలో వ్యాపారులు కోత పెడుతున్నారు. మొక్కజొన్న ఆధారంగా తయారు చేసే ఇథనాల్ ధర 2021-22 సంవత్సరంలో లీటరు రూ.52.92 ఉండగా.. 2024-25 నాటికి రూ.71.86 అయింది. అయినా రైతులకు ఇచ్చే మొక్కజొన్న ధరల్లో మాత్రం కోత పెడుతున్నారు. క్వింటాలుకు కనీసం రూ.2,400 అయినా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించాలి. లేదంటే ఇథనాల్ తయారీ సంస్థలతో కొనుగోలు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

మద్దతు ధరపై మొక్కజొన్న సేకరణకు అనుమతి కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. రాష్ట్రంలోని మొత్తం ఉత్పత్తిలో 25% అంటే 2.04 లక్షల టన్నుల కొనుగోలుకు ధరల స్థిరీకరణ నిధి నుంచి రూ.7,630 కోట్లు బడ్జెట్ విడుదల చేయాలని కోరామన్నారు. గురువారం ఆయన వ్యవసాయ అధికారులు, ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కోళ్ల పరిశ్రమ, విత్తన తయారీదారులు, ఫార్మా ట్రేడర్లు మొక్కజొన్న కొనుగోలు చేయాలని సూచించారు. పౌల్ట్రీ, పశువుల దాణా తయారీదారులు, ఆహారశుద్ధి యూనిట్లు, డిస్టిలరీలు, బయో ఫ్యూయల్ యూనిట్లతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన పూల విక్రమ్



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును సీనియర్ జర్నలిస్ట్ పూల విక్రమ్ గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఆయన్ను ఇటీవల అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నియమించింది. దీంతో ఆయన సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఆరోగ్య కార్డులపై కమిటీ ఏర్పాటు హర్షణీయం: ఏపీఎన్జీవో



ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు సీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ తదితరులు

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల ఆరోగ్య కార్డులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడంపై ఏపీ ఐకాస ఛైర్మన్, ఏపీఎన్జీవో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, డీవీ రమణ హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు సీఈవో దినేశ్‌కుమార్‌ను గురువారం కలిసి ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఇటీవల జరిగిన ఉద్యోగుల సంఘాల సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 24 లక్షల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య కార్డుల సేవలు సరిగా అందడం లేదని చర్చల సందర్భంగా సీఎం దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ 60 రోజుల్లోపు సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం. ముఖ్యంగా వైద్య బిల్లుల ఆమోదంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. జిల్లాల్లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల పరిశీలనకు ఉన్న పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచాలి. ఉద్యోగుల వైద్యసేవల పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా పెంచాలి. విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలి" అని కోరారు.

నైజీరియన్ల డ్రగ్స్ దందా గుట్టు రట్టు

- దిల్లీ క్రైంబ్రాంచ్‌తో కలిసి తెలంగాణ 'ఈగిల్' భారీ ఆపరేషన్
- కొంపల్లి మల్నాడు రెస్టరెంట్ కేసు దర్యాప్తు క్రమంలో గుర్తింపు
- ఈ ముఠాని నడిపిస్తోంది అంతర్జాతీయ డ్రగ్ డీలర్ నిక్



ఈగిల్ బృందం స్వాధీనం చేసుకున్న డ్రగ్స్



నైజీరియన్లను అదుపులోకి తీసుకున్న ఈగిల్ బృందం

ఈనాడు, హైదరాబాద్: దేశ రాజధాని దిల్లీ కేంద్రంగా సాగుతున్న అంతర్జాతీయ డ్రగ్ రాకెట్ కార్యకలాపాల్ని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఈగిల్) బృందం ఛేదించింది. దిల్లీలో అక్రమంగా ఉంటూ మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న నైజీరియన్ల దందా గుట్టు రట్టు చేసింది. నెలల తరబడి ఆపరేషన్ కొనసాగించి అంతర్జాతీయ డ్రగ్ డీలర్ నిక్ నేతృత్వంలోని నెట్‌వర్క్ ఆట కట్టించింది. దిల్లీలోని పలు ప్రాంతాలతో పాటు గ్రేటర్ నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలలో గురువారం ఏకకాలంలో దాడులు నిర్వహించి ఈ ముఠాను పట్టుకుంది. ఇంతమంది విదేశీ డ్రగ్స్ స్మగ్లర్లు ఒకేసారి పట్టుబడటం దేశంలో ఇదే తొలిసారి.

హైదరాబాద్ కేసు ఆధారంగా..

హైదరాబాద్ కొంపల్లిలోని మల్నాడు కిచెన్ రెస్టరెంట్ నిర్వాహకుడు సూర్యను జులైలో ఈగిల్ బృందం అరెస్ట్ చేసింది. దిల్లీ నుంచి అతడికి వచ్చిన కొరియర్‌లో కొకైన్ ఉందనే సమాచారంతో ఈగిల్ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. ఆ కేసు దర్యాప్తు క్రమంలో అంతర్జాతీయ డీలర్ నిక్ లింక్ బహిర్గతమైంది. పలు మెట్రో నగరాల్లో మకాం వేసిన నైజీరియన్లతో నిక్ తన డ్రగ్ కార్టెల్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. అతడు విదేశాల నుంచి ఓడల్లో ముంబయి, గుజరాత్‌ల ద్వారా దేశంలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు దిగుమతి చేయిస్తూ.. తనకు వాట్సప్ ద్వారా వచ్చే ఆర్డర్‌లను అనుచరులను పురమాయించి డ్రగ్స్‌ను కస్టమర్లకు చేరవేస్తున్నట్లు గుర్తించారు. కొన్ని సందర్భాల్లో అమ్మాయిలు, సెక్స్‌వర్కర్లతోనూ వాటిని సరఫరా చేయిస్తున్నట్లు వెల్లడైంది.

ఈగిల్ డైరెక్టర్.. ఆటోలో తిరుగుతూ రెక్కీ

ఎస్పీ నేతృత్వంలో 124మందితో కూడిన ఈగిల్ బృందం కొద్దిరోజుల క్రితం రెండు రైలు బోగీల్లో దిల్లీకి వెళ్లింది. రోజుల తరబడి మకాం వేసి నిక్ ముఠా ఉంటున్న కాలనీలపై నిఘా ఉంచింది. మరోవైపు ఈగిల్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య రాత్రివేళ ఒంటరిగా ఆటోల్లో తిరుగుతూ నిక్ ముఠా కార్యకలాపాల్ని పర్యవేక్షించారు. నైజీరియన్, కామెరూన్, ఉగాండా దేశాలతో కూడిన డ్రగ్ కార్టెల్ గురించి పక్కా సమాచారం సేకరించిన అనంతరం దిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులతో కలిసి గురువారం ఆపరేషన్ చేపట్టారు. 124 మంది ఈగిల్ పోలీసులతో పాటు 100 మంది దిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు దిల్లీ, గ్రేటర్‌నోయిడాలో ఏకకాలంలో 20 ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్టసీ పిల్స్. తదితర మాదకద్రవ్యాలతో పాటు సెల్‌ఫోన్లు, గడువు తీరిన వీసాలను స్వాధీనం చేసుకున్నారు. 50మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పలువురి వీసా గడువు సైతం తీరినట్లు గుర్తించారు. న్యాయస్థానాల్లో హాజరు పరిచిన అనంతరం వారిని స్వస్థలాలకు తిప్పి పంపే (డిపోర్టేషన్) యోచనలో ఉన్నారు.

వేల కస్టమర్లు, మ్యూల్‌ఖాతాలు..

దర్యాప్తులో తేలిన అంశాల మేరకు.. నిక్ ముఠాకు దేశవ్యాప్తంగా 2వేల మందికిపైగా కస్టమర్లున్నారు. వారికి డెడ్‌డ్రాప్ (నేరుగా కలవకుండా కొరియర్ ద్వారా లేదా ప్రత్యేక ప్రదేశంలో డ్రగ్స్‌ను వదిలిపెట్టడం) పద్ధతిలో డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. పట్టుబడినవారి ఒక్కో ఖాతాలో ఈ ఏడాది సుమారు రూ.5-6కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు తేలింది. డబ్బుల్ని 50 మ్యూల్ ఖాతాల్లోకి బదిలీ చేయించుకొని ఏటీఎంల ద్వారా విత్‌డ్రా చేసుకోవడం లేదా యూపీఐ ఖాతాల ద్వారా దుకాణదారులకు బదిలీ చేస్తూ నగదు తీసుకుంటున్నారు. అనంతరం హవాలా మార్గంలో లేదా క్రిప్టోకరెన్సీలోకి మార్చి ఆఫ్రికా దేశాలకు తరలిస్తున్నారు. దుస్తులు, విగ్గుల కోసం ఉపయోగించే తలవెంట్రుకల్లాంటివి కొని నైజీరియా, లావోస్‌లకు షిప్పింగ్ చేస్తున్నారు. గతంలో భారత్‌లో డ్రగ్స్ దందా సాగించి ప్రస్తుతం నైజీరియాలో ఉంటున్న నిక్.. ఇక్కడ చదువు, వ్యాపారం పేరిట అక్రమంగా తిష్ట వేసిన అనుచరులతో ఈ దందా చేయిస్తున్నట్లు వెల్లడైంది. సూర్య గతంలో థాయ్‌లాండ్‌కు వెళ్లినప్పుడు నిక్ ముఠా నుంచి మాదకద్రవ్యాల్ని కొనుగోలు చేశాడు. అప్పటినుంచి సంబంధాలు కొనసాగిస్తున్నాడు. అలాగే హైదరాబాద్‌లోని ఓ యూనివర్సిటీలో విద్యార్థులకూ ఈ ముఠా డ్రగ్స్ విక్రయించినట్లు తేలడంతో ఈగిల్ బృందం నెలల తరబడి శ్రమించి తాజా ఆపరేషన్ నిర్వహించింది.

బెక్‌హామ్ నేర్పిన పాఠాలను విద్యార్థులు జీవితాంతం గుర్తుంచుకుంటారు

- మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: ఫుట్‌బాల్ దిగ్గజం, యూనిసెఫ్ ఇండియా గుడ్‌విల్ అంబాసిడర్ డేవిడ్ బెక్‌హామ్ విజయనగరం జిల్లా కొత్తవలసలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించడంపై విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "మీ హృదయపూర్వక మాటలు, ప్రోత్సాహం, అందరితో కలిసి ఆటపాటలతో గడిపిన సమయం అమూల్యం. మీరు నేర్పిన పాఠాలు మా విద్యార్థులు జీవితాంతం గుర్తుంచుకుంటారు. పిల్లల కలల్ని, వారి విద్యను ప్రోత్సహించడంలో మీ నిబద్ధతకు హృదయపూర్వక కృతజ్ఞతలు" అని 'ఎక్స్'లో లోకేశ్ పేర్కొన్నారు. పాఠశాలను బెక్‌హామ్ సందర్శించిన వీడియోను పోస్టుకు జత చేశారు.

రబీలో యూరియా కొరత లేకుండా చూడండి

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



ఈనాడు, అమరావతి: రబీలో యూరియా సమస్య లేకుండా చూడాలని, జేసీలు ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు. గ్రోమోర్ దుకాణాల్లో తరచూ యూరియా ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని పరిష్కరించాలని చెప్పారు. ఆగ్రోస్‌లో అవకతవకలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 1.91 లక్షల టన్నుల యూరియా నిల్వలున్నాయని అధికారులు ఆయనకు వివరించారు. పోర్టుల్లో 1.35 లక్షల టన్నులు అందుబాటులో ఉందని అవసరం మేరకు జిల్లాలకు తరలిస్తున్నామని తెలిపారు.

మార్చి నాటికి అన్ని రహదారులకూ మరమ్మతులు

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెల్లడి



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆర్అండ్‌బీ శాఖపై రూ.20 వేల కోట్ల భారం పడిందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. జగన్ హయాంలో రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో సుమారు 15 వేల కి.మీ. మేర పనికిరాకుండా పోయాయన్నారు. రహదారుల మరమ్మతులపై జగన్ కనీసం సమీక్ష కూడా చేయలేదని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '2014-19 మధ్య అనుమతులు తీసుకున్న పలు రహదారుల్ని సైతం జగన్ నిర్లక్ష్యం చేశారు. ఐదు జాతీయ రహదారుల నిర్మాణాలను రద్దు చేశారు. అనంతపురం ఎక్స్‌ప్రెస్ వే, అమరావతి రింగ్‌రోడ్డు పనులను నిలిపేశారు' అని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రూ.1,061 కోట్లతో 22 వేల కి.మీ. మేర రహదారులకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు. వచ్చే మార్చి నాటికి అన్ని రహదారులకు మరమ్మతులు చేసి గుంతలు లేకుండా చేస్తామన్నారు.

పీపీపీ విధానంలో 5,130 కి.మీ. మేర రహదారులు

పీపీపీ విధానంలో 5,130 కి.మీ.మేర 175 రహదారులను నిర్మిస్తామని.. దీనికి త్వరలో టెండర్లు పిలుస్తామని మంత్రి వెల్లడించారు. మొంథా తుపాను వల్ల 4,794 కి.మీ. మేర రహదారులు ధ్వంసమయ్యాయని, ప్రభుత్వంపై రూ.2,774 కోట్ల భారం పడిందని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులను పూర్తి చేస్తామని వివరించారు.

హైదరాబాద్–బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎలైన్‌మెంట్లు ఏమిటి?

హైదరాబాద్ నుంచి ఏపీ మీదుగా బెంగళూరుకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే.. ఎటు వెళ్తుంది? ప్రతిపాదిత ఎలైన్‌మెంట్లు ఏంటని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీపీఆర్ రూపకల్పన ఎంతవరకు వచ్చింది? ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. ఆయన గురువారం సచివాలయంలో ఈ ప్రాజెక్ట్‌పై ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సిద్ధమైన ప్రాజెక్ట్ వివరాలను ఎన్‌హెచ్ఏఐ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మార్చి నాటికి డీపీఆర్ కొలిక్కి వస్తుందని వెల్లడించారు. తెలంగాణతోనూ దీనిపై చర్చిస్తున్నామని, కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఉన్నతాధికారుల వద్ద వచ్చే నెల మొదటివారంలో జరిగే సమావేశంలో తుది ఎలైన్‌మెంట్‌పై స్పష్టత వస్తుందని అధికారులు లిపారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి ఆర్కే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేయండి

- ట్రాన్స్‌కో, డిస్కం అధికారులతో మంత్రి గొట్టిపాటి



ఈనాడు–అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ట్రాన్స్‌కో, ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కొత్త పరిశ్రమలు, యూనిట్ల విస్తరణ, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధి వేగం పుంజుకుంటోంది. ఆ మేరకు పెరిగే విద్యుత్ డిమాండ్, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ట్రాన్స్‌మిషన్, పంపిణీ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి. అన్ని సబ్‌స్టేషన్లు, లైన్లు, నెట్‌వర్క్ అప్‌గ్రేడేషన్ పనులు నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలి. అభివృద్ధి పనులపై ప్రతి 15 రోజులకోసారి అధికారులతో సమీక్షిస్తాం. పరిశ్రమలు, గృహ వినియోగదారులు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలి. దీనికోసం 29 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ, గృహ వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి. అన్ని విభాగాల్లో 95 శాతం సంతృప్త స్థాయి సాధించే లక్ష్యంతో పనిచేయాలి' అని పేర్కొన్నారు.

ఈహెచ్ఎస్ ప్రక్షాళనకు ఏడుగురు సభ్యులతో కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలులో లోపాలు, ఎదురవుతున్న సమస్యలు గుర్తించి.. పరిష్కార మార్గాలు సూచించడానికి ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. గత నెలలో మంత్రుల కమిటీ, ముఖ్యమంత్రితో జరిగిన సమావేశాల్లో ఉద్యోగ సంఘాల నాయకులు ఈహెచ్ఎస్ అమలులో సమస్యలను ప్రస్తావించగా కమిటీ వేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో జీఏడీ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ ముఖ్య కార్యదర్శి, వ్యయ విభాగం కార్యదర్శి, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈవో, ఇద్దరు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కమిటీ వేశారు. ఈ కమిటీ 8 వారాల్లో నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

ఏటా రూ.350 కోట్లు ఖర్చు..

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు.. వారి కుటుంబ సభ్యుల ప్రయోజనం కోసం 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈహెచ్ఎస్ అమల్లోకి తెచ్చారు. పథకంలో 23,58,858 మంది ఉన్నారు. పథకానికి అయ్యే ఖర్చులో ప్రభుత్వం, లబ్ధిదారులు చెరి సగం భరిస్తారు. ఏటా సుమారు రూ.350 కోట్లు పథకానికి వెచ్చిస్తున్నారు. వైద్య సేవలకు చేసిన ఖర్చును సకాలంలో చెల్లించడం లేదని, వివిధ వ్యాధుల ప్యాకేజీ ధరలు పెంచాలని, ఈహెచ్ఎస్ కింద సేవలకు ఆసుపత్రులు ఆసక్తి చూపడంలేదని, ఫిర్యాదులకు పరిష్కారం దొరకడం లేదని, ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ లోపాలున్నాయని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పలు సమావేశాల్లో ప్రస్తావించారు.

సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయానికి ఐజీబీసీ నెట్ జీరో ఎనర్జీ సర్టిఫికెట్

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఏపీ సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయానికి జాతీయ స్థాయి అవార్డు దక్కింది. రాయపూడి సమీపంలో నిర్మించిన సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం దేశంలో డిజైన్ దశలో (ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్) ఐజీబీసీ నెట్ జీరో ఎనర్జీ రేటింగ్ సర్టిఫికెట్ పొందిన మొదటి ప్రభుత్వ కార్యాలయంగా గుర్తింపు పొందింది. గురువారం ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 2025 ఐజీబీసీ గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్‌లో సీఆర్డీఏ చీఫ్ ఆర్కిటెక్ట్ డిజైన్ కో-ఆర్డినేటర్ సందీప్ దీక్షిత్ ఈ అవార్డును స్వీకరించారు. ప్రభుత్వ వనరుల సమర్థ వినియోగంలో ఏపీ ప్రభుత్వ సామర్థ్యాన్ని ఈ అవార్డు చాటిచెప్పిందని సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు అభివర్ణించారు.

ఫైబర్‌నెట్ పూర్వ ఎండీ మధుసూదన్‌రెడ్డి వెయిటింగ్ కాలం క్రమబద్ధీకరణ

ఈనాడు, అమరావతి: ఏపీ ఫైబర్‌నెట్ పూర్వ ఎండీ, ఐఆర్ఏఎస్ అధికారి ఎం.మధుసూదన్‌రెడ్డి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లో ఉన్న కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. 2024 జూన్ 7 నుంచి ఆగస్టు 22 వరకు ఆయన వెయిటింగ్‌లో ఉన్నారు. ఆ కాలాన్ని క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జగన్‌పై అనర్హత వేటు పడే ప్రమాదం

యనమల రామకృష్ణుడు హెచ్చరిక

ఈనాడు, అమరావతి: విద్యార్థుల మాక్ అసెంబ్లీలో ప్రతిపక్షం ఎలా వ్యవహరించిందో చూసైనా వైకాపా అధినేత జగన్ నేర్చుకోవాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు హితవు పలికారు. జగన్ ఇప్పటికైనా అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యల గురించి చర్చించాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లేకపోతే అనర్హత వేటు పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల క్రీడా పోటీలకు నిధులు విడుదల

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులకు ఈ నెల 29 నుంచి జనవరి 4వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తారు. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించేందుకు రూ.53.95 లక్షలు మంజూరు చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి మండలానికి రూ.5 వేలు, డివిజన్‌కు రూ.20 వేలు, జిల్లాస్థాయికి రూ.20 వేల చొప్పున విడుదల చేసింది.

తెలంగాణ వాదనలకు రుజువుల్లేవు

- నీటి కేటాయింపుల్లో అన్యాయం ప్రాతిపదికన ఆ రాష్ట్రం ఏర్పడలేదు
- ట్రైబ్యునల్ కూడా ఇదే చెప్పింది
- దురుద్దేశపూర్వక ఆరోపణలు చెల్లవు
- బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తరఫు న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు
- తదుపరి విచారణ డిసెంబరు 17కి వాయిదా



ఈనాడు – అమరావతి

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సమయంలో తెలంగాణ అభివృద్ధికి హామీ ఇచ్చినట్లు ఆ రాష్ట్రం చేస్తున్న వాదనలకు ఎలాంటి రుజువులు లేవు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సమయంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయని, వాటి అభివృద్ధికి 2014 విభజన చట్టంలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వడం వల్ల ఆ ప్రాంతాలు వెనుకబడి ఉన్నట్లు గుర్తించినట్లయింది' అని ఆంధ్రప్రదేశ్ తరఫు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదించారు. ఆయన గురువారం బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట మూడో రోజూ వాదనలు వినిపించారు. గురువారంతో ఈ విడత వాదనలు ముగిశాయి. తదుపరి విచారణ డిసెంబరు 17, 18లకు వాయిదా పడింది. జయదీప్ గుప్తా వాదనల్లో ముఖ్యాంశాలివీ..

■ నీటిపారుదలలో క్రమబద్ధమైన అన్యాయం జరిగిందని తెలంగాణ వాదిస్తోంది. ఇది దురుద్దేశపూర్వక ఆరోపణ. అధికారిక రికార్డుల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ బాగా అభివృద్ధి చెందింది. (చట్టప్రకారం ఇలాంటి ఆరోపణలకు ఆధారాలు అవసరమంటూ ముత్తా అసోసియేట్స్ వెర్సస్ మహారాష్ట్ర ప్రభుత్వం కేసును ఉదహరించారు.)

■ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో ఇందుకు సంబంధించిన ఉద్దేశాలు, కారణాల్లో ఎక్కడా తెలంగాణకు నీటిపారుదల పరంగా అన్యాయం జరిగిందన్న ప్రస్తావన లేదు. కేవలం రాజకీయ, ప్రజాస్వామ్య ఆకాంక్షలు నెరవేర్చేందుకే రాష్ట్ర విభజన జరిగింది. నీటిపారుదల అసమానతలను సరిచేయడానికి తెలంగాణ ఏర్పాటు చేయలేదు.

■ 2016 అక్టోబరు 19 నాటి ట్రైబ్యునల్ ఆదేశం కూడా రాష్ట్ర విభజనకు నీటి సమస్యలు కారణంగా చెప్పలేదని పేర్కొంది.

■ తెలంగాణలో నీటిపారుదల అభివృద్ధి.. కృష్ణా బేసిన్‌లో తెలంగాణ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయలేదన్న విషయాన్ని పేర్కొంటోంది. కృష్ణా మొదటి ట్రైబ్యునల్ నిశ్చల కేటాయించిన ప్రకారం తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. తెలంగాణకు 279 టీఎంసీలు (భీమా మినహా) కేటాయిస్తే 1972-2008 మధ్య తెలంగాణ సగటు వినియోగం 286.90 టీఎంసీలు. కేటాయింపు కన్నా వినియోగం ఎక్కువగా ఉందని ఈ విషయం రుజువు చేస్తోంది.

■ ట్రైబ్యునల్ కేవలం కృష్ణా బేసిన్ మాత్రమే కాకుండా మొత్తం తెలంగాణ అభివృద్ధిని సమీక్షించాలి. అలా చేస్తే చారిత్రక అన్యాయం వాదనలోని నిజాలు బయటకు వస్తాయి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు గణనీయంగా లాభం జరిగిందని అర్థమవుతుంది. తెలంగాణ ప్రాంతాన్ని కావాలని అలక్ష్యం చేశారనేందుకు ఎలాంటి రుజువులు లేవు. (ఈ సందర్భంగా టి.రామచంద్రరావు వెర్సస్ కేంద్ర ప్రభుత్వం కేసును ప్రస్తావించారు.)

■ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 16 ప్రాజెక్టుల్లో 8 తెలంగాణలోనే ఉన్నాయి. నీటిపారుదల నిర్ణయాలు సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర ఒప్పందాలు, ట్రైబ్యునల్ అవార్డులు, ప్రజా ప్రయోజనాలపై ఆధారపడి ఉంటాయి.

■ తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన శ్వేతపత్రం ప్రకారమే 1956 నుంచి 2014 మధ్య తెలంగాణలో రూ.4.98 లక్షల కోట్లు ఖర్చు చేశారు. కృష్ణా, గోదావరి నదుల నీటి ఆధారంగా నాగార్జునసాగర్, జూరాల, కోయిల్‌సాగర్, దేవాదుల, శ్రీరాంసాగర్, కడెం, హైదరాబాద్ తాగునీటి ప్రాజెక్టు మంజీరా పూర్తయ్యాయి.

■ అప్పర్ కృష్ణ, భీమా, తుంగభద్ర విస్తరణ, ప్రాజెక్టులు 1956 నవంబరు 18 నుంచి మంజూరు కాలేదు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 108(2) వర్తించదు. ఏదైనా అలక్ష్యం జరిగి ఉంటే అది హైదరాబాద్ రాష్ట్ర అధికారుల బాధ్యత. ఆంధ్రప్రదేశ్ బాధ్యత కాదు.

■ ఆ తర్వాత జూరాల తొలి దశ కోసం కృష్ణా ట్రైబ్యునల్-1ను ఆంధ్రప్రదేశ్ 23 టీఎంసీలు కోరింది. కృష్ణా డెల్టా ఆధునికీకరణతో ఆదా అయిన 29 టీఎంసీలతో భీమా ఎత్తిపోతలకు 20 టీఎంసీలు కేటాయించారు.

■ కృష్ణా ట్రైబ్యునల్-2 జూరాలకు అదనంగా 9 టీఎంసీలు కేటాయించింది. తొలి ట్రైబ్యునల్ తెలంగాణ అవసరాలను గుర్తించి జూరాలతోపాటు 17.84టీఎంసీలు కేటాయించింది.

■ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ నీటిపారుదల అభివృద్ధికి నిరంతరం కృషి చేసింది. తెలంగాణకు చారిత్రక అన్యాయం జరిగిందన్న వాదనలకు రుజువుల్లేవు. ట్రైబ్యునల్ తీర్పులకూ ఆ వాదన వ్యతిరేకం. అలక్ష్యం/ అసమానత ఆరోపణలు నిలబడవు.

ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలుకు
సవరణ నోటిఫికేషన్ జారీ

ఈనాడు, అమరావతి: వర్గీకరణకు అనుగుణంగా ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం సవరణ నోటిఫికేషన్‌ను గురువారం జారీచేసింది. ఈ నోటిఫికేషన్ 2025 ఏప్రిల్ 18 నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది.

■ పబ్లిక్ సర్వీస్‌లోని ప్రతి కేడర్‌కు పదోన్నతుల్లో 1% రిజర్వేషన్‌ను గ్రూప్-1లోని కులాలు, ఉపకులాలకు రిజర్వ్ చేయాలి. ■ గ్రూప్-2లోని కులాలు, ఉపకులాలకు 6.5% రిజర్వ్ చేయాలి. ■ గ్రూప్-3లోని కులాలు, ఉపకులాలకు 7.5% రిజర్వ్ చేయాలి. ■ నిర్దేశించిన రోస్టర్ పాయింట్లను అనుసరించాలి. ■ ఆయా గ్రూపులకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఏ ప్యానెల్ సంవత్సరంలో అయినా అందుబాటులో లేనప్పుడు ఆ ఖాళీని తదుపరి ప్యానెల్ సంవత్సరానికి బదిలీ చేయాలి. ■ క్యారీ ఫార్వర్డ్ ఖాళీలకు రెండో సంవత్సరం కూడా అందుబాటులో అర్హులు అందుబాటులో లేకపోతే ప్రభుత్వం నిర్దేశించిన గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 క్రమంలో ఖాళీలు నింపాలి. ■ ప్రతి కేడర్‌లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3లకు రిజర్వేషన్ అమలు చేయడానికి వారి ప్రాతినిధ్యాన్ని విడివిడిగా లెక్కించాలి. మొత్తం ఎస్సీల ప్రాతినిధ్యం 15% మించకూడదు. ■ ఉద్యోగినులకు సమాంతర రిజర్వేషన్‌ను వర్తింపజేయాలి. ■ ఈ రిజర్వేషన్ అమలుకు రోస్టర్ పాయింట్ కేటాయింపు ఉండదు. ■ గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3లకు చెందిన ఎస్సీ మహిళలకు 33 1/3% సమాంతర రిజర్వేషన్ వర్తిస్తుంది.

రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ..
ట్యూమర్ బోర్డు ఏర్పాటుకు కేంద్రం సూచన

వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ వెల్లడి

ఈనాడు, అమరావతి: క్యాన్సర్ నియంత్రణ, నివారణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు సాధించేందుకు రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించిందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. వీటి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందించే అవకాశం ఉందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్యాన్సర్ మందుల కొనుగోలులో ఆర్థిక తోడ్పాటుతోపాటు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరికరాల కొనుగోలులో 80 శాతం మేరకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. దిల్లీలో గురువారం జరిగిన ఎన్సీడీ, క్యాన్సర్ కేర్ కార్యశాలలో చర్చల సందర్భంగా ఈ నిర్ణయాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించినట్లు తెలిపారు. పీపీపీ విధానంలో మందుల నిల్వకు గోదాముల నిర్మాణానికి సాయంతోపాటు సెకండరీ హెల్త్ పరిధిలోని వైద్యశాలలకు అమ్రిత్ పథకం కింద 50 శాతం రాయితీతో కేంద్ర ఆరోగ్యశాఖ మందులు, కృత్రిమ పరికరాలు (ఇంప్లాంట్స్) అందిస్తుందని సౌరభ్ గౌర్ వెల్లడించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఆహ్వానం

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీల్లో శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ హాజరుకానున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. దిల్లీలోని న్యాయమూర్తి నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మహాసభల ప్రారంభోత్సవానికి సతీసమేతంగా హాజరవుతామని న్యాయమూర్తి చెప్పారు. తెలుగును అజరామరం చేయడానికి అన్ని సంస్థలు కలిసి పనిచేయాలి. సంస్థాగతమైన వ్యవస్థను ఏర్పర్చుకొని రాబోయే తరాలకు తెలుగును అందించాలి' అని జస్టిస్ నరసింహ సూచించినట్లు గజల్ శ్రీనివాస్ తెలిపారు.



జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గజల్ శ్రీనివాస్

నీట్-సూపర్ స్పెషాలిటీ పరీక్షలు డిసెంబరుకు వాయిదా

తెదేపా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తిపై కేంద్రం నిర్ణయం

ఈనాడు, దిల్లీ: ఈ నెలలో జరగాల్సిన నీట్-సూపర్ స్పెషాలిటీ పరీక్షలను కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 26, 27 తేదీలకు వాయిదా వేసింది. ఈ మేరకు తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలుకు రాసిన లేఖలో కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో వైద్య విద్య పీజీ కోర్సు పరీక్షలు, నీట్-సూపర్ స్పెషాలిటీ పరీక్షలు ఒకేసారి రావడం వల్ల రెండింటికీ సమాయత్తం కాలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల వీటిని నెలరోజుల పాటు వాయిదా వేయాలని కోరుతూ శ్రీకృష్ణదేవరాయలు సెప్టెంబర్ 8న నడ్డాకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఆయన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్‌తో సంప్రదించిన తర్వాత పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆయన తాజాగా కృష్ణదేవరాయలుకు రాసిన లేఖలో వెల్లడించారు.

పర్యాటకుల కోసం త్వరలో 'డ్రైవర్ కం గైడ్'

ర్యాపిడో డ్రైవర్లకు రాష్ట్ర చరిత్ర, సంస్కృతిపై ప్రభుత్వం శిక్షణ

ఈనాడు, అమరావతి: పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల్లో 'డ్రైవర్ కం గైడ్' సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో 'డ్రైవర్ కం గైడ్' ప్రాజెక్టు నిర్వహణకు ర్యాపిడో, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం జరిగింది. ర్యాపిడోలో మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసి, వారికి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఆతిథ్యం, భద్రత తదితర అంశాలపై వచ్చే నెలలో రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. ర్యాపిడో యాప్‌లో టూరిస్ట్ ఆటోలు, క్యాబ్‌లతో పాటు పర్యాటక సర్క్యూట్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. యాప్ ద్వారా కావలసిన ప్రాంతాలను ఎంపిక చేసుకుని పర్యాటకులు వెళ్లొచ్చు. విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో పర్యాటకుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాలను రాష్ట్ర పర్యాటకశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు పరామర్శలా?

జగన్‌పై వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు రైతు పరామర్శల పేరుతో నాటకాలాడుతున్నారని వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సెస్సులు, టోల్‌గేట్లతో ప్రజల జేబులకు చిల్లులు పెట్టడం సరికాదు: సీపీఐ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం ప్రజలపై పెనుభారాలు మోపేలా ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. "రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వచ్చే 19 ఏళ్ల వ్యవధిలో రూ.22,826 కోట్ల అంచనాతో 1,500 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేసేందుకు హైబ్రిడ్ పద్ధతిలో పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టులో మొదటి రెండేళ్లు 600 కిలోమీటర్ల చొప్పున, మూడో ఏడాది 300 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాలని, ఇందులో రూ.4 వేల కోట్లు ప్రభుత్వం భరించనుండగా.. మిగతా 60% ఖర్చును కాంట్రాక్టు సంస్థ భరిస్తుంది. ఈ ఖర్చును ప్రభుత్వం ఏటా దశల వారీగా వడ్డీతో కలిపి 16 ఏళ్లలో చెల్లించేలా ప్రతిపాదనలు రూపొందించింది. ప్రభుత్వం వెచ్చించే రూ.4 వేల కోట్ల సమీకరణ కోసం ఆర్టీసీకి చెందిన భూములు, స్థిరాస్తులను లీజుకు ఇవ్వడంతో పాటు పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూపాయి చొప్పున సెస్సు, గనుల నుంచి 10 శాతం సెస్సు, కాంట్రాక్టు సంస్థ రాష్ట్ర రహదారులపై టోల్ వసూలు చేసేందుకు అవకాశం కల్పించింది" అని పేర్కొన్నారు.

బీసీ కుల కార్పొరేషన్లకు అమరావతిలో భవనాలు: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: అన్ని బీసీ కుల కార్పొరేషన్లకూ రాజధాని అమరావతిలో భవనాలు నిర్మిస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయా బీసీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలోనే ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేస్తామన్నారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో గురువారం సగర కార్పొరేషన్ పాలక మండలి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. మంత్రి సవిత మాట్లాడుతూ 'ఐదేళ్ల జగన్ పాలనలో బీసీలను అన్ని రకాలుగా వేధించారు. బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు.

బీసీని వైకాపాకు అధ్యక్షుడిగా చేయగలరా?

తెదేపా బీసీల పార్టీ అని, తాను అందులో ఉండటం వల్లే పార్టీ అధ్యక్షుడిని కాగలిగానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైకాపాలో బీసీ పార్టీ అధ్యక్షుడు కాగలరా అని ప్రశ్నించారు. కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. వారిని విస్మరిస్తే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహించరని తెలిపారు.

33 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీల్లో కాంట్రాక్టు బోధనా సిబ్బంది కొనసాగింపు

ఈనాడు, అమరావతి: శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో ఖాళీగా ఉన్న 33 సహాయ ఆచార్యుల పోస్టుల్లో ఒప్పంద పద్ధతిలో బోధనా సిబ్బందిని మరో ఏడాదిపాటు కొనసాగించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఈ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేంత వరకూ లేదా సంవత్సరం పాటు వీరిని కొనసాగించాలని పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.57,700 వేతనంగా చెల్లించేందుకు అనుమతించారు.

అనిశా వలలో ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్

ఇంటి నంబరుకు రూ.20 వేలు డిమాండ్

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు రూ.20 వేల లంచం తీసుకొంటుండగా గురువారం అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి నంబరు కేటాయించాలని ఫిబ్రవరిలో దరఖాస్తు చేయగా కమిషనర్ రూ.50 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.20 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ నెల 24న బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచనతో గురువారం సాయంత్రం ఆర్మూర్‌లోని కమిషనర్ రాజు ఇంటి వద్ద అతని డ్రైవర్‌కు రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో డ్రైవర్ బ్యాగులో మరో రూ.4.30 లక్షల నగదు లభించినట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ రాజు, డ్రైవర్ భూమేశ్‌లను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ చెప్పారు.



పట్టుబడిన నగదుతో కమిషనర్ రాజు(కళ్లజోడు వ్యక్తి), ప్రైవేటు డ్రైవర్ భూమేశ్

పరిహారం కోసం లంచం డిమాండ్

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ముంపునకు గురైన తన ఆరెకరాల భూమికి నష్టపరిహారం చెల్లించకుండా రెవెన్యూ అధికారులు వేధిస్తున్నారని శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం చిన్నచిగుళ్లరేవుకు చెందిన కుళ్లాయప్ప వాపోయారు. ధర్మవరం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి ఇందుకోసం రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్నారని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఏపీ కళింగ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కృష్ణంనాయుడు వినతులు స్వీకరించారు. తన వ్యవసాయ భూమిని కబ్జా చేసిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన షేక్‌షావలి ఫిర్యాదు చేశారు. తన భూమిని వక్ఫ్ స్థలంగా నమోదు చేసి నిషేధిత జాబితాలో చేర్చారని, దీన్ని సరిచేయాలని కర్నూలు జిల్లా కల్లూరుకు చెందిన మహేంద్ర వినతి పత్రం ఇచ్చారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం

- ఒకరికి రూ.84 లక్షలు, మరొకరికి రూ.31 లక్షల చెల్లించాలని ఆర్టీసీకి కోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లాలోని కోటమర్తి గ్రామం నుంచి భువనగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అడ్డగూడూరు మండలం కంచనపల్లి శివారులో 2023 సెప్టెంబరు 20న బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కోటమర్తి పంచాయతీ కార్యదర్శి కె.రాములు(60) మృతి చెందారు. సికింద్రాబాద్ వారాసిగూడలో నివాసముంటున్న రాములు భార్య మనోహరి... సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని విచారణలో నిర్ధారణ కావడంతో... మృతుడి భార్యకు రూ.54,35,584, ముగ్గురు పిల్లలకు రూ.10 లక్షల చొప్పున వారి ఖాతాల్లో జమ చేయాలని ఆర్టీసీని ఆదేశించింది. మరో కేసులో... సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన కుమారస్వామి(27) బైక్‌పై 2022 జనవరి 5న గజ్వేల్ నుంచి తాను పనిచేసే కంపెనీకి వెళ్తుండగా జగదేవ్‌పూర్‌లోని ఓ ఫంక్షన్ హాలు సమీపంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో చనిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ కోర్టును ఆశ్రయించారు. బస్సు డ్రైవర్ తప్పిదంతోనే ప్రమాదం జరిగినట్లు నిర్ధారణ కావడంతో.. కుమారస్వామి భార్య ఖాతాలో రూ.21,40,531, కుమార్తె ఖాతాలో రూ.10 లక్షలు జమ చేయాలని ఆర్టీసీకి కోర్టు ఆదేశించింది.

పశువుల్లో మూతిపుండ్ల వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పశు సంవర్ధక శాఖ సంచాలకుడు టి.దామోదర్‌నాయుడు

ఈనాడు, అమరావతి: ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పశువులు మూతి పుండ్ల వ్యాధి బారిన పడకుండా పోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ టి.దామోదర్ నాయుడు సూచించారు. 'వ్యాధి సోకిన జీవాలలో జ్వరం ఎక్కువగా ఉంటుంది. నాలుక నీలి రంగులోకి మారుతుంది. ముక్కు నుంచి చొంగ, కళ్ల నుంచి నీరు కారుతుంది. తీవ్రత ఎక్కువగా ఉంటే మేత మేయలేక నీరసిస్తాయి' అని వివరించారు.

ఏపీ ఫార్మసీ మండలి ఎన్నికల పోటీలో 44 మంది అభ్యర్థులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో 44 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. 48 నామినేషన్లు దాఖలవ్వగా 2 తిరస్కరణకు గురయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ద్వారా జరగనున్న ఈ ఎన్నికల్లో 60,943 మంది ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు 2025 ఆగస్టు 8 నాటికి ఓటర్లుగా నమోదయ్యారు. ■ ఓటర్లకు డిసెంబరు 4 నుంచి 8 లోపు బ్యాలెట్ పత్రాలను స్పీడ్ పోస్టులో పంపిస్తారు. ■ ఓటు వేసి డిసెంబరు 11 నుంచి 24న సాయంత్రం 5 గంటల లోపు విజయవాడలోని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ కార్యాలయానికి చేరేలా పంపాలి. ■ డిసెంబరు 27న ఓట్లు లెక్కించి, ఫలితాలు వెల్లడిస్తారు. ■ ఏపీ ఫార్మసీ మండలికి చివరిగా 2010లో ఎన్నికలు జరిగాయి. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి.

ఆరుగురు జనాభాకే సర్పంచి.. 3 వార్డులు కేటాయిస్తారా?

- మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికల నిలిపివేత
- తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామంలో కేవలం ఆరుగురు ఎస్టీ జనాభా ఉంటే.. వారికి సర్పంచి పోస్టుతో పాటు మూడు వార్డులను కేటాయించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. 2025 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కేటాయించడం సరికాదంది. దీనిపై సమర్పించిన వినతిపత్రాలపై నిర్ణయం తీసుకునేదాకా మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. మహమూద్‌పట్నం సర్పంచి పోస్టును ఎస్టీ మహిళకు కేటాయించడాన్ని సవాలు చేస్తూ మిట్టగడుపుల యాకూబ్ హైకోర్టులో అత్యవసరంగా లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది రమేశ్ చిల్లా వాదనలు వినిపిస్తూ గ్రామంలో 2025 ఓటర్ల జాబితా ప్రకారం 576మంది ఓటర్లున్నారన్నారు. అందులో ఎస్టీలు ఆరుగురేనన్నారు. వీరికి సర్పంచి పోస్టుతో పాటు 3 వార్డులను రిజర్వు చేశారన్నారు. 250 మంది ఎస్సీలు, 300 మంది బీసీలు, 20 మందికి పైగా ఓసీలున్నారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్సీ జనరల్ మహిళకు కేటాయించిన అధికారులు ఇప్పుడు ఎస్టీలకు కేటాయించారన్నారు. దీనిపై ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోలేదన్నారు. వినతి పత్రాలపై చర్యలు తీసుకునేదాకా.. మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణను డిసెంబరు 29కి వాయిదా వేశారు. వీటితోపాటు రిజర్వేషన్లను సవాలు చేస్తూ పలు పిటిషన్లపై విచారించిన న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి వివాదం ప్రధాన న్యాయమూర్తి బెంచ్‌లో పెండింగ్‌లో ఉన్నందున ఉత్తర్వులివ్వడంలేదన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ బీసీలకు 23 శాతం కూడా కేటాయించలేదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించిన అనంతరం బీసీలకు రిజర్వేషన్లు ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లభించాయని, వారి తరువాతే ఇతరులకు రిజర్వేషన్లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్లలో ఎంతవరకు జోక్యం చేసుకోవాలో శుక్రవారం పరిశీలిస్తామన్నారు.

2015 నోటిఫికేషన్ గ్రూప్-2 ఉద్యోగులకు ఊరట

- సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలుపై తెలంగాణ హైకోర్టు స్టే



ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-2, 2015 నోటిఫికేషన్‌లో నియమితులైన ఉద్యోగులకు గురువారం హైకోర్టులో ఊరట లభించింది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నియామకాలు చెల్లవంటూ ఈ నెల 18న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేస్తూ గురువారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం, తుడిచివేతలున్న పార్ట్-బీ పత్రాలను పునర్‌మూల్యాంకనం చేయడం చెల్లదని. 2019 అక్టోబరు 24న ఇచ్చిన ఫలితాలను రద్దుచేస్తూ ఈ నెల 18న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎం.క్రాంతికుమార్ తదితరులు అప్పీలు దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అప్పీలుదారుల తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. డబుల్ బబ్లింగ్‌కు సంబంధించిన వివాదం సుప్రీంకోర్టుకు వెళ్లిందని, ఇప్పుడు మళ్లీ అదే కారణం మీద నియామకాలను సింగిల్ జడ్జి రద్దుచేయడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ట్యాంపరింగ్‌కు పాల్పడినవారి పత్రాలను మూల్యాంకనంలో పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఇన్విజిలేటర్ల అవగాహన రాహిత్యం వల్ల ఓఎంఆర్‌లో వివరాలను బబ్లింగ్ ద్వారా భర్తీ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. ఇందులోభాగంగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, దాని సిఫార్సుల ప్రకారం మూల్యాంకనం జరిగిందన్నారు. ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాది సురేందర్ రావు వాదనలు వినిపిస్తూ.. ఓఎంఆర్ షీట్ పార్ట్-ఏలోని అభ్యర్థి వ్యక్తిగత వివరాలకు సంబంధించి చిన్న చిన్న పొరపాట్లుంటే మన్నించవచ్చని సాంకేతిక కమిటీ సిఫార్సు చేసిందన్నారు. పార్ట్-బీలోని 150 ప్రశ్నల జవాబులకు ఏదైనా తుడిచివేత, వైట్‌నర్ వాడినట్లయితే వాటిని మూల్యాంకనం చేయరాదన్నప్పటికీ పార్ట్-బీని కూడా మూల్యాంకనం చేశారన్నారు. ఈ కారణంగా పార్ట్-బీలో తుడిచివేతలు, వైట్‌నర్ వినియోగించినవారిని మినహాయించి పునర్‌మూల్యాంకనం చేసి తాజాగా నియామకాలు చేపట్టాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సమర్థనీయమేనన్నారు. వాదనలను విన్న ధర్మాసనం దీనిపై సుదీర్ఘ విచారణ చేపడతామని పేర్కొంది. అప్పీలులో కౌంటర్లు దాఖలు చేయాలని రిట్ పిటిషనర్లతోపాటు ప్రభుత్వం, టీజీపీఎస్సీని ఆదేశిస్తూ విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.